సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 7.00

సంపుటి: 18
సంచిక: 7

ఆదివారం 30-3-2025



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



విశ్వశ్రేయస్సే విశ్వావసు


నేడు మనం అడుగిడుతున్న కొత్త తెలుగు సంవత్సరానికి శ్రీవిశ్వావసు నామ సంవత్సరం అని పేరు. అంటే విశ్వ శ్రేయస్సు, విశ్వ సంపద అని అర్థం. ఇది అష్టవసువులలో ఒక వసువు పేరు. ఈ సంవత్సరం అందరికీ శ్రేయోదాయకంగా... సంపద్వంతంగా ఉంటుందని ఆశిద్దాం...

– వివరాలు 13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



indriya.com
ADITYA BIRLA
JEWELLERY
INDRIYA
ADITYA BIRLA | JEWELLERY
ఏడాదిలో ఈ శుభదినం నాడు
మీ మనసు ముడిపడుతుంది
ఇంద్రియా యొక్క నగలతో
బంగారంతో తయారైన
అందమైన గాజులు, చెవి దిద్దులు,
హారం ఇంకా ఉంగరాలు
ఇంద్రియా యొక్క ప్రతీ నగతో
ఉబికి వచ్చే మెరుపు
కొత్త ఉదయపు కిరణాల తళుకు
అంటే నేడు, నగలతో
ఎంత కాంతిని
ఇంట్లోకి తెచ్చుకున్నా,
మీ మనసు చెబుతుంది
తనివి తీరలేదు (మనసు నిండలేదు)
మనసు ఇంకా నిండలేదు
మీ అంతులేని ప్రేమను
పొందడానికి స్కాన్ చేయండి
బంగారం, వజ్రాలు ఇంకా పోల్కిలో 20000+ కు పైగా డిజైన్లు
ఉగాది ఆఫర్స్
₹51 తగ్గింపు*
ప్రతీ గ్రాము
బంగారంపై
25% వరకు తగ్గింపు
స్వర్ణాభరణాల మజూరీ మరియు
వజ్రాల ఆభరణాల విలువపై#
మీ పాత బంగారంపై
100%
మారకపు విలువ^
ఎ.ఎస్.రావు నగర్, కొంపల్లి మరియు కొండాపూర్‌లో ఇప్పుడు స్టోర్స్ తెరవబడ్డాయి


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 | వెల: ₹ 7.00 | సంపుటి: 18 | సంచిక: 7

ఆదివారం 30-3-2025

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు



సాక్షి ఉగాది శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మోదీ చాలా తెలివైన మనిషి

భారత ప్రధాని మోదీ చాలా తెలివైన వ్యక్తి అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. తనకు గొప్ప మిత్రుడన్నారు.

- వివరాలు 6లో



గ్రీన్ కార్డులకు ఫుల్‌స్టాప్!

అమెరికాలో శరణార్థి/నిరాశ్రయుల హోదా సంపాదించిన విదేశీయులకు అందజేసే గ్రీన్‌కార్డుల జారీ ప్రక్రియ ఆగిపోయింది.

- వివరాలు 6లో



కేంద్రంలో మరో 20 ఏళ్లు బీజేపీనే

కేంద్రంలో బీజేపీ కనీసం 20 ఏళ్లపాటు అధికారంలో ఉంటుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తంచేశారు.-

వివరాలు 6లో



కౌంటర్‌లో కొన్న టికెట్‌ను..

ఇక నుంచి కౌంటర్‌లో కొన్న రైలు టికెట్లను సైతం ఆన్‌లైన్‌లో క్యాన్సిల్ చేసుకోవచ్చని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు.

వివరాలు 6లో

న్యూస్‌రీల్

వ్యాపారాలకు హిందీ కావాలి.. రాజకీయాలకు వద్దా?



'త్రిభాషా విద్యావిధానంలో హిందీ వద్దంటున్న వారికి వ్యాపారాలు చేసుకునేందుకు హిందీ అవసరం కానీ.. రాజకీయాలకు వచ్చేసరికి హిందీ వద్దా? దేశంలో హిందీ తప్పనిసరిగా నేర్చుకోవాలని ఒత్తిడి చేశామా' అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రశ్నించారు.

- వివరాలు 2లో

ఆర్టీసీకి 'మహాలక్ష్మి' షాక్



మహిళల ఉచిత ప్రయాణాలకు సంబంధించి ఆర్టీసీకి రీయింబర్స్ చేయాల్సిన మొత్తంలో దాదాపు రూ.635 కోట్లను ప్రభుత్వం బకాయి పెట్టింది. శనివారం పనివేళలు ముగిసే సమయానికి ఆ మొత్తం విడుదల కాలేదని తెలిసింది. దీంతో ఇక అవి మురిగిపోతాయనే ఆందోళన ఆర్టీసీలో వ్యక్తమవుతోంది.

- వివరాలు 16లో

ఆరోగ్యశ్రీలోకి మరో 164 ప్రైవేటు ఆస్పత్రులు

- వివరాలు 2లో

పేదలందరికీ.. సన్న బియ్యం



దేశంలోనే తొలిసారిగా రేషన్ కార్డుదారులకు ఉచితంగా పంపిణీ

నేడు హుజూర్‌నగర్‌లో పథకం ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు

ఆహారభద్రతా కార్డుల్లో నమోదైన 2.85 కోట్ల మందికి లబ్ధి

కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు కూడా..

సన్న బియ్యంతో రాష్ట్ర ప్రభుత్వంపై అదనంగా రూ.2,800 కోట్ల భారం

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్న బియ్యం ఇచ్చే కార్యక్రమం ఉగాది రోజున ప్రారంభం కానుంది. ఆహార భద్రతా కార్డులు కలిగిన వారికి ఇప్పటివరకు ఇస్తున్న దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఏప్రిల్ నెల కోటాను ఒకటో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేయనున్నారు. దీంతో రాష్ట్రంలోని పేదలందరికీ సన్న బియ్యం ఉచితంగా అందుతాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

దొడ్డు బియ్యం దుర్వినియోగంతో..

వేల కోట్ల రూపాయల సబ్సిడీ భరిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా ఇప్పటివరకు పంపిణీ చేస్తున్న బియ్యంలో 85 శాతానికి పైగా దుర్వినియోగం అవుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దొడ్డు బియ్యాన్ని తినేందుకు ఇష్టపడని పేద, మధ్య తరగతి వర్గాలు పెద్ద సంఖ్యలో రేషన్ దుకాణాల నుంచి తీసుకున్న బియ్యాన్ని ఆ సమీపంలోనే దళారులకు కిలో రూ.10 నుంచి 13 రూపాయలకు విక్రయించడం, లేదంటే డీలర్ల నుంచి అసలు బియ్యం తీసుకోకుండా అతను ఇచ్చిన మొత్తం తీసుకుని వెళ్లడం జరిగేది. ఈ నేపథ్యంలోనే దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం పంపిణీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావించింది. దీనిపై రేషన్‌కార్డులు, సన్న బియ్యం పంపిణీపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం పూర్తి స్థాయిలో అధ్యయనం చేసింది. ప్రజలు తినని దొడ్డు బియ్యాన్ని రూ.10,665 కోట్లు వెచ్చించి

మిగతా 2వ పేజీలో ▶

84 % మందికి నెలకు 6 కిలోల చొప్పున

→ రాష్ట్రంలో ప్రస్తుతం 89.73 లక్షల ఆహార భద్రతా కార్డులు ఉండగా, వాటిలో 2.85 కోట్ల లబ్ధిదారులు నమోదై ఉన్నారు. ఇక నుంచి వీరందరికీ నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయినట్లు అధికార వర్గాలు తెలిపాయి ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు, మధ్యాహ్న భోజన పథకం కింద సుమారు 35 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ గత మూడేళ్లుగా సన్న బియ్యంతోనే భోజనాన్ని వడ్డిస్తున్నారు. వీరు కాకుండా ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణిలు, బాలింతలకు కూడా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్రంలోని 84 శాతం మందికి సన్న బియ్యం పంపిణీ అవుతాయని చెబుతున్నారు.

ఒక్క సంతకంతో కొడంగల్‌కు అన్నీ వస్తాయి

ఎవరినీ అడుక్కోవాల్సిన అవసరం లేదు

కొడంగల్ ప్రజలే రాష్ట్రాన్ని పాలించే శక్తిని ఇచ్చారు

ఇఫ్తార్ విందు కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

వేంకటేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పణ



శ్రీవారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న సీఎం రేవంత్

కొడంగల్: 'ఒక్క సంతకంతో కొడంగల్‌కు అన్నీ వస్తాయి. ఎవరినీ అడుక్కోవాల్సిన అవసరం లేదు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మంచి చెడుల్లో ఎల్లప్పుడూ కొడంగల్ ప్రజలు తనను గుండెల్లో పెట్టుకుని చూసుకున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని పాలించే శక్తిని కొడంగల్ ప్రజలే ఇచ్చారని వ్యాఖ్యానించారు. కొడంగల్‌లోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్లో ప్రభుత్వం శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు రాజకీయ అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మత రాజకీయాలు చేయదని అన్నారు. కొందరికి వాళ్ల కుర్చీ పోయిందనే దుఃఖం ఉందని, వారి మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. నేనేం చేస్తానో.. ఏం చేశానో నాకంటే మీకే ఎక్కువగా తెలుసునన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్ పాల్గొన్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొడంగల్ చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా పద్మావతీ సమేత శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్తలు శ్రీవారి ప్రతిమను బహూకరించారు. అర్చకులు ఆశీర్వాదం అందించారు.

మళ్లీ కాల్పుల మోత

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ 17 మంది మావోయిస్టులు మృతి

- మృతుల్లో 11 మంది మహిళలు, అగ్రనేత జగదీశ్
- దర్భా డివిజన్ కార్యదర్శి జగదీశ్‌పై రూ.25 లక్షల రివార్డు
- సుక్మా జిల్లా సరిహద్దులో చోటుచేసుకున్న ఎదురుకాల్పులు
- నక్సలిజంపై మరో దాడి: 'ఎక్స్'లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా



మావోయిస్టుల మృతదేహాలను తరలిస్తున్న బలగాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఛత్తీస్‌గఢ్ అడవులు మరోసారి కాల్పుల మోతతో దద్దరిల్లాయి. మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య శనివారం భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఎదురుకాల్పుల్లో ఏకంగా 17 మంది మావోయిస్టులు మృతి చెందగా వీరిలో 11 మంది మహిళలే ఉన్నారు. ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, దర్భా డివిజన్ కార్యదర్శి, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు జగదీశ్ అలియాస్ బుద్రా మరణించినట్టు పోలీసులు ధ్రువీకరించారు. ఇద్దరు డీఆర్‌జీ జవాన్లు గాయపడగా వారిని ఎయిర్‌లిఫ్ట్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

పక్కా సమాచారంతో..: సుక్మా – దంతెవాడ జిల్లాల సరిహద్దు కేర్లపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోగుండ గుట్టల దగ్గర మావోయిస్టు దర్భా డివిజన్, కేర్లపాల్, నేషనల్ పార్క్ ఏరియా కమిటీలు సమావేశమయ్యాయని పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో సుక్మా డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ (డీఆర్‌జీ), సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత గుట్టల వద్దకు చేరుకున్నాయి. శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇరు పక్షాల మధ్య ఎదురుకాల్పులు ప్రారంభమయ్యాయి. ఉదయం 6.30 గంటల వరకు అనేకసార్లు కాల్పులు చోటు చేసుకున్నాయి. అనంతరం ఘటనా స్థలిని పరిశీలించగా 17 మంది మావోయిస్టులు చనిపోయినట్టు తేలింది. మృతదేహాలను సుక్మాకు తరలించారు. ఇందులో ఏడుగురి వివరాలు మాత్రమే తెలిశాయి. ఘటనా స్థలంలో ఏకే 47, ఇన్సాస్, రాకెట్ లాంఛర్లు, ఇతర ఆటోమేటిక్ వెపన్లు లభించాయి.

మిలటరీ ఆపరేషన్లలో దిట్ట జగదీశ్!: సుక్మా జిల్లాలోని పార్‌గుండం గ్రామానికి చెందిన బుద్రా కుహరామి చిన్నప్పుడే మావోయిస్టుల్లో చేరాడు. అంచెలంచెలుగా ఎదుగుతూ దర్భా డివిజన్ కమిటీ కార్యదర్శి స్థాయికి చేరాడు. మరో మావోయిస్టు

మిగతా 5వ పేజీలో ▶



మయన్మార్ వెన్ను విరిగింది

భూకంపంతో అపార నష్టం..

ఇప్పటికే 1,600 దాటిన మృతులు

10 వేలకు మించవచ్చని అంచనా

3,500 మందికి పైగా క్షతగాత్రులు

థాయ్‌లాండ్‌లోనూ తీవ్ర విధ్వంసం

నేపిడాలో మళ్లీ తీవ్ర భూకంపం

- వివరాలు 6లో

టెన్త్.. జవాబు పత్రాలు చిందర వందర

ఖమ్మం బస్టాండులో బస్సు టైర్ల కింద పత్రాల పార్శిల్

బండిల్ పగిలిపోయి బయటపడ్డ పేపర్లు.. కలెక్టర్ నుంచి నివేదిక తీసుకున్న ప్రభుత్వం

జవాబు పత్రాలు భద్రంగా ఉన్నాయి.. ఆందోళన అవసరం లేదన్న అధికారులు

సాక్షి, హైదరాబాద్/కారేపల్లి: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ముఖద్వారంగా భావించే పదో తరగతి పరీక్షల నిర్వహణ, జవాబు పత్రాల తరలింపుపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. పరీక్షలు నిర్వహించామా.. జవాబు పత్రాలు పంపించామా.. అంతే.. అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఖమ్మంలో శనివారం వెలుగు చూసిన ఘటన ఇందుకు అద్దం పడుతోంది..

ఏం జరిగిందంటే..: ఖమ్మం జిల్లా కారేపల్లిలోని మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోమట్లగూడెం(గాంధీనగర్)లోని హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నెల 28న ఫిజికల్ సైన్స్ పరీక్ష ముగిశాక జవాబు పత్రాలను కారేపల్లి పోస్టాఫీస్‌లో పార్శిల్ బుకింగ్ చేశారు. అక్కడి సిబ్బంది జవాబు పత్రాలను మూడు పార్శిళ్లు చేసి

మిగతా 15వ పేజీలో ▶



బస్సు టైర్లు.. పై నుంచి వెళ్లడంతో చిరిగిన జవాబు పత్రాల బ్యాగ్

ఇదండీ సంగతి



ఈ ఉగాది పచ్చడి నీ కోసం 'ప్రత్యేకంగా' చేసినది!

పరీక్ష తప్పదు.. సీనియారిటీ రాదు..!

గ్రామ పాలనాధికారుల నియామకాలకు విధివిధానాలు విడుదల..

జీవో నం.129 జారీ చేసిన రెవెన్యూ శాఖ

రెవెన్యూ శాఖలో చేరేందుకు ఆప్షన్లు ఇచ్చినవారే అర్హులు

స్క్రీనింగ్ టెస్టు తర్వాతే ఎంపిక

గతంలో రెవెన్యూలో ఉన్న సీనియార్టీ ఇవ్వడం కుదరదని స్పష్టీకరణ

- వివరాలు 5లో

హిమాచల్‌లో 2 హైడల్ ప్రాజెక్టులు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, హిమాచల్ సీఎం సుక్కు సమక్షంలో ఎంఓయూ

400 మెగావాట్ల సెలీ, 120 మెగావాట్ల మియర్ కేంద్రాలు నిర్మించనున్న జెన్‌కో

100% వాటాతో రూ.6,200 కోట్ల పెట్టుబడి పెట్టనున్న సంస్థ

40 ఏళ్ల పాటు హిమాచల్‌కి 12–30% ఉచిత విద్యుత్ సరఫరా

ఆ తర్వాత యాజమాన్య హక్కులు పూర్తిగా ఆ రాష్ట్రానికి బదిలీ



హిమాచల్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కుతో భట్టి

సాక్షి, హైదరాబాద్: హిమాచల్‌ప్రదేశ్‌లో మొత్తం 520 మెగావాట్ల సామర్థ్యంతో రెండు జలవిద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ఆ రాష్ట్ర ప్రభుత్వంతో తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. శనివారం సిమ్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుక్కు సమక్షంలో తెలంగాణ జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా, హిమాచల్ ఇంధన శాఖ కార్యదర్శి రాకేష్ కన్వర్‌లు ఈ ఎంఓయూపై సంతకాలు చేశారు. ఒప్పందం మేరకు.. హిమాచల్ ప్రభుత్వ సహకారంతో 400 మెగావాట్ల సెలీ, 120 మెగావాట్ల మియర్ జలవిద్యుత్ కేంద్రాలను రాష్ట్ర జెన్‌కో బిల్డ్ ఓన్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బూట్) విధానంలో నిర్మించనుంది. తొలుత అక్కడ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాలపై అధ్యయనం నిర్వహించి నివేదికను సిద్ధం చేయనుంది. దాని ఆధారంగా డీపీఆర్‌ను సిద్ధం చేయనుంది. తెలంగాణ రాష్ట్ర క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ 2025 పాలసీ కింద పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యం పంచుకునేందుకు ప్రభుత్వం ఈ ఒప్పందం కుదుర్చుకుంది. హిమాచల్‌లో ఏడాదిలో 9–10 నెలల పాటు నదుల్లో నీటి ప్రవాహం ఉండనుండడంతో పుష్కలంగా

మిగతా 2వ పేజీలో ▶



విద్యుత్ డిమాండ్‌కు రెక్కలు

వేసవికి యాసంగి సాగు తోడు కావడంతో భారీగా విద్యుత్ వినియోగం

17,162 మెగావాట్ల డిమాండ్‌తో రికార్డు

2లో

రజతోత్సవాలపై బీఆర్‌ఎస్ ఫోకస్..

ఎర్రవల్లి నివాసంలో పార్టీ నేతలతో కేసీఆర్ వరుస భేటీలు

క్షేత్రస్థాయిలో రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరుపై ఆరా

జన సమీకరణ, సభ ఏర్పాట్లపై 20కి పైగా ప్రత్యేక కమిటీలు

ఏప్రిల్ 2న ఎల్కతుర్తిలో బహిరంగ సభాస్థలికి భూమి పూజ

రెండో వారం నుంచి జిల్లాలవారీగా కేటీఆర్ పర్యటనలు

- వివరాలు 12లో

క్లుప్తంగా...

తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే పండుగ ఉగాది

రాజ్‌భవన్ ఉగాది వేడుకల్లో గవర్నర్



సాక్షి, హైదరాబాద్: తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే పండుగ ఉగాది అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ప్రజలందరికీ ఆయన విశ్వావసు నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం ప్రజల జీవితాల్లో శ్రేయస్సు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఆనందోత్సాహాలతో జరుపుకొనే ఉగాది పండుగ.. ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకాలని ప్రార్థించారు. శనివారం రాజ్‌భవన్‌లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ పండితుడు డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ పంచాంగ పఠనం చేశారు. బెంగళూరులోని ఎస్‌సీఆర్‌టీ ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి.

రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలి: సీఎం రేవంత్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని, ధర్మబద్ధమైన కోరికలు నెరవేరాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ముఖ్యమంత్రి అభిలషించారు. ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేలా ప్రతి ఒక్కరు ఉగాది సంతోషంగా జరుపుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

జీవితం షడ్రుచులతో పరిపూర్ణత సంతరించుకోవాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఉగాది శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా తెలుగు ప్రజలకు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. తీపి, చేదు, పులుపు, వగరు, ఉప్పు, కారం వంటి షడ్రుచుల సమ్మేళనమే ఉగాది పచ్చడి అని తమ సందేశంలో పేర్కొన్నారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితం, షడ్రుచులతో పరిపూర్ణత సంతరించుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని చెప్పారు.

ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు: స్పీకర్



సాక్షి, హైదరాబాద్: నూతన విశ్వావసు నామ తెలుగు సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆకాంక్షించారు. తెలుగు ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండి రైతులు ఈ ఏడాది ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఈ ఏడాది మరింత సమర్థవంతంగా ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందిస్తుందని, రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు.

సమృద్ధిగా పంటలు.. సుఖసంతోషాలతో ప్రజలు

ఉగాది సందేశంలో ఆకాంక్షించిన కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: విశ్వావసు నామ ఉగాది పర్వదినం సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో సాగు, తాగునీటిని పుష్కలంగా ప్రసాదించాలని, సమృద్ధిగా పంటలు పండి, ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరిసేలా దీవించాలని ప్రకృతి మాతను కేసీఆర్ ప్రార్థించారు. ఉగాది పచ్చడి మాదిరిగా జీవితంలో షడ్రుచులను ఆస్వాదిస్తూ ప్రతీ సందర్భాన్ని వివేచనతో ఎదుర్కోవాలని పేర్కొన్నారు.

శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో అన్నీ శుభాలు కలగాలి

తెలుగు ప్రజలకు వైఎస్ జగన్ ఉగాది శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: శ్రీ విశ్వావసు నామ ఉగాది పర్వదినం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు అన్నీ శుభాలు కలగాలని.. పల్లెల్లో, పట్టణాల్లో ప్రతి ఇల్లూ కళకళలాడాలని.. మన సంస్కృతీ సంప్రదాయాలు కలకాలం వర్ధిల్లాలని వైఎస్ జగన్ ఆకాంక్షించారు. ఇంటింటా ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, ఆనందాలు నిండాలని ఆయన అభిలషించారు.



నల్లమలలో లింగమయ్య, భౌరమ్మలకు పూజలు చేస్తున్న చెంచులు

ఇప్పపూలతో ఆరాధన.. సారాతో నైవేద్యం

ఉగాది రోజున నల్లమలలో లింగమయ్యకు చెంచుల ప్రత్యేక పూజలు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉగాది రోజున నల్లమలలోని చెంచులు ప్రత్యేకంగా పండుగను జరుపుకుంటారు. అడవిలో లభించే ఇప్పపువ్వును లింగమయ్యస్వామి (శివుడు)కి సమర్పించి ఆరాధిస్తారు. ఇప్పపువ్వుతో తయారు చేసిన సారాను భౌరమ్మ (భ్రమరాంబికాదేవి)కి నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఉగాది రోజున ఏటా నల్లమలలోని సలేశ్వర క్షేత్రంలో కొలువుదీరిన లింగమయ్యను దర్శించుకుని ఇప్పపువ్వు, సారాను నైవేద్యంగా అందిస్తారు. ఈ సందర్భంగా మేక, కోడిని కోసి పండుగను జరుపుకుంటారు. నల్లమలలోని చెంచులు.. భౌరమ్మను కూతురుగా, లింగమయ్యను అల్లుడిగా భావిస్తారు. ఇక ఏటా శివరాత్రి రోజున తమ ఆడపడుచుగా భావించే భౌరమ్మకు అల్లుడు లింగమయ్యకు చెంచు పూజారుల ఆధ్వర్యంలో కల్యాణం జరిపిస్తారు.

ఇప్ప పువ్వులతోనే తొలి పండుగ

వేసవికాలంలో ఉగాది సమయంలోనే ఇప్పచెట్లు పూతకు వస్తాయి. ఉగాది పండుగ రోజున ఇప్పపూలనే తీపి ప్రసాదంగా స్వీకరించి పండుగ జరుపుకుంటారు. తొలి పండుగ ఉగాది తర్వాత ఇతర పండుగలు ప్రారంభమవుతాయి. ఉగాది తర్వాత వచ్చే చైత్రశుద్ధ పౌర్ణమి రోజున సలేశ్వరం లింగమయ్యకు ప్రత్యేక పూజలు చేసి, జాతర నిర్వహిస్తారు.

> **ఇప్పపూలతో పూజ చేస్తాం..**
>
> 
>
> ఉగాది రోజున నల్లమలలోని సలేశ్వరం లింగమయ్యకు ఇప్ప పూలు, ఇప్పసారాతో నైవేద్యం సమర్పించి పూజలు చేస్తాం. అడవిలో లభించే ఇప్పపువ్వుతో పాటు వేపపువ్వు, కొండగోగుపువ్వులను లింగమయ్య, భౌరమ్మలకు సమర్పిస్తాం.
>
> – గురువయ్య, అప్పాపూర్‌పెంట, లింగాల మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

విద్యుత్ డిమాండ్‌కు రెక్కలు

వేసవికి యాసంగి సాగు తోడు కావడంతో భారీగా విద్యుత్ వినియోగం

- ఈ నెల 20న డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరుకుని కొత్త రికార్డు
- ప్రస్తుత మార్చి, ఏప్రిల్ నెలల్లో 17,500 మెగావాట్లకు చేరనున్నట్టు అంచనా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరిగిపోతోంది. ఓ వైపు వేసవి తాపం పెరగడం.. మరోవైపు బోరుబావుల కింద పెద్ద మొత్తంలో యాసంగి పంటల సాగు జరుగుతుండడంతో విద్యుత్ డిమాండ్ అమాంతంగా పెరిగిపోతోంది. రోజువారీ గరిష్ట విద్యుత్ డిమాండ్ ఈనెల 20న 17,162 మెగావాట్లకు చేరుకుని కొత్త రికార్డును సృష్టించింది. గతేడాది మార్చి 8న రాష్ట్ర గరిష్ట విద్యుత్ డిమాండ్ 15,623 మెగావాట్లకు చేరగా, ఈ ఏడాది ఫిబ్రవరి 5 వరకు ఇదే అత్యధికం. ఫిబ్రవరి 6న గరిష్ట విద్యుత్ డిమాండ్ 15,752 మెగావాట్లకు చేరి కొత్త రికార్డు సృష్టించగా, నాటి నుంచి రోజురోజుకూ పెరుగుతూ రికార్డులు సృష్టిస్తోంది. గత నెలలోనే 16 వేల మెగావాట్లు, ఆ తర్వాత 17 వేల మెగావాట్ల మైలురాళ్లను దాటింది. గత ఫిబ్రవరి 19 నుంచి ఇప్పటివరకు గడిచిన 39 రోజుల్లో ఏకంగా 31 పర్యాయాలు రోజువారీ గరిష్ట విద్యుత్ డిమాండ్ 16 వేల మెగావాట్లు, ఒకసారి 17 వేల మెగావాట్లకు మించిపోయింది. గ్రిడ్‌పై తీవ్ర ఒత్తిడి పెరిగినా నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగించడంలో ఈ ఏడాది విద్యుత్ సంస్థలు సఫలమయ్యాయి. మార్చి, ఏప్రిల్‌లో గరిష్ట డిమాండ్ 17,500 మెగావాట్లకు చేరవచ్చని ట్రాన్స్‌కో అంచనా వేసింది.

ఎక్స్ఛేంజీల నుంచి రోజూ 80 ఎంయూల విద్యుత్ కొనుగోళ్లు

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిపోవడంతో విద్యుత్ ఎక్స్ఛేంజీల నుంచి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో స్వల్ప కాలిక విద్యుత్ కొనుగోళ్లు జరుపుతోంది. రోజువారీ సగటు విద్యుత్ వినియోగం 290–335 మిలియన్ యూనిట్లు (ఎంయూ) ఉండగా, అందులో 50–80 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్‌ను పవర్ ఎక్స్ఛేంజీల నుంచి కొనుగోలు చేస్తుండడం గమనార్హం. దక్షిణాది రీజియన్‌లో ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజీ (ఐఈఎక్స్) రోజువారీగా విక్రయిస్తున్న మొత్తం విద్యుత్‌లో 80– 90 శాతాన్ని తెలంగాణనే కొనుగోలు చేస్తోంది. విద్యుత్ డిమాండ్ గరిష్టంగా పెరిగే వేళల్లో యూనిట్‌కు రూ.10 గరిష్ట ధరతో పవర్ ఎక్స్ఛేంజీలు విద్యుత్‌ను విక్రయిస్తుండగా డిమాండ్ లేని సమయాల్లో యూనిట్‌కు రూ.2.5 కనిష్ట ధరతో విక్రయిస్తున్నాయి. ఈ కొనుగోళ్ల కోసం నిత్యం సగటున రూ.50 కోట్ల మేర డిస్కంలు వెచ్చిస్తున్నాయి.

పేరుకే 20 వేల మెగావాట్ల సరఫరా సామర్థ్యం

రాష్ట్రం 20,275 మెగావాట్ల విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని (కాంట్రాక్ట్ కెపాసిటీ) కలిగి ఉంది. అందులో ప్రధానంగా జెన్‌కోకి సంబంధించిన 4,842.5 మెగావాట్ల థర్మల్, 2,442.76 మెగావాట్ల జలవిద్యుత్‌తో పాటు 1,200 మెగావాట్ల సింగరేణి, 3186.76 మెగావాట్ల కేంద్ర ప్రభుత్వ విద్యుత్‌తో పాటు 839.45 మెగావాట్ల సెమ్‌కార్ప్ విద్యుత్ ఉంది. అయితే 1,000 మెగావాట్ల ఛత్తీస్‌గఢ్ విద్యుత్, 807.31 మెగావాట్ల గ్యాస్ ఆధారిత విద్యుత్ సరఫరా జరగడం లేదు. దీంతో రాష్ట్ర వాస్తవ విద్యుత్ సరఫరా సామర్థ్యం 18,467.69 మెగావాట్లకు తగ్గిపోయింది. ఇందులో 6,123 మెగావాట్ల సౌర విద్యుత్ లభ్యత పగటి పూటే ఉండనుంది.

తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని కింది పట్టికలో చూడవచ్చు..

థర్మల్ విద్యుత్ కేంద్రం	స్థాపిత సామర్థ్యం (మెగావాట్లలో)
కొత్తగూడెం-5 (1వ యూనిట్)	250
కొత్తగూడెం-5 (2వ యూనిట్)	250
కొత్తగూడెం-6	500
కొత్తగూడెం-7	800
కాకతీయ-1	500
కాకతీయ-2	600
భద్రాద్రి-1	270
భద్రాద్రి-2	270
భద్రాద్రి-3	270
భద్రాద్రి-4	270
యాదాద్రి-2	800
రామగుండం-బీ	62.5
జెన్‌కో మొత్తం	4,842.5

హిమాచల్‌లో 2 హైడల్ ప్రాజెక్టులు

▶ మొదటి పేజీ తరువాయి

జలవిద్యుదుత్పత్తి జరపడానికి అవకాశం ఉంటుంది.

5 వేల మంది స్థానికులకు ఉద్యోగాలు, ఇతర ప్రయోజనాలు

చినాబ్ నదిపై రూ.6,200 కోట్లతో ఈ రెండు విద్యుత్ కేంద్రాలను జెన్‌కో నిర్మించనుండగా, ఆ రాష్ట్రానికి చెందిన 5 వేల మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రాజెక్టు వ్యయంలో 1.5 శాతాన్ని లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ఫండ్ (ఎల్‌ఏడీఎఫ్) కోసం జెన్‌కో ఇవ్వనుంది. ప్రాజెక్టుల నిర్మాణంతో ప్రభావితం కానున్న కుటుంబాలకు 10 ఏళ్ల పాటు నెలకు 100 యూనిట్ల విద్యుత్‌కు సమానమైన డబ్బు చెల్లించనుంది.

విద్యుత్ భద్రతను పెంపొందిస్తున్నాం: భట్టి విక్రమార్క

విద్యుత్ భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి కొనసాగిస్తామన్నారు. తమ రాష్ట్రంలోని వనరులకు రక్షణతో పాటు వాటి ఆధారంగా నిర్మించే జలవిద్యుత్ కేంద్రాలతో స్థానిక ప్రజలకు ప్రయోజనం కల్పించే విషయంలో తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుక్కు అన్నారు. పవర్ బ్యాంకింగ్, ట్రేడింగ్ రంగాల్లో సైతం తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, జెన్‌కో హైడల్ డైరెక్టర్ సచ్చిదానందం, హిమాచల్ ఎనర్జీ డైరెక్టర్ రాకేష్, ఆ రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి అరిందం చౌదరి పాల్గొన్నారు.

హిమాచల్‌కు 40 ఏళ్ల పాటు ఉచిత విద్యుత్

హిమాచల్ ప్రాజెక్టులను జెన్‌కో నామినేషన్ విధానంలో నిర్మించనుంది. విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి 100 శాతం మూలధన పెట్టుబడులను సంస్థ భరించనుంది. అప్ ఫ్రంట్ ప్రీమియం(ముందస్తు పెట్టుబడి) కింద జెన్‌కో ఇప్పటికే రూ.26 కోట్లను హిమాచల్‌కు చెల్లించింది. ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ జెన్‌కో ఆధ్వర్యంలోనే జరగనుంది. స్థలం ఇవ్వడంతో పాటు సహకారాన్ని అందించినందుకు గాను ఆ రాష్ట్రానికి 40 ఏళ్ల పాటు 12–30 శాతం వరకు విద్యుత్‌ను తెలంగాణ ఉచితంగా సరఫరా చేయనుంది. రెండు విద్యుత్ కేంద్రాలు ఉత్పత్తి చేసే విద్యుత్‌లో 12శాతాన్ని తొలి 12 ఏళ్ల పాటు, ఆ తర్వాతి 18 ఏళ్ల పాటు 18 శాతాన్ని ఆ రాష్ట్రానికి ఉచితంగా సరఫరా చేయనుంది. మిగిలిన 10 ఏళ్ల పాటు 30 శాతం విద్యుత్‌ను ఆ రాష్ట్రానికి ఉచితంగా అందించనుంది. బూట్ ఒప్పందం ప్రకారం 40 ఏళ్ల తర్వాత రెండు విద్యుత్ కేంద్రాల యాజమాన్య హక్కులను హిమాచల్‌ప్రదేశ్‌కు జెన్‌కో బదిలీ చేయనుంది.

పేదలందరికీ.. సన్నబియ్యం

▶ మొదటి పేజీ తరువాయి

పంపిణీ చేయడం కంటే అదనంగా మరో రూ.2,800 కోట్లు వెచ్చించి సన్న బియ్యం పంపిణీ చేయడం వల్ల ఉచిత బియ్యం పథకం సద్వినియోగం అవుతుందని తేల్చింది. ఈ మేరకు సన్న బియ్యం పంపిణీకి మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే ఆదివారం సన్న బియ్యం పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు.

నెలకు 2 ఎల్ఎంటీలు అవసరం: నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అవసరం అవసరమని అధికారులు చెబుతున్నారు. గత వానాకాలం సీజన్‌లో 4.41 లక్షల మంది రైతుల నుంచి సేకరించిన 24 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీల) సన్న ధాన్యాన్ని గత డిసెంబర్ నుంచే మిల్లింగ్ చేయించడం ప్రారంభించినట్లు పేర్కొంటున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అధీనంలోని గోడౌన్‌లలో నిల్వ చేసిన బియ్యాన్ని ఏప్రిల్ 1 నుంచి పంపిణీ చేసేందుకు వీలుగా మండల స్థాయి స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్లకు పంపించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో 2.85 కోట్ల లబ్ధిదారులకు పంపిణీ చేసే సన్న బియ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటివరకు రూ.10,665 కోట్లు సబ్సిడీ రూపంలో భరిస్తున్నాయని, సన్న బియ్యం పంపిణీ కారణంగా ఇకపై రూ.13,522 కోట్లు భరించాల్సి వస్తుందని వివరించాయి. ఇందులో కేంద్రం రూ.5,489 కోట్లు భరిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సిన రాయితీ రూ.8,033 కోట్లకు పెరుగుతోందని పేర్కొన్నాయి.

త్వరలోనే మరో 30 లక్షల మంది పీడీఎస్ నెట్‌వర్క్‌లోకి..

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రేషన్‌కార్డులకు తోడు కొత్త కార్డుల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 30 లక్షల మందిని అర్హులుగా ప్రాథమిక పరిశీలనలో తేల్చారు. ఇందులో 18 లక్షల దరఖాస్తులు ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్లు చేర్చడం (అడిషన్స్) గురించి కాగా.. వీరందరినీ అర్హులుగా గుర్తించి ఇప్పటికే ఆన్‌లైన్‌లో చేర్పుల జాబితాలో పొందుపరిచినట్లు అధికారులు చెబుతున్నారు. జాబితాలో పేర్లు ఉన్నవారికి కూడా సన్న బియ్యం ఇస్తామని ప్రభుత్వం తెలిపింది. మరో 12 లక్షల మందిని (సుమారు 4 లక్షల కుటుంబాలు) కూడా రేషన్‌కార్డులకు అర్హులుగా జాబితాల్లో చేర్చాలని నిర్ణయించినట్లు పౌరసరఫరాల సంస్థ తెలిపింది. వీరందరికీ కొత్తగా 4 నుంచి 5 లక్షల కార్డుల వరకు అవసరమని అంచనా వేశారు. కొత్త లబ్ధిదారుల చేరికతో సన్న బియ్యం వినియోగించుకునే వారి సంఖ్య 3.10 కోట్లకు పెరుగుతుందని, అలాగే కార్డుల సంఖ్య 94 లక్షలకు చేరే అవకాశం ఉందని చెబుతున్నారు.

హుజూర్‌నగర్‌లో ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించనున్న నేపథ్యంలో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని రాజీవ్ ప్రాంగణంలో నిర్వహించనున్న సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం సాయంత్రం 5 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 5.45 గంటలకు హుజూర్‌నగర్ శివారులోని రామస్వామి గుట్ట వద్ద హెలిపాడ్‌లో దిగుతారు. అక్కడ నిర్మాణంలో ఉన్న రెండు వేల సింగిల్ బెడ్రూం ఇళ్ల మోడల్ కాలనీని సీఎం పరిశీలిస్తారు. అనంతరం 6.15 గంటల సమయంలో రాజీవ్ ప్రాంగణం సమీపంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. 6.15 గంటల నుంచి 7.30 గంటల వరకు సభా ప్రాంగణంలో ఉంటారు. ఇదే వేదికపై సన్న బియ్యం పంపిణీ పథకాన్ని సీఎం లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం ప్రజలనుద్దేశించి సీఎం మాట్లాడతారు. రాత్రి 7.30 గంటలకు రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు బయలుదేరి వెళతారు.

‘తెలంగాణ రైజింగ్’కు ఆ దేశాలు వద్దు!

అరబ్ దేశాలు, వాటికి సహకరిస్తున్న కొన్ని దేశాలను పిలవొద్దన్న కేంద్రం

- ఇటీవల కేంద్ర మంత్రి జైశంకర్‌ను కలిసి ‘రైజింగ్’కు అనుమతి కోరిన సీఎం రేవంత్
- కొన్ని దేశాలు వస్తే ప్రతికూల సంకేతాలు వెళతాయన్న కేంద్రం
- వారిని మినహాయించి, మిగతా వారితో ‘రైజింగ్’జరుపుకోమని సూచన



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే ‘భారత్ సమ్మిట్’(తెలంగాణ రైజింగ్)కు కొన్ని దేశాల వారిని పిలవొద్దని కేంద్రం ఆంక్షలు విధించింది. అరబ్‌దేశాలు, ఆ దేశాలకు సహకరిస్తున్న మరికొన్ని దేశాల వారిని పిలవకుండా రైజింగ్ జరుపుకోమని సూచనలు చేసింది. ఆయా దేశాల ప్రతినిధులు భారత్‌కు వస్తే సంకేతాలు మరోలా బయటకు వెళతాయనే ఆలోచనతోనే తాము వద్దు అంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌కు.. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కేంద్రం సూచించిన వివిధ దేశాల పేర్లు తొలగించి, కొత్త పేర్లతో మరో లేఖ ఇవ్వడానికి రాష్ట్ర సర్కార్ కసరత్తు చేస్తోంది.

మీ ఆలోచన మంచిదే.. కానీ వాళ్లు వద్దు

‘రాబోయే 25 సంవత్సరాల్లో తెలంగాణను సమున్నతంగా నిలిపేందుకోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా నిలవండి. ఈ ఏడాది ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో తెలంగాణ రైజింగ్ పేరుతో నిర్వహించబోయే ‘భారత్ సమ్మిట్’కు పలు దేశాల వారిని పిలవాలని అనుకుంటున్నాం. దీనికి మీ మద్దతు, అనుమతి అవసరం’అంటూ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌ను సీఎం రేవంత్ కోరారు. ఈ నెల 13న ఢిల్లీలో జైశంకర్‌ను కలసి అందుకు సంబంధించిన లేఖను అందచేశారు. ఆ లేఖలో పలు దేశాల పేర్లు పొందుపరిచారు. కాగా, ‘తెలంగాణ రైజింగ్ పేరుతో మీరు నిర్వహించ తలపెట్టిన భారత్ సమ్మిట్ అభినందనీయం. మీఆలోచన మంచిదే.. అయితే, వీటిలో ఉన్న అరబ్ దేశాలు, అరబ్ దేశాలకు సహకరిస్తున్న కొన్ని దేశాల పేర్లు తొలగించండి. వాళ్లు భారత దేశానికి రావడం మాకు ఇష్టం లేదు. వాళ్లు ఇక్కడకు వచ్చి ఏదైనా మాట్లాడితే, భారత్‌తో స్నేహపూర్వకంగా ఉన్న దేశాలకు తప్పుడు సంకేతాలు అందుతాయి. కాబట్టి, ఆయా దేశాల పేర్లు తొలగించి మీరు ఏ కార్యక్రమమైనా పెట్టుకోండి, మాకేమీ ఇబ్బంది లేదు’అంటూ సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి జైశంకర్ బదులిచ్చారు.

ఆ దేశాల పేర్లు తొలగించకపోతే కష్టమే?

ఇదిలా ఉండగా రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య, అలాగే ఇజ్రాయెల్, పాలస్తీనియన్ల మధ్య, మయన్మార్‌లో అంతర్గతంగా కొంతకాలంగా యుద్ధాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ దేశాలకు కొన్ని దేశాలు మద్దతు తెలుపుతుండగా, కొన్ని వ్యతిరేకంగా ఉన్నాయి. ఇటువంటి సమయంలో యుద్ధాలు జరిగే దేశాలు, వాటికి సహకరిస్తున్న దేశాల వారిని భారత్‌కు పిలవడం మనకు నష్టమని కేంద్రం భావిస్తోంది. వారిని మినహాయించి ఎవరు వచ్చినా తమకేమీ ఇబ్బంది లేదని కేంద్రం చెబుతున్నట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ గొప్పతనం చాటిచెప్పాలని, అందుకే ఆయా దేశాల వారిని ఇక్కడకు ఆహ్వానిస్తున్నట్లు సీఎం రేవంత్ చెబుతున్నారు. సీఎం ఆలోచన మంచిదే అయినప్పటికీ కేంద్రానికి మాత్రం కొన్ని దేశాల వాళ్లు ఈ తరుణంలో ఇక్కడకు రావడం ఇష్టం లేదని, ఆ దేశాల పేర్లు తొలగించి కొత్తగా పేర్లు ఇస్తే అనుమతి ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని విశ్వసనీయ సమాచారం. లేనిపక్షంలో తెలంగాణలో భారత్ సమ్మిట్ జరగడం కష్టమేనని కేంద్ర సర్వీసుల్లోని అధికారులు అంటున్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు నేడు అంకురార్పణ

భద్రాద్రిలో ప్రత్యేక పూజలు



విద్యుత్ దీపాల వెలుగులో ధగధగలాడుతున్న భద్రాచల రామాలయం

భద్రాచలం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో శ్రీరామనవమి ఉత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరగనుంది. ప్రతీ సంవత్సరం ఉగాది రోజున వేడుకలు ప్రారంభించడం ఆనవాయితీ. విశ్వావసు నామ సంవత్సరాది సందర్భంగా ఆదివారం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం ఆస్థాన పురోహితులతో పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు. శ్రీ సీతారాముల వారి ఆదాయ, వ్యయాలు, రాజపూజ్యం, అవమానంతో పాటు రాశి ఫలాలను భక్తులకు వివరిస్తారు. అనంతరం వేప పూత పచ్చడి నివేదన చేసి భక్తులకు పంచుతారు. కాగా, ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఏప్రిల్ 12వ తేదీ వరకు నిత్యకల్యాణాలు నిలిపివేస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

‘వ్యాపారాలకు హిందీ కావాలి... రాజకీయాలకు వద్దా?’

- హిందీ తప్పనిసరిగా నేర్చుకోవాలని ఒత్తిడి చేశామా?
- రాజకీయాల కోసమే డీఎంకే, కాంగ్రెస్ నాయకుల నాటకాలు
- దేశంలో త్రిభాషా విధానం తెచ్చింది కాంగ్రెస్సే: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ‘త్రిభాషా విద్యావిధానంలో హిందీ వద్దంటున్న వారికి వ్యాపారాలు చేసుకునేందుకు హిందీ అవసరం కానీ.. రాజకీయాలకు వచ్చేసరికి హిందీ వద్దా? దేశంలో హిందీ తప్పనిసరిగా నేర్చుకోవాలని ఒత్తిడి చేశామా’అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. దేశంలో త్రిభాషా విద్యావిధానం కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోనే రూపుదిద్దుకుందన్న విషయాన్ని హిందీని వ్యతిరేకించేవారు గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు. శనివారం ఢిల్లీలో ఓ మీడియా సంస్థ నిర్వహించిన సదస్సులో పాల్గొన్న కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, దేశంలో నూతన విద్యా విధానం తీసుకొచ్చేందుకు తమిళనాడుకు చెందిన కస్తూరి రంగన్ నేతృత్వం వహించారన్నారు. ఆయన సూచనల మేరకే 2022లో కేంద్ర ప్రభుత్వం ఈ నూతన విద్యా విధానం తీసుకొచ్చిందన్నారు. ఎన్నికలు వస్తున్నాయనగానే తమిళనాడు సీఎం స్టాలిన్‌కు ఎక్కడ లేని సమస్యలు గుర్తొస్తాయని విమర్శించారు. అవినీతి, లిక్కర్ స్కామ్ నుంచి తమిళనాడు ప్రజలను పక్కదారి పట్టించేందుకు సీఎం స్టాలిన్ కొత్త నాటకాలకు తెరలేపారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. అంతేగాక తమిళనాడు డీఎంకే నేతల పిల్లలందరూ ఢిల్లీలో, ఉత్తరాదిన చదువుకుంటున్నారని, డీఎంకే నేతలు నిర్వహించే విద్యాసంస్థల్లో హిందీ బోధన జరుగుతోందని తెలిపారు. తమిళనాడు ప్రజల్లోనూ హిందీ విషయంలో ఎలాంటి అభ్యంతరం లేదని, రాజకీయాల కోసమే డీఎంకే, కాంగ్రెస్ నాయకులు ఈ నాటకాలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. మరోవైపు ఇప్పటికిప్పుడు తెలంగాణ, కర్ణాటకలో ఎన్నికలు జరిగితే బీజేపీ అధికారంలోకి వస్తుందని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ నుంచే 60 శాతం ఆదాయం వస్తోందని, అలాంటప్పుడు హైదరాబాద్‌ను వదిలి ఆదిలాబాద్‌లో ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నిస్తే ఎలా ఉంటుంది? అని ప్రశ్నించారు. దేశంలోనూ ఇదే సూత్రం వర్తిస్తుందని స్పష్టత ఇచ్చారు.

బెట్టింగ్స్‌పై సిట్ చీఫ్‌గా అభిషేక్ మహంతి

- నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్
- డీజీపీ పర్యవేక్షణలో జరగనున్న దర్యాప్తు
- ఒకటిరెండు రోజుల్లో అధికారిక ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్ వ్యవహారాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) 2011 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అభిషేక్ మహంతి నేతృత్వం వహించనున్నారు. డీజీపీ జితేందర్ సిఫార్సు మేరకు సీఎం ఎ.రేవంత్‌రెడ్డి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి ఒకటిరెండు రోజుల్లో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఈ కేసుల దర్యాప్తు మొత్తం నేరుగా డీజీపీ పర్యవేక్షణలోనే జరగాలని, ఇతర అధికారులు సహాయ సహకారాలు అందించాలని సీఎం స్పష్టం చేశారు. ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సైతం సిట్‌కు సలహాలు, సూచనలు అందించనున్నారు. సిట్ ఏర్పాటుపై గత బుధవారం అసెంబ్లీలో ప్రకటన చేయడానికి ముందు సీఎం పోలీస్ ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సజ్జనార్ కూడా పాల్గొన్నారు. సిట్ బాధ్యతలను ఆయనకే అప్పగించాలని సీఎం భావించారు. అయితే, ప్రస్తుతం ఆయనకు ఉన్న బాధ్యతల నేపథ్యంలో అభిషేక్ మహంతిని ఎంపిక చేశారు. ఆయా కంపెనీలు, వెబ్‌సైట్లు, యాప్స్‌తో పాటు సినీనటులు, సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లూయెన్సర్లపై పంజగుట్ట, మియాపూర్‌లో నమోదైన రెండు కేసులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బెట్టింగ్ సంబంధిత ఆత్మహత్యల కేసులు సిట్‌కు బదిలీ కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే అభిషేక్ మహంతిని ఆంధ్రప్రదేశ్‌కు రిలీవ్ చేయాలని ఆదేశించింది. దీనిపై ఆయన క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ విచారణ పూర్తయ్యే వరకు కేంద్రం ఉత్తర్వులను ఇటీవల హైకోర్టు సస్పెండ్ చేసింది. దీంతో ప్రస్తుతం అభిషేక్ మహంతి వెయిటింగ్‌లో ఉన్నారు. సిట్ కోసం డీజీపీ కార్యాలయం లేదా బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో కార్యాలయం కేటాయించనున్నారు.

ఆరోగ్యశ్రీలోకి మరో 164 ప్రైవేటు ఆస్పత్రులు

ప్రస్తుతం నెట్‌వర్క్‌లో 409 ప్రైవేటు ఆస్పత్రులు

సాక్షి, హైదరాబాద్: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలోకి కొత్తగా 164 ప్రైవేటు ఆస్పత్రులు రానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వానికి చేసుకున్న దరఖాస్తులకు సూత్రప్రాయంగా అంగీకారం లభించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో 1,042 ఆస్పత్రులు ఉండగా, అందులో 409 ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. మొత్తంగా వెయ్యి ప్రైవేటు ఆస్పత్రులను ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లోకి తీసుకురావాలని అధికారులను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. రాష్ట్రంలో సుమారు 3 వేలకుపైగా ఆస్పత్రులు సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పొందేందుకు అర్హత సాధించాయి. ఈ నేపథ్యంలో క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ పరిధిలోకి కనీసం వెయ్యి ఆస్పత్రులను తీసుకురావాలని మంత్రి ఆదేశించినట్లు తెలిసింది.

రెట్టింపైన ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఆరోగ్యశ్రీ కింద చికిత్స ఖర్చును రూ.10 లక్షలకు పెంచింది. అలాగే కొత్తగా 163 వ్యాధులను జత చేసి ఆరోగ్యశ్రీ పరిధిలోకి 1,835 వ్యాధులను చేర్చింది. 1,375 ప్రొసీజర్లకు సంబంధించి హాస్పిటళ్లకు చెల్లిస్తున్న ధరలను 20 శాతం పెంచింది. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ కింద 2024–25 ఆర్థిక సంవత్సరంలో 3,53,474 మంది చికిత్స చేయించుకున్నారు. కాగా, హాస్పిటళ్లకు సగటున ఏటా రూ.684 కోట్లు చొప్పున (నెలకు రూ.57 కోట్లు) బీఆర్ఎస్ ప్రభుత్వంలో చెల్లిస్తే, కాంగ్రెస్ హయాంలో రూ.966.54 కోట్లు చెల్లించారు. అంటే నెలకు రూ.87 కోట్లు చెల్లించారు.

సైబర్ నేరగాళ్ల బ్లాక్‌మెయిల్‌కు భయపడొద్దు

ప్రజలకు పోలీసుల సూచన

సాక్షి, హైదరాబాద్: మనం సరదాగా ఫేస్‌బుక్, ఎక్స్ ఖాతాల్లో షేర్ చేస్తున్న ఫొటోలు, వీడియోలు సైబర్ నేరగాళ్లకు అవకాశంగా మారుతున్నాయి. మనం పెట్టే ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా చిత్రీకరిస్తూ, వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని.. మీ బంధుమిత్రులకు పంపుతామని బెదిరింపులకు దిగుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు పోలీసులు కొన్ని సూచనలు చేస్తున్నారు. సైబర్ నేరగాళ్ల బ్లాక్ మెయిల్‌కు భయపడొద్దని వారు చెపుతున్నారు. పరువు పోతుందని, మనం ఏదో తప్పు చేసినట్టు అవుతుందని భయపడి సైబర్ నేరగాళ్లకు డబ్బులు పంపవద్దని అంటున్నారు. సోషల్ మీడియాలో ఎవరికీ ఫొటోలు, వీడియోలు పంపవద్దని వారు హెచ్చరించారు.

6, 7 తరగతుల విద్యార్థులకు ప్యాంట్

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి ఎఫెక్ట్

జనగామ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 6, 7 తరగతుల విద్యార్థులకు ప్యాంట్ స్టిచ్చింగ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. వచ్చే విద్యాసంవత్సరానికి రాష్ట్ర వ్యాప్తంగా 1 నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లోని 19,91,986 మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్ అందించడానికి 8వ తరగతి పిల్లలకు ప్యాంట్, 6, 7 తరగతులకు నిక్కర్ కొలతలు తీసుకున్నారు. ఈ తరుణంలో ఆరు, ఏడు తరగతుల విద్యార్థులు నిక్కర్‌తో అసౌకర్యానికి గురవుతున్న తీరును వివరిస్తూ 'ఇంకా నిక్కరేనా' శీర్షికన ఈనెల 7న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి సర్కారు స్పందించింది. ఆ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ (ఐఏఎస్/పాఠశాల విద్యాశాఖ) ఈవీ వెంకటనర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 6, 7 తరగతుల విద్యార్థులకు ప్యాంట్, షర్టుకు అవసరమైన క్లాత్ కొనుగోలు చేయాలని పేర్కొంటూ.. స్టిచ్చింగ్ చేసే మహిళా స్వయం సహాయక సంఘాల బాధ్యులకు సూచనలు చేయాలని తెలిపారు.

రోజుకు 98 మొబైల్‌ఫోన్ల రికవరీ

- సీఈఐఆర్ పోర్టల్‌తో ఇప్పటివరకు 70,058 మొబైల్ ఫోన్ల స్వాధీనం
- వెల్లడించిన సీఐడీ డీజీ శిఖాగోయల్



సాక్షి, హైదరాబాద్: చోరీకి గురైన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీలో జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసులు రెండో స్థానంలో నిలిచినట్టు సీఐడీ డీజీ శిఖాగోయల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజుకు సరాసరిన 98.67 మొబైల్ ఫోన్లు రికవరీ చేసినట్టు పేర్కొన్నారు. టెలికమ్యూనికేషన్స్ విభాగానికి చెందిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌ను వినియోగించి మొబైల్‌ఫోన్ల జాడ కనిపెడుతున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 780 పోలీస్ స్టేషన్లలో సీఈఐఆర్ పోర్టల్‌ను వినియోగిస్తున్నట్టు చెప్పారు. మొబైల్ ఫోన్ల రికవరీలో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ (10,861 మొబైల్ ఫోన్లు), సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ (9,259), రాచకొండ పోలీస్ కమిషనరేట్ (7,488) తొలిమూడు స్థానాల్లో నిలిచినట్టు పేర్కొన్నారు. మొబైల్‌ఫోన్ చోరీకి గురైతే www.tspolice.gov.inలో లేదా www.ceir.gov.inలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐడీ సైబర్ క్రైం ఎస్పీ బి.గంగారాం ఇతర అధికారులను శిఖాగోయల్ అభినందించారు.



గుంటను త్రవ్వువాడే అందులో పడును.
రాతిని పొర్లించువాని మీదికి అది తిరిగి వచ్చును.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు చైత్ర మాసం, **తిథి:** శు.పాడ్యమి ప.2.44 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** రేవతి సా.6.44 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** ఉ.7.34 నుండి 9.02 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.36 నుండి 5.24 వరకు, **అమృత ఘడియలు:** సా.4.26 నుండి 5.56 వరకు.

సూర్యోదయం : 6.00
సూర్యాస్తమయం : 6.08
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

ఎర్రబుక్కు తెల్లమొహం!

జనతంత్రం

వర్ధెల్లి మురళి



ఎర్ర పుస్తకం తెల్లమొహం వేసినట్లయింది. రాజ్యాంగ విధి విధానాలను కూడా ప్రైవేటీకరించబోయిన తెంపరితనానికి చెంపలు వాయించినట్లయింది. ఇష్టారీతిన పోలీసు రాజ్యాన్ని నడుపుతామంటే, పౌరహక్కుల్ని చిదిమేస్తామంటే అంగీకరించేది లేదని ఇప్పటికే పలుమార్లు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వ యంత్రాంగాన్ని హెచ్చరించింది. ఇప్పుడదే హెచ్చరికను జనతా న్యాయస్థానం కూడా జారీ చేసినట్లయింది. రాష్ట్రంలో 56 మండల పరిషత్తు అధ్యక్ష ఉపాధ్యక్ష స్థానాలకు, కడప జిల్లా పరిషత్తు అధ్యక్ష స్థానానికి మొన్న ఉపఎన్నికలు జరిగాయి. ఓట్లు వేసింది ఎంపీటీసీలు, జడ్పీటీసీలే. వీరు క్షేత్రస్థాయి ప్రజా ప్రతినిధులు. జనం గుండె చప్పుళ్లను నిరంతరం వినగలిగేవాళ్లు. ప్రజల నాడీ స్పందనను ముందుగా పసిగట్టగలిగేవాళ్లు.

ఉపఎన్నికల్లో అధికార కూటమి పన్నిన వ్యూహం ఫలించలేదు. విపక్షమైన వైసీపీ ఘనవిజయాన్ని నమోదు చేసింది. కడప జడ్పీతో సహా 40 స్థానాలను ఆ పార్టీ అవలీలగా గెలవగలిగింది. కూటమికి 10 స్థానాలు దక్కాయి. మిగిలినచోట్ల ఎన్నిక వాయిదా పడింది. వైసీపీ టిక్కెట్‌పై గెలుపొందిన స్థానిక ప్రతినిధులు ఆ పార్టీ పక్షాన్నే నిలవడంలో వింతేముందని ఇప్పుడు కూటమి చిలుకలు పలుకుతుండవచ్చు. కానీ ఏపీలో ఈ తొమ్మిది నెలల పూర్వరంగం అర్థమైన వారికి వైసీపీ గెలుపులో వింతే కాదు, అద్భుతం కూడా కనిపిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రజానీకంలో బలంగా వేళ్లూనుకున్న పార్టీ వైసీపీ. ఆ సంగతి కూటమి నేతలకు స్పష్టంగా తెలుసు. అందుకే కూటమి కట్టుకున్నారు. కుయుక్తులను ఆశ్రయించారు. ఎన్నికల్లో ఈ కూటమి చేసిన దుష్ప్రచారం, వెదజల్లిన విషం, పలికిన అసత్యాలు, చేసిన బూటకపు బాసలు అనే నిచ్చెనమెట్ల మీదుగా చేరుకున్న అధికారాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రతిపక్ష పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేయాలనే సంకల్పానికి అధికార కూటమి వచ్చినట్టు దాని చర్యలు నిరూపిస్తున్నాయి. ఇటువంటి ప్రయత్నాలు సత్ఫలితాలనివ్వవని గతంలో అనేక గుణపాఠాలున్నాయి. అయినా అధికార మత్తులో ఉన్నప్పుడు అవి స్ఫురించక పోవచ్చు. 'తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు.... ... కానీ మూర్ఖుని మనసును సమాధానపరచడం మాత్రం సాధ్యం కాద'ని భర్తృహరి చెప్పిన సుభాషితం మనకు ఉండనే ఉన్నది.

ప్రభుత్వ వైఖరిని విమర్శించిన వారి మీద, ఎన్నికల హామీలను అమలు చేయలేదేమని అడిగిన వారి మీద వందలాది కేసులు నమోదయ్యాయి. టెర్రరిస్టుల మీద పెట్టాల్సిన కేసులను సోషల్ మీడియా విమర్శకుల మీద ఎందుకు పెడుతున్నారని హైకోర్టు ప్రశ్నిస్తున్నా పోలీసు యంత్రాంగం ఖాతరు చేయడం లేదు. రక్షక భటులే అర్ధరాత్రి పూట సివిల్ డ్రెస్సుల్లో ఇళ్లలోకి చొరబడి విమర్శకులను బరబరా లాక్కొని వెళ్తున్నారని, రాష్ట్రమంతటా తిప్పుతున్నారనీ, కుటుంబ సభ్యులకు సమాచారం కూడా ఇవ్వడం లేదనే ఆరోపణలు తరచుగా వినిపిస్తున్నాయి. పోసాని కృష్ణమురళి పదేళ్ల కింద ప్రెస్‌మీట్‌లో చేసిన విమర్శలపై టెర్రరిస్టు కేసు పెట్టి జైల్లోకి నెట్టారు. నడివీధుల్లో విపక్ష కార్యకర్తలను విచ్చుకత్తులతో నరుకుతున్న దృశ్యాల వీడియోలను చూడవలసి వచ్చింది. ప్రైవేట్ ఆస్తుల మీద దాడులు జరిగాయి. పార్టీ ఆఫీసులను కూల్చేశారు. పంట చేల విధ్వంసం జరిగింది. పండిన తోటలను నరికేశారు. మీడియా మీద అప్రకటిత సెన్సార్‌షిప్ అమలైంది. తమకు గిట్టని వార్తా చానెళ్ల ప్రసారాలను నిలిపివేసేలా కేబుల్ ఆపరేటర్ల మీద ఒత్తిడి తీసుకొచ్చారు.

ఈ నేపథ్యంలో వచ్చిన స్థానిక ఉపఎన్నికల సందర్భంగా కూటమి నాయకత్వం మరింత రెచ్చిపోయింది. స్థానిక ప్రతినిధులను లొంగదీసుకోవడానికి సామ దాన భేద దండోపాయాలను ప్రయోగించారు. ప్రలోభాల ఎరలు వేశారు. కేసులు పెడతామని బెదిరించారు. ఉపాధిని దెబ్బతీస్తామని హెచ్చరించారు. పోలీసు యంత్రాంగాన్ని చేతిలో పెట్టుకొని స్వయంగా ప్రభుత్వమే అధికార జులుమ్‌కు దిగినప్పుడు స్థానిక ప్రతినిధులను లొంగదీసుకోవడం పెద్ద విశేషమేమీ కాదు. పైగా రాజ్యసభల్లో, శాసన మండళ్లలో అధికార హోదాలు వెలగబెట్టిన బడాబడా ఆసాములే సర్కార్ కొరడా ముందు సాగిలపడి పోయిన ఉదంతాలు కళ్లముందటే కనిపిస్తున్నాయి. స్థానిక పదవులను గెలుచుకోవడానికి అధికార పార్టీ బరి తెగించిందనీ, పలుచోట్ల ప్రతినిధులను అడ్డుకున్నారనీ, ప్రలోభపెట్టారనీ 'సాక్షి' మీడియానే కాదు, 'ప్రజాశక్తి' పత్రిక కూడా రాసింది.

ఇలా అధికార యంత్రాంగం బరితెగించి ప్రవర్తించినప్పుడు స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ స్వీప్ చేయడం కష్టం కాదనే అభిప్రాయం చాలామందికి ఉంటుంది. కానీ, వైసీపీ స్థానిక ప్రతినిధులు అరుదైన ప్రజాస్వామిక చైతన్యాన్ని ప్రదర్శించారు. పరిశీలకులను ఆశ్చర్యంలో ముంచెత్తారు. నిర్బంధాలను ధిక్కరించి తమను నమ్మి గెలిపించిన పార్టీ పక్షానే దృఢంగా నిలబడ్డారు. తమ పదవులేమీ ప్రభావం చూపగలిగేంత పెద్దవి కాదు. అయినా సరే విశ్వసనీయతకే వారు పట్టం కట్టారు. గోడ దూకిన బడా ఆసాములు ఈ పరిణామం తర్వాత ఎలా తలెత్తుకుంటారో చూడాలి. 'స్టేట్ టెర్రరిజమ్' అనదగ్గ స్థాయిలో నిర్బంధకాండను ప్రయోగించినా ఈ క్షేత్రస్థాయి ప్రతినిధులు దృఢంగా నిలవడానికి రెండు ముఖ్యమైన కారణాలు కనిపిస్తున్నాయి. మొదటిది – రెండు నెలల క్రితం పార్టీ కార్యకర్తలనుద్దేశించి ఆ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రసంగం. కార్యకర్తలెవరూ అధైర్యపడవలసిన అవసరం లేదనీ, వారికి తాను అండగా నిలబడతాననీ ప్రకటించారు. జగనన్న 2.0 కార్యకర్తల కోసం ఎలా పనిచేస్తాడో చేసి చూపెడతానని భరోసా ఇచ్చారు.

జగన్ ప్రకటన తర్వాత గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యకర్తలకు మంచి ప్రేరణ లభించిందనీ, వారు ధైర్యంగా నిలబడుతున్నారనీ వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇక రెండో ప్రధాన కారణం – క్షేత్రస్థాయి వాస్తవికత. ఎన్నికలకు ముందు చంద్రబాబు కూటమి చేసిన బూటకపు హామీల బండారం ప్రజలందరికీ అర్థమైంది. వైసీపీ సర్కార్ మీదా, జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యక్తిగతంగా కూటమి చేసిన ఆరోపణలన్నీ పచ్చి అబద్ధాలేనని ప్రజాశ్రేణులు ఇప్పుడు భావిస్తున్నాయి. మోసపోయామన్న భావన వారిని వెంటాడుతున్నది. ప్రభుత్వంపై వ్యతిరేకత క్రమంగా పెరుగుతున్నది. వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి భయపడటం లేదు. బహిరంగంగానే కూటమి సర్కార్‌ను విమర్శిస్తున్నారు. ఈ పరిణామం కూడా వైసీపీ కార్యకర్తలు ఎదురొడ్డి నిలబడేందుకు దోహదపడింది.

జనంలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నా కూటమి సర్కార్ తన ధోరణిని మార్చుకోకపోగా అదే అసత్య ప్రచారాన్ని మరింత ఎక్కువగా ఆశ్రయిస్తున్నది. తేలిపోయిన ఆరోపణల్నే మళ్లీ మళ్లీ ఎక్కుపెడుతున్నారు. చంద్రబాబు చెబుతున్న అప్పుల లెక్కల్ని గుర్తు చేసుకుంటూ జనం నవ్వుకుంటున్నారు. సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నాయి. శనివారం నాడు జరిగిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కూడా అలవాటు ప్రకారం అప్పుల కథను మరోసారి వినిపించారు. ఎన్నికల ప్రచారంలో 14 లక్షల కోట్లున్న అప్పు, గవర్నర్ ప్రసంగంలో 10 లక్షల కోట్లుగా మారి, బడ్జెట్ ప్రసంగంలో ఏడు లక్షల కోట్లుగా రూపాంతరం చెంది, ఆవిర్భావ సభలో తొమ్మిదిన్నర లక్షల కోట్లుగా పరిణామం చెందింది.

అప్పుల కథతోపాటు అసలు విషయాన్ని కూడా ఆయన కుండబద్దలు కొట్టి చెప్పారు. ''బయట నుండి (ప్రభుత్వంలోకి రాకముందు) చూసినప్పుడు 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేయవచ్చని అనుకున్నా, ఇప్పుడు చూస్తే తొమ్మిదిన్నర లక్షల కోట్ల అప్పుంది. దీనిపై వడ్డీ కట్టాలి. ఇప్పుడు సంక్షేమాన్ని అమలుచేస్తే మధ్యలోనే ఆగిపోతుంది. కనుక ముందుగా అభివృద్ధి చేసి, వచ్చే ఆదాయంతో సంక్షేమం చేద్దా''మని ఈ సభలో చెప్పుకొచ్చారు.

ఈ తూచ్ మంత్రాన్ని ఆయన ఆవిర్భావ సభలో మాత్రమే చెప్పలేదు. ఈ వార్షిక బడ్జెట్‌లో కూడా ఆయన దీన్ని పొందుపరిచారు. కాకపోతే అంకెల్లో చెప్పడం వల్ల సరిగ్గా అర్థం కాలేదు. 'సూపర్ సిక్స్'గా పేర్కొన్న ఆరు అంశాలను ఆయన చెప్పినట్టుగా అమలు చేస్తే 70 వేల కోట్ల పైచిలుకు నిధులు అవసరమవుతాయని అంచనా. అయితే బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం 17 వేల కోట్లు మాత్రమే చూపెట్టారు. కేటాయింపు చూపినంత మాత్రాన అమలు చేస్తారని అర్థం కాదు. గత బడ్జెట్‌లో కూడా 'తల్లికి వందనం', 'అన్నదాతా సుఖీభవ' పథకాలకు అరకొర కేటాయింపులు చూపెట్టారు. కానీ, అందులో అణా పైసలు కూడా ఖర్చుపెట్టలేదన్నది జనం అనుభవంలోకి వచ్చిన సత్యం.

మొన్నటి మంగళవారం జోలెతో పాడుకున్న వేలంతో కలిపి తొమ్మిదిన్నర మాసాల్లో బాబు సర్కార్ ఒక లక్షా 52 వేల కోట్ల పైచిలుకు అప్పులు చేసి జాతీయ రికార్డును నెలకొల్పింది. ప్రభుత్వం నేరుగా చేసిన అప్పు 98,088 కోట్లయితే, ష్యూరిటీ సంతకం పెట్టి కార్పొరేషన్ల ద్వారా చేసిన అప్పు 23,700 కోట్లు, ఇక రాజధాని పేరుతో ఇప్పటివరకు చేసిన అప్పు 31,000 కోట్లు. వెరసి 1,52,788 కోట్లు. ఇంతటి జగదేక అప్పారావు ప్రభుత్వం జగన్ సర్కార్‌ను అప్పులకు బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రచారం చేయబూనడాన్ని దాష్టీకం అనాలో, దగుల్బాజీతనం అనాలో తెలుసుకోవాలి. ఈ అప్పుల చిట్టా వ్యవహారం ఇక ఎంతమాత్రమూ దాచేస్తే దాగేది కాదు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఇస్తున్న సమాచారాన్ని బట్టి, కాగ్ రిపోర్టుల ఆధారంగా, బడ్జెట్ పత్రాల సాక్షిగా జనంలోకి వాస్తవాలు వస్తున్నాయి. రాష్ట్రాన్ని జగన్ ప్రభుత్వం అప్పుల కుప్ప చేసిందన్న ప్రచారాన్ని ఇప్పుడెవ్వరూ నమ్మడం లేదు.

జగన్ ప్రభుత్వ హయాంలో విధ్వంసం జరిగిందనే మాట చంద్రబాబుకు ఊతపదంగా మారింది. చివరికి కలెక్టర్ల సమావేశంలో కూడా 'గత ప్రభుత్వం విధ్వంసం చేసింద'ని మాట్లాడారు. ఇలా కలెక్టర్ల సమావేశాన్ని రాజకీయాలకు వాడుకున్న ముఖ్యమంత్రి ఈయన తప్ప మరొకరు ఉండకపోవచ్చు. తాను చెప్పిందే వేదం, తన పచ్చ కోడి కూస్తేనే సమాచారం తెలిసేది అనే భ్రమల్లోంచి ఆయనింకా బయటపడలేదు. పదేపదే అబద్ధాన్ని వల్లెవేస్తే అది నిజమైపోతుందనే పాతకాలపు గోబెల్స్ థియరీని పట్టుకొని వేళ్లాడుతున్నారు. ఇప్పుడు విధ్వంసం గురించి ఎక్కువ మాట్లాడితే జనం రికార్డుల్ని తిరగేస్తారు. విధ్వంసం ఎవరిదో వికాసం ఎవరి వల్ల జరిగిందో తెలుసుకుంటారు. సమాచారం ఇప్పుడు ఎవరి ప్రైవేట్ ప్రాపర్టీ కాదు. అది ప్రజల హక్కు.

పౌరుల భావప్రకటనా స్వేచ్ఛపై శుక్రవారం నాడు సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు అధికార మత్తులో జోగుతున్న మన వ్యవస్థలకు కనువిప్పు కావాలి. భావ ప్రకటనా స్వాతంత్ర్యం లేనినాడు రాజ్యాంగం హామీ పడిన గౌరవ ప్రదమైన జీవన హక్కు సాధ్యం కాదని సుప్రీంకోర్టు తేటతెల్లం చేసింది. ఈ హక్కును రక్షించడంలో పోలీసులు విఫలమైతే ఆ బాధ్యతను కోర్టులు తీసుకోవాలని కూడా సుప్రీంకోర్టు హితవు చెప్పింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ అనే కాంగ్రెస్ ఎంపీ పెట్టిన పోస్టుపై గుజరాత్ పోలీసులు పెట్టిన కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుపై సంపాదకీయం రాసిన 'టైమ్స్ ఆఫ్ ఇండియా' 'కేసును కొట్టివేయడంలో ఆశ్చర్యం లేదు. అసలు సుప్రీంకోర్టు దాకా ఈ కేసు రావడమే దిగ్భ్రాంతిని కలిగిస్తున్నద'ని వ్యాఖ్యానించింది. ప్రతాప్‌గఢీ పెట్టిన పోస్టుకూ, ఆంధ్రాలో ప్రేమ్ కుమార్ అనే దళిత యువకుడి సోషల్ మీడియా పోస్టుకూ సారూప్యతలున్నాయి. కానీ ఆ యువకుడిని మన పోలీసు యంత్రాంగం ఎంతగా వేధించిందో తెలిసిందే. ఇప్పటికైనా పోలీస్ యంత్రాంగం జీ హుజూర్ పద్ధతుల్ని విడిచి పెట్టకపోతే న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని గ్రహిస్తే మంచిది. పోలీసు యంత్రాంగానికే కాదు... రెడ్‌బుక్ వంటి గ్రంథాల రచయితలకు కూడా సుప్రీం వ్యాఖ్యలు వాతలు పెట్టినట్టే!

> జనంలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నా కూటమి సర్కార్ తన ధోరణిని మార్చుకోకపోగా అదే అసత్య ప్రచారాన్ని మరింత ఎక్కువగా ఆశ్రయిస్తున్నది. తేలిపోయిన ఆరోపణల్నే మళ్లీ మళ్లీ ఎక్కుపెడుతున్నారు. చంద్రబాబు చెబుతున్న అప్పుల లెక్కల్ని గుర్తు చేసుకుంటూ జనం నవ్వుకుంటున్నారు. సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నాయి. శనివారం నాడు జరిగిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కూడా అలవాటు ప్రకారం అప్పుల కథను మరోసారి వినిపించారు. ఎన్నికల ప్రచారంలో 14 లక్షల కోట్లున్న అప్పు, గవర్నర్ ప్రసంగంలో 10 లక్షల కోట్లుగా మారి, బడ్జెట్ ప్రసంగంలో ఏడు లక్షల కోట్లుగా రూపాంతరం చెంది, ఆవిర్భావ సభలో తొమ్మిదిన్నర లక్షల కోట్లుగా పరిణామం చెందింది.
> అప్పుల కథతోపాటు అసలు విషయాన్ని కూడా ఆయన కుండబద్దలు కొట్టి చెప్పారు. "బయట నుండి (ప్రభుత్వంలోకి రాకముందు) చూసినప్పుడు 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేయవచ్చని అనుకున్నా, ఇప్పుడు చూస్తే తొమ్మిదిన్నర లక్షల కోట్ల అప్పుంది. దీనిపై వడ్డీ కట్టాలి. ఇప్పుడు సంక్షేమాన్ని అమలుచేస్తే మధ్యలోనే ఆగిపోతుంది. కనుక ముందుగా అభివృద్ధి చేసి, వచ్చే ఆదాయంతో సంక్షేమం చేద్దా"మని ఈ సభలో చెప్పుకొచ్చారు.

vardhelli1959@gmail.com

పళనిస్వామి (ఏఐఏడీఎంకే)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఢిల్లీలోని కృష్ణ మీనన్ మార్గ్‌లో ఉన్న అమిత్‌షా నివాసానికి వెళ్లి, ఆయన్ని కలిసి బయటికి రాగానే... ఆ చీకట్లో మీడియా వాళ్లు నిలబడి మిణుగురుల్లా మెరుస్తూ ఉన్నారు!

"సర్! వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీ చేయబోతున్నారట కదా? పొత్తు కుదుర్చుకోవటం కోసమే మీరు అమిత్‌షాను కలిసేందుకు వచ్చారా?" – ఆరంభ ప్రశ్న.

"లేదు లేదు. ఢిల్లీలో మా పార్టీ ఆఫీస్ ప్రారంభోత్సవం పని మీద వచ్చాం..." అన్నాను.

"సర్! మీ ఢిల్లీ ఆఫీస్‌ని మీరు ఫిబ్రవరి 10 నే వర్చువల్‌గా చెన్నై నుంచి ప్రారంభించారు కదా. మళ్లీ ఇప్పుడేమిటి! అమిత్‌షాతో గంటన్నరకు పైగా మాట్లాడారు. ఏడాదిన్నర క్రితం బీజేపీకి బ్రేకప్ చెప్పాక, తిరిగి ఇన్నాళ్లకు ఇప్పుడే కదా మీరు అమిత్‌షాను కలవటం! ఇంతసేపూ ఆయనతో ఏం మాట్లాడారు సర్ మీరు?" – ఆరాలు తీస్తున్న ప్రశ్న.

"అలా ఏం లేదు. అమిత్‌జీని అనుకోకుండా కలిశాం..." అన్నాను.

"కానీ సర్, చెన్నై నుంచి ఉదయాన్నే మీరు ఢిల్లీ వచ్చారు. మధ్యాహ్నానికి మీ పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేపీ మునుస్వామి, సీనియర్ లీడర్ వేలుమణి మీ వెనుకే ఢిల్లీకి రీచ్ అయ్యారు. సాయంత్రానికి ఢిల్లీలోనే ఉంటున్న



మరో ఇద్దరు సీనియర్ లీడర్లు తంబిదొరై, సీవీ షణ్ముగం మీతో జాయిన్ అయ్యారు. అంతా కలిసి చీకటి పడ్డాక అమిత్‌షా నివాసానికి వెళ్లారు. అమిత్‌షాను కలవాలని అందరూ అనుకునే కలిశాక, అదెలా సర్ అమిత్‌షాను అనుకోకుండా కలవటం అవుతుంది?" – ఆధారాలు సేకరించిన ప్రశ్న!

"మీరనుకుంటున్నట్లు మేమేమీ చీకటి పడ్డాక అమిత్‌జీని కలవలేదు. అమిత్‌జీని కలిసేటప్పటికే చీకటి పడినట్లుంది. వెళ్లి కలిశాం, శాలువా కప్పాం, కాసేపు మాట్లాడాం. వచ్చేశాం..." అని నవ్వుతూ చెప్పాను.

"మరి, బీజేపీ వాళ్లు ఇంకోలా చెబుతున్నారు కదా సర్?" – చీకట్లో విసిరిన ప్రశ్న!

"మేము లోపలికి వెళ్లినప్పుడు లోపల ఉన్నది మీరంటున్న బీజేపీ వాళ్లలో అమిత్‌జీ ఒక్కరే. ఆయనే మీకు చెప్పారంటారా, ఇంకోలా?" అని అడిగాను.

"లేదు సర్, 'కలిసి పోటీ చేద్దాం' అని మీరు అమిత్‌షాను అడిగినప్పుడు, అందుకాయన 'మీరు 117 సీట్లలో, మేము 117 సీట్లలో సగం సగం పోటీ చేయటానికి ఒప్పుకుంటేనే మీతో కలుస్తాం...' అని మీకు కండిషన్ పెట్టారట కదా?!" – ఊహించి వేసిన ప్రశ్న.

"ఇంకా?!" అన్నాను.

"పార్టీ నుంచి బహిష్కరించిన దినకరన్‌ని, శశికళను, పన్నీర్‌సెల్వంను తిరిగి పార్టీలోకి ఆహ్వానించాలని కూడా అమిత్‌షా మీకు కండిషన్ పెట్టారట కదా సర్..." – ఇదైతే కచ్చితంగా బీజేపీ స్టేట్ చీఫ్ అన్నామలై వేయించిన ప్రశ్న!

పొత్తు కోసం నేను అమిత్‌జీ దగ్గరకు వెళ్లకుండా, అమిత్‌జీనే పొత్తు కోసం నా దగ్గరకు వచ్చి ఉంటే, ముందు ఆ అన్నామలైని మార్చి, వేరెవరినైనా బీజేపీ చీఫ్‌గా పెట్టమని నేనే కండిషన్ పెట్టి ఉండేవాడిని.

"చెప్పండి సర్! బీజేపీతో పొత్తు కోసం కాదా మీరు అమిత్‌షాను కలిసింది?" – తిరిగి మళ్లీ అదే ఆరంభ ప్రశ్న.

"తమిళనాడులో డ్యామ్‌ల సమస్య ఉంది. స్కామ్‌ల సమస్య ఉంది. లాంగ్వేజీల సమస్య ఉంది. డీ-లిమిటేషన్ సమస్య ఉంది. డీఎంకే సమస్య ఉంది. ఇన్ని సమస్యలు ఉన్నప్పుడు మేము వాటి గురించి మాట్లాడి ఉండొచ్చని మీరెందుకు అనుకోరు?" అని అడిగాను.

"బీజేపీతో పొత్తు కోసం మీరిక్కడికి వస్తే, అక్కడ చెన్నైలో అన్నామలై మీరంటే పడని వాళ్లందరితో పొత్తు పెట్టుకుంటున్నారు. దీనికేమంటారు సర్?" – ఇంకేదో రాబట్టే ప్రశ్న.

నేనేమీ అనలేదు.

డ్యామ్‌లు, స్కామ్‌లు, లాంగ్వేజీలు, డీ-లిమిటేషన్, డీఎంకే... వీటన్నిటికన్నా తమిళనాడుకు అతి పెద్ద సమస్య అన్నామలై... అని నాతో చెప్పించటానికే ఈ మిణుగురులు ఇక్కడికి చేరినట్లు నాకర్థమైంది!


స్వయంసేవా మార్గ నిర్మాత

సందర్భం



ప్రొ॥ వై.వి. రామిరెడ్డి

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) 1925లో విజయదశమి పర్వదినాన నాగపూర్‌లో స్థాపితమయ్యింది. నేడు శత వసంతాలు జరుపుకొంటున్న ఈ సంస్థను డాక్టర్ కేశవ బలిరామ్ హెడ్గేవార్ నాగపూర్‌లో స్థాపించారు. ఇదే నగరంలో ఆయన 1889 ఉగాది రోజున జన్మించారు. ప్లేగ్ వ్యాధి వల్ల చిన్నతనంలోనే తల్లితండ్రులను కోల్పోయి వీధిన పడ్డారు. అయినా కష్టపడి చదివారు. నాగపూర్‌లోని నీల్ సిటీ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నప్పుడు ఒక బ్రిటిష్ అధికారి స్కూల్ పర్యవేక్షణకు వచ్చినప్పుడు చిన్నారి కేశవుడు 'వందేమాతరం' అని నినదించాడు. దీంతో కేశవుని స్కూల్ నుంచి బహిష్కరించారు. తర్వాత యవత్‌మాల్‌లోని రాష్ట్రీయ విద్యాలయంలో చేరి పాఠశాల విద్యను పూర్తి చేశారు.



డాక్టర్ కేశవ బలిరామ్ హెడ్గేవార్

మాతృభూమిని విదేశీయుల కబంధ హస్తాల నుంచి తొలగించడానికి కలకత్తాలోని సాయుధ విప్లవకారులతో కలిసి పని చేయాలని భావించి 1910లో కలకత్తా మెడికల్ కళాశాలలో చేరారు. విప్లవకారులైన శ్యామ్ సుందర చక్రవర్తి, మోతీలాల్ ఘోష్ వంటి వారితో కలిసి 'అనుశీలన సమితి' ద్వారా దేశ స్వాతంత్ర్యానికి కృషి చేశారు. 1914లో మెడికల్ విద్యను పూర్తి చేసిన తర్వాత బ్యాంకాక్‌లో మంచి ఉద్యోగానికి ఎంపికయ్యారు. అయితే జీవితాన్ని దేశ సేవకే అంకితం చేయాలని అప్పటికే నిర్ణయించుకున్నందు వలన ఆ ఉద్యోగాన్ని తిరస్కరించారు.

నాగపూర్‌కు తిరిగి వచ్చిన తర్వాత లోకమాన్య తిలక్ స్థాపించిన 'రాష్ట్ర సేవ మండల్'లో చేరి శివాజీ జయంతి, గణేష్ ఉత్సవం, శాస్త్ర పూజ, సంక్రాంతి మహోత్సవం వంటి కార్యక్రమాలను ఉత్సాహంతో నిర్వహించేవారు. ఈ సందర్భంగా ఆ కార్యక్రమాల్లో ఆయన చేసిన ప్రసంగాలకు ఆంగ్ల ప్రభుత్వం రాజద్రోహాన్ని మోపి ఒక సంవత్సరం కారాగార శిక్ష విధించింది. అదేవిధంగా 1930లో మహాత్మా గాంధీ పిలుపునిచ్చిన సత్యాగ్రహానికి మద్దతుగా పాల్గొని తొమ్మిది నెలల జైలు జీవితాన్ని గడిపారు. మహాత్మా గాంధీ, మదన్ మోహన్ మాలవీయ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, అప్పాజీ జోషీ వంటి నాయకులను కలిసి సంఘ కార్యం ఆవశ్యకతను వారికి తెలియజేశారు. 'సంఘ' శాఖను వీక్షించిన మహాత్మా గాంధీ డాక్టర్‌జీతో 'మీరు నిజంగానే ఒక అద్భుతమైన సంస్థను నిర్మించారు. నేను స్వయంగా చేద్దామనుకుంటున్న పనిని మీరు నిశ్శబ్దంగానే చేసేశారు' అని పేర్కొన్నారు.

కాళ్లకు స్థానికంగా కుట్టిన చెప్పులు, ఒంటిపై సాధారణమైన ధోవతి, చొక్కా, కాలర్ ఉన్న కోటు, నెత్తి మీద ఎత్తుగా ఉండే టోపీ ఆయన వేషధారణ. తాను స్వీకరించిన మహాకార్యానికి సంపూర్ణంగా జీవితాన్ని అంకితం చేసేందుకు ఆయన ఆజన్మ బ్రహ్మచర్యాన్ని స్వీకరించారు. ఆసేతు హిమాచలం సంఘ కార్యాన్ని విస్తరింప చేయడానికి ప్రయాణం చేసేవారు. ఈ విధంగా చేస్తూ ఆయన అనారోగ్యం బారిన పడి 1940 జూన్ 21వ తేదీన యాభై ఒక్క సంవత్సరాల వయసులోనే అంతిమ శ్వాస విడిచారు. ఆయన స్థాపించిన ఆర్ఎస్ఎస్ నేడు దేశ విదేశాలలో విస్తరించింది. ఎటువంటి సభ్యత్వ నమోదూ లేకుండా దాదాపు కోటి మంది స్వయం సేవకులను, నలభై అయిదు లక్షల సంఘ శాఖలను, యాభై అనుబంధ సంఘాలను, ఐదు వేల మంది పూర్తి సమయ స్వయం సేవకులను (ప్రచారకులు) ఆర్ఎస్ఎస్ కలిగి ఉంది. భారతదేశంలోనే కాక అమెరికా, ఇంగ్లండ్, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్ వంటి దాదాపు 50 దేశాలలో వివిధ రకాల పేర్లతో సేవా కార్యక్రమాలను ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తోంది.

వ్యాసకర్త శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్
(నేడు ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు హెడ్గేవార్ జయంతి)

ఆదరణే ఆరాధన

కాలం ఓ మహా గ్రంథం
జీవితం మొత్తం
చదువుకోవడమే బ్రతుకు.

ప్రకృతిలో ప్రతి ప్రాణీ
మనిషికి బంధువు.
ఆదరించడమే ఆరాధించడం.

కాలం కంటి ఎదురుగా
ప్రకృతి ఒడిలో అనాదిగా
సాగుతున్న ఆనందమే ఉగాది.

– శ్రీ సాహితి | 97044 37247



పచ్చడి

ఉగాది కాంతి
ఋతువుల స్రవంతి
రుచుల మార్గం

కోకిల రాగం
హామీల స్వరగానం
సాగని మేళం

జనం పచ్చడి
ఉచితాల ఉచ్చులు
లంకా దహనం

– రేడియమ్ | 92915 27757

నూతన ప్రారంభం

ఉగాదికి సంబంధించిన వేడుకలూ, సంప్రదాయాలూ ఉన్నాయి కానీ, ఉగాది గురించి పురాణ కథలు కనిపించవు. కారణం – ఉగాది దైవానికి సంబంధించిన పండగ కాదు, కాలానికి సంబంధించిన పండగ! మనిషికున్న వనరులలో అన్నిటికంటె విలువైనది కాలం. అందులో క్షణం ఖర్చయిపోయిందంటే, దాన్ని తిరిగి సంపాదించుకొనే అవకాశం ఎవరికీ లేదు! మనిషి ఆయుర్దాయాన్ని పన్నెండు నెలల పొడుగు ఉన్న ముక్కలుగా విభజిస్తే, ఒక్కొక్క భాగం ఆరంభానికి, ఒక్కొక్క ఉగాది మైలురాయి. 'నిన్నటితో నీ జీవితంలో మరో ఏడు వెళ్ళిపోయింది. అది ఇక తిరిగిరాదు. ఇవ్వాళ ఇంకొక భాగం ఆరంభం. గతం గతః కనుక, రాబోయే ఏడాదిలోనైనా ధర్మార్థ కామ మోక్షాల సాధనకు సమయాన్ని సరిగా కేటాయించుకొని, సద్వినియోగం చేసుకొమ్మని కాలం చేస్తున్న హెచ్చరికగా ఉగాదిని స్వీకరించవచ్చు.




కాలం చిత్రమైంది. అందులో ప్రతిక్షణమూ మన కళ్ళముందే క్రమం తప్పకుండా టిక్‌టిక్‌మని జరిగిపోతూ ఉంటుంది. కానీ విలువయిన కాలం, విలువలేని భోగలాలసతలో వేగంగా మన చేయి జారిపోయిందని, మనకు బోధపడే నాటికి, సాధారణంగా మనం ముది వయసులో ఉంటాం. 'లాలసులగు మానవులను/ కాలము వంచించు, దురవగాహము! సుమతీ!' అన్నారు కదా పోతన గారు. 'తస్మాత్ జాగ్రత్త' అని గుర్తు చేసే పర్వదినంగా ఉగాదిని చూడవచ్చు.

కాలంలో మరో విచిత్రం కూడా ఉంది. 'కాలం మారిపోతున్నది, రోజురోజుకూ భ్రష్టమై, నాశనమై పోతున్నది!' అని లోకులం తరచుగా వాపోతూ ఉంటాం. కానీ అది సబబు లేని మాట. కాలం సృష్ట్యాది నుంచి, ఒకే క్రమంలో ఒకే వేగంతో దాని దోవన అది పోతూ ఉన్నది. దానికి మార్పెక్కడ? మారేది లోకం, కాలం కాదు. కాలం మారిపోతున్నదనటం '... తల/ తిరుగు మానిసి ఇల యెల్ల తిరుగుననుటె!' (పానుగంటి).

'మారేదీ, మారిందీ, మారగలిగిందీ, మారవలసిందీ కాలం కాదు, దేశం. దేశం అంటే మనుషులు. అంటే మేమే! జరిగిపోయిన చెడుగు, అధర్మం, పతనం, భ్రష్టత్వాలు జరిగిపోయాయి. కనీసం రాబోయే కాలంలోనన్నా మేమంతా 'మంచి' దిశగా మారేలా చేయి స్వామీ! ఇప్పటి అంధకారం నుంచి మమ్మల్ని వెలుగుదిశగా నడిపించు. 'తమసో మా జ్యోతిర్గమయ!' అని చిత్తశుద్ధితో లోకులందరూ సర్వేశ్వరుడిని ప్రార్థించదగిన సుదినం ఉగాది.

– ఎం. మారుతి శాస్త్రి



క్లుప్తంగా...

కుక్కను కాపాడబోయి బాలిక మృతి


శ్రీనిధి

కొత్తపల్లి (కరీంనగర్): చెరువులోకి వెళ్లిన పెంపుడు కుక్కను కాపాడే క్రమంలో కరీంనగర్ జిల్లా కేంద్రం పరిధిలోని రేకుర్తి సింహాద్రికాలనీకి చెందిన బాలిక మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సింహాద్రి కాలనీకి చెందిన మైరాల శ్రీనిధి (11) శుక్రవారం సాయంత్రం తన పెంపుడు కుక్కతో రేకుర్తిలోని పెంటకమ్మ చెరువు (బతుకమ్మ) వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో కుక్క నీటిలో పడిపోగా రక్షించేందుకు చెరువులోకి దిగి మునిగిపోయింది. ఊపిరాడక కొట్టుమిట్టాడుతున్న బాలికను గమనించిన స్థానికులు హుటాహుటిన కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేస్తున్న క్రమంలోనే బాలిక మృతి చెందింది. కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక తల్లి చిన్నప్పుడే చనిపోగా సింహాద్రికాలనీకి చెందిన భవాని, కృష్ణ దంపతులు దత్తత తీసుకున్నారు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న బాలిక ప్రమాదవశాత్తు మృతి చెందడం ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది.

పిల్లల మృతి కేసులో పోలీసుల అదుపులో తల్లి

పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ రాఘవేంద్ర కాలనీలో ముగ్గురు పిల్లలు నురగలు కక్కుకుని మృతి చెందిన కేసులో పోలీసులు పిల్లల తల్లిని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం తెల్లవారు జామున ముగ్గురు పిల్లలు నిద్రలోనే మృతిచెందిన విషయం తెలిసిందే. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లి రజిత శనివారం కోలుకోవడంతో, డిశ్చార్జ్ అయిన ఆమెను అమీన్‌పూర్ పోలీసులు విచారణకోసం తీసుకెళ్లారు. కాగా, పిల్లల మృతదేహాలకు గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. తర్వాత అంత్యక్రియలకోసం పిల్లల మృతదేహాలను వారి తండ్రి చెన్నయ్య స్వగ్రామమైన రంగారెడ్డి జిల్లా మెడకపల్లి గ్రామానికి తీసుకెళ్లారు. ఆ కార్యక్రమం పూర్తయిన వెంటనే చెన్నయ్యను కూడా పిలిచి విచారిస్తామని పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులను విచారించిన తర్వాతే పూర్తి వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉందని వారు చెపుతున్నారు. పిల్లల మృతదేహాలపై ఎటువంటి గాయాలు లేవని తెలిపారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య


విఠల్


రవీందర్

బజార్‌హత్నూర్/ కాటారం: చేసిన అప్పులు తీర్చే మార్గం లేక, మనోవేదనకుగురై ఇద్దరు రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం దేగామ గ్రామానికి చెందిన మేకల విఠల్ (54) తనకున్న పదెకరాల సాగు భూమిలో వర్షాకాలంలో పత్తి సాగు చేశాడు. దిగుబడి రాకపోవడంతో ఆ పంటను తొలగించి రబీలో జొన్న, మొక్కజొన్న వేశాడు. అయితే భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో సాగునీరు అందక పంటలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో పంట సాగుకోసం రెండేళ్లగా తెచ్చిన అప్పులు పెరిగిపోయాయి. 2022 జూన్‌లో దేగామ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.లక్షన్నర, ఏడీసీసీ బ్యాంకులో రూ.లక్ష పంట రుణం తీసుకున్నాడు. అయితే విఠల్‌కు రూ.రెండున్నర లక్షలకుపైగా పంట రుణం ఉండటంతో ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకం వర్తించలేదు. ఈ క్రమంలో ప్రైవేట్‌గా రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. ఆశించిన దిగుబడి రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోయాడు. దీంతో ఆందోళనకు గురై శుక్రవారం మధ్యాహ్నం తన పంట చేనులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో ఘటనలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన చల్ల రవీందర్(43) తనకున్న రెండు ఎకరాల భూమితో పాటు ఏడెకరాలు కౌలుకు తీసుకొని మూడేళ్లుగా పత్తి, వరి సాగు చేస్తున్నాడు. మూడేళ్ల క్రితం భారీ వర్షాల కారణంగా పత్తి, వరి పంటలు వరదలకు కొట్టుకుపోగా తీవ్ర నష్టం వాటిల్లింది. రెండేళ్లుగా వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడి లేక నష్టపోయాడు. మొత్తంగా రూ.10 లక్షల మేర అప్పు అయింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన రవీందర్ ఈ నెల 24న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా, ఎంజీఎంలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య స్వర్ణలత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బీజాపూర్‌లో ఓ మావోయిస్టు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో శనివారం సాయంత్రం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. బాసగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టేకుమెట్ల అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులకు, పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకోగా గుర్తు తెలియని మావోయిస్టు మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని బీజాపూర్ జిల్లా కేంద్రానికి తరలించామని చెప్పారు.

పరీక్ష తప్పదు.. సీనియారిటీ రాదు!

గ్రామ పాలనాధికారుల నియామకాలకు విధివిధానాలు విడుదల

- జీవో నం.129 జారీ చేసిన రెవెన్యూ శాఖ
- రెవెన్యూ శాఖలో చేరేందుకు ఆప్షన్లు ఇచ్చినవారే అర్హులు
- స్క్రీనింగ్ టెస్టు తర్వాతే ఎంపిక
- గతంలో రెవెన్యూలో ఉన్న సీనియారిటీ ఇవ్వడం కుదరదని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న గ్రామ పాలనాధికారుల (జీపీవో) పోస్టుల భర్తీలో మరో అడుగు ముందుకు పడింది. క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు గాను గ్రామ స్థాయిలో భర్తీ చేయనున్న ఈ పోస్టుల ఎంపిక ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ శనివారం జీవో నం: 129 విడుదల చేశారు. ఈ జీవో ప్రకారం గతంలో గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వో), గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ)గా పనిచేసి వేరే శాఖల్లోకి వెళ్లిన వారిలో మళ్లీ రెవెన్యూ శాఖలోకి వచ్చేందుకు ఆప్షన్లు ఇచ్చిన వారిని మాత్రమే ఈ పోస్టులకు ఎంపిక చేయనున్నారు. వీరికి కూడా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నారు. పరీక్ష వద్దని, తమను నేరుగా మళ్లీ రెవెన్యూలోకి తీసుకోవాలని పూర్వ వీఆర్వోలు, వీఆర్‌ఏలు చేసిన అభ్యర్థనను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకుండా పరీక్ష నిర్వహణ వైపే మొగ్గు చూపింది. అలాగే మళ్లీ రెవెన్యూలోకి వస్తున్నంత మాత్రాన గతంలో రెవెన్యూ శాఖల్లో పనిచేసిన కామన్ సీనియార్టీ వర్తించదని, సర్వీసు మళ్లీ మొదటి నుంచీ ప్రారంభం కావాల్సిందేనని జీవోలో స్పష్టం చేసింది. ఈ నిబంధనలపై వీఆర్వో, వీఆర్‌ఏల సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

ఎవరెవరు అర్హులు?

జీవో నం.129 ప్రకారం ఈ గ్రామ పాలనాధికారుల పోస్టులను గతంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలుగా పనిచేసిన వారితో మాత్రమే భర్తీ చేస్తారు. గతంలో వీఆర్వోలుగా పనిచేసి ఇతర శాఖల్లో విలీనమైన వారు, వీఆర్‌ఏలుగా పనిచేస్తూ ఇతర శాఖల్లో రికార్డ్/ జూనియర్ అసిస్టెంట్లుగా నియమితులైన వారిని వారి అర్హతల ఆధారంగా ఈ పోస్టుల్లో నియమిస్తారు.

అర్హతలేమిటి?

గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉండి మళ్లీ రెవెన్యూ శాఖలోకి వచ్చేందుకు ఆప్షన్లు ఇచ్చిన వీఆర్వోలు, వీఆర్‌ఏలు ఈ పోస్టుకు అర్హులు. అదే విధంగా ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉంటే వీఆర్వోలుగా ఐదేళ్లు పనిచేసి ఉండాలి. లేదంటే వీఆర్‌ఏతో పాటు ఇతర శాఖల్లో నియమితులై ఐదేళ్లు పూర్తయి ఉండాలి.

ఉద్యోగ బాధ్యతలివే

గ్రామ పద్దుల నిర్వహణ, ప్రజలకు అవసరమైన ధ్రువ పత్రాల జారీకి తగిన విధంగా విచారణ జరపడం, ప్రభుత్వ భూములు, చెరువులు, ఇతర నీటి వనరుల ఆక్రమణలపై విచారించడం, భూసంబంధిత వివాదాల దర్యాప్తు, భూముల సర్వేలో సర్వేయర్లకు సహకారమందించడం, ప్రకృతి విపత్తుల సమయంలో పనిచేయడం, అత్యవసర సరీ ఫరాలందించడం, ప్రభుత్వం చేపట్టే పలు అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాల కోసం లబ్ధిదారులను గుర్తించడం, ఎన్నికల సంబంధిత విధులు, ప్రొటోకాల్ సహకారం, ఇతర ప్రభుత్వ శాఖలతో గ్రామ, క్లస్టర్, మండల స్థాయిలో అంతర్గత సహకారం, ప్రభుత్వం లేదా సీసీఎల్‌ఏ, జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వోలు నిర్దేశించే ఇతర పనులు.

ఎంపిక ఎలా?

దరఖాస్తుదారులకు స్క్రీనింగ్ టెస్టు నిర్వహిస్తారు. రెవెన్యూ వ్యవస్థపై దరఖాస్తుదారులకు ఉన్న అవగాహన, పట్టును అంచనా వేసే విధంగా ఈ పరీక్ష ఉంటుంది. ఈ గ్రామపాలనాధికారులను ఎంపిక చేసి వారిని వివిధ జిల్లాల్లో నియమించే అధికారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) లేదా సీసీఎల్‌ఏ నియమించే అధికారికి ఉంటుంది. జిల్లాలకు పంపిన వారిని కలెక్టర్లు అక్కడి అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకోవచ్చు. ఈ పోస్టులకు సంబంధించిన సర్వీసు నిబంధనలను త్వరలోనే రూపొందిస్తారు.

తప్పుల తడక జీవోను అంగీకరించం: తెలంగాణ వీఆర్వోల జేఏసీ

'ఈ జీవో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇచ్చినట్టుగా లేదు. ఇంకా బీఆర్ఎస్ ఆనవాళ్లు ఉన్న వారి వారసులు కొందరు ఇచ్చినట్టుగా ఉంది. సీనియార్టీ కలపబోమని, పరీక్ష రాసిన తర్వాతే మళ్లీ రెవెన్యూ శాఖలోకి రావాలని ఈ జీవో ద్వారా చెబుతున్నారు. మళ్లీ పరీక్ష అంటే ఆత్మగౌరవం దెబ్బతిన్నట్టే. సీనియార్టీ ఇవ్వడం లేదంటే మా శ్రమకు గుర్తింపు ఇవ్వనట్టే. అసలు జీవోలోనే ఎన్నో తప్పులున్నాయి. తప్పులతడక జీవోను మేం అంగీకరించబోం. కామన్ సీనియార్టీ ఇచ్చి ఎలాంటి పరీక్ష లేకుండా పూర్వ వీఆర్వోలు, వీఆర్‌ఏలను మళ్లీ రెవెన్యూ వ్యవస్థలోకి తీసుకోవాలి. లేనిపక్షంలో ఉద్యమ బాట తప్పదు..' అని వీఆర్వోల జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీశ్, నేతలు హరాలే సుధాకర్‌రావు, పల్లెపాటి నరేశ్, కాందారి భిక్షపతి, ఎస్.కె.మౌలానా, సర్వేశ్వర్, ప్రతిభ, చింతల మురళి, వెంకట్‌రెడ్డిలు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్ర డీసీపీ మృతి

- హైదరాబాద్ – శ్రీశైలం రహదారిపై.. దోమలపెంట సమీపంలో ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు
- ముంబై ఫోర్త్ జోన్ డీసీపీ సుధాకర్, ఆయన తోడల్లుడు మృతి


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు


డీసీపీ సుధాకర్

సాక్షి, నాగర్‌కర్నూల్: హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారితో పాటు ఆయన బంధువు దుర్మరణం చెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలోని ఘాట్‌రోడ్డులో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును కారు వేగంగా ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న మహారాష్ట్ర కేడర్‌కు చెందిన 2011 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సుధాకర్ భానుదాస్ పఠారి (54)తో పాటు ఆయన తోడల్లుడు భగవత్ కిషన్‌రావు పాటిల్ (66) మృతిచెందారు. కారు డ్రైవర్ షేక్ ముఖీద్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలకు కల్వకుర్తిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మహారాష్ట్రకు తరలించారు. జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ కల్వకుర్తి ఆసుపత్రికి చేరుకుని మృతులకు నివాళి అర్పించారు. సుధాకర్ పఠారి ప్రస్తుతం ముంబై ఫోర్త్ జోన్ డీసీపీగా పనిచేస్తున్నారు. మధ్యంతర ట్రైనింగ్‌లో భాగంగా నెల రోజులుగా హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. శ్రీశైలం దేవాలయ దర్శనానికి వెళ్తుండగా శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును వీరి కారు బలంగా ఢీకొట్టింది. అతివేగంతో పాటు డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కారులో వెనక వైపు ఎయిర్ బెలూన్లు తెరుచుకోకపోవటంతో సుధాకర్, భగవత్ కిషన్‌రావు తీవ్ర గాయాలతో మరణించారు. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం లేదని ఆర్టీసీ ఆర్ఎం సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

గుండెపోటుతో భార్య, తట్టుకోలేక భర్త..

- 24 గంటల వ్యవధిలో దంపతుల మృతి
- సంగారెడ్డి జిల్లాలో ఘటన


అండాలు


దుర్గయ్య

హత్నూర (సంగారెడ్డి): భార్య గుండెపోటుతో మృతి చెందగా, అది తట్టుకోలేక భర్త కూడా మృతి చెందాడు. 24 గంటల వ్యవధిలో దంపతులిద్దరూ మృతి చెందిన విషాదకర ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గుండ్ల మాచునూరు గ్రామానికి చెందిన టేకు అండాలు(58) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందింది. అదే రోజు సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో మనోవేదనకు గురైన భర్త టేకు దుర్గయ్య (65) ఒక్కసారిగా అనారోగ్యానికి గురై శనివారం ఉదయం మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

ప్రభుత్వంపై ఇక పోరుబాటే

- టీఎన్‌జీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్‌జీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్

సాక్షి, యాదాద్రి: ఉద్యోగుల సంక్షేమం విషయంలో ప్రభుత్వంతో రాజీపడే ప్రసక్తే లేదని, ఇక పోరుబాటే శరణ్యమని టీఎన్‌జీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జగదీశ్ స్పష్టం చేశారు. శనివారం ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా టీఎన్‌జీఓల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో 15 నెలలు నోరుమూసుకుని కూర్చున్నా ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రభుత్వాలు పథకాల పేరుతో డబ్బంతా పంపిణీ చేస్తున్నాయని, ఉద్యోగుల వరకు వచ్చేసరికి ఆర్థిక పరిస్థితి బాగాలేదని చెపుతున్నాయని తప్పుబట్టారు. రాష్ట్రంలో ఉద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు, డీఏలు చెల్లించిన తర్వాతే సంక్షేమ పథకాల గురించి ఆలోచించాలన్నారు. బడ్జెట్ రూపొందించే సమయంలోనే ఇచ్చే పథకాలకు, జీతాలకు లెక్క చూసుకోవాలని సూచించారు. పెండింగ్ బకాయిల కోసం ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. మే 4న రాష్ట్ర స్థాయి సదస్సు, 15న జిల్లా కేంద్రాల్లో నిరసనలు ఉంటాయన్నారు. అలాగే జూన్ 9న హైదరాబాద్‌లో మహాధర్నా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.భగత్, కార్యదర్శి ఖదీర్, టీజీఓ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒకేరోజు 3.25 లక్షల టన్నుల బొగ్గు రవాణా

- 136 ఏళ్ల సింగరేణి చరిత్రలో ఇది రికార్డ్
- సీఎండీ బలరాం వెల్లడి



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలోని గనుల నుంచి శుక్రవారం ఒకే రోజు 3.25 లక్షల టన్నుల మేర బొగ్గు రవాణా చేశామని, సంస్థ 136 ఏళ్ల చరిత్రలో ఇది రికార్డు అని సీఎండీ ఎన్.బలరాం వెల్లడించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శనివారం ఆయన ఈ వివరాలు వెల్లడించడంతో పాటు డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభినందనలు తెలిపారు. ఒకేరోజు 3,25, 243 టన్నుల బొగ్గును వినియోగదారులకు రవాణా చేశా మని, రైల్వే రేక్‌ల ద్వారా గత ఏడాదితో పోలిస్తే అత్యధికంగా బొగ్గు రవాణా చేయడం రికార్డుగా నమోదైందని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికుల కృషితోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లోనూ ఇదే విధంగా బొగ్గు సరఫరాకు సమష్టిగా కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఈడీ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కాల్పుల మోత

▶ మొదటి పేజీ తరువాయి


జగదీశ్ మృతదేహం

అగ్రనేత జగదీశ్ మాస్టర్జీ 2011లో అరెస్ట్ అయ్యాక ఆయన పేరును బుద్రా ఉపయోగిస్తున్నాడు. భద్రతా దళాలే లక్ష్యంగా దాడులు చేయడం, మిలిటరీ ఆపరేషన్లకు వ్యూహాలు రచించడం, పేలుడు పదార్థాలను ఉపయోగించడంలో దిట్టగా జగదీశ్‌కు పేరుంది. ఈ క్రమంలో 2023 ఏప్రిల్ 23న ఆరన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భద్రతా దళాల కాన్వాయ్‌ని లక్ష్యంగా చేసుకుని శక్తివంతమైన ఐఈడీ బాంబు పేల్చగా పది మంది డీఆర్‌జీ జవాన్లు మరణించారు. ఈ దాడి వెనుక మాస్టర్ మైండ్ జగదీశ్‌దేనని పోలీసుల విచారణలో తేలింది. అప్పటి నుంచి జగదీశ్ కదలికలపై భద్రతా దళాలు కన్నేసి ఉంచాయి.

డీఆర్‌జీ జవాన్ల సంబరాలు

జగదీశ్‌పై రూ.25 లక్షల రివార్డు ఉంది. ఎదురుకాల్పుల మృతుల్లో ఆయన ఉన్నట్టు తెలియగానే యాంటీ నక్సల్స్ ఆపరేషన్ (కగార్) చేపడుతున్న జవాన్లు సంబరాలు చేసుకున్నారు. జవాన్లకు బస్తర్ డీఐజీ కమలోచన్ కశ్యప్, సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్‌లు మిఠాయిలు పంచారు. ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా 'ఎక్స్'లో స్పందించారు. 'అనదర్ స్ట్రైక్ ఆన్ నక్సలిజం'(నక్సలిజంపై మరో దాడి) అని అన్నారు. 'ఆయుధాలు పట్టుకున్న వారికి నాదొక్కటే విజ్ఞప్తి, హింసతో మీరు ఎలాంటి మార్పు తేలేరు. శాంతితోనే మార్పు సాధ్యం' అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 2026 మార్చి చివరి నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని పునరుద్ఘాటించారు.

ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోట

సుక్మా జిల్లా ఒకప్పుడు మావోయిస్టులకు కంచుకోటలా ఉండేది. క్షేత్రస్థాయిలో జన మిలీషియా మద్దతుతో మావోలు ఇక్కడ గట్టిగా నిలదొక్కుకున్నారు. 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు చనిపోయిన తాడిమెట్ల – చింతల్నార్ దాడి, సల్వాజుడుం సృష్టికర్త మహేంద్రకర్మ, రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలతో సహా 32 మంది చనిపోయిన జీరామ్‌ఘాట్ దాడులు ఇక్కడే చోటుచేసుకున్నాయి. ఆపరేషన్ కగార్ మొదలైన తర్వాత కూడా ఇక్కడ చెప్పుకోదగ్గ విజయాలు దక్కలేదనే భావన యాంటీ నక్సల్స్ టీమ్స్‌లో ఇంతకాలం ఉండేది. కాగా ఇంత పెద్ద సంఖ్యలో మావోయిస్టులు చనిపోవడం సుక్మా జిల్లా చరిత్రలో ఇదే మొదటిసారని చెబుతున్నారు.

ఇప్పటివరకు గుర్తించిన మృతుల వివరాలు

పేరు	కేడర్
జగదీశ్	స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, దర్భా డివిజన్ కార్యదర్శి
రోషన్	ఏరియా కమిటీ సభ్యుడు
సల్వం జోగి	ఏరియా కమిటీ సభ్యురాలు
మడావి దేవే	ఏరియా కమిటీ సభ్యురాలు
దాసరి కోవాసి	పార్టీ సభ్యురాలు
హిడిమే	ప్లాటూన్ మెడికల్ ఇన్‌చార్జి

సుక్మా ఎన్‌కౌంటర్ బూటకం

- పౌరహక్కుల సంఘం ఖండన


సమావేశంలో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నేతలు

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గడ్డం లక్ష్మణ్, నారాయణరావులు ఆరోపించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో 60 ఏళ్లకు పైబడిన వారిని, కదల్లేని వాళ్లను నిరాయుధులుగా పట్టుకుని చిత్రహింసలు పెడుతూ హత్యాకాండ కొనసాగిస్తున్నారని ఆరోపించారు. 14 నెలల హత్యాకాండలో 470 మంది మరణించారని తెలిపారు. ఇప్పటికైనా కగార్ ఆపరేషన్ నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. జరిగిన అన్ని ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలన్నారు.


గల్ఫ్ భరోసా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గల్ఫ్ భరోసా పోస్టర్, డాక్యుమెంటరీ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: గల్ఫ్ కార్మిక కుటుంబాలకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గల్ఫ్ భరోసాకు సంబంధించి ప్రవాసీ మిత్ర సంస్థ రూపొందించిన పోస్టర్, డాక్యుమెంటరీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. గల్ఫ్ కార్మికుల సామాజిక భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన నేపథ్యంలో ఈ డాక్యుమెంటరీని రూపొందించారు. కార్యక్రమంలో తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్, ప్రవాసీ మిత్ర ప్రతినిధులు మంద భీమ్‌రెడ్డి, పి.సునీల్‌కుమార్‌రెడ్డి, చెన్నమనేని శ్రీనివాసరావు, పీఎల్‌కే రెడ్డి, కళ్యాణ్ కుమార్, జబ్బార్ పాల్గొన్నారు.

అనుమానం పెనుభూతమై..

- భార్యను హతమార్చి, భర్త ఆత్మహత్య
- జగిత్యాల జిల్లాలో ఘటన


దుర్గయ్య


రాజవ్వ

మల్యాల (చొప్పదండి): కుటుంబ తగాదాలతో క్షణికావేశంలో భార్యపై రోకలి బండతో దాడి చేసి.. ఆమె చావుకు తానే కారణమయ్యాననే పశ్చాత్తాపంతో ఓ భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం లంబాడిపల్లి గ్రామంలో ఈ ఘటన జరిగింది. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. లంబాడిపల్లిలోని బుడగజంగాల కాలనీకి చెందిన సాదుల దుర్గయ్య (55), రాజవ్వ (48) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు. దుర్గయ్య ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి భిక్షాటన చేస్తుంటాడు. రాజవ్వ స్థానికంగా వ్యవసాయ, ఉపాధి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. కొద్దిరోజులుగా రాజవ్వపై దుర్గయ్య అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో కుటుంబతగాదాలు తలెత్తాయి. పలుమార్లు పంచాయితీలు కూడా జరిగాయి. శుక్రవారం కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆవేశంలో దుర్గయ్య రోకలిబండతో భార్య తలపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను తొలుత జగిత్యాలలోని ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం కరీంనగర్‌కు తరలించారు. పరిస్థితి విషమించి శనివారం ఆమె మృతిచెందింది.

ఉరేసుకుని ఆత్మహత్య

తీవ్రంగా గాయపడిన రాజవ్వను కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగానే.. ఆందోళనకు గురైన దుర్గయ్య ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. శనివారం బంధువులు వెతుకుతుండగా గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు.

పేలిన మావోయిస్టుల ప్రెజర్‌బాంబు

- మహిళకు తీవ్ర గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబు పేలి విప్పపూల సేకరణకోసం వెళ్లిన ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన బీజాపూర్ జిల్లా బోడ్గా గ్రామ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామ సమీపంలోని ఇంద్రావతి నదీతీరానికి వెళ్లిన మహిళ పూలు ఏరుకుని తిరిగి వస్తూ మావోయిస్టులు అమర్చిన ప్రెజర్‌బాంబుపై కాలుమోపింది. ఈ పేలుడు ధాటికి ఎడమ కాలు మోకాలు వరకు నుజ్జునుజ్జయింది. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు ఆమెను బైరంగఢ్ ఆస్పత్రికి, అక్కడి నుంచి బీజాపూర్‌కు తరలించారు. రెండేళ్ల క్రితం ఇదే గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు మావోయిస్టులు అమర్చిన ప్రెజర్‌బాంబు పేలి మృత్యువాత పడ్డారు.

- వారి వివరాలను సమూలంగా పరిశీలిస్తున్న ట్రంప్ సర్కార్
- భారతీయులపైనా ప్రభావం పడే ఛాన్స్

శరణార్థులకు, నిరాశ్రయులకు జారీ చేసే
గ్రీన్ కార్డులకు ఫుల్‌స్టాప్!

గత జో బైడెన్ ప్రభుత్వం చూపించిన ఉదారవాద విధానాలను సద్వినియోగం చేసుకుని ఇప్పటికే శరణార్థి/నిరాశ్రయుల హోదా సంపాదించిన విదేశీయులకు అందజేసే గ్రీన్‌కార్డుల జారీ ప్రక్రియ హఠాత్తుగా ఆగిపోయింది. తాత్కాలికంగా ఈ గ్రీన్‌కార్డుల జారీ ప్రక్రియను నిలిపేసినట్లు అమెరికా పౌరసత్వం, శరణార్థి సేవల విభాగం తాజాగా ధ్రువీకరించింది. దీంతో అక్రమ మార్గాల్లో అమెరికాలోకి వచ్చి ఎలాగోలా శరణార్థి హోదా పొందిన వారికి ఇక కొత్త కష్టాలు మొదలయ్యే అవకాశముంది. శరణార్థి/నిరాశ్రయుల హోదా పొందటంతో ఏవైనా అవకతవకలు జరిగాయా లేదంటే వీళ్లంతా నిజంగానే సొంతదేశాల్లో హింస, పీడనకు గురయ్యారా? అనేది తేలాల్సి ఉంది. ఇందుకోసం డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సంబంధిత పాత రికార్డులను తవ్వితీయనుందని తెలుస్తోంది. గ్రీన్‌కార్డు హోదా కోసం దరఖాస్తు చేసుకున్న వారి పూర్వాపరాలను సమీక్షించాకే వారికి గ్రీన్‌కార్డు కట్టబెట్టడంపై ముందుకెళ్లాలని ట్రంప్ యంత్రాంగం నిర్ణయించింది. దీంతో లక్షలాది మంది శరణార్థులు/నిరాశ్రయుల గ్రీన్‌కార్డు కలలపై ఒక్కసారిగా నీలినీడలు కమ్ముకున్నాయి.

భారతీయుల్లో 466 శాతం ఎక్కువ

రెండేళ్ల క్రితం అంటే 2023 ఏడాదిలో ఏకంగా 51,000 మందికిపైగా భారతీయులు అమెరికాకు చేరుకుని శరణార్థి హోదా కోసం దరఖాస్తు చేసుకున్నారు. గతంతో పోలిస్తే ఒకేఏడాదిలో ఇంతమంది భారతీయులు శరణార్థులుగా అగ్రరాజ్యం చెంతకు చేరడం ఇదే తొలిసారి. 2018 ఏడాదిలో కేవలం 8,000 మంది భారతీయులు ఈ తరహా దరఖాస్తు చేసుకోగా 2023 ఏడాదికి వచ్చేసరికి ఏకంగా 466 శాతం అధికంగా 51,000 మంది అప్లై చేశారని జాన్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయం విడుదలచేసిన గణాంకాల్లో వెల్లడైంది. అక్రమ మార్గాల్లో మెక్సికో, కెనడా సరిహద్దుల గుండా అమెరికా భూభాగంలోకి అడుగుపెడుతూ అమెరికా బోర్డర్ సెక్యూరిటీ పోలీసులకు చిక్కిన వేలాది మంది భారతీయులు శరణార్థి హోదా కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇందుకు అమెరికా ఇమిగ్రేషన్ సిస్టమ్ అనుమతిస్తోంది.

శరణార్థి హోదా.. సుదీర్ఘ ప్రక్రియ

బోర్డర్ వద్ద చిక్కిన వాళ్లకు వెంటనే శరణార్థి హోదా ఇవ్వరు. వాళ్లు చెప్పే వివరాలను అధికారులు నమోదుచేసుకుని దరఖాస్తు ప్రక్రియను మొదలుపెడతారు. వైద్య పరీక్షలతోపాటు ముఖాముఖి ఇంటర్వ్యూలు చేస్తారు. సంబంధిత శరణార్థి అధికారులు ఈ బాధ్యతలను నెరవేరుస్తారు. ఈ సందర్భంగా తాము స్వదేశాన్ని ఎందుకు వీడాల్సి వచ్చింది?. స్వదేశంలో తాము పడిన కష్టాలు, ఎదురైన సమస్యలు, సొంత సమాజంలో అణచివేతకు గురవడానికి కారణాలను వివరించాల్సి ఉంటుంది. వీళ్లు చెప్పే మాటలు, వివరాలను అధికారులు/ఇమిగ్రేషన్ న్యాయమూర్తులు నమ్మితే శరణార్థి హోదా వచ్చే అవకాశాలు మెరుగవుతాయి.

కార్యనిర్వాహక ఉత్తర్వుతో అడ్డుకున్న ట్రంప్

ఎలాగోలా శరణార్థి హోదా పొందిన వారికి అమెరికాలో తాత్కాలికంగా నివసించేందుకు అవకాశం చిక్కుతోంది. ఈ అవకాశం లేకుండా చేసేందుకు రెండోదఫా అధికారంలోకి వచ్చిన ట్రంప్ వెంటనే రెండు కార్యనిర్వాహక ఉత్తర్వులను జారీచేశారు. శరణార్థులుగా వచ్చే వారిని లోపలికి రానివ్వడం ఆపేశారు. అరెస్టయి శరణార్థి శిబిరాల్లో ఉంటున్న వారు శరణార్థి హోదా దరఖాస్తు చేయకుండా నిలువరిస్తున్నారు. ముఖ్యంగా అమెరికా–మెక్సికో సరిహద్దు వద్ద ఈ రెండు విధానాలను ట్రంప్ కఠినంగా అమలుచేస్తున్నారు. ఈ ఉత్తర్వులను ఇప్పటికే కొందరు కోర్టుల్లో సవాల్‌చేశారు. కొందరిని స్వదేశాలకు తిరిగి పంపడాన్ని ఇటీవల ఒక ఫెడరల్ జడ్జి తన ఉత్తర్వులతో అడ్డుకోవడం తెల్సిందే.

– సాక్షి, నేషనల్ డెస్క్



హోదా సవరణపై ట్రంప్ సర్కార్ తీవ్ర అభ్యంతరం

శరణార్థి హోదాతో చాన్నాళ్లుగా అమెరికాలో ఉంటున్న వాళ్లు ఇక శాశ్వత స్థిర నివాసం కోసం గ్రీన్‌కార్డుకి దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ దరఖాస్తుల పరిశీలనను ట్రంప్ సర్కార్ తాజాగా ఆపేసింది. హడావుడిగా వీళ్లకు గ్రీన్‌కార్డు ఇచ్చేయకుండా అసలు ఈ శరణార్థుల గతచరిత్ర స్వదేశంలో ఎలాంటిది?. భవిష్యత్తులో వీళ్లు అమెరికా జాతీయ భద్రతకు ముప్పుగా మారే ప్రమాదముందా?.. ఇలా పలు అంశాల తుది నిర్ధారణకు సంబంధించి 'స్క్రీనింగ్'విధానాలను అవలంబించాలని, అందుకోసమే అప్లికేషన్ల పరిశీలనను ఆపేశామని యూఎస్ సిటిజన్‌షిప్, ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) అధికారులు స్పష్టంచేశారు. మెక్సికోలో గతంలో డ్రగ్స్ ముఠాలతో సంబంధాలున్న వ్యక్తులు/కుటుంబాలు అమెరికాలో శరణార్థులుగా ఉంటే అలాంటి వారి జాబితాను ఈ గ్రీన్‌కార్డు దరఖాస్తుల్లో వెతుకుతున్నారు.

మయన్మార్
వెన్ను విరిగింది

భూకంపంతో అపార నష్టం

- ఇప్పటికే 1,600 దాటిన మృతులు
- 10 వేలకు మించవచ్చని అంచనా
- 3,500 మందికి పైగా క్షతగాత్రులు

బ్యాంకాక్: భూకంపం మయన్మార్ వెన్ను విరిచింది. అంచనాలకు కూడా అందనంతటి నష్టాన్ని మిగిల్చింది. భూకంప కేంద్రమైన మాండలేతో పాటు దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా కుప్పకూలిన భవనాల శిథిలాలే. బాధితుల హాహాకారాలు, వారి సంబంధీకుల ఆక్రందనలే. శుక్రవారం మధ్యాహ్నం 7.7 తీవ్రతతో విరుచుకుపడ్డ భూకంపానికి బలైన వారి సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది. శిథిలాల నుంచి ఇప్పటికే 1,600కు పైగా మృతదేహాలను వెలికితీశారు. 3,500 మందికి పైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య 10 వేలు దాటవచ్చని చెబుతున్నారు. కొన్నేళ్లుగా అంతర్యుద్ధంతో కునారిల్లుతున్న ఆ దేశానికి ఇది పులిమీద పుట్రలా పరిణమించింది. అత్యవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు కనీస స్థాయి మౌలిక వనరులు కూడా లేక సైనిక సర్కారు చేతులెత్తేస్తోంది. శిథిలాల నుంచి మృతులు, క్షతగాత్రుల వెలికితీతకు అవసరమైనన్ని భారీ క్రేన్లు కూడా అందుబాటులో లేని పరిస్థితి! దాంతో సహాయక చర్యలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. ఫలితంగా శిథిలాల కింద చిక్కిన వారిలో అత్యధికులు మృత్యువాత పడే దుస్థితి నెలకొంది. నిస్సహాయ స్థితిలో ఉన్న మయన్మార్‌కు భారత్ తక్షణం ఆపన్నహస్తం అందించింది. ఇతర దేశాల నుంచి కూడా మయన్మార్‌కు సాయం అందుతోంది. మరోవైపు శనివారం మధ్యాహ్నం నేపిడా సమీపంలో మూడు గంటల తేడాతో రెండుసార్లు భూమి కంపించింది. 4.3, 4.7 తీవ్రతతో వచ్చిన ఆ భూకంపాల తాలూకు నష్టం వివరాలు వెంటనే తెలియరాలేదు. గత 24 గంటల్లో మయన్మార్‌లో 14కు పైగా భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి.

కుప్పకూలిన కంట్రోల్ టవర్

భూకంప ధాటికి నేపిడా అంతర్జాతీయ విమానాశ్రయంలో కంట్రోల్ టవర్ కుప్పకూలి శిథిలాల దిబ్బగా మారింది. విమాన సేవలు ఆగిపోవడంతో భారత్ తదితర దేశాల నుంచి వస్తున్న సహాయక విమానాలు యాంగూన్‌లో దిగుతున్నాయి.

థాయ్‌లాండ్‌లో...

థాయ్‌లాండ్‌లో భూకంపం తాలూకు విధ్వంస తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. రాజధాని బ్యాంకాక్‌తో పాటు పలు నగరాల్లో భవనాలు, ఆస్పత్రులు, ఆలయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నగరంలో కనీసం 2,000 పైచిలుకు భవనాలు తీవ్రంగా పగుళ్లిచ్చినట్టు గవర్నర్ తెలిపారు.

334 అణుబాంబుల శక్తి!

మయన్మార్ భూకంపం ఏకంగా శక్తిమంతమైన 334 అణుబాంబుల పేలుడుకు సమానమైన శక్తిని విడుదల చేసినట్టు జియాలజిస్టులు తేల్చారు! మాండలే, పరిసర ప్రాంతాలకు ముప్పు ఇంకా తొలగలేదని వారు హెచ్చరించారు. అక్కడ ఒకట్రెండు నెలల పాటు ప్రకంపనలు కొనసాగే ఆస్కారముందని వివరించారు.


మాండలేలో శిథిలాల కింద చిక్కిన వ్యక్తిని కాపాడుతున్న సహాయక సిబ్బంది

రోడ్డుపైనే ప్రసవం

శుక్రవారం మధ్యాహ్న వేళ. భూకంపం దెబ్బకు బ్యాంకాక్ అతలాకుతలమైంది. జనమంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇళ్లు, భవనాలు వీడుతున్నారు. ఉన్నపళంగా రోడ్లపైకి పరుగులు తీస్తున్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిని అధికారులు హుటాహుటిన ఖాళీ చేయించి రోగులను ఫైర్ సేఫ్టీ మార్గం గుండా బయటికి తరలిస్తున్నారు. ఆ క్రమంలో ఓ నిండు గర్భిణికి నడిరోడ్డు మీదే పురిటి నొప్పులు మొదలయ్యాయి. చుట్టూ గందరగోళం మధ్యే వైద్య సిబ్బంది సమక్షంలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది కూడా. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

15 మంది సజీవం!

భూకంపం ధాటికి బ్యాంకాక్‌లో నిర్మాణంలో ఉన్న 33 అంతస్తుల భవనం శుక్రవారం కుప్పకూలడం తెలిసిందే. పదుల సంఖ్యలో నిర్మాణ కార్మికులు, సిబ్బంది శిథిలాల కింద చిక్కుబడ్డట్టు చెబుతున్నారు. ఆచూకీ తెలియకుండా పోయిన 100 మందిలో అత్యధికులు ఆ శిథిలాల కిందే ఉన్నట్టు భావిస్తున్నారు. దాంతో వారి బంధువులంతా కన్నీరుమున్నీరవుతున్నారు. వారిలో కనీసం 15 మంది ప్రాణాలతో ఉన్నట్టు సహాయక సిబ్బంది గుర్తించారు. శిథిలాల అడుగుభాగం నుంచి వారి మూలుగులు, సాయం కోసం చేస్తున్న ఆర్తనాదాలు తమకు లీలగా వినిపిస్తున్నాయని సిబ్బంది చెప్పారు.

వీసా రద్దు చేశాం..
తక్షణం వెళ్లిపోండి

వందలాది మంది విదేశీ విద్యార్థులకు ఈ మెయిళ్లు

- పాలస్తీనియన్లకు, అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతు పలికినందుకు ట్రంప్ సర్కార్ ఆగ్రహం

వాషింగ్టన్: దేశ వ్యతిరేక విధానాలను సమర్థించే వాళ్లెవరూ ఇక్కడ ఉండొద్దని, తక్షణం వెళ్లిపోవాలంటూ వందలాది మంది విదేశీ విద్యార్థుల వీసాలను అమెరికా ప్రభుత్వం హఠాత్తుగా రద్దుచేసింది. వీసా రద్దయిన నేపథ్యంలో కస్టమ్స్, అండ్ బోర్డర్ ప్రొటెక్షన్(సీబీపీ) యాప్‌లో నమోదుచేసుకుని స్వీయబహిష్కరణ ద్వారా అమెరికాను వదిలివెళ్లాలంటూ ఆయా విద్యార్థులకు ఈ–మెయిళ్లు, టెక్ట్స్ సందేశాలను పంపించింది. ఇలా బహిష్కరణ సందేశాలను అందుకున్న వారిలో భారతీయ విద్యార్థులు సైతం ఉన్నట్లు తెలుస్తోంది. ట్రంప్ సర్కార్ తీసుకున్న ఈ అనూహ్య నిర్ణయంతో అక్కడ విద్యనభ్యసిస్తున్న లక్షలాది భారతీయ విద్యార్థుల్లో ఒక్కసారిగా భయాందోళనలు పెరిగాయి. గాజా యుద్ధంలో హమాస్‌కు, పాలస్తీనియన్లకు మద్దతు పలకడం, ఇజ్రాయెల్‌ను విమర్శించడం, యుద్ధం విషయంలో ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపడుతూ సంబంధిత సోషల్ మీడియా పోస్ట్‌లను సోషల్ మీడియా ఖాతాల్లో లైక్ చేయడం, షేర్ చేయడం వంటి చర్యలకు పాల్పడిన వారి వీసాలను రద్దుచేశామని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్(డీఓఎస్) ప్రకటించింది. ఈ మేరకు ఎఫ్–1 వీసాను రద్దుచేస్తూ సంబంధిత విద్యార్థులకు ఈమెయిల్ పంపించింది. ''అమెరికా శరణార్థి, జాతీయత చట్టంలోని సెక్షన్ 221(ఐ) ప్రకారం మీ ఎఫ్–1 వీసా గడువును తక్షణం ముగిస్తున్నాం. అమెరికాను వీడటానికి ముందు కచ్చితంగా అమెరికా ఎంబసీ/కాన్సులేట్‌లో మీ పాస్‌పోర్ట్‌ను చూపించండి. వాళ్లు మీ వీసాను స్వయంగా రద్దుచేస్తారు. ఆ తర్వాత సీబీపీ యాప్ సాయంతో స్వీయబహిష్కరణ విధానాన్ని వాడుకుని అమెరికాను వీడండి. అలా వెళ్లకపోతే మీమే మిమ్మల్ని బలవంతంగా బహిష్కరిస్తాం. మేం పంపితే మీ స్వదేశానికే పంపకపోవచ్చు. మా వీలును బట్టి మాకు అనువైన మరేదైనా దేశానికి తరలించే వీలుంది'' అని ఈ–మెయిల్ సందేశంలో ప్రభుత్వం పేర్కొంది. 2023–24 ఏడాదికి విదేశీ విద్యార్థులకు సంబంధించిన 'ఓపెన్ డోర్స్'నివేదిక ప్రకారం అమెరికాలో 11 లక్షల మంది విదేశీ విద్యార్థులున్నారు. వారిలో 3.31 లక్షల మంది భారతీయ విద్యార్థులే.

ఆపరేషన్ బ్రహ్మ

మయన్మార్‌కు భారత్ ఆపన్నహస్తం

- 15 టన్నుల సహాయక సామగ్రి చేరవేత
- టెంట్లు మొదలుకుని ఔషధాల దాకా
- వాయు, జలమార్గాన మరో 70 టన్నులు
- రంగంలోకి దిగిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం
- ఆస్పత్రిని కూడా ఎయిర్‌లిఫ్ట్ చేసిన వైనం


ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో మయన్మార్ బయల్దేరుతున్న భారత వాయుసేన విమానం


న్యూఢిల్లీ: భారీ భూకంపంతో అతలాకుతలమైన మయన్మార్‌కు అంతర్జాతీయ సాయం వెల్లువెత్తుతోంది. ఈ విషయంలో తక్షణం స్పందించిన తొలి దేశంగా భారత్ నిలిచింది. బాధిత దేశానికి యుద్ధ ప్రాతిపదికన సహాయక సామగ్రి తదితరాలు అందజేసేందుకు ఆపరేషన్ బ్రహ్మ పేరిట హుటాహుటిన రంగంలోకి దిగింది. టెంట్లు, స్లీపింగ్ బ్యాగులు, బ్లాంకెట్లు, ఆహార పదార్థాలు, వాటర్ ప్యూరిఫయర్లు, సోలార్‌లైట్లు, జెనరేటర్ సెట్లు, అత్యవసర ఔషధాల వంటివాటితో కూడిన 15 టన్నుల సహాయక సామగ్రిని శనివారం తెల్లవారుజామున మూడింటికే సైనిక విమానాల్లో మయన్మార్‌కు పంపింది. ఉదయం 8 గంటలకల్లా వాటిని స్థానికంగా బాధిత ప్రాంతాలకు పంపే కార్యక్రమం మొదలైపోయింది. అంతేగాక 118 మంది వైద్య తదితర సిబ్బందితో కూడిన పూర్తిస్థాయి ఫీల్డ్ ఆస్పత్రిని కూడా వాయుమార్గాన శనివారం రాత్రికల్లా మయన్మార్‌కు తరలించింది! వాళ్లంతా ఇప్పటికే మాండలే ప్రాంతంలో రంగంలోకి దిగారు. గాయపడ్డ వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. మరో రెండు వాయుసేన విమానాల్లో మరింత సామగ్రిని పంపుతున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. అంతేగాక మరో 40 టన్నుల సామగ్రిని ఐఎన్‌ఎస్ సాత్పురా, ఐఎన్‌ఎస్ సావిత్రి నౌకల్లో యాంగూన్‌కు తరలిస్తున్నట్టు విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. కమాండెంట్ పి.కె.తివారీ నేతృత్వంలో 80 మందితో కూడిన ఎన్‌డీఆర్‌ఎఫ్ అన్వేషక, విపత్తు సహాయక బృందాలు శనివారం సాయంత్రానికే బాధిత ప్రాంతాలకు చేరుకుని రంగంలోకి కూడా దిగాయని చెప్పారు. ''రెస్క్యూ డాగ్స్ కూడా వెంట వెళ్లాయి. వాయు మార్గాన ఆరు అంబులెన్సులను తరలిస్తున్నాం'' అని ఎక్స్‌లో పోస్టు చేశారు. చైనా, రష్యా, దక్షిణ కొరియా తదితర దేశాల నుంచి కూడా సహాయక సామగ్రి మయన్మార్ చేరుతోంది. ఆ దేశంతో భారత్ 1,643 కి.మీ. పొడవైన సరిహద్దును పంచుకుంటుంది.

అందుకే 'బ్రహ్మ'

''బ్రహ్మ సృష్టికర్త. తీవ్ర విధ్వంసం బారిన పడ్డ మయన్మార్‌లో వీలైనంత త్వరగా మౌలిక సదుపాయాల పునరుద్ధరణ జరగాలన్నది భారత్ ఆకాంక్ష. అందుకే ఈ సహాయక ఆపరేషన్‌కు బ్రహ్మ అని పేరు పెట్టాం'' అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మీడియాకు వివరించారు. మరింత సాయం పంపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు చెప్పారు. గతేడాది యాగీ తుపానుతో అతలాకుతలమైనప్పుడు కూడా మయన్మార్‌కు భారత్ ఇలాగే తక్షణం ఆపన్నహస్తం అందించిందని గుర్తుచేశారు. సహాయక సామగ్రి బాధిత ప్రాంతాలకు తక్షణం చేరేలా చర్యలు తీసుకుంటున్నట్టు మయన్మార్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. మయన్మార్ సైనిక పాలకుడు జనరల్ మిన్ ఆంగ్ లయాంగ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్లో మాట్లాడారు. అన్నివిధాలా దన్నుగా నిలుస్తామని మరోసారి హామీ ఇచ్చారు.

కేంద్రంలో మరో 20 ఏళ్లు బీజేపీనే

- దేశం కోసం పనిచేసే వారికి విజయం తథ్యం
- ఉమ్మడి పౌరస్మృతి అమలు చేసి తీరుతాం
- 'టైమ్స్ నౌ'సదస్సులో అమిత్ షా



న్యూఢిల్లీ: కేంద్రంలో బీజేపీ కనీసం 30 ఏళ్లపాటు అధికారంలో ఉంటుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తంచేశారు. స్థిరమైన పనితీరు కనబరుస్తున్న తమ పార్టీ పట్ల ప్రజాదరణ చెక్కుచెదరదని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ పార్టీ విజయమైనా కష్టపడి పనిచేసే లక్షణంపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. సొంత బాగు కోసం కాకుండా దేశం కోసం పనిచేస్తే విజయం కచ్చితంగా సొంతమవుతుందని వెల్లడించారు. కేంద్రంలో బీజేపీ రాబోయే 30 ఏళ్లపాటు అధికారంలో ఉంటుందని తాను పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చెప్పానని గుర్తుచేశారు. గత పదేళ్లుగా అధికారంలో కొనసాగుతోందని, మరో 20 ఏళ్లపాటు పార్టీకి ఢోకా లేదని తేల్చిచెప్పారు. శుక్రవారం రాత్రి 'టైమ్స్ నౌ'సదస్సులో అమిత్ షా మాట్లాడారు. చక్కటి పరిపాలన అందించిన పార్టీకి ప్రజాదరణ లభిస్తుందని, తద్వారా ఎన్నికల్లో విజయం సాధిస్తామన్న ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. ప్రజలు మెచ్చే పాలన అందించలేని పార్టీలకు ఇలాంటి ఆత్మవిశ్వాసం లభించదని స్పష్టంచేశారు.

పదేళ్లలో 16,000 మంది లొంగుబాటు

దేశంలో అంతర్గత భద్రతకు ప్రస్తుతం వచ్చిన ముప్పేమీ లేదని అమిత్ షా స్పష్టంచేశారు. నక్సలైట్ల హింసాకాండ, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం, ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్రవాదం అనే మూడు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ మూడు అంశాలకు సంబంధించి గత పదేళ్లలో 16,000 మంది యువత లొంగిపోయారని వెల్లడించారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో శాంతి నెలకొల్పాల్సిన బాధ్యత హోంమంత్రిగా తనపై ఉందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు నరేంద్ర మోదీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆరాధన స్థలాల చట్టం–1991పై ఇప్పుడు తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేనని పేర్కొన్నారు. ఈ అంశం కోర్టు పరిధిలో ఉండడంతో మనం మాట్లాడడం సరైంది కాదన్నారు. కోర్టులో ప్రభుత్వం తరఫున అఫిడవిట్ దాఖలు చేస్తామన్నారు. ఈ చట్టంపై సుప్రీంకోర్టు సరైన నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నట్లు చెప్పారు. కోర్టు ఆదేశాలను తప్పనిసరిగా పాటిస్తామన్నారు. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ వలసదార్లను ఓటుబ్యాంకుగా మార్చుకుంటోందని అమిత్ షా మండిపడ్డారు. పొరుగు దేశం నుంచి వచ్చినవారిని ఓటర్లుగా చేర్పిస్తున్నారని ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించారు.

ప్రభుత్వ కార్యకలాపాల్లో ఆర్‌ఎస్‌ఎస్ జోక్యం లేదు

ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ)పై అమిత్ షా స్పందించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలన్నీ ఒకదాని వెంట ఒకటి యూసీసీని ప్రవేశపెట్టబోతున్నాయని వెల్లడించారు. ఉత్తరాఖండ్‌లో యూసీసీపై చట్టం తీసుకొచ్చారని, గుజరాత్‌లోనూ దీనిపై కమిటీ ఏర్పాటు చేశారని తెలిపారు. బీజేపీ ఏర్పాటైనప్పటి నుంచి పార్టీ ఎజెండాలో యూసీసీ అనేది అత్యంత కీలకమైన అంశమని ఉద్ఘాటించారు. దేశంలో యూసీసీని అమలు చేస్తామంటూ హామీ ఇచ్చామని తెలిపారు. అది జరిగి తీరుతుందని స్పష్టంచేశారు. యూసీసీని తీసుకురావాలన్నది రాజ్యాంగ సభ నిర్ణయమని పేర్కొన్నారు. ఆ విషయం కాంగ్రెస్ పార్టీ మర్చిపోయినప్పటికీ బీజేపీ మర్చిపోలేదన్నారు. చెప్పినట్లుగానే ఆర్టికల్ 370ని రద్దు చేశామని, అయోధ్యలో రామమందిరం నిర్మించామని, ఇక యూసీసీని అమలు చేయడం తథ్యమని వివరించారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టలు దొరికిన ఘటనపై త్రిసభ్య కమిటీ ఇచ్చే నివేదిక కోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు. కమిటీ విచారణకు ప్రభుత్వం సహకరిస్తోందని అన్నారు. మోదీ ప్రభుత్వ కార్యకలాపాల్లో ఆర్‌ఎస్‌ఎస్ జోక్యం చేసుకుంటోందన్న విమర్శల్లో ఎంతమాత్రం వాస్తవం లేదని వెల్లడించారు. సంఘ్ గత వందేళ్లుగా దేశభక్తులను తయారు చేస్తోందని ప్రశంసించారు.

కౌంటర్‌లో కొన్న రైలు టికెట్‌ను ఆన్‌లైన్‌లో రద్దు చేసుకోవచ్చు

రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ: రైలు టికెట్లను రద్దు చేసుకోవడం మరింత సులభతరంగా మారింది. ఆన్‌లైన్‌లో బుక్ చేస్తున్న టికెట్లను ఆన్‌లైన్‌లోనే రద్దు చేసుకొనే సదుపాయం ఇప్పటికే ఉంది. కౌంటర్‌లో కొనుగోలు చేసిన ఫిజికల్ టికెట్లను సైతం ఆన్‌లైన్‌లో క్యాన్సిల్ చేసుకోవచ్చని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో ఈ సౌలభ్యం అందుబాటులో ఉందన్నారు. అలాగే '139'నెంబర్‌కు ఫోన్ చేసి టికెట్‌ను రద్దు చేసుకోవచ్చని తెలిపా రు. అయితే, టికెట్ సొమ్మును వెనక్కి తీసుకోవడానికి తప్పనిసరిగా రిజర్వేషన్ సెంటర్‌లోని కౌంటర్ వద్దకు రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒరిజినల్ ఫిజికల్ టికెట్‌ను తీసుకురావాలని చెప్పారు. ఈ మేరకు తాజాగా రాజ్యసభలో ఆయన లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ప్రయాణికులు తమ టికెట్లను రద్దు చేసుకోవడానికి ఇకపై రైల్వే స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పారు. ఆన్‌లైన్‌లోనే పూర్తి చేసుకోవచ్చని సూచించారు.

పిల్లలు ఆరుబయట ఆడాలంటే
మాస్క్ ధరించాల్సిరావడం దారుణం

సుప్రీంకోర్టు జడ్జి విక్రమ్‌నాథ్ ఆవేదన

న్యూఢిల్లీ: బహిరంగ ప్రదేశాల్లో చిన్నారులు ఆడుకోవాలంటే మాస్క్ ధరించాల్సిన దుస్థితి దాపురించొద్దని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ ఆవేదన వ్యక్తంచేశారు. కాలుష్య ఉద్గారాల ఉధృతికి అడ్డుకట్టవేయాలని, కాలుష్యం కట్టడి కోసం తగు 'స్వచ్ఛ'సాంకేతికతలపై పెట్టుబడులు పెరగాలని ఆయన అభిలషించారు. శనివారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మొదలైన వాతావరణ జాతీయ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ''దేశ రాజధాని గత కొంతకాలంగా కాలుష్య రాజధానిలా తయారైంది. కాలుష్యం విపరీతంగా పెరిగిపోయింది. పిల్లలు ఆరుబయట ఆడుకోవాలంటే మాస్క్ ధరించాల్సిన దారుణ పరిస్థితులు రావడం శోచనీయం. ఇంత తక్కువ వయసులో కాలుష్యమయ గాలి పీల్చడం వల్ల ఎన్నో శ్వాససంబంధ వ్యాధులు చుట్టుముడతాయి. కాలుష్య ఉద్గారాల వెల్లువకు అడ్డుకట్టపడాల్సిందే. ఇందుకోసం మనందరం సమైక్యంగా నిలబడి తక్షణ కార్యాచరణతో రంగంలోకి దిగాలి. ఆర్థికాభివృద్ధికి, పర్యావరణహిత విధానానికి సమతూకం సాధించాలి. శుద్ధ సాంకేతికతల అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు విధాన నిర్ణయాలు తీసుకోవాలి. పర్యావరణానికి హాని కల్గించని టెక్నాలజీలపై దృష్టిసారించాలి. తక్కువ ఉద్గారాలను వెదజల్లే రవాణా విధానాలను అవలంబించాలి. అలాంటప్పుడు మనం పీల్చే గాలి గరళంగా మారకుండా ఉంటుంది. నీటి కాలుష్యం సైతం మరో తీవ్ర సమస్యగా తయారైంది. శుద్ధికి నోచుకోని వ్యర్థాలు నేరుగా నదీజలాల్లో కలిసిపోతున్నాయి. పారిశ్రామిక వ్యర్థాలు నదీజలాల్లో కలవకుండా అడ్డుకోవాలి. మురుగునీటిని శుద్ధిచేశాకే నదీజలాల్లోకి వదలాలి. నదీతీరాల్లోని స్థానిక ప్రజానీకం సైతం వ్యర్థాలను నేరుగా నదుల్లో పడేయకుండా తమ వంతు బాధ్యతగా మెలగాలి'' అని జడ్జి అన్నారు. కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ చైర్‌పర్సన్, అటార్నీ జనరల్, తదితరులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

సెమీ క్రయోజనిక్ ఇంజిన్ అభివృద్ధిలో మరో పురోగతి

బెంగళూరు: అత్యంత బరువైన వ్యోమనౌకలను మోసుకెళ్లే సామర్థ్యముండే రాకెట్‌లో బూస్టర్‌కు ఉపయోగించే అధునాతన సెమీక్రయోజనిక్ ఇంజిన్ అభివృద్ధిలో ఇస్రో పురోగతి సాధించింది. ఏకంగా 2,000 కిలోన్యూటన్ల అత్యధిక థ్రస్ట్‌ను వెదజల్లే ఇంజిన్ పవర్ హెడ్ ఆర్టికల్(పీహెచ్‌టీఏ)ను విజయవంతంగా మండించింది. దీంతో సెమీక్రయోజనిక్ ఇంజన్/ద్రవ ఆక్సిజన్, కిరోసిన్ ఇంజన్ తయారీలో మరో ముందడుగు పడిందని ఇస్రో శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. శుక్రవారం తమిళనాడులోని మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ సిస్టమ్స్ కాంప్లెక్స్‌లో ఈ పరీక్ష చేపట్టారు. బూస్ట్ స్ట్రాప్ మోడ్ విధానాన్ని కేవలం 2.5 సెకన్లపాటు పరీక్షించినాసరే ప్రీ–బర్నర్, టర్బో పంపులు, స్టార్ వ్యవస్థ, కంట్రోల్ ఉపకరణాలు సవ్యంగా పనిచేశాయని ఇస్రో పేర్కొంది. ఇంజిన్‌లోని అన్ని విడిభాగాలను బిగించడానికంటే ముందే ఇలాంటి మరిన్ని ప్రయోగాలు చేపట్టనున్నారు.

మోదీ చాలా తెలివైన మనిషి

భారతీయులకు గొప్ప ప్రధానమంత్రి దొరికారు

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు



న్యూయార్క్: భారత ప్రధాని నరేంద్ర మోదీ చాలా తెలివైన వ్యక్తి అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. ఆయనకు తనకు గొప్ప మిత్రుడు అని అన్నారు. భారత్–అమెరికా మధ్య టారిఫ్ చర్చలు తప్పనిసరిగా సఫలీకృతం అవుతాయని చెప్పారు. టారిఫ్‌ల విషయంలో రెండు దేశాలు చక్కగా కలిసి పనిచేస్తాయన్న నమ్మకం ఉందని పేర్కొన్నారు. విదేశీ ఉత్పత్తులపై అమెరికాలో వచ్చే నెల 2వ తేదీ నుంచి సుంకాలు అమల్లోకి రాబోతున్న నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆయన శుక్రవారం వైట్‌హౌస్‌లో మాట్లాడారు. ''ప్రపంచంలో అత్యధికంగా టారిఫ్‌లు వసూలు చేస్తున్న దేశాల్లో ఇండియా కూడా ఉంది. ఇది నిజంగా క్రూరత్వమే. ముమ్మాటికీ క్రూరత్వమే అని చెప్పగలను. ఇండియా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చాలా తెలివైన వ్యక్తి. ఆయన నాకు గొప్ప మిత్రుడు. ఎన్నో ఏళ్లుగా మా మధ్య స్నేహ సంబంధాలు కొనసాగుతున్నాయి. మోదీ ఇటీవలే అమెరికాలో పర్యటించారు. మేమిద్దరం చర్చించుకున్నాం. టారిఫ్‌ల విషయంలో భారత్–అమెరికా మధ్య అవగాహన కుదురుతుందన్న విశ్వాసం ఉంది. మీకు చాలా గొప్ప ప్రధానమంత్రి దొరికారని భారతీయులకు చెప్పదల్చుకున్నా'' అని ట్రంప్ వెల్లడించారు. భారత్‌ను ట్రంప్ గతంలో టారిఫ్ కింగ్, అతిపెద్ద దోపిడీదారు అని అభివర్ణించిన సంగతి తెలిసిందే. మరోవైపు భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ శుక్రవారం అమెరికా విదేశాంగ శాఖ సహాయ మంత్రి క్రిస్టోఫర్ లాండౌతో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు జరిపారు. ఇరుదేశాల మధ్య సమతుల్య వాణిజ్య భాగస్వామ్యం సాధించే విషయంలో ఎదురయ్యే అవరోధాలను ఎలా పరిష్కరించాలన్న దానిపై అభిప్రాయాలు పంచుకున్నారు.



పండుగ.. పసందుగా..
కొత్త ఆశలు, కొంగొత్త ఊసులతో ఉగాది వచ్చేసింది. ఈ నేపథ్యంలోనే నగరంలోని పలు రెస్టారెంట్లు పండుగ సందడిని అందించే బాధ్యతను స్వీకరిస్తున్నాయి. - సిటీప్లస్‌లో



రంజాన్ వేళలు
ఇఫ్తార్
ఆదివారం
సా. 6.35 గం.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
39.0/25.0
నగరంలో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 39, కనిష్టంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన కొంతే!

హెచ్‌ఎండీఏకు వచ్చింది రూ.100 కోట్లే

సాక్షి, సిటీబ్యూరో: స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రవేశపెట్టిన ఎల్‌ఆర్‌ఎస్ పథకం ఒక అడుగు ముందుకు నాలుగడుగులు వెనక్కు అన్నట్లుగా సాగుతోంది. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుల్లో 25 శాతం రాయితీ ప్రకటించినప్పటికీ జనం నుంచి పెద్దగా స్పందన కనిపించడం లేదు. హెచ్‌ఎండీఏ పరిధిలో సుమారు 3.44 లక్షల ఫైళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 10 శాతం ఫైళ్లు మాత్రమే పరిష్కారమయ్యాయి. 35 వేలకు పైగా దరఖాస్తులను పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. మరో 3 లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. హెచ్‌ఎండీఏ అధికారుల అంచనాల మేరకు ఎల్‌ఆర్‌ఎస్–2020 పథకం ద్వారా దాదాపు రూ.1500 కోట్లు లభించే అవకాశం ఉండగా, ఇప్పటివరకు కేవలం రూ.100 కోట్లు లభించాయి. మరోవైపు 25 శాతం రాయితీ గడువు ఈ నెలాఖరుతో ముగియనున్న దృష్ట్యా సెలవు రోజుల్లోనూ ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. దరఖాస్తుదారుల నుంచి స్పందన నామమాత్రంగా ఉండడంతో గడువు పొడిగించే అవకాశం ఉన్నట్లు అధికారులు చెప్పారు.



చిన్నారులు మత సామరస్యాన్ని చాటారు. ఉగాది, రంజాన్ పర్వదినాల నేపథ్యంలో ఇటు ఉగాది పచ్చడి.. అటు షీర్ కుర్మాలతో సందడి చేశారు. పచ్చడి, షీర్ కుర్మాలను ఒకరికొకరు తినిపించుకుని ఈ రెండు పండగల విశిష్టతను కళ్లకు కట్టారు. ఈ వేడుకలు శనివారం మూసాపేటలోని పంచశీల పాఠశాలలో నిర్వహించారు. - మూసాపేట

ఇటు ఉగాది పచ్చడి.. అటు షీర్ కుర్మా!

కాల్పుల కలకలం

రంజాన్ బజార్‌లో ఈవెంట్ మేనేజర్ హల్‌చల్

- గుడిమల్కాపూర్ కింగ్స్ ప్యాలెస్‌లో ఘటన
- రెండు స్టాళ్ల నిర్వాహకుల మధ్య గొడవే కారణం
- పోలీసుల అదుపులో నిందితుడు



కాల్పులు జరిపిన హసీబుద్దీన్


గోల్కొండ: గుడిమల్కాపూర్ కింగ్స్ ప్యాలెస్ గార్డెన్‌లో దావత్ – ఎ– రంజాన్ షాపింగ్ ఎక్స్‌పోలో శనివారం రెండు స్టాళ్ల నిర్వాహకుల మధ్య జరిగిన గొడవ గాలిలోకి కాల్పులకు దారి తీసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. గుడిమల్కాపూర్ కింగ్స్ ప్యాలెస్‌లో దావత్– ఎ– రంజాన్ పేరుతో రంజాన్ షాపింగ్ నిర్వహిస్తున్నారు. ఎక్స్‌పో శుక్రవారం రాత్రి ముగిసింది. శనివారం ఉదయం నిర్వాహకులు తమ స్టాళ్లను తొలగిస్తున్నారు. కాగా.. ఫారూక్ అహ్మద్, సయ్యద్ హారూన్ సోదరులు బొమ్మల షాపు నిర్వహిస్తుండగా.. వీరి స్టాల్ పక్కనే దుబాయ్‌కి చెందిన తౌఫిక్ అనే వ్యక్తి పర్‌ఫ్యూమ్ షాపు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఫారూక్ అహ్మద్ తనకు ఒక పర్‌ఫ్యూమ్ బాటిల్ ఇవ్వాలని తౌఫిక్‌ను అడుగుతున్నాడు. ఈ విషయమై శనివారం ఉదయం ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఒకరినొకరు తోసుకుంటూ స్టాళ్లను ధ్వంసం చేయసాగారు. పర్‌ఫ్యూమ్ స్టాల్ నిర్వాహకుడు తౌఫిక్ ఈవెంట్ ఆర్గనైజర్ అయిన మీర్ హసీబుద్దీన్ వద్దకు వెళ్లి విషయం చెప్పాడు. తమపైనే షికాయత్ చేస్తావా అంటూ ఫారూక్ అహ్మద్, సయ్యద్ హారూన్‌లు కలిసి తౌఫిక్‌పై దాడికి వెళ్లారు. వీరి మధ్య పరస్పరం తోపులాట చోటుచేసుకుంది. ఇది గమనించిన ఈవెంట్ ఆర్గనైజర్ మీర్ హసీబుద్దీన్ తనపై కూడా దాడి జరగవచ్చనే అనుమానంతో తన వద్ద ఉన్న లైసెన్స్‌డ్ రివాల్వర్‌తో గాల్లోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. కాల్పుల శబ్దం వినగానే స్టాళ్లను తొలగించిన వ్యాపారులు, వారి సహాయకులు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న గుడిమల్కాపూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కాల్పులు జరిపిన మీర్ హసీబుద్దీన్ నుంచి రివాల్వర్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

త్రాసు.. తిరకాసు!

తూనికలు, కొలతల శాఖలో ఇష్టానుసారం

అవినీతి అధికారిణికి అందలం!!

- ఏసీబీకి చిక్కి సస్పెండైన తొమ్మిది నెలల్లోనే తిరిగి పోస్టింగ్
- జిల్లా స్థాయి కీలక పోస్టులో అదనపు బాధ్యతలు
- జూనియర్‌కు పోస్టింగ్ ఇవ్వడంపై అనుమానాలు



తూనికలు, కొలతల శాఖ కార్యాలయం

సాక్షి, సిటీబ్యూరో:

తూనికలు, కొలత శాఖ తీరు మారడం లేదు. అడుగడుగునా అవినీతి, అక్రమాల అపవాదు మూటకట్టుకున్న ఈ శాఖలో పరిపాలన యంత్రాంగం తీరు అనుమానాలు, విమర్శలకు తావిస్తోంది. తాజాగా ఏసీబీకి చిక్కి సస్పెండైన ఒక అధికారిణి పోస్టింగ్‌ను కేవలం తొమ్మిది నెలల్లో పునరుద్ధరించడం, రెండు నెలల తర్వాత సీనియర్లను పక్కకు పెట్టి.. జూనియర్ అయిన సదరు అధికారిణికి జిల్లా స్థాయి కీలక పోస్టుకు అదనపు బాధ్యతలు అప్పగించడం విస్మయానికి గురిచేస్తోంది. ఇందులో అసలు ట్విస్ట్ ఏంటంటే ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన కార్యాలయంలోనే జిల్లా స్థాయి కీలక పోస్టుకు ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించడం తూనికలు, కొలతల శాఖలో చర్చనీయాంశంగా మారింది.

అసలేం జరిగిందంటే..?

ఏడాది క్రితం పద్మారావు నగర్‌లోని రంగారెడ్డి జిల్లా తూనికలు, కొలతల శాఖ కార్యాలయంలో డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్‌లు ముడుపులు తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. తూనికలు, కొలత శాఖ అధీకృత లైసెన్స్‌డ్ స్కిల్డ్ వర్కర్ (రిపేరర్) ఒకరు నాట్కో ఫార్మా లిమిటెడ్‌కు సంబంధించిన 25 ఎలక్ట్రానిక్ డిజిటల్ వేయింగ్ స్కేల్ మిషన్ల వ్యాలిడిటీ సర్టిఫికెట్ల పునరుద్ధరణ కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని వాటికి సంబంధించి డిపార్ట్‌మెంట్ ఫీజు రూ.7,900 చెల్లించారు. పునరుద్ధరణ కోసం సదరు డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించగా డిపార్ట్‌మెంట్ ఫీజు కాకుండా అదనంగా ఒక్కో మిషన్‌కు రూ.400 చొప్పున 25 యంత్రాలకు రూ.10 వేలు ముట్టజెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో సదరు అధీకృత లైసెన్స్‌దారు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించి సదరు అధికారిణి ఫోన్ సంభాషణ ఆడియో, వీడియో రికార్డు అందజేశారు. అనంతరం కార్యాలయంలో నగదు ముట్టజెప్పుతుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్, టెక్నిషియన్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా.. వీరిని రిమాండ్‌కు తరలించారు. దీంతో తూనికలు, కొలతల శాఖ ఇరువురిని సస్పెండ్ చేసింది.

పోస్టింగ్ పునరుద్ధరణ ఇలా...

ఏసీబీకి చిక్కి సస్పెండైన తొమ్మిది నెలల తర్వాత డిసెంబర్ 16న జీవోఆర్‌టీ నెంబర్ 54 ద్వారా సదరు డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్‌ను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో డిసెంబర్ 20న హెడ్ క్వార్టర్–1, హైదరాబాద్ సిటీలో డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ కేటాయిస్తూ తూనికలు, కొలతల శాఖ కంట్రోలర్ ఆదేశాలు జారీ చేశారు. ఇదీలా ఉండగా.. ఈ ఏడాది ఫిబ్రవరి 28న రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ (ఏసీ) జగన్మోహన్ రెడ్డి పదవీ విరమణ చేశారు. నిబంధనల ప్రకారం ఆ స్థానంలో రెగ్యులర్ అధికారి నియామకమయ్యే వరకు ఇతర జిల్లాలో పని చేస్తున్న అసిస్టెంట్ కంట్రోలర్‌కు గానీ అర్హులైన సీనియర్ డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్‌కు గానీ తాత్కాలికంగా అదనపు బాధ్యతలను అప్పగించాల్సి ఉంటుంది. అయితే.. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా.. ఏసీబీకి చిక్కి తాజాగా విధుల్లో చేరిన జూనియర్ అయిన డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్‌కు అసిస్టెంట్ కంట్రోలర్‌గా బాధ్యతలు అప్పగించడం విస్మయానికి గురి చేస్తోంది. ఏసీబీకి చిక్కిన ఆఫీస్‌లోనే ఉన్నత స్థాయి కీలక పోస్టులో ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తుండటంతో తూనికలు, కొలతల శాఖ జిల్లా స్థాయి అధికారులు విస్మయానికి గురవుతున్నారు.

నా ప్రమేయమేమీ లేదు.. కంట్రోలరే పోస్టింగ్ ఇచ్చారు..



రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కంట్రోల్ (ఏసీ) పదవీ విరమణ చేయడంతో తాత్కాలికంగా ఒక డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్‌కు బాధ్యతలు అప్పగించడంలో నా ప్రమేయమేమీ లేదు. రాష్ట్ర కంట్రోలరే ఆ పోస్టింగ్ ఇచ్చారు. తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించే పోస్టులకు సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలన్న నిబంధన ఏమీ లేదు. సదరు అధికారిణికి వర్క్ తక్కువగా ఉండటంతో అక్కడ అదనపు బాధ్యతలు అప్పగించాం. రెగ్యులర్ పోస్టు భర్తీ కోసం కంట్రోలర్ దృష్టికి తీసుకెళ్లాం.
– రాజేశ్వర్, అసిస్టెంట్ కంట్రోలర్ (అడ్మిన్) లీగల్ మెట్రోలజీ, హైదరాబాద్

గ్రేటర్‌లో ఇక టీకా బండ్లు

ప్రారంభించిన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి



టీకా వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటి

లక్డీకాపూల్: గ్రేటర్ హైదరాబాద్‌లో ఇక నుంచి టీకా బండ్లు రయ్ రయ్ అంటూ తిరగనున్నాయి. పిల్లలకు రొటీన్ ఇమ్యూనైజేషన్ సెషన్‌ను నిర్వహించడానికి హోండా యాక్టివాతో కూడిన ఈ టీకా బండ్లు ఎంతగానో దోహదపడతాయని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి అన్నారు. శనివారం ఆయన నాలుగు టీకా బండ్లను జెండా ఊపి ప్రారంభించారు. టీకా కార్యక్రమాల నిర్వహణ కష్టతరమైన ప్రాంతాల కోసం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఈ వాహనాలను కేటాయించినట్టు తెలిపారు. వీటిని ఖైరతాబాద్ ఏఎన్‌ఎం లావణ్య, మెట్టుగూడ ఏఎన్‌ఎం శైలజ, శ్రీరామ్‌నగర్ ఏఎన్‌ఎం రజిత, సనత్‌నగర్ ఏఎన్‌ఎం ప్రమీలకు టీకా కవరేజ్ నిమిత్తం అప్పగించామన్నారు. కార్యక్రమంలో ఇమ్యూనైజేషన్ జిల్లా అధికారి డాక్టర్ శ్రీధర్, జిల్లా మాస్ ఎడ్యుకేషన్, మీడియా అధికారి జక్కుల రాములుతో పాటు వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మెట్రో@ 11.45PM



ఫెస్ట్‌లో భాగంగా పెయింటింగ్స్ ప్రదర్శన

ఏప్రిల్ 1 నుంచి రైళ్ల వేళల్లో మార్పులు

- ఉదయం 6 నుంచి రాత్రి 11.45 గంటల వరకు సర్వీసులు
- ఘనంగా ముగిసిన హైదరాబాద్ మెట్రో ఆర్ట్, మెట్రో ఫెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఇక రాత్రి 11.45 గంటల వరకు మెట్రో సేవలు అందుబాటులో రానున్నాయి. అన్ని టెర్మినల్ స్టేషన్‌ల నుంచి మొదటి సర్వీసు ఉదయం 6 గంటలకు, చివరి సర్వీసు రాత్రి 11.45 గంటలకు బయలుదేరనున్నాయి. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఈ వేళలు కొనసాగుతాయి. శనివారం యథావిధిగా ఉదయం 6 గంటలకు మొదటి సర్వీసు బయలుదేరుతుంది. చివరి సర్వీసు మాత్రం రాత్రి 11.45 గంటలకు బదులు రాత్రి 11 గంటలకే బయలుదేరుతుంది. ఆదివారం మాత్రం మొదటి సర్వీసు ఉదయం 7 గంటలకు, చివరి సర్వీసు రాత్రి 11 గంటలకు బయలుదేరుతాయి. ఏప్రిల్ 1 నుంచి మెట్రో కొత్త వేళలు అందుబాటులోకి వస్తాయి. హెచ్‌ఎంఆర్‌ఎల్, హైదరాబాద్ మెట్రో ఎల్‌అండ్‌టీ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెట్రో ఆర్ట్ అండ్ ఫెస్ట్ ఉగాది వేడుకలు ఎర్రమంజిల్‌లోని ఎల్‌అండ్‌టీ ప్రీమియా మాల్‌లో శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అధికారులు పలు కీలక విషయాలను వెల్లడించారు. డిజిటల్ ఇంటిగ్రేషన్‌లో భాగంగా టి–సవారీ మొబైల్ యాప్ సేవలను మరింత ఆధునీకీకరించనున్నట్లు తెలిపారు. అలాగే.. స్టూడెంట్ స్పెషల్ పాస్‌ను మరో ఏడాది పాటు పొడిగించినట్లు పేర్కొన్నారు.

సూపర్ సేవర్ ఆఫర్ బంద్..

సెలవులు, పండగలు తదితర ప్రత్యేక సందర్భాల్లో ప్రయాణికులు కేవలం రూ.59 చెల్లించి నగరంలో మెట్రోల్లో పర్యటించేందుకు ప్రవేశపెట్టిన సూపర్‌సేవర్ హాలిడే ఆఫర్ గడువు ఈ నెల 31తో ముగియనుంది. పాక్షిక రద్దీ వేళల్లో అందుబాటులో ఉన్న తగ్గింపు ఆఫర్ కూడా ముగియనుంది.

ప్రయాణం.. సృజనాత్మకం...

హైదరాబాద్ మెట్రో ప్రయాణాన్ని ఒక సాధారణమైన ప్రజా రవాణా సదుపాయంగా మాత్రమే కాకుండా ప్రయాణికులకు కళాత్మకమైన, సృజనాత్మకమైన అనుభూతిని అందజేసేందుకు మెట్రో ఆర్ట్‌అండ్ ఫెస్ట్ వేడుకలను నిర్వహించినట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్ ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ.. టీ–సవారీ యాప్‌ను మరింత మెరుగుపర్చి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. హైదరాబాద్ మెట్రో డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేసినట్లు చెప్పారు. డిజిటల్ సేవల పూర్తి వివరాల కోసం ఎల్‌అండ్‌టీ మెట్రో వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు. అనంతరం కళాకారులు వేసిన పెయింటింగ్స్ ఆకట్టుకున్నాయి.

ఏప్రిల్ 1 నుంచి మెట్రో వేళలు ఇలా..

- సోమవారం నుంచి శుక్రవారం వరకు: నాగోల్, రాయదుర్గం, ఎల్‌బీనగర్, మియాపూర్, ఎంజీబీఎస్, జేబీస్ టెర్మినల్ స్టేషన్లలో మొదటి సర్వీసు ఉదయం 6 గంటలకు, చివరి సర్వీసు రాత్రి 11.45 గంటలకు బయలుదేరుతాయి.
- శనివారాల్లో మాత్రం మొదటి సర్వీసు యథాతథంగా ఉదయం 6 గంటలకు బయలుదేరుతుంది. చివరి సర్వీసు మాత్రం రాత్రి 11 గంటలకు బయలుదేరుతుంది.
- ఆదివారాల్లో అన్ని టెర్మినల్ స్టేషన్‌ల నుంచి ఉదయం 7 గంటలకు మొదటి సర్వీసు బయలుదేరుతుంది. చివరి సర్వీసు రాత్రి 11 గంటలకు బయలుదేరుతుంది.

వారం రోజులు... 1113 కేసులు

'నిషా'చరులపై ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపే 'నిషా'చరులపై ట్రాఫిక్ విభాగం అధికారులు ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 22–28 తేదీల మధ్య చేపట్టిన తనిఖీల్లో మొత్తం 1113 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ చిక్కినట్లు ట్రాఫిక్ విభాగం సంయుక్త సీపీ జోయల్ డెవిస్ శనివారం వెల్లడించారు. అంతకు ముందు వారం ఈ సంఖ్య 1099గా ఉంది. గత వారం పట్టుబడిన వారిలో 942 మంది ద్విచక్ర, 48 మంది త్రిచక్ర వాహనచోదకులు ఉండగా.. తేలికపాటి వాహనాల డ్రైవర్లు 118 మంది, భారీ వాహనం నడిపే చోదకుడు ఐదుగురు ఉన్నట్లు వివరించారు. ఈ స్పెషల్ డ్రైవ్స్‌లో ట్రాఫిక్ పోలీసులు పట్టుబడిన వారిలో ముగ్గురు మైనర్లు, మరో మహిళ కూడా ఉన్నారు. అత్యధికంగా 494 మంది 30 ఏళ్ల లోపు వయస్కులే కావడం గమనార్హం. నిబంధనల ప్రకారం డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి 100 ఎంఎల్ (మిల్లీ లీటర్లు) రక్తంలో 30 ఎంజీ (మిల్లీ గ్రాములు) ఆల్కహాల్ ఉండే అది ఉల్లంఘన కిందికి వస్తుంది. దీన్ని బ్లడ్ ఆల్కహాల్ కౌంట్‌గా (బీఏసీ) వ్యవహరిస్తారు. ఈ 1113 మందిలో 254 మందికి 30–50 మధ్య, 486 మందికి 51–100 మధ్య, 212 మందికి 101–150 మధ్య, 100 మందికి 151–200 మధ్య, 35 మందికి 201–250 మధ్య, 14 మందికి 251–300 మధ్య, 12 మందికి 300 కంటే ఎక్కువగా బీఏసీ కౌంట్ నమోదైనట్లు జోయల్ డెవిస్ తెలిపారు. ఈ ఉల్లంఘనులకు ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో కౌన్సిలింగ్ నిర్వహించి, కోర్టులో హాజరుపరుస్తామని ఆయన పేర్కొన్నారు.

బాధితురాలికి కిషన్‌రెడ్డి పరామర్శ

ఎంఎంటీఎస్‌లో లైంగికదాడి యత్నం ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేయాలి



యశోద ఆసుపత్రి వద్ద బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్–మేడ్చల్ ఎంఎంటీఎస్ రైలు అత్యాచారయత్నం ఘటనలో గాయపడి సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని శనివారం కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితురాలి పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నామని, శస్త్రచికిత్స అనంతరం బాధితురాలు కోలుకుంటుందని చెప్పారు. బాధితురాలి వైద్య ఖర్చులన్నీ మేమే భరిస్తామని, ఆమె కుటుంబానికి అండగా ఉంటామని ఆమె కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. చికిత్స అనంతరం స్వస్థలానికి వెళ్లినాక అక్కడి ప్రభుత్వం నుంచి బాధితురాలికి సహకారం అభించేవిధంగా ఏపీ మంత్రులతో మాట్లాడుతామని కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం కొందరు అనుమానితులు పోలీసుల అదుపులో ఉన్నారని, దర్యాప్తును త్వరగా పూర్తి చేసి బాధితురాలికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రైల్వే డీజీతో మాట్లాడినట్టు చెప్పారు.

ఒకే కాన్పులో నలుగురు శిశువులు జననం

నిలోఫర్ నుంచి తల్లి శిశువులు డిశ్చార్జ్



నలుగురు పిల్లలతో తల్లిని డిశ్చార్జి చేసి ఇంటికి పంపుతున్న నిలోఫర్ వైద్యులు

నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలో ఒకే కాన్పులో ఓ మహిళ నలుగురు శిశువులకు జన్మనిచ్చింది. పిల్లలు, తల్లి ఆరోగ్యంగా ఉన్నారు. కోలుకున్న తల్లీపిల్లలను శనివారం డిశ్చార్జ్ చేశారు. ఆసుపత్రి వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని హస్తినాపురం ప్రాంతానికి చెందిన అమృత (24) పురిటి నొప్పులతో ఫిబ్రవరి 22న నిలోఫర్‌లో అడ్మిట్ అయ్యారు. ఏడున్నర నెలలకి పురిటి నొప్పులు రావడంతో నిలోఫర్ వైద్యులు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి పెద్దాపరేషన్ చేశారు. ఈ కాన్పులో ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. వీరి బరువు 1.6 కేజీ, 1.5 కేజీ, 1.4 కేజీ, 1.2 కేజీలుగా ఉన్నారు. శిశువులకు పుట్టుకతో శ్వాస సంబంధమైన సమస్య తలెత్తడంతో వెంటిలేటర్‌పై ఉంచారు. నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రవికుమార్, ఎస్‌హెచ్‌ఓడీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ నియోనటాలజీ ప్రొఫెసర్ ఎల్.స్వప్న పర్యవేక్షణలో పూర్తి స్థాయిలో పదిరోజుల పాటు చికిత్సలు అందించారు. నిలోఫర్ వైద్యుల పర్యవేక్షణలో పిల్లలు ఇన్ఫెక్షన్, కామెర్లు, కంటి సమస్యల నుంచి బయటపడ్డారు. 35 రోజుల ట్రీట్‌మెంట్ తర్వాత నలుగురు పిల్లలు డిశ్చార్జ్ అయ్యారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

ఇబ్రహీంపట్నం: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి ఇబ్రహీంపట్నంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ చందర్ తెలిపిన ప్రకారం... ఇబ్రహీంపట్నంలో నివాసముండే ఎండీ చాంద్‌పాష(43)కు జేసీబీలున్నాయి. కొంత కాలంగా ఆయన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన పాష రాత్రి 11 గంటల ప్రాంతంలో స్థానిక వైఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలోని చింతచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడి కోసం బైక్ దొంగతనం..

ఫిలింనగర్: తనకు బైక్ ఉంది..అయితే తన ప్రాణానికి ప్రాణమైన స్నేహితుడికి బైక్ లేకపోవడంతో కలత చెందాడు. ఎలాగైనా సరే స్నేహితుడికి బైక్ ఇప్పించి అతని కళ్లల్లో ఆనందం చూడాలని భావించాడు ఓ యువకుడు. ఇంకేముంది..బైక్ దొంగతనానికి పథకం వేశాడు. 24 గంటలు తిరక్కముందే పోలీసులకు పట్టుబడ్డాడు. ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనా వివరాలు ఇలా ఉన్నాయి. హకీంపేటలో నివసించే మహ్మద్ రియాజ్ (19) స్థానికంగా హారతి కర్పూరం తయారుచేసే కంపెనీలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. తన స్నేహితుడు (17) కూడా అందులోనే పనిచేస్తుండగా ఆయనకు బైక్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని రియాజ్ గమనించాడు. దీంతో దొంగతనం చేసైనా సరే స్నేహితుడికి బైక్ ఇచ్చి ఆనందం చూడాలనుకుని బైక్ దొంగతనానికి పథకం వేశాడు. షేక్‌పేట సమీపంలోని ఫాల్కన్ వ్యాలీలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఓ బైక్‌ను మూడు రోజుల క్రితం అర్ధరాత్రి చోరీ చేసి ఆ తెల్లవారే తన స్నేహితుడైన మైనర్ బాలుడికి బహుమతిగా ఇచ్చాడు. తన బైక్ చోరీకి గురైందంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగి ఘటనా స్థలం నుంచి సీసీ ఫుటేజీలను పరిశీలిస్తూ చోరీకి గురైన బైక్ వెళ్లే క్రమంలో హకీంపేట దాకా గుర్తించారు. చోరీ చేసిన రియాజ్ ఫోటోలు స్పష్టంగా రావడంతో హకీంపేటలో ఫోటోల ఆధారంగా ఆరాతీశారు. స్థానికులు గుర్తించి రియాజ్ అడ్రెస్ చెప్పడంతో గుట్టువీడింది. నిందితుడి నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకుని రియాజ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మైనర్ బాలుడిని జువైనల్ హోంకు తరలించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రీచార్జ్ చేస్తానంటూ టోకరా

వృద్ధుడిని ముంచిన జియో ఫైబర్ టెక్నీషియన్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందని ఓ వృద్ధుడిని టార్గెట్‌గా చేసుకుని, రీచార్జ్ పేరుతో ఆయన క్రెడిట్‌కార్డు తీసుకుని, అక్రమ లావాదేవీ ద్వారా రూ.1.11 లక్షలు స్వాహా చేసిన జియో ఫైబర్ ఉద్యోగిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వరంగల్‌కు చెందిన ఎం.బాలరాజ్ జియో ఫైబర్‌లో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి (78) వద్దకు వెళ్లాడు. ఇంటర్‌నెట్ కనెక్షన్ అప్‌గ్రేడ్ చేస్తానంటూ దానికి సంబంధించిన రీచార్జ్ కోసమని ఆయనకు చెందిన యాక్సస్ బ్యాంక్ క్రెడిట్ కార్డు తీసుకున్నాడు. దాన్ని దుర్వినియోగం చేస్తూ రూ.1.11 లక్షలు తన ఖాతాలోకి మార్చుకున్నాడు. దీనికి అవసరమైన ఓటీపీని సైతం ఆయన నుంచే తీసుకున్నారు. దీనిపై బాధితుడు బ్యాంకుకు వెళ్లి తగిన ఆధారాలు తీసుకుని, సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ పి.ప్రమోద్ కుమార్ దర్యాప్తు చేశారు. బాలరాజ్‌ను నిందితుడిగా గుర్తించి శనివారం అరెస్టు చేశారు.

అమ్మకం ప్రకటన-సహిత-ఇ-వేలం
భారత ప్రభుత్వం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల శాఖ
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-2 హైదరాబాద్ వద్ద
1వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్-500001, ఫోన్: 040-24756467

R.P.No.24 of 2019 తేది: 19.03.2025

రికవరీ ఆఫ్ డెట్స్ ద్యూ టు బ్యాంక్స్ అండ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్, 1993తో చదువబడే ఆదాయపన్ను చట్టం 1961కి రెండవ షెడ్యూలులోని రూల్స్ 38, 52(2) క్రింద అమ్మకం ప్రకటన

(CH-1) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్ట్రెస్డ్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, GPA సమీపాన, ప్యాట్నీ సెంటర్, సికింద్రాబాద్. ...సర్టిఫికెట్ హోల్డర్
(CD-1) అమేయ లేబొరేటరీస్ లిమిటెడ్, ప్రాతినిధ్యంవహిస్తున్న దాని మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ కొనరాజు హరిబాబు తండ్రి శ్రీ కొనరాజు సుబ్బారావు, వృత్తి: వ్యాపారం, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, ప్లాట్ నం.68-B, ప్రగతినగర్, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500045 మరియు A-49, మధురానగర్, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500038.
(CD-2) కొనరాజు హరిబాబు తండ్రి కొనరాజు సుబ్బారావు, వృత్తి: వ్యాపారం, ప్లాట్ నం.1169, ప్రగతినగర్, బాచుపల్లి గ్రామం, కూకట్‌పల్లి, హైదరాబాద్ మరియు A-49, మధురానగర్, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500038.
(CD-3) MSSV సత్యనారాయణ తండ్రి బాబూరావు వెంకట కృష్ణారావు, వృత్తి: వ్యాపారం, ప్లాట్ నం.68-B, ప్రగతినగర్, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500045 మరియు A-49, మధురానగర్, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500038 మరియు డి.నం.6-88, పునాదిపాడు, కంకిపాడు మండలం, కృష్ణా జిల్లా-521151.
(CD-4) చదలవాడ సుజాత భర్త సాంబశివరావు, వృత్తి: వ్యాపారం, ప్లాట్ నం.68-B, ప్రగతినగర్, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500045 మరియు A-49, మధురానగర్, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500038.
(CD-5) M. వసూ రాణి భర్త MSSV సత్యనారాయణ వృత్తి: వ్యాపారం, ప్లాట్ నం.68-B, ప్రగతినగర్, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500045 మరియు A-49, మధురానగర్, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500038 మరియు డి.నం.6-88, పునాదిపాడు, కంకిపాడు మండలం, కృష్ణా జిల్లా-521151.
(CD-6) శ్రీమతి కోట ఉమాదేవి భర్త వెంకటేశ్వర్లు, వృత్తి: వ్యాపారం, ప్లాట్ నం.68-B, ప్రగతినగర్, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500045 మరియు A-49, మధురానగర్, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500038 మరియు ఫ్లాట్ నం.16, గ్రీన్ అవెన్యూస్, నిజాంపేట్ రోడ్, హైదరాబాద్. ...సర్టిఫికెట్ డెటార్స్

రికవరీ ఆఫ్ డెట్స్ ద్యూ టు బ్యాంక్స్ అండ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్, 1993లోని సెక్షన్ 19(22) క్రింద గౌరవనీయ ప్రిసైడింగ్ ఆఫీసర్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-II, హైదరాబాద్ వారిచే RP No.24/2019, తేది 27.08.2020 గల రికవరీ సర్టిఫికెట్ జారీచేయబడింది.

ఆదాయపన్ను చట్టం, 1961కి రెండవ మరియు మూడవ షెడ్యూల్స్ మరియు పైన తెలిపిన రికవరీ సర్టిఫికెట్‌లో నిర్దేశించిన రూ.84,68,64,223.62/- (ఎనభై నాలుగు కోట్ల అరవై ఎనిమిది లక్షల అరవై నాలుగు వేల రెండు వందల ఇరవై మూడు రూపాయల అరవై రెండు పైసలు మాత్రమే) తో పాటు వడ్డీ, వ్యయాలు మొదలైనవాటిని సర్టిఫికెట్ డెటార్స్ నుంచి రాబట్టుకొనుటకు దిగువ సంతకందారు RP No.24/2019 లో రికవరీ ప్రొసీడింగ్స్ చేపట్టారు.

[illegible]

ఆదివారం అయినట్లయితే, ఆ మరునటి పనిరోజున చెల్లించాలి. కొనుగోలు ప్రతిఫలంలో మిగతా 75% వేలం తేదీ నుంచి 15 రోజులలోగా చెల్లించాలి.

10. పైన తెలిపినదానికి అదనంగా, కొనుగోలుదారు పౌండేజి ఫీజు రూ.1000/- వరకు 2% వంతున "Registrar, DRT-2, Hyderabad" వద్ద మరియు సదరు మొత్తం రూ.1000/- కంటే అధికంగా ఉంటే 1% వంతున "Registrar, DRT-2, Hyderabad" పేరున డి.డి. ద్వారా డిపాజిట్ కూడా చేయాలి.
11. నిర్దిష్ట వ్యవధిలోగా చెల్లింపు చేయడంలో విఫలమైతే, అమ్మకం ఖర్చులను భరించిన తర్వాత డిపాజిట్‌ను దిగువ సంతకందారు తగిన విధంగా ఉందని భావిస్తే, ప్రభుత్వానికి స్వాధీనం చేస్తారు మరియు డిఫాల్టింగ్ కొనుగోలుదారు ఆస్తికి లేదా ఆ తర్వాత విక్రయించబడే దానికోసం మొత్తంలో ఏదేని భాగానికి అన్ని క్లెయిమ్‌లను కోల్పోతారు. అమ్మకం యొక్క తాజా ప్రకటన జారీ చేసిన తరువాత ఆస్తి తిరిగి విక్రయించబడుతుంది.
12. ఆస్తి కోసం బిడ్డింగ్ చేసే కొనుగోలుదారు అమలులో ఉన్న వర్తించే చట్టాలకు కట్టుబడి ఉన్నట్లుగా రూఢీ చేసుకోవాలి. ఆస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" స్థితిలో విక్రయించబడును. బిడ్డర్లు ఆస్తికి సంబంధించి యాజమాన్యత, తాకట్టు రుణభారాలు, చార్జీలు లేదా పన్నులు మొదలైనటువంటి చట్టబద్ధమైన బకాయిల గురించి తమ స్వంత విచారణలు జరుపుకోవలెను. బిడ్డర్లు బిడ్లు దాఖలు చేసేముందు తాము తగినంత జాగ్రత్తగా పరిశీలించి దాఖలు చేశారని భావించబడుతుంది.
13. ఆస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే ప్రాతిపదికన" విక్రయించబడుచున్నది.
14. ఏ కారణం తెలుపకుండానే బిడ్లు సహేతుకంగా లేవని కనుగొనబడితే ఏదేని లేదా అన్ని బిడ్లను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు లేదా ఎప్పుడైనా వేలం వాయిదా వేయు హక్కు దిగువ సంతకందారుకు కలదు. ఆస్తి స్పెసిఫికేషన్.

ఆస్తి షెడ్యూల్-"C"-1

ప్రతివాది నం.4, శ్రీమతి Ch. సుజాత భర్త శ్రీ Chs. సాంబశివరావుకు చెందిన మరియు వారు తనఖాపెట్టిన ఆస్తి, డాక్యుమెంట్ నం.3103 ఆఫ్ 1981, తేది.25.04.1981.

రంగారెడ్డి జిల్లా, హయత్‌నగర్ తాలుకా, కర్మన్‌ఘాట్ గ్రామం మరియు పంచాయతీ వద్ద గల సర్వే నం.7/1, 7/2, 8, 9 మరియు 10 ద్వారా కవర్ చేయబడిన లేఅవుట్, సర్వే నం. లో భాగంగా గల 656.34 చ.మీటర్లకు సమానమైన 785 చ.గజాల విస్తీర్ణం, ప్లాట్ నం.82 కలిగిన భూమి యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: పొరుగువారి భూమి (ప్రైవేట్), దక్షిణం: ప్లాట్ నం.81, తూర్పు: ప్లాట్ నం.83, పశ్చిమం: 40 అ. వెడల్పు రోడ్డు.

వేలం వివరాలు

లాట్ నం.	వేలం తేది	బిడ్ల దాఖలుకు చివరి తేది	వేలం సమయం	రిజర్వు ధర	10% బయానా మొత్తం	బిడ్ పెంపుదల మొత్తం
లాట్ నం.1	30.04.2025	28.04.2025	ఉ.11.30 గం. నుండి మ.12.00 గం.	రూ.5,50,00,000/-	రూ.55,00,000/-	రూ.1,00,000/-

నాచే స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ యొక్క సీల్‌తో 19 మార్చి, 2025న ఇవ్వబడింది.

సం/- (ప్రశాంత్ కంక్రానియ)
రికవరీ ఆఫీసర్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-2, హైదరాబాద్-500001

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

లిబర్టీ: రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుంటే విపక్షాలు అడ్డుకుంటున్నాయని సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకులు మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు అన్నారు. శాసనసభలో ప్రభుత్వానికి సహకరించకుండా విమర్శలతోనే సరిపెట్టుకున్నారని ఆరోపించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసన సభ బడ్జెట్‌ సమావేశాల్లో ప్రభుత్వం ఏ చర్చకైనా సిద్ధంగా ఉన్నప్పటికి ఆరోపణలు విమర్శలతోనే బీజేపీ, బీఆర్‌ఎస్‌ సభ్యులు కాలాన్ని వృథా చేశారని ఆరోపించారు. ప్రభుత్వం చేయాల్సిన కార్యక్రమాల గురించి విపక్షాలు సలహాలు సూచనలు ఇవ్వాల్సింది పోయి కేవలం తమ ప్రచారం కోసమే శాసనసభను వేదికగా వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంబేడ్కర్‌ వర్సిటీలో ఇఫ్తార్‌ విందు



బంజారాహిల్స్‌: పవిత్ర రంజాన్‌ మాసం సందర్భంగా డా.బి.ఆర్‌ అంబేడ్కర్‌ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ముస్లిం మైనారిటీ సోదరులు, ఉద్యోగులకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి అధ్వర్యంలో ఇఫ్తార్‌ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులకు ఆయన శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్‌ డా. విజయ కృష్ణారెడ్డి, ముస్లిం మైనారిటీ సోదరులు ఎండీ హబీబుద్దీన్‌, షబ్బీర్‌, జానీ, ఎండీ షబ్బీర్‌, ఖాజా మఖ్దూం మొహియుద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



ఫణీంద్ర గోటేటి

బంజారాహిల్స్‌: కేబీఆర్‌ పార్కులోని, నేచర్‌ పార్క్‌ వాకర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా ఫణీంద్ర గోటేటి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత ఆరు నెలల క్రితం నేచర్‌ పార్క్‌ వాకర్స్‌ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా ఉన్న లయన్‌ విజయ్‌కుమార్‌ మృతిచెందినప్పటి నుంచి అధ్యక్ష పదవికి ఎవ్వరినీ ఎన్నుకోలేదు. ఈ నేపథ్యంలో మిగతా కమిటీతో పాటు వాకర్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు ఫణీంద్ర గోటేటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఫణీంద్ర మాట్లాడుతూ.. 33 ఏళ్లుగా కేబీఆర్‌ పార్కులో వాకర్‌గా ఉండటంతో పాటు యోగా శిక్షకుడిగా సుపరిచితుడిగా ఉన్నానని తనకు ఇచ్చిన ఈ అవకాశంతో వాకర్లకు మరింత మెరుగైన వసతులు కలిప్పించేలా చర్యలు తీసుకుంటానన్నారు. ప్రధాన కార్యదర్శిగా లకోష్మారెడ్డి, కోశాధికారిగా సురేష్‌ అగర్వాల్‌ కొనసాగుతున్నారు.

రైల్వే కాంట్రాక్టర్‌ ఆత్మహత్య

సికింద్రాబాద్‌: సికింద్రాబాద్‌ రైల్వే పోలీస్‌స్టేషన్‌ రైల్వే కాంట్రాక్టర్‌ శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం మామిడాల యాపలగూడెంకు చెందిన పూరుకొండ విజయేందర్‌రెడ్డి (29) రైల్వే ఎలక్ట్రికల్‌ కాంట్రాక్టర్‌. మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌లో ఇతడికి స్టోర్స్‌ కోసం ఒక గదిని అధికారులు కేటాయించారు. నల్గొండ నుంచి ఇక్కడికి పనుల మీద వచ్చివెళ్లే విజయేందర్‌రెడ్డి స్టోర్స్‌ గదిలోని ఫ్యాన్‌ క్లిప్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విజయేందర్‌ ఆత్మహత్యను గుర్తించిన అతని సహాయకుడు సంపత్‌ పోలీసులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విజయేందర్‌ ఆత్మహత్యకు గల కారణాలు అన్వేషిస్తున్నారు.

ఎస్‌ఆర్‌నగర్‌లో ముమ్మరంగా డ్రంకెన్‌ డ్రైవ్‌

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్‌ ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ తనిఖీలను ముమ్మరం చేశారు. శనివారం ఉదయం ఎస్‌ఆర్‌నగర్‌ కమ్యునిటీహాలు వద్ద చేపట్టిన తనిఖీల్లో మూసాపేటకు చెందిన శ్రీ వాణి వాటర్‌ సప్‌లై కేంద్రానికి చెందిన ట్యాంకర్‌ నడిపే డ్రైవర్‌ మాధవరావుకు పరీక్ష చేయగా 181 ఎంజి ఎంఎల్‌ వచ్చిందని ట్రాఫిక్‌ పోలీసలు తెలిపారు. దీంతో ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వాహనాలను దహనం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

అమీర్‌పేట: సనత్‌నగర్‌ కేఎల్‌ఎన్‌వై మున్సిపల్‌ పార్కు వద్ద నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలకు గుర్తు తెలియని అగంతకులు నిప్పు పెట్టారు. ఆద్యినగర్‌ కాలనీ వైపు పార్కు ప్రధాన గేటు వద్ద ఉన్నఖాళీ స్థలంలో సందర్శకుల వాహనాలు పార్కు చేస్తారు. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో పార్కు చేసి ఉన్న వాహనాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మంటలు వ్యాపించడాన్ని గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. మరో 3 వాహనాలు పాక్షికంగా దెబ్బ తిన్నాయి. పోలీసులు సీసీకెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

2,95,779 కార్డుదారులకు

ఉగాది కానుక

ఏప్రిల్‌ 1 నుంచి సన్నబియ్యం పంపిణీ.. | ఇప్పటికే రేషన్‌షాపులకు చేరుకున్న బియ్యం



బంజారాహిల్స్‌: అధికారంలోకి వస్తే సన్నబియ్యం పంపిణీ చేస్తామని కాంగ్రెస్‌ ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్‌ 1 నుంచి రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం నుంచి ఆయా షాపుల్లో సన్న బియ్యం పంపిణీకి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. రేషనింగ్‌ ఖైరతాబాద్‌ సర్కిల్‌–7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్‌, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్‌, రహమత్‌నగర్‌, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట, సనత్‌నగర్‌ డివిజన్ల పరిధిలో ఉన్న 81 రేషన్‌ దుకాణాలకు గత మూడు రోజుల నుంచి రేషన్‌ బియ్యాన్ని తరలిస్తున్నారు.

ఉగాది కానుకగా..

ఆయా రేషన్‌షాపులకు అవసరమైన స్టాక్‌ను ముందుగానే తీసుకువచ్చి భద్రపరిచారు. రేషనింగ్‌ సర్కిల్‌–7 పరిధిలో ఉగాది కానుకగా 2,95,779 మంది సన్నబియ్యం అందుకోనున్నారు. సర్కిల్‌ పరిధిలో ఇప్పటికే 81,013 రేషన్‌కార్డులు ఉండగా ఇటీవల కొత్తగా 2,897 కొత్త కార్డులు ప్రకటించారు. ఏప్రిల్‌ 1వ తేదీ నుంచి అన్ని షాపుల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని నిర్ణయించారు. సన్నబియ్యం పంపిణీ చేస్తామంటూ కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల నుంచే ప్రకటిస్తూ కార్డుదారులను ఊరిస్తూ వచ్చింది. నాలుగు రోజుల క్రితం పౌర సరఫరాల శాఖ మంత్రి అసెంబ్లీలో ప్రకటన జారీ చేస్తూ కొత్తగా మంజూరైన కార్డుదారులతో పాటు పాత కార్డుదారులందరికీ ఏప్రిల్‌ 1 నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామని చెప్పారు.

పక్కదారి పట్టకుండా..

ఉగాది రోజునే మంత్రి సన్న బియ్యం పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. ఏప్రిల్‌ 1 నుంచి అన్ని దుకాణాల్లో పంపిణీ జరగనుంది. ఇప్పటికే రేషన్‌ షాపులకు చేరుకున్న సన్న బియ్యం నిల్వలను పౌర సరఫరాల శాఖ అధికారులు తనిఖీలు చేశారు. బియ్యం పక్కదోవ పట్టకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. డీలర్లకు తగిన సూచనలు జారీ చేశారు. ప్రతికార్డుదారుడూ సన్న బియ్యం తీసుకోవడానికి ముందుకు రానుండడంతో ఈ సారి రేషన్‌ బియ్యం పక్కదారి పట్టే అవకాశాలు లేవని అధికారులు అంటున్నారు.

ఖైరతాబాద్‌ సర్కిల్‌లో కార్డుల వివరాలు..

మొత్తం రేషన్‌ షాపులు:	81
తెల్ల రేషన్‌ కార్డులు :	79,531
ఇటీవల కొత్తగా మంజూరైన కార్డులు:	2,897
అంత్యోదయ అన్నయోజన కార్డులు:	3,481
అన్నపూర్ణ కార్డులు:	1
కార్డుల్లో మొత్తం సభ్యుల సంఖ్య:	2,95,779
మంజూరైన సన్నబియ్యం:	18,19,011

డ్రంకెన్‌ డ్రైవ్‌లో ట్యాంకర్‌ డ్రైవర్‌పై కేసు

బంజారాహిల్స్‌: నీటి ట్యాంకర్‌ డ్రైవర్లకు డ్రంకెన్‌ డ్రైవ్‌ పరీక్షలు నిర్వహిస్తూ హెచ్చరికలు జారీ చేస్తున్నా మద్యం తాగి డ్రైవింగ్‌ చేస్తూ పట్టుబడుతూనే ఉన్నారు. ఎస్సార్‌నగర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ సైదులు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌ పరీక్షల్లో మద్యం తాగి వాహనం నడుపుతూ మరో వాటర్‌ ట్యాంకర్‌ డ్రైవర్‌ పట్టుబడ్డాడు. మూసాపేటకు చెందిన శ్రీవాణి వాటర్‌ సప్‌లై కేంద్రానికి చెందిన ఓ వాటర్‌ ట్యాంకర్‌ (టీఎస్‌ 09 యూఈ 4113) డ్రైవర్‌కు నిర్వహించిన పరీక్షలో 181 బీఏసీగా నమోదు కావడంతో ట్యాంకర్‌ను సీజ్‌ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

ఫుడ్‌ డెలివరీ ఇచ్చి వచ్చేలోగా బైక్‌ మాయం

వెంగళరావునగర్‌ : ఫుడ్‌ డెలివరీ ఇచ్చి వచ్చేలోగా ద్విచక్ర వాహనం మాయమైన ఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. దూలపల్లికి చెందిన సి.విష్ణువర్ధన్‌ స్విగ్గీ డెలివరీ బాయ్‌గా చేస్తున్నాడు. ఈ నెల 28న యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్‌ వద్ద ఫుడ్‌ డెలివరీ కోసం ద్విచక్ర వాహనంపై వచ్చాడు. కస్టమర్‌ 4వ అంతస్తుకు రావాలని చెప్పడంతో తన వాహనాన్ని గేటు ముందు పార్క్‌ చేసి ఫుడ్‌ డెలివరీ ఇచ్చి తిరిగి వచ్చే లోగా వాహనం కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రంజాన్‌ ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి



ఎస్పీఆర్‌హిల్స్‌ మైదానాన్ని పరిశీలిస్తున్న జకీయా సుల్తానా, సీఎన్‌ రెడ్డి

రహమత్‌నగర్‌ : రంజాన్‌ ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు చేశామని జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–19 డీఎంసీ జకీయా సుల్తానా, కార్పొరేటర్లు సీఎన్‌రెడ్డి స్పష్టం చేశారు.రంజాన్‌ ప్రత్యేక ప్రార్థనలు జరిగే ఎస్పీఆర్‌హిల్స్‌ క్వారీ మైదానాన్ని వారు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేక ప్రార్థనలకు వచ్చే ముస్లిం సోదరుల కోసం షా మియానాలు, మంచినీటిని ఏర్పాటు చేయడంతో పాటు మైదానాన్ని చదును చేయడం జరిగిందన్నారు.

• డివిజన్‌లోని శ్రీరాంనగర్‌లోని మజీద్‌–ఏ–సయ్యదిన ఉమర్‌ ఫరూఖ్‌ మసీదులో ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌ విందులో కార్పొరేటర్‌ సీఎన్‌ రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



యాత్రకు స్వాగతం పలుకుతున్న ఉద్యమకారుల ఫోరం నేతలు

బంజారాహిల్స్‌: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు, ఉద్యమకారులను జాగృతం చేసేందుకు తెలంగాణ ఉద్యమకారులు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బస్సు యాత్ర శనివారం బంజారాహిల్స్‌కు చేరుకుంది. ఖైరతాబాద్‌ నియోజక వర్గం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేతలు ఈ సందర్భంగా బస్సు యాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షుడు చీమకూరి శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు రూ. 25 వేల పింఛన్‌ ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టిందని ఈ మేరకు హామీని అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు ఎన్నో ఇబ్బందుల్లో ఉన్నారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. హామీల అమలు జరిగే వరకు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెట్టి విజయ్‌కుమార్‌, నాగరాజు, నక్క రఘు, జగన్‌, మోహనాచారి, పర్వతాలు పాల్గొన్నారు.

నిమ్స్‌ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం



లక్డీకాపూల్‌ : నిమ్స్‌ ఆస్పత్రి అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ నగర బీరప్ప అన్నారు. ఉద్యోగుల అంకితభావం, చిత్తశుద్ధికి నిదర్శనమే క్లినిక్‌ దశ నుంచి యూనివర్సిటీ స్థాయికి దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. నిమ్స్‌లో శనివారం పదవీ విరమణ చెందిన పలువురు ఉద్యోగులను ఆయన ఘనంగా సత్కరించారు. పదవి విరమణ పొందిన వారిలో సీనియర్‌ ప్రొఫెసర్‌ డా. ఎర్లగడ్డ. జ్యోత్స్న రాణి ఎర్లగడ్డ, సీనియర్‌ నర్సింగ్‌ ఆఫీసర్స్‌ బొల్లా.చంద్ర లీలమ్మ, సలోవ.సరోజ, పొట్టి.బాల స్వరూపరాణి, డీపీఏ అల్లంపల్లి శ్రీనివాస్‌ రావు, టెక్నీకల్‌ ఆఫీసర్‌ జీ. గిరిజ మనోహర్‌ లు ఉన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌ మాట్లాడుతూ.. విధుల్లోకి చేరిన రోజున తన పదవి విరమణ తేదీ ఖరావుతుందని అందుకు అనుగుణంగానే ప్రతి ఒక్క ఉద్యోగి తమ ఉన్నతికి ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. అప్పుడు పదవి విరమణ పొందిన తర్వాత తమ శేష జీవితం ప్రశాంతంగా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్‌ రిజిస్టర్‌ డా. శాంతివీర్‌, సీనియర్‌ ప్రొఫెసర్లు డా.సాయి సతీష్‌, సూచందా, సాయిబాబా, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ సుజాత, పీఆర్వో అశలత, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు శాంతి, విజయ, సౌజన్య, భరత్‌ భూషణ్‌, శ్రీనివాసులు, మార్తా రమేష్‌, రాజ్‌ కుమార్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఉమేష్‌చంద్రను యువత ఆదర్శంగా తీసుకోవాలి

అమీర్‌పేట్‌: దివంగత ఐపీఎస్‌ ఉమేష్‌చంద్రను యువత ఆదర్శంగా తీసుకోవాలని డీజీ మహేష్‌ భగవత్‌ అన్నారు. దివంగత ఐపీఎస్‌ ఉమేష్‌ చంద్ర 59 జయంతి వేడుకులను పురస్కరించుకోని ఎస్‌ఆర్‌ నగర్‌లోని ఉమేష్‌ చంద్ర విగ్రహంకు మహేష్‌ భగవత్‌ పూలుమాళ వేసి నివాళులు అర్పించారు. ఉమేష్‌ చంద్ర మనమధ్యలేకపోయినా ఎప్పుడూ ప్రజల గుండెల్లో ఉంటారన్నారు.

హౌసింగ్‌ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌

సికింద్రాబాద్‌: సికింద్రాబాద్‌ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని హౌసింగ్‌ స్కీం కు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని సికింద్రాబాద్‌ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్‌ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని హౌసింగ్‌ స్కీంల పై శనివారం సీతాఫలమండీ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. లాలాపేటలో గతంలో నిర్మించిన ఇండ్లు శిథాలివస్థకు చేరుతున్న పరిస్థితిపై పద్మారావు గౌడ్‌ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రమాదకరంగా పరిణమించిన గృహనిర్మాణ ప్రాంగణాల్లో ప్రజలు నివసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయినగర్‌ నిర్మాణం పనుల్లో జాప్యం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా మరాఠా బస్తీ లో కొత్త ఇళ్ళను నిర్మించాలని, దోభీ ఘాట్‌, సుభాష్‌ చంద్ర బోస్‌ నగర్‌, ఆజాద్‌ చంద్ర శేఖర్‌ నగర్‌లలో లబ్ధిదారులకు ఇళ్ళు కేటాయించాలని సూచించారు. హమాలి బస్తీ లో వివాదాలు పరిష్కరించాలని, శాస్త్రి నగర్‌, లబ్ధిబస్తీల్లో శిథిల స్థితి చేరిన భవనాల పునర్నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. సికింద్రాబాద్‌ హౌసింగ్‌ సెల్‌ ఏఈ క్రాంతి, అధికారులు మల్లికార్జున్‌, కార్పొరేటర్లు సామల హేమ, లింగాని ప్రసన్న లక్ష్మి, రాసురి సునీత, కంది శైలజ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్‌ ప్రవీణ్‌ మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

లిబర్టీ: పాస్టర్‌ ప్రవీణ్‌ మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్‌ డిమాండ్‌ చేవారు. పాస్టర్‌ ప్రవీణ్‌ మృతిపై ఎన్నో అనుమానాలు ఉన్నాయని సమగ్ర విచారణ జరిపిస్తేనే వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాస్టర్‌ ప్రవీణ్‌ మృతి వెనుక మతోన్మాద శక్తుల కుట్ర ఉందన్న అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయన్నారు. నగరానికి చెందిన ప్రవీణ్‌ రాజమండ్రిలో అనుమానాస్పదంగా మృతి చెందారని దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంగళరావునగర్‌ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. షేక్‌ షరీఫ్‌ ఈ నెల 28న రాత్రి తన భార్యతో కలిసి చార్మినార్‌ వద్ద రంజాన్‌ షాపింగ్‌కు వెళ్లాడు. అర్ధరాత్రి ఇంటికి వెళ్తుండగా అమీర్‌పేట చౌరస్తా వద్దకు రాగానే ఇండస్‌ ఇండ్‌ బ్యాంక్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.సాయికృష్ణ మద్యంమత్తులో వేగంగా కారుతో వచ్చి షరీఫ్‌ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అకారణంగా మహిళపై దాడి

వెంగళరావునగర్‌ : అకారణంగా మహిళపై దాడి చేసిన ఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. చిన్నప్ప, డాక్టర్‌ ఎం.సుమన దంపతులు రహమత్‌నగర్‌లో ఉంటున్నారు. ఈ నెల 28న ఎయిర్‌టెల్‌ సర్వీస్‌మెన్‌ తన ఇంటికి వచ్చి ఇంటర్నెట్‌ కనెక్షన్‌ ఇస్తున్నాడు. ఇదే సమయంలో డాక్టర్‌ సుమన సోదరుడు కె.పి. కరుణాకర్‌ ఆమె ఇంటికి వచ్చి ఇంటర్నెట్‌ సర్వీస్‌ మెన్‌ను బెదిరించి, కేబుల్‌ను బయటకు విసిరేశాడు. తన మొబైల్‌ లాక్కుని కిందకేసి కొట్టాడు. ఆమె తల్లిదండ్రులు కూడా ఆమెతో పాటు భర్తను అకారణంగా దుర్భాలాడుతూ దాడి చేశారు. తమ తల్లిదండ్రులు, సోదరుడి నుంచి తమకు హాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పాత నేరస్థుడి అరెస్టు

పంజగుట్ట: దొంగతనం చేసేందుకు యత్నించిన పాత నేరస్థుడిని అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం .. అమీర్‌పేటలోని కమ్మసంఘం సమీపంలో నివసించే ఉషా శ్యామల అనే మహిళ ఇంట్లోకి శుక్రవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి ప్రవేశించాడు. శబ్దం కావడంతో ఆమె కేకలు వేయ్యడంతో స్థానికులు వచ్చి దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుడు దుబ్బాకకు చెందిన పర్ష వెంకట్రాములు (38) గా గుర్తించారు. ఇతడు పాత నేరస్థుడని, పలు దొంగతనాల కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపాడు.

నేడు, రేపు ఆస్తి పన్ను చెల్లించవచ్చు

సనత్‌నగర్‌: ఆస్తిపన్ను బకాయిదారులు పండగ రోజులైన ఆది, సోమవారాల్లో కూడా కూడా ఆస్తి పన్ను చెల్లించే వెసులుబాటు కల్పించినట్లు బేగంపేట సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ సమ్మయ్య తెలిపారు. ఈ నెల 30న (ఉగాది), 31న (రంజాన్‌) రెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్కిల్‌ కార్యాలయంలోని సిటిజన్‌ సర్వీస్‌ సెంటర్‌ తెరిచి ఉంటుందని, ఆస్తి పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలపారు.

‘బృహస్పతి’లో ఉగాది వేడుకలు



ఉగాది వేడుకల్లో ఉద్యోగులు

బంజారాహిల్స్‌: ప్రముఖ ఐటీ అండ్‌ ఈ–సెక్యూరిటీ సంస్థ బృహస్పతి టెక్నాలజీస్‌ లిమిటెడ్‌లో శనివారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. 200 మందికి పైగా ఉద్యోగులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని తెలుగుజాతి సంస్కృతిని ప్రతిబింబించారు. మామిడి ఆకులు, పువ్వులతో కార్యాలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఉద్యోగులందరూ ఉగాది పచ్చడిని ఆరగించారు. ప్రత్యేక వంటకాలను ఆస్వాదిస్తూ ఉగాది ప్రత్యేకతను గుర్తు చేసుకున్నారు. జీవితం పలు రుచులతో కూడినదని తెలియజేస్తూ ఈ విందు ఆనందాన్ని అందరితో పంచుకున్నారు. ఈ సందర్భంగా మేనేజింగ్‌ డైరెక్టర్‌ రాజశేఖర్‌ పాపోలు మాట్లాడుతూ.. సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవిస్తూ ఉగాది వేడుకలను జరుపుకుంటున్నట్లు చెప్పారు.





మార్కెట్లలో ఉగాది శోభ

ఉగాది సందర్భంగా మార్కెట్లలో కొనుగోళ్ల సందడి కనిపించింది. షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి చేసేందుకు కొత్త కుండలు కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపారు. మామిడి కాయలు, కొత్త చింత పండు, వేప పూత, పూలు, పండ్లు కొనుగోళ్లతో మార్కెట్లన్నీ కిటకిటలాడాయి. బంజారాహిల్స్‌, శ్రీనగర్‌ కాలనీ, పంజగుట్ట, ఖైరతాబాద్‌, ఫిలింనగర్‌, అమీర్‌పేట తదితర ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి విక్రయదారులు అమ్మకాలు జరిపారు.

–బంజారాహిల్స్‌

మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చింత భగవాన్‌ ప్రసాద్‌

పంజగుట్ట: మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని పలు మాదిగ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సీ, ఎస్టీ మేధావుల ఫోరం ఉపాధ్యక్షులు చింత భగవాన్‌ ప్రసాద్‌, ఓయూ జేఏసీ నాయకులు వేల్పుల సంజయ్‌, కాంగ్రెస్‌ ఎస్సీ సెల్‌ కన్వీనర్‌ హెచ్‌.ఆర్‌.మోహన్‌ మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రధానభూమిక పోషించింది మాదిగలే అన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో మాదిగలకు అన్యాయం జరిగిందని, మనువాద పార్టీ బీజేపీ పార్టీకి మాదిగలు దూరంగా ఉండి కేవలం కాంగ్రెస్‌ వల్లే న్యాయం జరుగుతుందని భావించి కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు.

హీరో ప్రభాస్‌ పీఆర్వోపై కేసు నమోదు


బంజారాహిల్స్‌: తనను చంపుతామని బెదిరించిన హీరో ప్రభాస్‌ పీఆర్వోగా చెప్పుకుంటున్న వ్యక్తిపై యూట్యూబర్‌ చేసిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్‌ రోడ్డు నెంబర్‌–44లో డయల్‌ న్యూస్‌ అనే యూట్యూబ్‌ ఛానల్‌లో విజయ్‌సాధు అనే జర్నలిస్టు అసోసియేట్‌ ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. తన డయల్‌ న్యూస్‌ ఛానల్‌లో ఈ నెల 4న హీరో ప్రభాస్‌కు మేజర్‌ సర్జరీ జరిగిందంటూ ఓ వీడియోను విజయసాధు పోస్ట్‌ చేశాడు. ఈ వీడియో వైరల్‌ అయ్యింది. మరుసటి రోజు సురేష్‌ కొండి అనే వ్యక్తి ఫోన్‌ చేసి తాను ప్రభాస్‌ పీఆర్వోనని పరిచయం చేసుకున్నాడు. డార్లింగ్‌ ఇన్‌ డేంజర్‌ అనే హెడ్డింగ్‌తో ప్రభాస్‌కు మేజర్‌ సర్జరీ జరిగిందంటూ, అనారోగ్యం బారిన పడ్డాడంటూ డయల్‌ న్యూస్‌ యూట్యూబ్‌లో పెట్టిన పోస్ట్‌కు ఏమైనా ఆధారాలు ఉన్నాయా? అని సురేష్‌ ప్రశ్నించాడు. వెంటనే ఆ వీడియోను డిలీట్‌ చేయాలని బెదిరిస్తూ అసభ్య పదజాలంతో దూషించాడు. అయితే ఈ వీడియోను విజయసాధు డిలీట్‌ చేయలేదు. దీంతో సురేష్‌ ఈ పోస్ట్‌ను ప్రభాస్‌ ఫ్యాన్స్‌కు పంపించాడు. ఈ పోస్ట్‌ చూసిన ప్రభాస్‌ అభిమానులు ఫోన్‌కాల్‌, ఎస్‌ఎంఎస్‌, వాట్సప్‌ మెసేజ్‌లలో విజయసాధును తీవ్రంగా దూషిస్తూ నిన్ను చంపేస్తాం..నీ ఆఫీసును తగలబెడతాం..అంటూ హెచ్చరించారు. అంతేకాకుండా ఈ నెల 6వ తేదీన ఉదయం 10 మంది యువకులు యూట్యూబ్‌ కార్యాలయానికి వచ్చి తాము ప్రభాస్‌ అభిమానులం అంటూ న్యూసెన్స్‌ చేయగా భయాందోళనకు గురైన విజయసాధు డయల్‌ 100కు ఫిర్యాదు చేశాడు. జూబ్లీహిల్స్‌ పోలీసులు అక్కడికి చేరుకుని అల్లరి మూకలను పంపించి వేశారు. న్యూసెన్స్‌కు కారణమైన సురేష్‌ కొండిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

హత్య చేసేందుకు ప్రయత్నించాడంటూ భర్తపై ఫిర్యాదు

బంజారాహిల్స్‌: తనను హత్యచేసేందుకు ప్రయత్నించాడంటూ భర్తపై భార్య జూబ్లీహిల్స్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. యూసుఫ్‌గూడ వెంకటగిరి శివస్‌ దివ్యహైట్స్‌లోని 603 ప్లాట్‌లో నివాసం ఉండే భోగి విక్రమ్‌, అభిజ్ఞలు భార్యాభర్తలు. అభిజ్ఞ ఈ నెల 7న అదే అపార్ట్‌మెంట్‌లో 607లో నివసించే తన స్నేహితురాలు కొండా అజనీప్రియ వద్దకు వెళ్లింది. అదే సమయంలో అభిజ్ఞ భర్త భోగి విక్రమ్‌ అక్కడకు వచ్చి అభిజ్ఞను బెడ్‌రూమ్‌లోకి లాక్కెళ్లి కొట్టడం ప్రారంభించాడు. ఆమె తలపై కొట్టడంతో కిందపడిపోయింది. అతడి బారి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ ఆమె జుట్టు పట్టుకుని లాగుతూ కొట్టాడు. ఆమె చున్నీని లాక్కొని మెడకు చుట్టి చంపడానికి ప్రయత్నించాడు. ఈ సంఘటనకు ప్రత్యక్ష సాక్షులుగా అభిజ్ఞ స్నేహితురాలు అంజన్‌ప్రియారెడ్డి, సోదరులు శేఖర్‌, లోకేషన్‌, పనిమనిషి ఉన్నట్లు ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

శరవేగంగా మల్కాజిగిరి స్టేషన్ పునరాభివృద్ధి

- పనులను పరిశీలించిన జీఎం అరుణ్‌కుమార్‌జైన్
- ఇప్పటి వరకు 70 శాతం పనులు పూర్తి
- అమృత్‌భారత్ పథకం కింద రీడెవలప్‌మెంట్



సాక్షి, సిటీబ్యూరో: మల్కాజిగిరి రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ శనివారం మల్కాజిగిరి స్టేషన్‌ను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, ఇతర సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు. 'అమృత్ భారత్ స్టేషన్ పథకం'లో భాగంగా ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలను అందజేసేందుకు సుమారు రూ. 27.61 కోట్ల వ్యయంతో మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ పునరాభివృద్ధిని చేపట్టారు. ఇప్పటివరకు 70 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ సంవత్సరంలోనే అన్ని పనులను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్ పునరాభివృద్ధిలో భాగంగా 12 మీటర్ల వెడల్పు గల ఫుట్‌ఓవర్ బ్రిడ్జితోపాటు లిఫ్టులు, ఎస్కలేటర్ల ఏర్పాటు పనులను జీఎం సమీక్షించారు. వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను సందర్శించి, అక్కడ అమ్ముతున్న వివిధ ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టిన చర్యలను గురించి అధికారులతో మాట్లాడారు.పునరాభివృద్ధి పనుల దృష్ట్యా ప్రయాణికుల భద్రతపైన దృష్టి సారించాలని చెప్పారు.

మల్కాజిగిరి స్టేషన్ పునరాభివృద్ధి ఎలా....

- ప్రవేశద్వారం వద్ద తగిన మార్పులు చేసి అందంగా తీర్చిదిద్దుతారు.
- 12 మీటర్ల వెడల్పు ఫుట్‌ఓవర్ బ్రిడ్జితోపాటు, 3 లిఫ్టులు, 3 ఎస్కలేటర్లు ఏర్పాటు చేయనున్నారు.
- ప్లాట్‌ఫామ్‌లు ఎత్తును పెంచి అదనపు కవర్ ఏర్పాటు చేస్తారు.
- టాయిలెట్ సదుపాయాలను మెరుగుపర్చడంతో పాటు దివ్యాంగుల కోసం ప్రత్యేక టాయిలెట్లను ఏర్పాటు చేస్తారు.
- మెరుగైన వెయిటింగ్ హాళ్లు, సర్క్యులేటింగ్ ప్రాంతంలో ల్యాండ్‌స్కేపింగ్, కళాత్మకంగా పరిసరాల ఏర్పాటు
- ప్రయాణికులను అనుకూలమైన సంకేతాలను అందించడం, రైలు సూచిక బోర్డులు, కోచ్ సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తారు.

ఇంట్లో ఉక్కపోత.. బయట ఎండదెబ్బ

రోజుకు 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలంటున్న వైద్యులు

- నగరంలో 40 డిగ్రీలకు చేరువలో వేసవి ఉష్ణోగ్రతలు
- పిల్లలు, వృద్ధులపై అధిక ప్రభావం చూపే అవకాశం
- మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ మేలు
- ఐస్, కూల్ డ్రింక్స్, ఫ్రైడ్ ఆహారానికి దూరంగా ఉండాలి



సాక్షి, సిటీబ్యూరో: వేసవి ఎండలు రోజురోజుకూ ముదురుతున్నాయి. పగటిపూట ప్రతాపం చూపుతున్నాయి. ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలు దాటి 40 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. ఇంట్లో కూర్చుంటే ఉక్కపోత, బయటకు వస్తే ఎండదెబ్బ అన్నట్లు తయారైంది పరిస్థితి. ఈ నేపథ్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీలైనంత వరకు ఎండలో తిరగడం మానుకోవడం మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు రావాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, ఎండలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. తగినంత నీరు తాగాలని, కీర, దోసకాయ, పుచ్చకాయ, పండ్లు, కూరగాయలు, సలాడ్స్, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్‌లు తీసుకోవడం మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

వడదెబ్బ లక్షణాలు..

వడదెబ్బకు గురైనప్పుడు శరీరంలోని నీటిస్థాయి తగ్గిపోయి గొంతు, నోరు, నాలుక పొడిబారుతుంది. మత్తుగా ఉంటుంది. కళ్లు తిరగడం, మసక బారడం, కాళ్లు, చేతులు లాగుతాయి. జ్వరం వస్తుంది. విరోచనాలు, వాంతులు, డయేరియా లక్షణాలు కనిపిస్తాయి. 4 నుంచి 5 గంటలపాటు మూత్రం రాకపోవడం, విపరీతమైన చెమట పట్టడం, చర్మం పొడిబారిపోవడంతోపాటు అంతా గందరగోళంగా ఉంటుంది. చర్మ సంబంధిత రుగ్మతలు వచ్చే అవకాశం ఉంటుంది. గతేడాది ఏప్రిల్, మే నెలల్లో హైదరాబాద్‌లో 600లకుపైగా వడదెబ్బ కేసులు నమోదయ్యాయని నివేదికలు చెబుతున్నాయి. వాస్తవానికి ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందనే వాదనలు ఉన్నాయి.

ఆహారపు అలవాట్లపై జాగ్రత్త

వేసవిలో ఆరోగ్యంపట్ల చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. నూనె వస్తువులు, పానీ పూరీ, ఫాస్ట్‌ఫుడ్, ఫ్రైడ్, మసాలా ఆహారానికి, కూల్‌డ్రింక్స్, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలి.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..



వేసవిలో సాధారణ వ్యక్తులు రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి. ఎండలో పనిచేసే వారు ఇంకా ఎక్కువ తీసుకోవాలి. కాటన్, వదులుగా ఉన్న దుస్తులు ధరించాలి. బయటకు వెళ్లే సమయంలో గొడుగు, టోపీ, మంచినీళ్లు వెంట తీసుకెళ్లాలి. ఎండలో ప్రయాణించే సమయంలో రక్షణనిచ్చే కళ్లద్దాలు ధరించడం మంచిది. ఇంట్లో కిటికీలకు పరదాలు వేసుకుని, గాలి ఆడే విధంగా ఏర్పాటు చేసుకోవాలి. వేడిగాలులకు దూరంగా ఉండాలి. ఈ ఎండలు చిన్నపిల్లలు, వృద్ధులపై అధిక ప్రభావం చూపిస్తాయి. కిడ్నీ, గుండె, సమస్యలు, బీపీ, షుగర్, నరాలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు నిపుణుల సూచనల మేరకు నడుచుకోవాలి. ఇంట్లో ఏసీ ఉపయోగించే సందర్భంలో కనీసం 25 డిగ్రీల్లో పెట్టుకుంటే మంచిది. మరీ తక్కువ ఉష్ణోగ్రత పెట్టుకుని, బయటకు వెళ్లినప్పుడు 40 డిగ్రీల వేడిమికి శరీరం తట్టుకోలేదు. కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా, వైరల్, హెపటైటిస్ వంటివి వచ్చే ప్రమాదం ఉంది. ఓఆర్ఎస్ పౌడర్ కలిపిన నీరు రోజుకు ఒక లీటరు తీసుకుంటే మంచిది. వడదెబ్బ తగిలిన వ్యక్తిని తక్షణం నీడకు తీసుకెళ్లి, గాలి ఆడే విధంగా ఏర్పాటు చేయాలి. తర్వాత సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించాలి.

– ప్రొ.ఎల్.సునీల్ కుమార్, మెడిసిన్ విభాగం హెచ్‌వోడీ, గాంధీ ఆసుపత్రి

ఆర్టీసీ హమాలీల కూలీరేట్లు పెంచాలి

- కనీస సౌకర్యాలు కల్పించాలని
- బస్సు భవన్ ముందు బైటాయింపు



బస్ భవన్ ముందు ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధి బృందం

ముషీరాబాద్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆర్టీసీలో హమాలీల కూలీరేట్లను బస్తా ఒక్కంటికి 15 రూపాయలకు పెంచాలని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం టీజీఎస్ఆర్టీసీ లైసెన్సు రిపోర్టర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లోని బస్ భవన్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో పది రూపాయలు ఉన్న బస్తా రేటును ఐదు రూపాయలకు తగ్గించారని అన్నారు. ఆర్టీసీలో ప్రయాణికులతోపాటు కార్గో ద్వారా ఆర్టీసీకి అనేక లాభాలు వస్తున్నా కూలీరేట్లు మాత్రం సగాని సగం తగ్గించారని విచారం వ్యక్తం చేశారు. వందలాది మంది హమాలీ పోర్టర్లు సీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని బస్టాండ్లలో ప్రయాణికుల సరుకుల్ని రవాణా చేసేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఏఎన్ఎల్ లాంటి ప్రైవేట్ సంస్థల్లో కూడా రెండేళ్లకు ఒకసారి కూలీరేట్లు పెంచేవారని, కార్పొరేషన్ ద్వారా నడుస్తున్న కార్గోలో మాత్రం శ్రమదోపిడి సాగుతోందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ మాట్లాడుతూ హమాలీలకు రెండేళ్ల ఒకసారి 20 శాతానికి తగ్గకుండా కూలీ రేట్లు పెంచాలని, ప్రతి కార్మికుడికి రెండు జతల యూనిఫాం సంస్థ ద్వారా ఇప్పించాలన్నారు. డిపోలలో కార్మికులకు రెస్టు రూమ్‌లు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ ఆసుపత్రిలో వైద్య సదుపాయం కల్పించేవిధంగా హెల్త్ కార్డులు ఇవ్వాలని, పోర్టర్స్‌కు, వారి కుటుంబాలకు ఆర్టీసీలో ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రతినిధి వర్గం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, యూనియన్ ఉపాధ్యక్షులు జి.దాసు, వి.పోచయ్య, కె.కొండయ్య, ధశరథ్, చంద్రమౌళి, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కళాకారుడు రాబిన్ డేవిడ్ తయారు చేసిన స్కల్ప్చర్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో ఉగాది, రంజాన్ ఉత్సవాలు ఉదయం 11.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- హ్యాండ్‌లూమ్ ఇండియా ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు సిల్క్ మార్క్ ధ్రువీకృత సిల్క్‌ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హై లైఫ్ సమ్మర్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

శ్రమదోపిడీని అరికట్టాలి

- ఇందిరాపార్క్ వద్ద ఓలా, ఊబర్, ర్యాపిడో క్యాబ్ డ్రైవర్ల ధర్నా



ఇందిరాపార్కులో ధర్నా చేస్తున్న క్యాబ్ డ్రైవర్లు

కవాడిగూడ: రవాణ రంగ యాప్ సంస్థలైన ఓలా, ఊబర్, రాపిడో సంస్థల్లో శ్రమదోపిడీని అరికట్టాలని క్యాబ్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు కె.సతీష్ కుమార్, బత్తుల ప్రసాద్ రవాణా శాఖ అధికారులను డిమాండ్ చేశారు. క్యాబ్ డ్రైవర్లను దోపిడీ చేయడాన్ని నిరసిస్తూ శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రవాణా చట్టాలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్న ఇతర రాష్ట్రాల ట్యాక్సీ ప్లేట్ వాహనాలపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రవాణా యాప్ సంస్థలు క్యాబ్‌డ్రైవర్ల నుంచి వసూలు చేస్తున్న కమీషన్‌ను తగ్గించాలన్నారు. ఓలా, ఊబర్, రాపిడో సంస్థలు డ్రైవర్‌కు సమాచారం లేకుండా, ఎంక్వయిరీ లేకుండా ఐడీని బ్లాక్ చేయడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల క్యాబ్‌ల వల్ల తెలంగాణ డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ విషయంపై పలు మార్లు రవాణా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. రవాణా చట్టాలను ఉల్లంఘించి వైట్ ప్లేట్ కార్లు, బైక్‌లు పబ్లిక్ ట్రాన్స్‌పోర్టులో భాగస్వామ్యం కావడంతో ఆటో, క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈఎంఐలు కట్టలేక అనేక మంది డ్రైవర్లు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రవాణా రంగ యాప్‌లపై నియంత్రణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఉలవల సాగర్, పి.వినోద్, ఎం.సాయికిరణ్, గంగాధర్, బానోతు రమేష్, హనుమంతు, బాబ్జీ, శ్రీకాంత్, చిలుక రాజు, జి.ప్రభాకర్, జానయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో బదిలీలు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో పలువురు సీనియర్ ప్రొఫెసర్లను వివిధ విభాగాలకు డైరెక్టర్లుగా నియమిస్తూ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ టి. కిషన్‌కుమార్ రెడ్డి శనివారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డిప్యూటేషన్‌పై డాక్టర్ జె.సురేష్ కుమార్‌ను నియమించగా, అక్కడ పనిచేస్తున్న డాక్టర్ ప్రభాకర్‌ను జగిత్యాల కళాశాల ఈసీఈ విభాగం అధిపతిగా నియమించారు. యూనివర్సిటీ పరీక్షల విభాగం డైరెక్టర్‌గా మెకానికల్ ఇంజనీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ జి.కృష్ణ మోహన్‌రావును నియమించగా, అక్కడ పనిచేసిన ప్రొఫెసర్ అరుణ కుమారిని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి పంపారు. మరో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ బి.బాలు నాయక్‌ను అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్‌గా, డాక్టర్ ఎ. చెన్నకేశవరెడ్డిని ఇన్నోవేటివ్ లెర్నింగ్ అండ్ టీచింగ్ విభాగం డైరెక్టర్‌గా, డాక్టర్ భ్రమరను యూనివర్సిటీ అలుమ్ని వ్యవహారాల డైరెక్టర్‌గా నియమించారు. డాక్టర్ ఎం.నాగరత్నను పరీక్షల విభాగం కంట్రోలర్‌గా నియమించగా, అక్కడ పనిచేస్తున్న డాక్టర్ సాహు చక్రవర్తిని కంప్యూటర్ సైన్స్ విభాగానికి బదిలీ చేశారు.

పాస్టర్ ప్రవీణ్ హత్యోదంతంపై సీబీఐ విచారణ జరిపించాలి

రిటైర్డ్ ఐపీఎస్ బాబూరావు డిమాండ్

పంజగుట్ట: ఇటీవల అనుమానాస్పద మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సీబీఐతో విచారణ జరిపించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పలు క్రైస్తవ సంఘాలు, కావేటి ఇంటర్నేషనల్ లా ఫర్మ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి బాబూరావు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మరణంపై ఎన్నో అనుమానాలు ఉన్నాయని, కొంతకాలం నుంచి ఆయనకు విపరీతంగా బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, 95 శాతం మంది ఇది హత్యే అని భావిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన బయలుదేరిన దగ్గరి నుంచి ఘటన జరిగినచోటు వరకు సీసీ ఫుటేజీలు పరిశీలించాలని, గత కొంతకాలంగా ఎవరితో మాట్లాడుతున్నాడు, ఘటన జరిగిన రోజు ఎవరు ఫోన్ చేశారో తెలుసుకోవాలని సూచించారు. మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్‌కు ఇద్దరు బిడ్డలు, మరో 12 మంది పిల్లల్ని చదివిస్తున్నారని, ఇప్పుడు ఆ 14 మంది పిల్లల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన చర్చ రెండు వర్గాలకు, సమాజానికి వ్యాపిస్తోందని ఇది సరికాదన్నారు. బీఆర్ఎస్ నాయకుడు విజయ్ ఆర్య మాట్లాడుతూ ఏ మతగ్రంథం ఒకరి మీద దాడి చేయాలని చెప్పలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎన్నికలకు ముందు ఒకలా ఉన్నారని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఓట్లతో అధికారంలోకి రాగానే రూపం మార్చారని కొంతమందిని రెచ్చగొడుతూ వారిని దాడులకు ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో కావేటి లా ఫర్మ్ ప్రతినిధి రాజేందర్, సాల్మన్ రాజు, గ్లోరియ, గోనె సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

రాష్ట్ర అటవీశాఖ ముఖ్య సంరక్షణ అధికారి ఎల్యూసింగ్ మేరు



శిక్షణ ప్రతిభ కనబరిచిన వారికి పతకాలు, సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎల్యూసింగ్ మేరు

సుభాష్‌నగర్: అటవీ భూములు, సంపదను పరిరక్షించడంలో బీట్, సెక్షన్ అధికారులు కీలకంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రధాన అటవీ ముఖ్య సంరక్షణ అధికారి ఎల్యూసింగ్ మేరు అన్నారు. దూలపల్లిలోని రాష్ట్ర అటవీ అకాడమీలో 36వ బ్యాచ్ శిక్షణ అటవీ బీట్ అధికారుల ప్రవేశ శిక్షణ కార్యక్రమం, 7వ బ్యాచ్ అటవీ సెక్షన్ అధికారుల ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమాల ఉమ్మడి స్నాతకోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ, వన్యప్రాణి రక్షణకు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. పరిస్థితుల నుంచి కొత్త విషయాలను నేర్చుకుంటూ వృత్తిని సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. మొత్తం 58 మంది బీట్ అధికారులు శిక్షణ పొందగా, వారిలో 19 మంది మహిళా అధికారులు ఉన్నారు. 32 మంది అటవీ సెక్షన్ అధికారులు శిక్షణ పొందగా, వారిలో ఏడుగురు మహిళా అధికారులు ఉన్నారు.

పతకాల ప్రదానం..

శిక్షణలో ప్రతిభ కనబరిచిన అధికారులకు బంగారు పతకాలు, ప్రతిభా పత్రాలను అందజేశారు. బీట్ అధికారుల శిక్షణలో గూడూరు వన్యప్రాణి అటవీ డివిజన్‌కు చెందిన టి.శిరీష, కిన్నెరసాని డివిజన్‌కు చెందిన కృష్ణ చైతన్య రెండు చొప్పున బంగారు పతకాలను సాధించారు. రాజేశ్వర్ రావు, సుశీల్ కుమార్, నవీన్ కుమార్, మహేందర్ సింగ్, ఐలయ్య ఒక్కో బంగారు పతకం పొందారు. మారథాన్ పరుగు పందెం మహిళల విభాగంలో మహేశ్వరి, పురుషుల విభాగంలో శ్రీనాథ్ పతకాలను సాధించారు. సెక్షన్ అధికారుల్లో కరీంనగర్–రాజన్న సిరిసిల్ల అటవీ డివిజన్‌కు చెందిన రంజిత్ కుమార్ ఐదు బంగారు పతకాలు, కిరణ్ కుమార్, వాసవి మూడు చొప్పున, శాలిని, మంజుల, అర్చన రెండేసి, జర్నప్ప, సతీష్ కుమార్, విజయ్ భాస్కర్ రెడ్డి ఒక్కో బంగారు పతకాలను సాధించారు. కార్యక్రమంలో అటవీ అకాడమీ సంచాలకులు, ఎస్.జె.ఆశా, అటవీ అకాడమీ అదనపు సంచాలకులు ఎస్.రమేష్, డిప్యూటీ డైరెక్టర్లు పి.సాగర్, వేంకటేశ్వర రావు, శ్రీనివాస్, సెక్షన్ అధికారుల శిక్షణ కోర్స్ డైరెక్టర్, సీహెచ్ గంగారెడ్డి, బీట్ అధికారుల కోర్స్ డైరెక్టర్ సి.హెచ్.కృష్ణప్రసాద్, రేంజ్ అధికారులు స్వరూప రాణి, వంశీకృష్ణ, సుభాష్‌చంద్రయాదవ్, రామ్మోహన్, ఫిజికల్ ట్రైనర్స్ కొండల్ రావు, రఫీ ఉల్లా, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ నాటికి పాఠశాలలకు యూనిఫాంలు

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రతి విద్యార్థికి నూతన యూనిఫాం అందించాలి
- విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాల రీ ఓపెనింగ్ రోజున ప్రతి విద్యార్థి స్కూల్ యూనిఫామ్స్ తో పాఠశాలలకు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ చంద్రకాంత్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 772 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 1,03,912 మంది విద్యార్థిని విద్యార్థులకు రెండు జతలు చొప్పున స్కూల్ యూనిఫాంలు నిర్దేశించిన సమయం నాటికి అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముందుగా హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ అధికారులు నాణ్యమైన క్లాత్‌ను ఏప్రిల్ 3 నుంచి 5 వరకు విద్యాశాఖకు అందించాలని సూచించారు. జిల్లాలోని మండలాల వారీగా స్వయం సహాయక సంఘాలకు స్కూల్ యూనిఫాంలు కుట్టేందుకు సంఘాలకు అప్పగించాలని, విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. గత సంవత్సరం స్వయం సహాయక సంఘాలకు యూనిఫామ్స్ కుట్టు చార్జీలు రూ.కోటి 50 లక్షలు చెల్లించినట్లు తెలిపారు.. పాఠశాలల రీ ఓపెనింగ్ సమయం ఇంకా రెండు నెలల సమయం ఉన్నందున స్వయం సహాయక నైపుణ్యత గల టైలర్లతో సంఘాలకు యూనిఫామ్ ల కటింగ్, కుట్టుపై శిక్షణ ఇప్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఈవో ఆర్.రోహిణి, వివిధ శాఖల సంక్షేమ అధికారులు డిప్యూటీ డీఈఓలు, డీపీఓలు, జీహెచ్ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరో నామినేషన్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల్లో శనివారం ఒక నామినేషన్ దాఖలైంది. ఇండిపెండెంట్ అభ్యర్థిగా కంటె సాయన్న నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఇప్పటి వరకు ఇద్దరు ఇండిపెండెంట్లు నామినేషన్లు దాఖలు చేశారు.

రైల్వే ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ

అంబర్‌పేట: రైల్వేలో ఉద్యోగాలు సాధించాలనుకునే నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ గ్రీన్‌ల్యాండ్స్ సంస్థలు సంయుక్తంగా ముందుకు వచ్చాయి. ఈ మేరకు ఆయా సంస్థల ప్రతినిధులు గద్దె భాస్కర్, ముప్వ రాంరెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మీకుమారిలు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రైల్వేలో ఉద్యోగం పొందడానికి నిరుద్యోగులకు 3–4 నెలల పాటు అన్ని విధాలా తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉచిత శిక్షణ పొందగోరే నిరుద్యోగ యువతకు ఏప్రిల్ 5వ తేదీన అర్హత పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన నిరుద్యోగులకు ఉచిత భోజనం, వసతి, కోచింగ్ ఇస్తామని చెప్పారు. శ్రీధర్ సీసీఈ ఇన్స్టిట్యూట్ సహకారంతో ఉత్తమ శిక్షణ అందిస్తామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో అర్హత రాత పరీక్షను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ముందస్తుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఆయా సంస్థల వెబ్‌సైట్‌లను సందర్శించాలని తెలిపారు.

మార్కెట్లకు ఉగాది శోభ

సాక్షి, సిటీబ్యూరో: నగర మార్కెట్లలో తెలుగు నూతన సంవత్సరం ఉగాది శోభ కనిపిస్తోంది. మామిడి కాయలు, మామిడి కొమ్మలు, పూలు, వేప పువ్వు, ఇతర పూజా సామగ్రిని వ్యాపారులు పెద్ద ఎత్తున తీసుకొచ్చారు. మార్కెట్‌లో చామంతి, బంతి, గులాబీ, ఇతర పూల ధరలు సమారుగా కిలోకి రూ.30 నుంచి రూ.50 వరకు పెరిగాయి. ఉగాది అంటేనే మామిడి, వేపపువ్వు. దీంతో శనివారం సాయంత్రం మార్కెట్లు, వీధులు, రహదారులకు ఇరువైపులా తోపుడు బండ్లపై సైతం ఉగాది సంబంధించిన సామగ్రి దర్శనమిచ్చాయి. మామిడి కాయలు చిన్న పాటి నుంచి సాధారణ సైజు నుంచి రూ.15 నుంచి రూ.20 వరకు పలుకుతున్నాయి. వేప పువ్వులు కనీసం రూ.10 అమ్ముతున్నారు. గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌కు పెద్ద ఎత్తున పూలు వచ్చాయి. కోహెడ మార్కెట్‌కు మామిడి కాయలు పోటెత్తాయి. ఆంధ్ర, కర్ణాటక నుంచి మామిడి కాయలు వచ్చాయి.

జలమండలిని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



ట్రైనీ ఐఏఎస్ బృందానికి బోర్డు వివరాలు వివరిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రానికి కేటాయించిన 2023 బ్యాచ్‌కు చెందిన ఏడుగురితో కూడిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం జలమండలిని సందర్శించింది. ఒకరోజు ఓరియెంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ లో భాగంగా శనివారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి విచ్చిన సందర్భంగా జలమండలి ఎండీ అశోక్ రెడ్డి బోర్డు పనితీరు, నగరానికి నీటి సరఫరా, ఎస్టీపీలు, మురుగు శుద్ధి నిర్వహణతోపాటు భవిష్యత్తు ప్రణాళికలు, ప్రాజెక్టుల గురించి వారికి వివరించారు. కోటి 30 లక్షలకుపైగా జనాభా ఉన్న హైదరాబాద్ మహా నగరానికి భారీ పైపులైన్ల ద్వారా మంచి నీరు సరఫరా చేస్తున్న పద్ధతిని తెలిపారు. దీంతోపాటు నీటిశుద్ధి, వివిధ దశలలో నీటి శుద్ధీకరణ జరిగే ప్రక్రియ, క్లోరినేషన్, తుది దశగా హైదరాబాద్‌కు భారీ మోటార్లతో పంపింగ్ వంటి అంశాల గురించి వివరించారు. నగర ప్రజలకు సుదూర ప్రాంతాల నుంచి సరఫరా చేసే విలువైన నీటిని వృథా చేయకుండా జలమండలి ఎప్పటికప్పుడు చేపట్టే అవగాహన కార్యక్రమాల్ని వివరించారు. వాన నీటి సంరక్షణ పద్ధతులను వివరించే థీమ్ పార్కును జలమండలి నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ థీమ్ పార్కులో భవిష్యత్తు తరాలకు వాన నీటిని ఎలా ఒడిసి పట్టాలో తెలిపే వివిధ పద్ధతుల్ని ఉన్నట్లు వివరించారు. వీటితో పాటు రాబోయే 25 ఏళ్లలో చేపట్టే భవిష్యత్తు కార్యాచరణ గురించి కూడా తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్.. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లతో వేసవిలో హైదరాబాద్‌లో తాగునీటి ట్యాంకర్ బుకింగ్ సరళి.. డెలివరీ వివరాలతోపాటు గత ఏడాది కంటే 60 శాతం పెరిగినా 98 శాతం ట్యాంకర్లను 24 గంటల్లో డెలివరీ చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్, ఆపరేషన్స్–1 డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, సీజీఎం (పీ అండ్ ఏ) మహ్మద్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలను బతకనిద్దాం: అమల

మణికొండ: మూగజీవాలను ప్రతి ఒక్కరూ ప్రేమించాలని, వాటికి మనతోపాటు జీవించే హక్కు ఉందని సినీనటి, బ్లూక్రాస్ సొసైటీ వ్యవస్థాపకురాలు అక్కినేని అమల అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో డబ్ల్యూ 3 గ్లోబల్ ఆర్గనైజేషన్‌తో కలిసి వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూగజీవాలు విశ్వాసం, ప్రేమతో ఉంటాయన్నారు. కుక్కలను మనం ఏమైనా అంటేనే మనల్ని అవి కరుస్తాయని, వాటికి హాని చేయకపోతే అవి అందరితో బాగుంటాయని అన్నారు. వీధి కుక్కలు కరిచినా ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఇలాంటి వ్యాక్సినేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, ఏఈ సంజయ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసుల జులుం

దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు



రాయదుర్గం: హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసుల జులుం చేశారని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ప్రధాన ద్వారం వద్ద హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విషయం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకొని దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట చేసుకుంది. ఈ సమయంలో కొందరు విద్యార్థులు స్పృహ తప్పిపోయారని విద్యార్థి సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు యూనివర్సిటీ భూములపై, నిరసన తెలిపిన విద్యార్థులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని అడ్డుకోవడం విడ్డూరమన్నారు. సీఎం స్థానంలో ఉండే వ్యక్తి విద్యార్థులను గుంట నక్కలుగా అభివర్ణించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంత కుట్రలు పన్నినా విద్యార్థులు వెనకడుగు వేసే ప్రయత్నం చేయద్దని, సమిష్టి ఐక్యతతో దిష్టిబొమ్మ దహనం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఉమేష్ అంబేద్కర్, కార్యదర్శి నిహాద్, ఉపాధ్యక్షుడు ఆకాష్, సహాయ కార్యదర్శి . త్రివేణి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం, 30, మార్చి, 2025

ఉగాది పచ్చడి, పిండివంటలు చేసుకోవాలంటే.. ముందురోజే మార్కెట్‌కి వెళ్లాలి.. అవసరమైన దినుసులు, సరంజామా అన్నీ కొని తెచ్చుకోవాలి. పూలు, మామిడి ఆకులతో ఇంటికి తోరణాలు కట్టి అలంకరించుకోవాలి.. ఇలా అన్ని రకాలుగా పండుగ చేసుకోవాలి.. ఇదంతా ఇంటిపట్టున ఉండడం వీలైన వారికేమో గానీ.. వారం అంతా పనిచేసి నీరసించిపోయి వారాంతంలో విశ్రాంతి తీసుకోవాలని అనుకునేవారికి మాత్రం పండుగ పనులు సహనానికి పరీక్ష అనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలోనే నగరంలోని పలు రెస్టారెంట్లు పండుగ సందడి అందించే బాధ్యతను స్వీకరిస్తున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో



పండుగ.. పసందుగా..

వారాంతపు విశ్రాంతితో పాటు పండుగ సందడి

- నగరవాసులను ప్రత్యేక మెనూలతో ఆహ్వానిస్తున్న రెస్టారెంట్లు
- ఉగాది పచ్చడి, చక్కెర పొంగలి, భక్షాలతో మెనూ సిద్ధం
- తెలుగు సంవత్సరాది రోజున అచ్చ తెలుగు రుచుల ఆస్వాదన
- సంప్రదాయ వంటకాలతో నోరూరిస్తున్న నిర్వాహకులు

సాధారణ సమయాల్లో పెద్ద పెద్ద రెస్టారెంట్లలో కన్పించని పిండివంటలు, సంప్రదాయ వంటకాలు పండుగ సందర్భాల్లో మాత్రమే దర్శనమిస్తాయి. పరమాణ్ణం, పులిహోరా, పూర్ణాలు, గారెలు, బూరెలు తదితర సంప్రదాయ రుచులను ఆస్వాదించడానికి పండుగలు మంచి అవకాశం అనే చెప్పాలి. సరిగ్గా అలాంటి అవకాశాన్నే కలిపిస్తున్నాయి నగరంలోని పలు రెస్టారెంట్లు.. అలాంటి వాటిల్లో కొన్ని..

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నోవోటెల్ విలాసవంతమైన బ్రంచ్‌తో ఉగాదిని ఆస్వాదించమని ఆహ్వానిస్తోంది. ఇందులో భాగంగా మసాలా గారెలు, మామిడికాయ పులిహోర వంటి రుచికరమైన పండుగ వంటకాలతో పాటు పూర్ణాలు, పూతరేకులు వంటి డెజర్ట్‌లకూ స్థానం కల్పించారు. గోంగూర మాంసం, హైదరాబాద్ చికెన్ బిర్యానీ, నాటు కోడి పులుసు దిబ్బరొట్టితో కూడిన రాగి సంకటి వంటి వాటిని లైవ్ ఫుడ్ స్టేషన్స్ ప్రదర్శిస్తాయి. బ్రంచ్‌లో థాయ్ కూరలు, గౌర్మెట్ పిజ్జాలు, పాస్తా లైవ్ స్టేషన్‌లు వంటి గ్లోబల్ డిలైట్‌లు కూడా అందుబాటులో ఉంచనున్నారు.

- నగరంలోని నియో–తెలంగాణ వంటకాల రెస్టారెంట్ అయిన టెరాయ్, తమ మొట్ట మొదటి ఉగాది తెలంగాణ భోజనం అనుభూతిని అందిస్తోంది. స్వాగత పానీయాలుగా పానకం మజ్జిగతో ఇది ప్రారంభమవుతుంది. సాంప్రదాయ ఉగాది పచ్చడి సరేసరి. స్టార్టర్స్‌లో వంకాయ్ బజ్జీ (వంకాయ వడలు) పెసర పప్పు గారెలు (మూంగ్ పప్పు వడలు) ఉన్నాయి. ప్రధాన కోర్సులో మామిడికాయ పప్పు, ఆలుగడ టొమాటో కూర, అరటికాయ ఫ్రై, వంకాయ మసాలా, వివిధ రకాల చట్నీలు, ఊరగాయలు ఉన్నాయి. జొన్న రొట్టె, పూరీ, చపాతీ, స్టీమ్డ్ రైస్, పులిహోర (చింత పండు అన్నం), కోబరి అన్నం, దద్దోజనం (పెరుగు అన్నం) తోడుగా ఉంటాయి. డెజర్ట్‌లలో పెసర బక్షాలు/కొబ్బరి బక్షాలు (తీపి సగ్గుబియ్యం), ఫ్రూట్ కస్టర్డ్ పరమాన్నం (తీపి అన్నం పుడ్డింగ్) ఉన్నాయి.



- గచ్చిబౌలిలోని షెరటాన్ హైదరాబాద్ హోటల్ స్పెషాలిటీ రెస్టారెంట్–ఫీస్ట్‌లో పండుగ ఆదివారం బ్రంచ్ అందిస్తోంది. ఉగాది పచ్చడి, పులిహోర, గారెలు, అన్నం పాయసం, వడపప్పు పానకం వంటివి అందుబాటులో ఉన్నాయి.
- మాదాపూర్‌లోని మైండ్‌స్పేస్‌లో ఉన్న వెస్టిన్ హైదరాబాద్‌లో సీజనల్ టేస్ట్స్ రెస్టారెంట్.. పండుగ బ్రంచ్‌తో ఆహ్వానిస్తోంది. పులిహోర, పొంగలి, పులోచారి బిర్యానీ, ఆమ్ పన్నా, గారెలు, క్రిస్పీ బజ్జీలు వంటివాటితో పాటు ఉగాది పచ్చడిని కలిగి ఉండే ప్రత్యేక మెనూ రూపొందించింది.
- నగరంలోని జూబ్లీహిల్స్‌లో ఉన్న సింప్లీ సౌత్ బై చెఫ్ చలపతిరావు తమ ప్రసిద్ధ థాలీతో ఉగాదిని జరుపుతోంది. వీరి మెనూలో ఉగాది పచ్చడి, మామిడికాయ పప్పు, పూర్ణాలు, చక్కెర పొంగలి, మినప గారెలు, వాము పూరీ వగైరా వంటకాలు అందుబాటులో ఉన్నాయి.



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శిల్పారామంలో ఉగాది వసంతోత్సవాలు

మాదాపూర్ : కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఉగాది వసంతోత్సవాలను శనివారం నిర్వహించారు. మోతలి పద్మప్రియ శిష్యబృందం ఉగాది పండుగను పురస్కరించుకుని రుతువులు, రాశులు, కోకిల రాగాలు, వసంతానికి సంబంధించిన పాటలను ఆలపించి ఆకట్టుకున్నారు. వీరికి వల్లీదేవసేన, కళ్యాణి, ఫణిశ్రీ, విజయలక్ష్మి గాత్ర సహకారం అందించారు. కీబోర్డు వెంకటశాస్త్రి, తబలా శ్రీనివాస్‌లు సంగీత సహకారాన్ని అందించారు. ప్రసన్న మోహన్ శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శన అలరించింది. ఇందులో పుష్పాంజలి, వర్ణం, ఆనందతాండవం, చారుకేశ కీర్తన, ఇట్టి ముద్దులాడి, దేవిస్తుతి, షియాన్ స్తుతి తదితర అంశాలను హాసిని, గాయత్రి, తరుణి, శ్రీవల్లి, గౌరి, ప్రణవి, ఆశ్రిత, హన్విత, వైశాలి, రూపశ్రీ , సంజన, శ్రీప్రియ తదితరులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి నాట్యగురువు కిరణ్మయి ముఖ్య అతిథులుగా విచ్చేసి కళాకారులను అభినందించారు.



అదితిరావ్ హైదరి ఫెస్టివ్ కలెక్షన్స్ విడుదల

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ దుస్తుల బ్రాండ్ తన పండుగ ప్రత్యేక దుస్తుల శ్రేణిని రూపొందించింది. దీనిని బ్రాండ్ అంబాసిడర్ హోదాలో ప్రముఖ నటి అదితిరావ్ హైదరి లాంఛనంగా నగర మార్కెట్‌లోకి విడుదల చేశారు. కలెక్షన్స్‌లో భాగమైన ప్రత్యేక గుల్‌ఖేరా శారీ తదితర వెరైటీలు బంజారాహిల్స్‌లోని తమ స్టోర్‌లో అందుబాటులో ఉన్నాయని ఆ బ్రాండ్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు.



రీఛార్జ్.. రీస్టార్ట్..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హైటెక్ సిటీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న క్వాలిజీల్ టెక్నాలజీ కంపెనీ.. నగరంలో కేపబులిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ విషయాన్ని సంస్థ సహవ్యవస్థాపకులు మధుమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సెంటర్‌లో 850 మంది ఉద్యోగులను నియమిస్తున్నామన్నారు. వ్యక్తిగత కారణాలతో ఉద్యోగ కెరీర్‌కు విరామం ఇచ్చే మహిళా నిపుణులను మళ్లీ వర్క్‌ఫోర్స్‌లోకి ప్రవేశించడాన్ని ప్రోత్సహిస్తూ రీస్టార్ట్ విత్ క్వాలిజీల్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించామని, దీనిలో భాగంగా సదరు మహిళలు ఎదుర్కొనే సవాళ్లను అధిగమించేందుకు తోడ్పడడం.. తాజా నైపుణ్యాలతో వారిని సన్నద్ధం చేయడం.. తదితర లక్ష్యాలతో ఈ కార్యక్రమం రూపొందిందన్నారు. వ్యక్తిగత జీవితాన్ని సమతుల్యం చేసుకుంటూ కార్పొరేట్ పాత్రల్లోకి తిరిగి సాఫీగా మారేలా మార్గదర్శకత్వం అందిస్తామన్నారు.

బ్యూటీఫుల్

స్ట్రాంగ్..షో

టైటిల్ కోసం 50 మంది ఫైనలిస్ట్‌లు



వయసులకు అతీతంగా అందంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించిన మహిళలు భేష్ అనిపించుకున్నారు. నగరంలోని టీ హబ్‌లో శనివారం నిర్వహించిన మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ బ్యూటీఫుల్ గ్రాండ్ ఫినాలే ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ పోటీలో యువతులతో పాటు వివాహిత మహిళలు సైతం క్యాట్‌వాక్‌తో కనువిందు చేశారు. వైద్యులు, కార్పొరేట్ ఉద్యోగులు, ఫ్యాషన్ డిజైనర్లు, ఔత్సాహిక మోడళ్లు, గృహిణులతో పాటు విభిన్న రంగాలకు చెందిన 50 మంది ఫైనలిస్ట్‌లు టైటిల్ కోసం పోటీ పడ్డారు. టాలీవుడ్ నటి వితికా షెరు ప్రారంభించిన ఈ పోటీలకు కథక్ నృత్యకారిణి సంధ్య, హ్యాండ్ లూమ్ క్యూరేటర్ శ్రీదేవి విజయ దాస్, మిస్ గెలాక్సీ ఇండియా జష్టవి తదితరులు ఈ పోటీలో న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. నిర్వాహకులు కిరణ్మయి అలివేలు మాట్లాడుతూ అందం మాత్రమే కాక మేధస్సు, శక్తి యుక్తులకు కూడా గుర్తింపునిస్తూ మహిళల్లో ఆరోగ్యం, పోషకాహారంపై, అలాగే క్యాన్సర్ స్క్రీనింగ్ పై అవగాహన కల్పించడం వంటి లక్ష్యాలతో ఈ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు.

సాక్షి, సిటీబ్యూరో:



తెలుగు సంవత్సరాది.. అందరికీ ఇష్టమైన ఉగాది..! జీవితంలో అన్ని అనుభవాలను, అనుభూతులను సమపాళ్లలో ఆస్వాదించాలనే మంచి సందేశాన్నందిస్తూ నూతన తెలుగు ఏడాదికి ఆహ్వానం పలుకుతోంది. ఈ నేపథ్యంలో నగరమంతా కొంగొత్త ఆశలతో పండుగ శోభ వెల్లివిరుస్తోంది. సంక్రాంతికి ఆంధ్రా, దసరాకు తెలంగాణ ఊళ్లకు ప్రయాణమయ్యే నగరవాసులు.. ఉగాదికి మాత్రం నగరంలో ఉండటానికే ప్రాధాన్యమిస్తున్నారు. ఈ సందర్భంగా నగరమంతా ఉగాది సంబరాల ఏర్పాట్లు, షాపింగ్ సందడితో కనిపిస్తోంది. మరోవైపు సాంస్కృతికప్రదర్శనలు, ఉగాది పురస్కారాలు, సాహిత్య కార్యక్రమాలు వంటి ఉత్సవాలకు సిద్ధమైంది. – సాక్షి, సిటీబ్యూరో



కొంగొత్త ఆశలు..!

నగరంలో భారీ సంఖ్యలో కొత్త కార్ల బుకింగ్

- ఉగాది తరువాత టాక్స్ రేట్లు పెరుగుతుండటమే కారణం
- మరో వైపు వైరల్‌గా మారిన షష్ట గ్రహ కూటమి వార్తలు
- భాగ్యనగరంలో భారీగా షాపింగ్ సందడి

నగరంలో పలు సాంస్కృతిక వేదికల్లో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. తెలుగు భాషా సాంస్కృతి శాఖ ఆధ్వర్యంలోనే కాకుండా పలు సాహిత్య, సాంస్కృతిక సంఘాల ఆధ్వర్యంలో కళ, నృత్య ఉత్సవాలు, సాహిత్య వేడుకలు, ఉగాది పురస్కారాల సంబరాలను నిర్వహిస్తున్నారు. వారాంతాలతో పాటు సోమవారం రంజాన్ పండుగ కూడా కలిసి రావడంతో మూడు రోజుల సెలవులను ఆస్వాదించడానికి ఈ వేదికలను ఎంచుకుంటున్నారు.



సోషల్ మీడియాలో షష్ట గ్రహ కూటమి..

గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో షష్ట గ్రహ కూటమి అనే అంశం వైరల్‌గా మారింది. అరుదుగా సంభవించే ఈ షష్ట గ్రహాల కూటమి వల్ల పలు మార్పులు సంభవిస్తాయని, ముఖ్యంగా రాశులపై ప్రభావం చూపిస్తుందని జ్యోతిష్యులు, పండితులు వెల్లడిస్తున్నారు. 2019లో సంభవించిన ఈ షష్ట గ్రహ కూటమి అనంతరం కరోనా మహమ్మారి విజృంభించిందని ఉదాహరణగా చెప్పుకొచ్చారు. కానీ, విశ్వంలో నిత్యం ఏర్పడే మార్పుల్లో భాగంగానే ఈ ఆరు గ్రహాల కూటమి, అంతకు మించి ఎలాంటి ప్రభావాలూ ఉండబోవని నగరానికి చెందిన పరిశోధకులు సోషల్‌మీడియా వేదికగా పోస్టులు షేర్ చేస్తున్నారు.



ఉగాదికి కోరిక తీరింది..

వసంతానికి శుభారంబంగా అందరి జీవితాల్లోనూ వసంత శోభ వరించాలని ప్రకృతి దీవెనలతో నూతన సంవత్సరాది ప్రారంభమవుతోంది. అయితే ఈ ఏడాది అందరి చూపు నూతన వాహనాలపై పడింది. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపుల్లో భాగంగా వాహనాలపై టాక్స్ పెరగనుందని నివేదికలు చెబుతున్న నేపథ్యంలో ఈ ఉగాదికి నగరవాసులు భారీ సంఖ్యలో కొత్త వాహనాలను బుకింగ్ చేసుకున్నారని ఆయా కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు.


జెన్ ఏఐలో ఇంకా వెనుకబాటే..!

అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఉపయోగించుకోవడంలో భారతీయ పరిశ్రమలు, సంస్థల వెనుకడుగు

బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) తాజా నివేదిక వెల్లడి

జెన్ ఏఐ ప్రయోజనాలను 80% డెవలపర్లు గుర్తించినా, ఉపయోగిస్తున్నది 39 శాతమే

భద్రతపై సందేహాలు, ఉద్యోగాలు పోతాయనే భయమే కారణమంటున్న నిపుణులు



సాక్షి, హైదరాబాద్: 'జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'(జెన్ ఏఐ) వల్ల కలిగే ప్రయోజనాలను ఉపయోగించుకోవడంలో భారత పరిశ్రమలు, సంస్థలు వెనుకడుగు వేస్తున్నాయి. గ్లోబల్ ఐటీ పవర్‌హౌస్‌గా గుర్తింపు పొందడంతో పాటు టెక్నాలజీ ట్రేడ్‌లో 250 బిలియన్ డాలర్ల పరిశ్రమగా 50 లక్షల మంది ఐటీ నిపుణులతో విరాజిల్లుతున్న భారత ఐటీ పరిశ్రమ 'జెన్ ఏఐ'కీలక మలుపు వద్ద నిలిచింది. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయి అవుట్ సోర్సింగ్ రంగంలో భారత్ ఆధిపత్యం కొనసాగుతున్న దశలో ఎల్ఎల్ఎం ఫైన్ ట్యూనింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి నైపుణ్యాల్లో యువతరం (నెక్స్ట్-జనరేషన్) '51 శాతం మేర స్కిల్ టాలెంట్ గ్యాప్'ను ఎదుర్కొంటున్నట్టు తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల వల్ల భవిష్యత్తులో కృత్రిమ మేథ ఏఐ సంబంధిత ఆవిష్కరణల్లో తమ ప్రాధాన్యతలను కోల్పోయే పరిస్థితులు ఏర్పడవచ్చుననే ఆందోళన భారత నిపుణుల్లో వ్యక్తమవుతోంది. 'జెన్ ఏఐ'వల్ల కలిగే ఉత్పాదకత వృద్ధి ప్రయోజనాలను 83 శాతం డెవలపర్లు గుర్తించినా, వారు దీనిని ఉపయోగిస్తున్నది 39 శాతమేనని, దానిని అనుసరిస్తూ, తమకు తగ్గట్టుగా వర్తింప చేసుకునే నవయువ డెవలపర్లు 31 శాతానికే పరిమితమవుతున్నట్టు బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) తాజా అధ్యయనంలో తేలింది. ఈ సవాళ్లను సరైన పద్ధతుల్లో సమాధానాలు వెతుక్కోవడంతో పాటు వాటిని అధిగమించే దిశలో చర్యలు చేపట్టకపోతే గ్లోబల్ ఏఐ లీడర్లుగా ఉన్న యూఎస్ఏ, చైనాల కంటే వెనుకబడే ప్రమాదం ఉందని అధ్యయనం హెచ్చరించింది. ఈ రంగంలో మధ్యస్థ శక్తులుగా ఎదిగిన దక్షిణ కొరియా, జపాన్, సౌదీ ఆరేబియా కూడా పైస్థాయికి చేరుకునే ప్రయత్నాలు చురుగ్గా సాగిస్తున్న సమయంలో భారత్‌కు ఇది సవాళ్లతో కూడుకున్నదనే అభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రస్తుత పరిస్థితులను అధిగమించి కృత నిశ్చయంతో ముందుకు సాగేందుకు అవసరమైన శిక్షణ కొరవడడం, ఈ అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగిస్తున్న క్రమంలో ఎదురవుతున్న భద్రతాపరమైన సందేహాలు, జెన్ ఏఐ వంటి వాటితో ఉద్యోగాలు పోతాయనే భయం తదితర కారణాలతో వివిధ కంపెనీలు ఆచితూచి స్పందిస్తున్నాయని తెలిపింది. మారుతున్న సాంకేతికతలకు తగ్గట్టుగా ఐటీ సర్వీసుల్లో జెన్ ఏఐ వర్తింపును వేగవంతం చేయడం ద్వారా పైచేయి సాధించాలంటే భారత్ వివిధ చర్యలు చేపట్టాలని అధ్యయనం సూచించింది.


రెండేళ్లు గడుస్తున్నా వెనుకబాటే..

2022 చివర్లో ఏఐ, జెన్ ఏఐ అనేవి పరిశ్రమల్లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టాయి. అయితే రెండేళ్లు గడుస్తున్నా జెన్ ఏఐను అందిపుచ్చుకుని, వర్తింపజేసుకునే విషయంలో అధిక శాతం పరిశ్రమలు వెనుకబడ్డాయి. ఇందుకు కారణం టెక్నాలజీ కాదని మానవ స్వభావం, ప్రవర్తనదేనని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు మొదలు డెవలపర్లలో ఉద్యోగాలు కోల్పోతామనే భయం వెంటాడుతుండటమే ఇందుకు కారణమని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ అధునాతన టూల్స్‌ను ఉద్యోగులు ఉపయోగించి మంచి ఫలితాలను సాధించేలా చేయడమనేది పెద్ద సవాల్‌గా మారుతోందని అంటున్నారు. ఈ సాంకేతికతను పూర్తిస్థాయిలో అమలు చేసే విషయంలో కస్టమర్ల నుంచి కూడా వ్యతిరేకత ఎదురవుతున్నట్టుగా కంపెనీలు పేర్కొంటున్నాయి.

భారత్ ఏం చేయాలంటే..

- వివిధ ప్రావీణ్యాలు, నైపుణ్యాల ఆధారిత శిక్షణా పద్ధతులు (ట్రెనింగ్ మోడళ్లు) చేపట్టాలి.
- ఏఐ, జెన్ ఏఐలు ఏ మేరకు ప్రభావితం చేస్తాయన్న దానిపై 'ప్రొఫిషియెన్సీ బేస్డ్ ట్రెనింగ్ మోడల్స్ తీసుకురావాలి.
- మేనేజ్‌మెంట్, వర్క్‌ఫోర్స్ తమ నైపుణ్యాలు పెంచుకునేందుకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు, ఉత్తమ శిక్షణ నిమిత్తం 'ఎగ్జిక్యూటివ్ స్పాన్సర్‌షిప్' చేపట్టాలి.
- భద్రతా పరమైన ఆందోళనలు, సమస్యలు అధిగమించేందుకు పరిశ్రమ క్లయింట్లతో దృఢమైన బంధాలు కొనసాగించేలా వ్యూహాలు రూపొందించుకోవాలి.

జనరేటివ్ ఏఐ అంటే..



జనరేటివ్ ఏఐ (జెన్ ఏఐ) అనేది యూజర్ కోరుకున్న కంటెంట్ లేదా విజ్ఞప్తికి తగ్గట్టుగా సాఫ్ట్‌వేర్ కోడ్‌ను రూపొందించుకుంటుంది. ముఖ్యంగా ట్రెనింగ్, ట్యూనింగ్, జనరేషన్ అనే మూడు దశలుగా పనిచేస్తుంది. టెక్స్ట్, ఇమేజెస్, ఆడియోల రూపంలో ఒరిజినల్ కంటెంట్‌ను తయారు చేయగలదు. అధునాతన మెషీన్ లెర్నింగ్ మోడళ్లు మరి ముఖ్యంగా డీప్ లెర్నింగ్ మోడళ్లపై ఆధారపడి ఈ టెక్నాలజీ పనిచేస్తుంది. ఇది మనుషుల మెదళ్ల మాదిరిగా నేర్చుకోవడం, నిర్ణయం తీసుకునే ప్రక్రియను వేగవంతం చేస్తుంది.

క్లుప్తంగా...

ఎవరు అడ్డుపడ్డా 'వక్ఫ్' సవరణ బిల్లు ఆగదు

దేశం కోసమే కఠిన నిర్ణయాలు: బండి



కరీంనగర్ టౌన్: భారత రాజ్యాంగానికి భవిష్యత్‌లో ఆర్ఎస్ఎస్ భావజాలంతోనే ముప్పు పొంచి ఉందంటూ మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. మజ్లిస్ పార్టీయే అసలైన దేశద్రోహ పార్టీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కరీంనగర్‌లోని జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లోని న్యాయవాదుల డిజిటల్ లైబ్రరీ కోసం బండి సంజయ్ రూ.15 లక్షలు మంజూరు చేశారు. న్యాయవాదుల కాన్ఫరెన్స్‌హాల్ కోసం సీఎస్సార్ ఫండ్స్ నుంచి మరో రూ.50 లక్షల సాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా న్యాయవాదులంతా బండి సంజయ్‌ను సన్మానించారు. అనంతరం సంజయ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం జాతీయవాద భావజాలంతో పనిచేస్తోందన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లుపై దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందని చెప్పారు. ఒవైసీ సహా కుహనా లౌకిక వాదులు ఎంత అడ్డుకున్నా పార్లమెంట్‌లో త్వరలోనే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందుతుందని స్పష్టం చేశారు. దేశ శ్రేయస్సు కోసం మోదీ ప్రభుత్వం మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు.

ముస్లింలు చంద్రబాబును క్షమించరు


ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్‌లో వక్ఫ్ (సవరణ) బిల్లు ఆమోదం పొందితే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, బిహార్ సీఎం నితీశ్‌కుమార్, చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌదరి తదితరులను భారత ముస్లింలు క్షమించరని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. పార్లమెంట్‌లో బీజేపీకి మెజారిటీ లేదని, మిత్రపక్షాల సహాయంతోనే కేంద్ర ప్రభుత్వం నడుస్తున్నందున మిత్రపక్షాలు మద్దతు ఇవ్వకపోతే సభలో బిల్లు ఆమోదం సాధ్యం కాదని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని దారుస్సలాంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత ముస్లింలు వక్ఫ్ సవరణ బిల్లును తిరస్కరించారని తెలిపారు. ముస్లింల ఆస్తులను దోచుకోవడానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు కుట్ర చేస్తున్నాయని, అందుకోసమే వక్ఫ్ బిల్లు తీసుకొచ్చారని ఆరోపించారు. బిల్లును 'దోపిడీదారుల (సవరణ) చట్టం'గా అభివర్ణించారు.

ఫిల్మ్ సిటీలోని ప్రభుత్వ భూములను పేదలకు పంచుతాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సాక్షి, హైదరాబాద్: రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం ఆక్రమించిన ప్రభుత్వ భూములను పేదలకు పంచుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఈ క్రమంలో జరిగే పరిణామాలకు ఫిల్మ్ సిటీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు. శనివారం ఎంబీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం దాదాపు 360 ఎకరాల భూమిని ఆక్రమించిందన్నారు. ఫిల్మ్ సిటీ సమీపంలోని చాలా గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలు వేలసంఖ్యలో ఉన్నారన్నారు. వారందరినీ సమీకరించి త్వరలోనే ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు చెప్పారు. గతంలో ప్రభుత్వం దాదాపు 700 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిందని, పట్టాలు ఇచ్చినప్పటికీ పొజిషన్ చూపలేదని తెలిపారు. అక్కడ ఇళ్లను నిర్మించుకునేందుకు అవకాశం లేకుండా రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం చుట్టూ ప్రహరీగోడ నిర్మించిందని, పట్టాదారులను లోనికి రానీయకుండా గేట్లు ఏర్పాటు చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ రోడ్లను కూడా ఆక్రమించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏపీలో వలంటీర్లు 'పచ్చడి'

చంద్రబాబు ఉగాది దగా.. 2.66 లక్షల మంది బతుకుల్లో చేదు

- ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ సహా ఎన్నో హామీలు
- వలంటీర్ల వ్యవస్థనూ కొనసాగిస్తామని హామీ..
- వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని ఊరింపు
- మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిన వైనం
- ఆ తర్వాత సూపర్ సిక్స్ సహా హామీలన్నింటిపై దాటవేత ధోరణి
- మొదటి నెల నుంచే వలంటీర్లకు విధులు అప్పగించకుండా మోసం


వాలంటీర్లకు
నెలకు రూ.10వేలు
సామాజిక పింఛన్లు రూ.4 వేలకు పెంపు
దివ్యాంగులకు రూ.6 వేలు
అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం
ఉగాది వేడుకల్లో తెదేపా అధినేత చంద్రబాబు కీలక ప్రకటన
విరాళాలివ్వండి.. ప్రచారంలోనూ పాల్గొనండి
చంద్రబాబు పిలుపు

ఇదిగో బాబు.. 'ఈనాడు'లో నీ ఉగాది హామీ
సరిగ్గా ఏడాది కిందట టీడీపీ కార్యాలయంలో జరిగిన ఉగాది వేడుకలో చంద్రబాబు మాట్లాడుతూ.. 'వలంటీర్లను తొలగించం. గౌరవ వేతనాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతాం' అని ప్రకటించారు. కానీ గద్దెనెక్కిన తర్వాత వలంటీర్లను నిండా ముంచేశారు.

సాక్షి, అమరావతి: ఎన్నికలకు ముందు ప్రజలకు సూపర్ సిక్స్ సహా ఎన్నో హామీలిచ్చి.. ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిన చంద్రబాబు, కూటమి పార్టీల నేతలు ఆపై మాట మార్చేశారు. ఆ హామీలన్నింటికీ తిలోదకాలిస్తుండటంతో పాటు రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల్లో ఎలాంటి అవినీతి, అక్రమాలు, పైరవీలు, పక్షపాతం లేకుండా క్షేత్ర స్థాయిలో సేవలు అందించిన వలంటీర్ల వ్యవస్థనూ ఒక్కసారిగా కుప్పకూల్చారు. కులం, మతం, వర్గం, ప్రాంతం.. చివరకు తనకు ఓటు వేయని వారికైనా సరే అర్హత ఉంటే చాలు ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలన్న నాటి సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు వలంటీర్లు విధులు నిర్వర్తించారు. ఇంతగా సేవలు అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామ సచివాలయాలు-వలంటీర్ల వ్యవస్థను ప్రస్తుత టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం రాజకీయ పంతంతో పూర్తిగా పక్కన పెట్టింది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం నుంచి వలంటీర్లకు చిక్కులు మొదలయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వలంటీర్లకు విధులు అప్పజెప్పడం మానేసింది. గత ప్రభుత్వంలో ఈ వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుంచి ఎన్నికల వరకు చంద్రబాబు సహా కూటమి నేతలంతా తీవ్ర విమర్శలు చేశారు. తీరా పోలింగ్ తేదీ దగ్గర పడేసరికి మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత 2.66 లక్షల కుటుంబాలను నిట్ట నిలువునా ముంచేశారని వలంటీర్లు వాపోతున్నారు. 2019 ఆగస్టు 15న అప్పటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతిష్టాత్మక వలంటీర్ల వ్యవస్థకు నాంది పలికింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 50 ఇళ్లకు ఒకరు చొప్పున, పట్టణ ప్రాంతాల్లో 75–100 ఇళ్లకు ఒకరు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 2.66 లక్షల మందిని నియమించింది. 2024లో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే వరకు ఎలాంటి వివక్ష, రాజకీయ పక్షపాతం, పైరవీలు, అవినీతికి తావులేకుండా ప్రభుత్వం ద్వారా లబ్ధిని ప్రజల గడప వద్దకే అందజేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషించారు.

మళ్లీ ఉగాదొచ్చింది..

ఇప్పుడు మళ్లీ ఉగాది వచ్చింది. మధ్యలో గత ఏడాది జూన్‌లో రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబే కొనసాగుతున్నారు. ఈ ఏడాది కాలంలోనే రాష్ట్రంలో వలంటీర్లందరి ఉద్యోగాలు పోయాయి. 2024 జూన్ ఒకటో తేదీన సైతం వలంటీర్లు గౌరవ వేతనాలు పొందారు. అయితే 2023 ఆగస్టు నుంచే రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ ఉనికిలో లేదంటూ చంద్రబాబు ప్రభుత్వమే వలంటీర్లందరినీ ఉద్యోగాల నుంచి తొలగించింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ముందు గత ఏడాది ఉగాది పండుగ రోజున చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం వారి వేతనాలు పెరగకపోగా, ఏకంగా వారి ఉద్యోగాలే లేకుండా పోయాయి. పది నెలలుగా వారి వేతన చెల్లింపులు కూడా నిలిచిపోయాయి. 2.66 లక్షల మంది వలంటీర్లు వివిధ రూపాల్లో ఆందోళనలు చేయడంతో పాటు వినతులు ఇస్తున్నా, చంద్రబాబు ప్రభుత్వం కనీసం వారి గురించి ఆలోచన చేయడం లేదు.



శనివారం కొడంగల్‌లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజావసరాలకు అనుగుణంగా లింకురోడ్లు

- హెచ్ఆర్‌డీసీఎల్ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ప్రజావసరాలకు అనుగుణంగా అనుసంధాన (లింక్) రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాజధాని నగరంతో పాటు హెచ్ఎండీఏ పరిధిలో హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్ఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో చేపడుతున్న లింక్ రోడ్ల నిర్మాణం, విస్తరణపై ఐసీసీసీలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై సీఎం పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానం పెంచాలని, ప్రజలు ఎలాంటి అవాంతరాలు లేకుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల నిర్మాణం చేపట్టాలని సీఎం ఆదేశించారు. వివిధ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం వల్ల ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోయి సమయం ఆదా అయ్యేలా ఉండాలని సూచించారు. ఇందుకోసం అదనపు భూసేకరణకు కొంత అధిక వ్యయమైనా వెనుకాడవద్దని స్పష్టం చేశారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శులు వి.శేషాద్రి, చంద్రశేఖర్‌రెడ్డి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ అధికారులపై సీబీఐ కేసు

పలువురిని బెదిరించి డబ్బు వసూలు చేశారని ఆరోపణలు

సాక్షి, హైదరాబాద్: అధికారిక డేటాను దుర్వినియోగం చేసి, జరిమానాలు విధిస్తామని బెదిరించడం ద్వారా పన్ను చెల్లింపుదారుల నుంచి అక్రమంగా డబ్బు వసూలు చేశారనే ఆరోపణలపై ఐదుగురు ఆదాయపన్ను శాఖ అధికారులతోపాటు వారికి సహకరించిన ఒక ప్రైవేటు ఆడిటర్‌పై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) కేసు నమోదు చేసింది. కేసు నమోదైనవారిలో క్వామర్ ఆలం ఖాన్, మనీష్ సిక్రావాల్, గుల్నాజ్ రావూఫ్, కుతాడి శ్రీనివాసరావు, మహ్మద్ జావీద్ ఐటీ ఉద్యోగులు కాగా, చార్టర్డ్ అకౌంటెంట్ పులిమామిడి భగత్ వీరికి సహకరించినట్లు సీబీఐ ఆరోపించింది. మరికొందరు గుర్తు తెలియని ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులు సైతం ఇందులో భాగస్వాములుగా ఉన్నట్టు అనుమానిస్తున్నారు. అధిక రిటర్నులను క్లెయిమ్ చేసే పన్ను చెల్లింపుదారుల పేర్లు, వివరాలు ఉన్న మాస్టర్ ఎక్సెల్ జాబితాను జూన్ 23, 2023న ఆదాయపు పన్ను శాఖలో పంపిణీ చేశారు. ఈ వివరాలను జాబితా నుంచి తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశించినా..క్వామర్ ఆలం ఖాన్, మనీష్ సిక్రావాల్ దురుద్దేశంతో ఆ డేటాను తమ వద్దే పెట్టుకున్నారు. ఈ వివరాల ఆధారంగా పన్ను చెల్లింపుదారులను నేరుగా సంప్రదించి, వారి ఆదాయపు పన్ను రిటర్నులలో సమస్యలను పేర్కొంటూ, జరిమానాలు విధిస్తామని బెదిరించారు. వినియోగదారులు తమ వద్దకు రాగానే బెదిరించి డబ్బులు డిమాండ్ చేసేవారు. ఈ మొత్తం వ్యవహారంలో ఆడిటర్ భగత్ వసూళ్లు చేసేవాడు. నిందితులపై నేరపూరిత కుట్ర, మోసం, అవినీతి ఆరోపణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వల్పంగా పెరిగిన టోల్ చార్జీలు

ఏప్రిల్ ఒకటి నుంచి అమలు

సాక్షి, హైదరాబాద్: జాతీయ రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాల రుసుములను ఎన్‌హెచ్ఏఐ సవరించింది. ప్రతి సంవత్సరం ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త ధరలను అమలు చేయటం ఆనవాయితీగా వస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు కూడా ఎన్‌హెచ్ఏఐ స్వల్పంగా ధరలు పెంచింది. టోల్‌ప్లాజాలను బట్టి ఈ ధరల్లో స్వల్ప మార్పులుంటాయి. పెరిగిన ధరలు ఇలా..

వాహనం (అంకెలు రూ.లలో)	సింగిల్ జర్నీ కొత్త	సింగిల్ జర్నీ పాత	రిటర్న్ జర్నీ కొత్త	రిటర్న్ జర్నీ పాత	నెలవారీ పాస్ కొత్త	నెలవారీ పాస్ పాత
కారు/జీపు/వ్యాను/తేలికపాటి వాహనాలు	90	90	135	130	3050	2935
తేలికపాటి గూడ్స్ వాహనం/మినీ బస్	150	140	220	215	4930	4740
బస్/ట్రక్	310	300	465	445	10330	9930
మూడు యాక్సిల్ వరకు కమర్షియల్ వాహనాలు	340	-	505	-	11270	-
నాలుగు అంతకంటే ఎక్కువ యాక్సిల్ వాహనాలు	485	465	730	700	16200	15570
అతి భారీ వాహనాలు	590	570	885	855	19720	18950

డీలిమిటేషన్‌పై బీజేపీ కుట్ర

- 'తెలంగాణ పీపుల్స్ వాయిస్ ఫర్ ఫెయిర్ డీలిమిటేషన్' అఖిలపక్ష సమావేశంలో వక్తలు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని పలువురు వక్తలు విమర్శించారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. 'తెలంగాణ పీపుల్స్ వాయిస్ ఫర్ ఫెయిర్ డీలిమిటేషన్' ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే యాదవరెడ్డి డీలిమిటేషన్‌పై ఒక ముసాయిదా నివేదికను ప్రవేశపెట్టారు. 'కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలతో చర్చించిన తర్వాతే డీలిమిటేషన్‌పై తుది నిర్ణయం తీసుకోవాలి. జనాభా ప్రాతిపదికన కాకుండా.. రాష్ట్రం యూనిట్‌గా ప్రస్తుతం ఉన్న ఎంపీ స్థానాలకు 2:1 నిష్పత్తి ప్రకారం నియోజకవర్గాలను పెంచాలి. దేశాభివృద్ధికి తోడ్పడుతున్న రాష్ట్రాలకు అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదు'అని వక్తలు హెచ్చరించారు.

బీజేపీ రహస్య ఎజెండా అమలుకే..

జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేయడంలో బీజేపీ తన రహస్య ఏజెండాను అమలు చేసే కుట్ర దాగి ఉందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి ఆరోపించారు. సీపీఐ నాయకురాలు పశ్య పద్మ మాట్లాడుతూ.. బీజేపీ తన రాజకీయ అధికారాన్ని శాశ్వతం చేసుకునేందుకు దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్లను తగ్గించాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో విద్యావేత్త మధుసూదన్, ఎం.జగన్ (ఐప్సో), నారాయణ (బ్లాసమ్ విద్యా సంస్థల అధినేత), తిప్పర్తి యాదయ్య, ఉపేందర్, పార్వతి (తెలంగాణ విద్యావంతుల వేదిక), మల్లంగి విజయ్ తదితరులు ప్రసంగించారు.

రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న సీఎం

- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ సీఎం రేవంత్‌రెడ్డి ధ్వంసం చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో రాక్షస, రాబందుల పాలన నడుస్తోందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, బీఆర్ఎస్ నేతలు బమ్మెర రామమూర్తి, అభిలాశ్ రంగినేని, సైదులుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జైల్లో ఉండాల్సిన వ్యక్తి నేడు హోంమంత్రి, సీఎంగా ఉన్నారని, ప్రజల హక్కులను హరిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతుకగా పోరాడటాన్ని రేవంత్‌రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారని, సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిని టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. డిజిటల్ మోసాల నుంచి ప్రజలను రక్షించాల్సిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ)ని బీఆర్ఎస్ సోషల్ మీడియాపై రేవంత్‌రెడ్డి ప్రయోగిస్తున్నారని విమర్శించారు. హరీశ్‌రావును పెట్రోల్ పోసి చంపుతామన్న కాంగ్రెస్ నేత మైనంపల్లిపై పోలీసులు ఎలాంటి కేసు పెట్టలేదని ఆయన తప్పుబట్టారు.

రజతోత్సవాలపై బీఆర్ఎస్ ఫోకస్

- ఎర్రవల్లి నివాసంలో పార్టీ నేతలతో కేసీఆర్ వరుస భేటీలు
- క్షేత్రస్థాయిలో రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరుపై ఆరా
- జన సమీకరణ, సభ ఏర్పాట్లపై 20కి పైగా ప్రత్యేక కమిటీలు
- ఏప్రిల్ 2న ఎల్కతుర్తిలో బహిరంగ సభా స్థలికి భూమి పూజ
- రెండో వారం నుంచి జిల్లాలవారీగా కేటీఆర్ పర్యటనలు



సాక్షి, హైదరాబాద్: పార్టీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఏప్రిల్ 27న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయడంపై బీఆర్ఎస్ పార్టీ దృష్టి కేంద్రీకరించింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఎర్రవల్లి నివాసంలో పార్టీ ముఖ్య నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. సభకు జన సమీకరణపై దిశానిర్దేశం చేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి సభకు ఎంత మంది తరలివచ్చే అవకాశముందని ఆరా తీస్తున్నారు. మరోవైపు క్షేత్రస్థాయిలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరుపై ప్రజలు స్పందిస్తున్న తీరును అడిగి తెలుసుకుంటున్నారు. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్, వరంగల్ జిల్లాకు చెందిన ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశాలు నిర్వహించారు. బడ్జెట్ సమావేశాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఎప్పటికప్పుడు కేసీఆర్ దిశానిర్దేశం చేస్తూ వచ్చారు. అదే సమయంలో పార్టీ ముఖ్యనేతలతో వరుస భేటీలు నిర్వహించారు. ఉత్తర తెలంగాణలో బీజేపీ అంతర్గతంగా నిర్వహిస్తున్న కార్యకలాపాలపై కేసీఆర్ ఆరా తీస్తున్నట్లు తెలిసింది. పార్టీ సంస్థాగత నిర్మాణం, ఏడాది పొడవునా నిర్వహించాల్సిన రజతోత్సవ వేడుకల తీరుతెన్నులపైనా నేతల అభిప్రాయాలు కోరుతున్నట్లు తెలిసింది.

సభ ఏర్పాట్లకు ప్రత్యేక కమిటీలు

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బహిరంగ సభను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న బీఆర్ఎస్ అధినేత.. సభ నిర్వహణలో పార్టీ ముఖ్య నేతలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. సభ నిర్వహణ కోసం 20కి పైగా కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నేతలు సభా స్థలి ఎంపిక, రైతుల నుంచి నిరభ్యంతర పత్రాల సేకరణ, పోలీసుల అనుమతులకు దరఖాస్తులు తదితర పనుల్లో తలమునకలయ్యారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఒడితెల సతీశ్‌కుమార్‌కు కూడా బాధ్యతలు అప్పగించారు. సుమారు 1,200 ఎకరాల్లో బహిరంగ సభ నిర్వహణ ఏర్పాట్లు జరగనుండగా, మైదానం చదును చేయడం, వేదిక నిర్మాణం తదితరాలకు సంబంధించి ఏప్రిల్ 2న భూమి పూజ చేస్తారు.

తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమీక్షలు

సభను విజయవంతం చేసేందుకు జిల్లాలవారీగా ఈ నెల 20న సన్నాహక భేటీలకు శ్రీకారం చుట్టిన కేటీఆర్.. ఇప్పటికే సూర్యాపేట, కరీంనగర్ జిల్లాల ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఏప్రిల్ మొదటి వారంలో తెలంగాణ భవన్‌లో కేటీఆర్ అధ్యక్షతన పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో వరుస సమావేశాలు జరుగనున్నాయి. పార్టీ జిల్లా అధ్యక్షులను కూడా ఈ సమావేశాల్లో భాగస్వాములను చేస్తారు. ఈ సమావేశాలు ముగిసిన తర్వాత ఏప్రిల్ రెండో వారంలో కేటీఆర్ జిల్లాలవారీగా రజతోత్సవ సభ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తారు. కేటీఆర్ జిల్లా పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేస్తామని తెలంగాణ భవన్ వర్గాలు వెల్లడించాయి.

రిజర్వేషన్లపై బీసీ సంఘాలతో కూడా చర్చించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



లక్డీకాపూల్(హైదరాబాద్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రిజర్వేషన్ల అంశంపై అఖిల పక్షంతో పాటు కులసంఘాలతో కూడా చర్చించాలని పలు బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం స్థానిక హోటల్లో బీసీ రిజర్వేషన్లపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. బీసీ జనసభ, బీసీ సంక్షేమ సంఘం, నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ బీసీ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యనారాయణ, బీసీ సంఘం అధ్యక్షుడు రాజారాం యాదవ్‌ల పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశంలో బీసీ బిల్లు అమలుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో లోతుగా చర్చించి అమలు కోసం గట్టి చర్యలు తీసుకోవాలని నేతలు సూచించారు. ఈ విషయంలో తెలంగాణ ఉద్యమం తరహాలో బలహీన వర్గాలు ఒక ఐక్య ఉద్యమానికి ముందుకు రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. వ్యక్తులు, శక్తులు ఏకమై విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం శాంతియుత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. కేంద్రానికి బీసీ బిల్లులను పంపి చేతులు దులుపుకోవాలని చూడడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదన్నారు. సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం మాట్లాడుతూ.. బిహార్ ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ బిల్లు పాస్ చేయడమే కాకుండా, జీవో కూడా జారీ చేసి ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. రాజారాం యాదవ్ మాట్లాడుతూ.. చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, దేశవ్యాప్తంగా సమగ్ర కులగణనను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండలి పక్ష నేత మధుసూదనాచారి, నేతలు వకుళాభరణం కృష్ణమోహన్, ఎల్.రమణ, నారగోని తదితరులు పాల్గొన్నారు.

ఉగాది

విశ్వశ్రేయస్సే విశ్వావసు

మనిషికి భవిష్యత్తు తెలుసుకోవాలని ఎప్పుడూ ఉంటుంది. ఆ భవిష్యత్తులో మంచి జరగాలనే ఆకాంక్ష ఉంటుంది. కాని భవిష్యత్తు అనేది అనిశ్చితితో నిండి ఉంటుందన్న ఎరుక కూడా ఉంటుంది. అయితే ఒక ఆశ కావాలి కదా. ఆ ఆశను ఆధ్యాత్మిక రూపంలో గ్రహాలను ఊతంగా చేసుకుని సనాతనంగా వచ్చిన గ్రహ విజ్ఞానం ఆధారంగా నిలబెట్టేదే పంచాంగ దర్శనం. మంచిని వాగ్దానం చేస్తూ చెడును హెచ్చరిస్తూ సాగే పంచాంగంలో అనూహ్యమైనది ఏదీ కనిపించకపోయినా దానిని వినడం, చదవడం, పరికించడం ఆనవాయితీ. అయితే ఈసారి 'సామాజిక పంచాంగం'ను వినిపించాలనుకుంది 'సాక్షి'. ఆరు కీలక రంగాలు దేశంలో, స్థానికంగా ఎలా ఉంటాయో తెలియచేశారు పండితులు. అవధరించండి.

ఆర్థికంగా ముందుకు...

విశ్వావసు నామ సంవత్సరంలో మంత్రి చంద్రుడు అవడం చేత, రసాధిపతి శుక్రుడు అవడం చేత, నీరసాధిపతి బుధుడు అవడం చేత వ్యాపారస్తులకు లాభదాయకంగా ఉంటుంది. భారతదేశం ఆర్థిక పరంగా ముందుకు సాగుతుంది. తెలుగురాష్ట్రాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయి. పశ్చిమ దేశాల్లో యుద్ధ భయం, యుద్ధ వాతావరణాలు ఉండి ఆర్థికపరంగా పశ్చిమ దేశాలకు అనిశ్చితి ఏర్పడుతుంది. మేఘాధిపతి రవి అవడం చేత పంటలకి క్రిమి కీటకాదుల వల్ల ముప్పు ఉంటుంది. రైతులకు కొంత ఆర్థిక నష్టం జరగవచ్చు. ధనవంతులు అధిక ధనవంతులు అవుతారు. పెద్ద వ్యాపారస్తులు లాభాలు బాగా ఆర్జిస్తారు. చిన్న వ్యాపారస్తులకు మధ్యస్థ ఫలితాలు ఉంటాయి. మొత్తం మీద శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఆర్థికంగా భారతదేశానికి శుభ ఫలితాలనూ, తూర్పు ప్రాంతాలకు, తూర్పు దేశాలకు అనగా చైనా, సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాలకు అభివృద్ధిని సూచిస్తోంది.



ఆరోగ్యం ఫరవాలేదు...

శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో నవనాయకులలో ఐదుగురు పాపులు, నలుగురు శుభులు ఉండడం చేత రాజు రవి, మంత్రి చంద్రుడు అవటం వల్ల ప్రజలు ఆరోగ్యంగా, క్షేమంగా ఉంటారు. కొన్ని గ్రహాల స్థితిగతులు అలజడులకు, విచిత్ర రోగాలకు, సర్వత్రా ఆందోళనలకు దారి తీస్తాయి. సంవత్సరారంభం నుంచి మే 6వ తేదీ వరకూ మీనరాశిలో నాలుగు గ్రహాలు ఒకే రాశిలో కూటమి కావడం వల్ల విశేష సూర్యతాపం, అకాల మరణాలు, యుద్ధ భయాలు, ధరల పెరుగుదల వంటి ఫలితాలు చూడాల్సిన పరిస్థితి. ఏప్రిల్ 1 నుంచి 13 రోజుల పాటు మీనరాశిలోనే పంచ గ్రహ కూటమి ఏర్పడనుంది. దీనివల్ల దుర్భిక్ష పరిస్థితులు, కొన్ని దేశాలలో వ్యాధుల వ్యాప్తి, జననష్టం, ప్రకృతి బీభత్సాలు వంటివి నెలకొంటాయి. జూన్ ఒకటో తేదీ నుంచి జులై 28వ తేదీ వరకూ కుజరాహువుల పరస్పర వీక్షణాల వల్ల యుద్ధ వాతావరణం, ఉద్రిక్తతలు, కొన్ని వ్యాధులు వ్యాపించే సూచనలు. ఉగాది నుండి సుమారు మూడు నెలల పాటు అపసవ్య రీతిన కాలసర్పదోష ప్రభావం కారణంగా వివిధ సమస్యలు, రోగాలతో ప్రజలు అవస్థ పడతారు. జాతీయ, అంతర్జాతీయ నేతలు కొందరిపై ఆరోపణలు, అరెస్టులు, ఆందోళనలు రేకెత్తవచ్చు.

– **చిలకమర్తి ప్రభాకర చక్రవర్తి శర్మ,** ఆధ్యాత్మిక వేత్త, పంచాంగకర్త



అనుబంధాలు జాగ్రత్త

ఈ ఏడాది పాలకుల మధ్య గాని కుటుంబ, వ్యక్తిగత అనుబంధాలుగానీ అంత బాగుంటాయని చెప్పలేం. అందువల్ల బంధుమిత్రుల ఇళ్లకు అతి ముఖ్యమైన పని మీద వెళ్లినా, ఎక్కువ సమయం ఉండకుండా తొందరగా పని చూసుకుని రావడం మంచిది. అనుబంధాలు, మానవ సంబంధాలు బాగుండాలంటే తరచు మాట్లాడుకుంటూ ఉండటం శ్రేయస్కరం. ఆర్థికంగా అంత బాగుండని బంధువుల మీద తెలిసీ తెలియక భారం వెయ్యకుండా వారికి మీ వల్ల చేతనైన సాయం చేయడం మంచిది. అనవసరమైన, చెయ్యలేని, చేతకాని వాగ్దానాలు చేసి వాటిని నెరవేర్చలేక మాటలు పడి మానసిక ప్రశాంతతను పోగొట్టుకునే బదులు చెయ్యగలదానిని మాత్రమే చెప్పడం, చెయ్యలేని వాటిని సున్నితంగా ముందే మా వల్ల కాదని చెప్పడం వల్ల స్నేహసంబంధాలు దెబ్బ తినకుండా ఉంటాయి. బంధువులు, మిత్రుల మధ్య అనుబంధాలు బాగుండాలంటే వారితో స్నేహ సంబంధాలు కొనసాగించడం మేలు.

– **డా. మైలవరపు శ్రీనివాసరావు,** ఆధ్యాత్మిక వేత్త



ఆనందానికి లోటు లేదు

ఈ విశ్వావసు నామవత్సరంలో పేరులోనే విశ్వశాంతి గోచరిస్తోంది. క్రోధాలు, మోసాలు, ద్వేషాలు తొలగిపోయి ప్రజలంతా ఒక్కమాటగా ఉంటారు. రాజకీయ రంగంలోని వారికి అవకాశాలు రావడం వల్ల ఆనందంగా ఉంటారు. విద్యార్థులకు అనుకున్న ఫలితాలు వచ్చి ఆనందంలో తేలుతారు, సాహిత్య, సాంస్కృతిక పర్యాటక రంగాలలోని వారికి అనుకూలంగా ఉండటం వల్ల ఆనందం కలుగుతుంది. ప్రజలంతా చేయీ చేయీ కలుపుకొని మాటా మాటా కలుపుకొని మనసులలోని శంకలు మాపుకొని ఒక్కతాటి మీద నడుస్తూ ఆనందంగా ఉంటారు. ఈ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరం తక్కువ ఎక్కువలనూ పేదాగొప్పా తారతమ్యాలను విడనాడి, దేశంలోని అన్ని రంగాలలో సమన్వయం ఏర్పడి అందరూ కలసి కట్టుగా ప్రతి నిత్యం ఆనందంతో మునిగి తేలుతూ అంబరాలనంటేలా సంబరాలను జరుపుకుంటూ జీవిద్దాం.


– **తాడిగడప సోదరులు: తాడిగడప సుబ్బారావు, తాడిగడప బాల మురళి భద్రిరాజు,** శ్రీ వాగ్దేవి జ్యోతిష విద్యాలయం,పెద్దాపురం



అభివృద్ధికరంగా ఉంటుంది

శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో దేశ అభివృద్ధి ఆశాజనకంగా ఉంది. ఈ సంవత్సరం గ్రహాలలో అత్యధిక శాతం శుభులు ఉండడం వల్ల ప్రజలు సుఖశాంతులతో ఉంటారు. సస్య వృద్ధి, పశుసంపదకు క్షేమం, ఆయురారోగ్యం కలుగుతుంది. రాజ్యాధిపతి అనుకూలుడుగా ఉండడంవల్ల దేశాధినేతలకు పాలకులకు శుభం చేకూరుతుంది. కొన్ని రాష్ట్రాలలో అతివృష్టి మరికొన్ని రాష్ట్రాలలో అనుకూల వృష్టి ఉండవచ్చు. నిత్యావసర వస్తువుల ధరలు నిలకడగా ఉంటాయి. రసవస్తువుల ధరలు కొంత హెచ్చి తగ్గుతాయి. నీరస వస్తువులు ధరలు తగ్గి స్వల్పంగా హెచ్చుతాయి. పరిపాలకులు సంయమనంతో ఉంటారు. చేతివృత్తుల వారికి ఈ సంవత్సరం చేతి నిండా పని దొరుకుతుంది. దేశ రక్షణ బాధ్యతను వహించే సైనికులకు ఈ సంవత్సరం పరీక్షా సమయం అయినప్పటికీ విజయం సాధిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమంపై దృష్టి సారిస్తారు. నీటిపారుదల, పారిశ్రామిక రంగాలపై పాలకులు ప్రాధాన్యతను చూపుతారు. యువకులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయి

– **ఓరుగంటి నాగరాజశర్మ,** పుష్పగిరి పీఠ మహాసంస్థాన సిద్ధాంతి, జ్యోతిష విద్వాంసులు



ఆధ్యాత్మికం మిశ్రమం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో ఆధ్యాత్మికంగా, సామాజిక పరంగా శుభాశుభ మిశ్రమంగా ఉంటుంది. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి చేయూత, పండితులకు కొంత వరకు ఆర్థికసాయం అందే అవకాశం ఉంది. గురుడు వర్ష జగ లగ్నంలో కేంద్రగతులవడం వల్ల ధార్మిక ఆరాధనల్లో విస్తృతి పెరుగుతుంది. ముఖ్య దేవాలయాల్లో కొన్ని సంస్కరణల వల్ల హైందవ జాతికి అనుకూలంగా ఉంటుంది. ఇంకా మతపరమైన విషయాల్లో స్వీయ మత ఎరుక పెరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా సనాతన ధర్మం అభివృద్ధికరంగా ఉంటుంది. అయితే షష్ఠగ్రహ కూటమి వల్ల బంద్‌లు, అధిక ఉష్ణోగ్రతల వల్ల సమాజంలో కొంత భయం ఏర్పడి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అంతరాయం కలుగవచ్చు. అలాగే మత్తు మందులు మారక ద్రవ్యాల వల్ల చెడుమార్గం పట్టే వారికి సంఖ్య పెరిగి వారికి ఆధ్యాత్మిక కట్టడి అవసరం అవుతుంది సమాజంలో ఆధ్యాత్మిక చింతనకు ధనవంతుల ఆర్థికసాయం లభించగలదు.

– **చింతా గోపీశర్మ,** సిద్ధాంతి

ప్రకృతికి ప్రణామం

మనం ఏ శుభలేఖల్లో అయినా స్వస్తిశ్రీ చాంద్రమానేన....అని చదువుతుంటాం. అంటే చాంద్రమానం ప్రకారం జరుపుకునే పండగల్లో ఉగాది పండగది ప్రథమస్థానం. ఉగాది రోజు నుంచే తెలుగు సంవత్సరం మొదలవుతుంది కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగ. 'ఉగాది' అన్న తెలుగు మాట 'యుగాది' అన్న సంస్కృతపద వికృతి రూపం. బ్రహ్మ ఒక కల్పం ప్రళయంతో అంతమై తిరిగి కొత్త బ్రహ్మ కల్పంలో సృష్టిని ఆరంభించిన రోజు. మొదటి ఋతువు వసంత ఋతువులో మొదటి మాసం (చైత్ర మాసం)లో మొదటి తిథి అయిన పాడ్యమి నాడు, మొదటి రోజైన ఆదివారం నాడు యావత్తు సృష్టిని ప్రభవింపజేసాడని అర్థం. అందుకే మొదటి సంవత్సరానికి 'ప్రభవ' అని పేరు. చివరి అరవయ్యవ సంవత్సరం పేరు 'క్షయ' అంటే నాశనం అని అర్థం.

ఉగాది సంప్రదాయాలు

ఉగాది రోజు తైలాభ్యంగనం, నూతన సంవత్సరాది స్తోత్రం, ఉగాది పచ్చడి సేవనం, ధ్వజారోహణం, పంచాంగ శ్రవణం తదితర పంచకృత్యాలను నిర్వహించాలని వ్రతగ్రంథం పేర్కొంటోంది. మామిడాకుల తోరణాలు కట్టడం, తలస్నానం చెయ్యడం, కొత్తబట్టలు ధరించడం, పిండి వంటలు చేయడం పూర్వం నుంచి వస్తున్న ఆచారం. ఆదాయ వ్యయాలు, రాజ పూజ్య అవమానాలు, కందాయ ఫలాలు, రాశి ఫలాలు తెలియజెప్పే పంచాంగం వినటం ఆనవాయితి. పల్లెల్లో రైతులు ఉగాది రోజున అక్కడి దేవాలయం వద్ద అంతా చేరి, పురోహితుడిని రప్పించి, తాము పండించబోయే పంటకి ఏ కార్తెలో ఎంత వర్షం పడుతుంది? గ్రహణాలు ఏమైనా ఉన్నాయా? ఏరువాక ఎప్పుడు సాగాలి... వంటివన్నీ శ్రద్ధాభక్తులతో అడిగి తెలుసుకుంటారు.

ఉగాది పూజ

అన్ని పండుగలలాగానే ఉగాది పండుగ నాడు ఉదయానే తలస్నానం చేసి కొత్త బట్టలు ధరించి పూజ చేసుకొంటారు. అయితే ప్రత్యేకంగా ఫలాని దేవుడి పూజ అని ఏమీ చెప్పబడ లేదు గనుక ఈరోజు ఇష్ట దేవతాపూజ చేసుకొంటారు. ఆ తర్వాత ఏమీ తినక ముందే తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు అనే ఆరు రుచులు కలసిన ఉగాది పచ్చడి తింటారు. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి ఇస్తుంది.

ఋతు మార్పు కారణంగా వచ్చే వాత, కఫ, పిత్త దోషాలను హరించే ఔషధంగా ఉగాది పచ్చడి తినే ఆచారం ఆరంభమైంది అంటారు. ఉగాది పచ్చడిని శాస్త్రీయంగా తయారు చేసే పద్ధతిలో ఉప్పు, వేపపువ్వు, చింతపండు, బెల్లం, పచ్చిమిరప కాయలు, మామిడి చిగుళ్ళు, అలాగే అశోక చిగుళ్ళు వేసి చేసేవాళ్ళు. ఈ పచ్చడిని శ్రీరామ నవమి వరకు తినడం వల్ల ఏడాదంతా అనారోగ్యం లేకుండా హాయిగా ఉండేలా చేస్తుందని వైద్యులు చెప్పే మాట. కాలక్రమంలో ఉగాది పచ్చడిలో లేత మామిడి చిగుళ్ళు, అనేక చిగుళ్ల, ఇలాంటివన్నీ మానేసి కేవలం వేపపూత, బెల్లం ముక్కలను మాత్రమే ఉపయోగించటం కనిపిస్తుంది.

ఎక్కడికీ కదలలేని చెట్లు కూడా తమ ఆకులను రాల్చేసుకుని చివుళ్లు తొడిగి పూత, పిందెలతో కళకళలాడే ఈ వసంతరుతువులో మనం కూడా మనలోని చెడు అలవాట్లను, నకారాత్మక ఆలోచనలను వదిలేసి, శుచి, శుభ్రత, సంయమనం, సమయపాలన, సమయోచిత కార్యాలను ఆచరించటమనే సద్గుణాలను అలవరచుకుందాం.

– డి.వి.ఆర్. భాస్కర్

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం అర్థం ఏమిటి?

నేడు మనం అడుగిడుతున్న కొత్త తెలుగు సంవత్సరానికి శ్రీవిశ్వావసు నామ సంవత్సరం అని పేరు. అంటే విశ్వ శ్రేయస్సు, విశ్వ సంపద అని అర్థం. ఇది అష్టవసువులలో ఒక వసువు పేరు. ఈ సంవత్సరం అందరికీ శ్రేయోదాయకంగా... సంపద్వంతంగా ఉంటుందని ఆశిద్దాం...



కొత్తదనం... పచ్చదనం

ఉగాది అనగానే ఏదో తెలియని కొత్తదనం సుతిమెత్తగా మనసును తాకినట్టు అనిపిస్తుంది. పచ్చదనం మనసునిండా పరుచుకుంటుంది. మామిడిపళ్లు, మల్లెమొగ్గలు, తాటి ముంజలు, పుచ్చకాయలు, కోయిల గానాలు మదిలో మెదులుతాయి. చిన్నప్పుడెప్పుడో చదువుకున్నట్టుగా చెట్లు చిగిర్చి పూలు పూసే వసంత రుతువు ఇది. మనసును ఉల్లాసపరిచే కాలం ఇది. అందుకే కవులు, కళాకారులు, సాహితీవేత్తలు ఉగాదిని, వసంత రుతువును విడిచిపెట్టలేదెప్పుడూ! ఉగాది కవి సమ్మేళనాలు, ఉగాది కథలు, కవితల పోటీలు, ఉగాది కార్టూన్లు కాగితం నిండా కళ్లు చేసుకుని తొంగి చూసే ప్రయత్నం చేస్తుంటాయి.

● ఉగాది తార

అందమైన తెలుగుదనం

– అనన్య నాగళ్ల

"ఆంగ్ల నూతన సంవత్సరాన్ని ఘనంగా జరుపుకుంటున్నాం. మరి... మన తెలుగు సంవత్సరాదిని ఇంకా ఘనంగా జరుపుకోవాలి కదా. మన సంస్కృతీ సంప్రదాయాలను పాటించే విషయంలో అస్సలు తగ్గకూడదు" అంటున్నారు అనన్య నాగళ్ల. తెలుగు తెరపై కథానాయికగా దూసుకెళుతున్న ఈ పదహారణాల తెలుగు అమ్మాయి 'సాక్షి' కోసం ప్రత్యేకంగా ముస్తాబయ్యారు. సంప్రదాయబద్ధంగా తయారై, ఉగాది పండగ గురించి పలు విశేషాలు పంచుకున్నారు.



ఫోటో: ఎస్.ఎస్. ఠాకూర్

- ఉగాది విశిష్టత అంటే మన తెలుగు సంవత్సరాది... మన సంప్రదాయం, మన సంస్కృతిని బాగా చూపించే పండగ. ఇంగ్లీష్ న్యూ ఇయర్‌ని బాగా సెలబ్రేట్ చేసుకుంటున్నాం. మన తెలుగు సంవత్సరాదిని అంతకంటే ఘనంగా జరుపుకోవడం నాకు ఇష్టం. పైగా తెలుగువారికి తొలి పండగ కాబట్టి బాగా జరుపుకోవాలనుకుంటాను.
- ఉగాది పండగ అనగానే నాకు రాశి ఫలాలు గుర్తొస్తాయి. ఉదయం లేవగానే రాశి ఫలాలు చూసుకోవడం, ఈ ఏడాది మన ఆదాయం, వ్యయం, రాజ పూజ్యం చూసుకోవడం అనేది సరదాగా అనిపిస్తుంటుంది. నాకు చిన్నప్పటి నుంచి అదొక ఆనవాయితీలా అయిపోయింది. ఉదయాన్నే లేచి అందంగా తయారవడం, ఉగాది పచ్చడి చేసుకోవడం, రాశి ఫలాలు చూసుకోవడం, గుడికి వెళ్లడం... ఇలానే నేను పండగ జరుపుకుంటాను. నాకు ఉగాది పండగ అంటే చాలా ఇష్టం. అందుకే ప్రతి ఏడాదీ బాగా చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాను. కానీ కొన్నిసార్లు కుదురుతుంది.. మరికొన్నిసార్లు కుదరదు. ఈ ఏడాది మాత్రం మంచిగా ముస్తాబై గుడికి వెళ్లాలని, ఇంటి వద్ద పిండి వంటలు చేసుకోవాలని ప్రణాళిక వేసుకున్నాను.
- ఉగాది పచ్చడి ఎప్పుడూ తయారు చేయలేదు. కానీ, ప్రతి ఏడాది తింటాను. ప్రత్యేకించి వేర్వేరు ఆలయాల్లో వేర్వేరు రుచుల్లో ఉగాది పచ్చడి ఉంటుంది. వీలైనన్ని టేస్ట్ చేస్తాను. ఇంట్లో మా అమ్మ ఉగాది పచ్చడి చేస్తుంటే సాయం చేశాను కానీ, నేనెప్పుడూ చేయలేదు. అయితే ఆ పచ్చడి రుచి అంటే నాకు చాలా ఇష్టం.
- ఉగాది పచ్చడి అంటేనే అందరూ చెబుతున్నట్లు ఆరు రుచులు ఉంటాయి. తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు... ఇలా అన్నమాట. నాకు ప్రత్యేకించి వగరుతో కూడిన రుచి అంటే ఇష్టం. ఎందుకంటే... బయట మనం వగరుతో కూడిన ఫుడ్‌ని ఎక్కువగా టేస్ట్ చేయలేం. అలాగే వగరు అనేది వైవిధ్యమైన ఫ్లేవర్‌ని యాడ్ చేస్తుంది... అందుకే నాకు ఇష్టం.
- నా బాల్యంలో జరుపుకున్న ఉగాది అంటే చాలా ఇష్టం. మా ఇంటి ముందు గుడి ఉండేది... అందరం పండగని సెలబ్రేట్ చేసుకోవడానికి ఆ గుడికి వెళ్లేవాళ్లం. చిన్నప్పుడు కాబట్టి కొత్త బట్టలంటే ప్రత్యేకమైన క్రేజ్ ఉండేది. ఇక రకరకాల పిండి వంటలు ఉంటాయి కదా... చాలా ఎగ్జయిటింగ్‌గా అనిపించేది.



నేడు వైజాగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ X సన్‌రైజర్స్ హైదరాబాద్

విశాఖపట్నం వేదికగా ఐపీఎల్‌లో నేడు మరో ఆసక్తికర సమరానికి రంగం సిద్ధమైంది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగే ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడుతుంది. ఇక్కడే జరిగిన గత మ్యాచ్‌లో లక్నోపై విజయం సాధించిన ఢిల్లీకి ఇది రెండో 'హోం మ్యాచ్' కానుంది. మరో వైపు ఆడిన రెండు మ్యాచ్‌లలో ఒకటి గెలిచి మరొకటి ఓడిన సన్‌రైజర్స్ లీగ్‌లో మళ్లీ గెలుపు బాట పట్టాలని పట్టుదలగా ఉంది. లక్నోతో మ్యాచ్‌లో దాదాపుగా ఓటమికి చేరువై అశుతోష్ అసాధారణ బ్యాటింగ్‌తో గెలుపు అందుకున్న అక్షర్ పటేల్ బృందం సమష్టిగా రాణిస్తేనే మరో విజయానికి అవకాశం ఉంటుంది. మరో వైపు తొలి మ్యాచ్‌లో రాజస్తాన్‌పై అద్భుత బ్యాటింగ్‌తో చెలరేగిన రైజర్స్ బ్యాటర్లు తర్వాతి పోరులో తడబడ్డారు. అయితే అంచనాలకు అనుగుణంగా హెడ్, అభిషేక్, ఇషాన్ కిషన్, క్లాసెన్ సత్తా చాటితే జట్టు భారీ స్కోరు సాధించడం ఖాయం. వైజాగ్‌కు చెందిన నితీశ్ కుమార్ రెడ్డి సన్‌రైజర్స్ తరఫున బరిలోకి దిగుతుండటంతో అభిమానులు కూడా మ్యాచ్ పట్ల ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు.



గుజరాత్ గెలుపు బోణీ

మాజీ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్ తాజా సీజన్‌లో తొలి విజయాన్ని అందుకుంది. మొదటి మ్యాచ్‌లో పంజాబ్ చేతిలో ఓడిన టీమ్ సొంతగడ్డపై పాయింట్ల ఖాతా తెరిచింది. బ్యాటింగ్‌లో సాయిసుదర్శన్, బౌలింగ్‌లో ప్రసిధ్, సిరాజ్ గెలుపులో కీలక పాత్ర పోషించారు. మరో వైపు గత మ్యాచ్‌లాగే అన్ని రంగాల్లో విఫలమైన ముంబై వరుసగా రెండో పరాజయాన్ని మూటగట్టుకుంది. బ్యాటింగ్‌లో ఆ జట్టు కనీస ప్రదర్శన కూడా ఇవ్వలేకపోయింది.

- తొలి విజయం సాధించిన టైటాన్స్
- 36 పరుగులతో ఓడిన ముంబై
- రాణించిన సుదర్శన్, ప్రసిధ్



తిలక్‌వర్మను అవుట్ చేసిన ప్రసిధ్ కృష్ణకు కెప్టెన్ గిల్, సిరాజ్ అభినందన

అహ్మదాబాద్: సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన గుజరాత్ టైటాన్స్ గెలుపు బోణీ చేసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 36 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన టైటాన్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (41 బంతుల్లో 63; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేయగా...జోస్ బట్లర్ (24 బంతుల్లో 39; 5 ఫోర్లు, 1 సిక్స్), శుబ్‌మన్ గిల్ (27 బంతుల్లో 38; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 160 పరుగులే చేయగలిగింది. సూర్యకుమార్ యాదవ్ (28 బంతుల్లో 48; 1 ఫోర్, 4 సిక్స్‌లు), తిలక్‌వర్మ (36 బంతుల్లో 39; 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ప్రసిధ్ కృష్ణ (2/18), సిరాజ్ (2/34) ప్రత్యర్థిని దెబ్బ తీశారు.

కీలక భాగస్వామ్యాలు...

గుజరాత్ ఇన్నింగ్స్‌లో టాప్-3 నెలకొల్పిన రెండు అర్ధ సెంచరీ భాగస్వామ్యాలు జట్టు స్కోరులో కీలకంగా నిలిచాయి. తొలి వికెట్‌తో గిల్‌తో 78 పరుగులు (51 బంతుల్లో) జోడించిన సుదర్శన్, రెండో వికెట్‌కు బట్లర్‌తో 51 పరుగులు (32 బంతుల్లో) జత చేశాడు. సుదర్శన్, గిల్ ధాటిగా ఆడుతూ 7 ఫోర్లు, 2 సిక్స్‌లు కొట్టడంతో పవర్‌ప్లే ముగిసే సరికి స్కోరు 66 పరుగులకు చేరింది. గిల్ వెనుదిరిగిన తర్వాత వచ్చిన బట్లర్ కూడా కొద్ది సేపు ధాటిని ప్రదర్శించాడు. 33 బంతుల్లో వరుసగా రెండో మ్యాచ్‌లో సుదర్శన్ అర్ధ సెంచరీ పూర్తయింది. షారుఖ్ ఖాన్ (9)ను ముందుగా పంపిన ప్రయత్నం ఫలితం ఇవ్వకపోగా, రూథర్‌ఫోర్డ్ (18) రాజు ఓవర్లో రెండు సిక్సర్లు బాదాడు. 18వ ఓవర్ చివరి బంతికి సుదర్శన్‌ను బౌల్డ్ అవుట్ చేయడంతో గుజరాత్ జోరుక బ్రేక్ పడింది. చివరి 2 ఓవర్లలో ఆ జట్టు 17 పరుగులు మాత్రమే సాధించి 4 వికెట్లు చేజార్చుకుంది. దాంతో స్కోరు 200 పరుగులు దాటలేకపోయింది. **ముంబై తరఫున రెండో మ్యాచ్ ఆడిన ఆంధ్ర పేస్ బౌలర్ పెన్మత్స సత్యనారాయణ రాజు ఐపీఎల్‌లో తన తొలి వికెట్ సాధించడం విశేషం.**

ఐపీఎల్-2025: అప్‌డేట్, వివరాలు, విశ్లేషణ కోసం స్కాన్ చేయండి

రాణించిన తిలక్...

ఛేదనలో ముంబై పూర్తిగా తడబడింది. తిలక్‌వర్మ, సూర్యకుమార్ క్రీజ్‌లో ఉన్న సమయంలోనే జట్టు గెలుపుపై ఆశలు ఉండగా...ఇది మినహా మిగతా ఇన్నింగ్స్ పేలవంగా సాగింది. సిరాజ్ వేసిన తొలి ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన రోహిత్ శర్మ (8) తర్వాతి బంతికి వెనుదిరగ్గా, రికెల్టన్ (6)ను కూడా సిరాజ్ బౌల్డ్ చేశాడు. తిలక్ మాత్రం కొన్ని చక్కటి షాట్లతో అలరించాడు. రబాడ ఓవర్లో అతను వరుసగా 4, 4, 6 కొట్టాడు. మరో ఎండ్‌లో సూర్య కూడా తనదైన శైలిలో ధాటిగా ఆడాడు. మూడో వికెట్‌కు 42 బంతుల్లో 62 పరుగులు జత చేసిన తర్వాత తిలక్‌ను ప్రసిధ్ వెనక్కి పంపాడు. 51 బంతుల్లో 100 పరుగులు చేయాల్సిన ఈ స్థితినుంచి ముంబై కోలుకోలేకపోయింది. 27 పరుగుల వ్యవధిలో తర్వాతి 4 వికెట్లు కోల్పోయిన జట్టు ఓటమిని ఆహ్వానించింది.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (ఎల్బీ) (బి) బౌల్ట్ 63; శుబ్‌మన్ గిల్ (సి) నమన్ (బి) పాండ్యా 38; బట్లర్ (సి) రికెల్టన్ (బి) ముజీబ్ 39; షారుఖ్ (సి) తిలక్ (బి) పాండ్యా 9; రూథర్‌ఫోర్డ్ (సి) సాంట్నర్ (బి) చహర్ 18; తెవాటియా (రనౌట్) 0; రషీద్ (సి) పాండ్యా (బి) రాజు 6; రబాడ (నాటౌట్) 7; సాయికిషోర్ (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 196. వికెట్ల పతనం: 1-78, 2-129, 3-146, 4-179, 5-179, 6-179, 7-194, 8-196. బౌలింగ్: ట్రెంట్ బౌల్ట్ 4-0-34-1, దీపక్ చహర్ 4-0-39-1, ముజీబ్ 2-0-28-1, హార్దిక్ పాండ్యా 4-0-29-2, సాంట్నర్ 3-0-25-0, సత్యనారాయణ రాజు 3-0-40-1.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) సిరాజ్ 8; రికెల్టన్ (బి) సిరాజ్ 6; తిలక్‌వర్మ (సి) తెవాటియా (బి) ప్రసిధ్ 39; సూర్యకుమార్ (సి) గిల్ (బి) ప్రసిధ్ 48; మిన్జ్ (సి) ఇషాంత్ (బి) సాయికిషోర్ 3; పాండ్యా (సి) సిరాజ్ (బి) రబాడ 11; నమన్ (నాటౌట్) 18; సాంట్నర్ (నాటౌట్) 18; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 160. వికెట్ల పతనం: 1-8, 2-35, 3-97, 4-108, 5-120, 6-124. బౌలింగ్: సిరాజ్ 4-0-34-2, రబాడ 4-0-42-1, ఇషాంత్ 2-0-17-0, రషీద్ 2-0-10-0, సాయికిషోర్ 4-0-37-1, ప్రసిధ్ 4-0-18-2.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
బెంగళూరు	2	2	0	4	2.266
లక్నో	2	1	1	2	0.963
గుజరాత్	2	1	1	2	0.625
పంజాబ్	1	1	0	2	0.550
ఢిల్లీ	1	1	0	2	0.371
హైదరాబాద్	2	1	1	2	-0.128
కోల్‌కతా	2	1	1	2	-0.308
చెన్నై	2	1	1	2	-1.013
ముంబై	2	0	2	0	-1.163
రాజస్తాన్	2	0	2	0	-1.882

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ఢిల్లీ X హైదరాబాద్
వేదిక: విశాఖపట్నం
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

రాజస్తాన్ X చెన్నై
వేదిక: గువాహటి
రాత్రి 7: 30 గంటల నుంచి

స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

శరత్ కమల్ శకం ముగిసె...

- చివరి మ్యాచ్ ఆడిన స్టార్ ప్యాడ్లర్
- స్నేహిత్ చేతిలో పరాజయం



చెన్నై: భారత టేబుల్ టెన్నిస్ ఆల్‌టైమ్ గ్రేట్ ప్లేయర్ ఆచంట శరత్ కమల్ తన ఆట ముగించాడు. వరల్డ్ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెండర్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో పరాజయంతో అతను రిటైర్ అయ్యాడు. ఈ టోర్నీ ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో సూరావజ్జుల స్నేహిత్ (తెలంగాణ) చేతిలో శరత్ కమల్ 0-3తో ఓటమిపాలయ్యాడు. 25 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో స్నేహిత్ 11-9, 11-8, 11-9తో విజయం సాధించాడు. శరత్ కమల్ చివరి మ్యాచ్ చూడటం కోసం నెహ్రూ స్టేడియానికి పెద్ద సంఖ్యలో అభిమానులు వచ్చారు. మ్యాచ్ ముగిసిన తర్వాత వారందరికీ అభివాదం చేస్తూ అతను కృతజ్ఞతలు తెలిపాడు. అంతకు ముందే పురుషుల డబుల్స్ విభాగంలో స్నేహిత్‌తోనే కలిసి శరత్ డబుల్స్ సెమీ ఫైనల్ మ్యాచ్ ఆడాడు. ఈ పోరులో కొరియా జోడి లిమ్ జాంగూన్ - ఆన్ జీహూన్ చేతిలో 11-9, 8-11, 9-11, 6-11 స్కోరుతో శరత్ - స్నేహిత్ ఓడిపోయారు. 17 ఏళ్ల వయసులో చెన్నైలోనే జరిగిన ఆసియా జూనియర్స్ టోర్నీతో తొలిసారి ప్రొఫెషనల్ టేబుల్ టెన్నిస్ బరిలోకి దిగిన శరత్ కమల్ రెండు దశాబ్దాలకు పైగా సాగిన కెరీర్‌లో ఎన్నో ఘనతలు సాధించాడు. అసాధారణ రీతిలో 10 సార్లు జాతీయ చాంపియన్‌గా నిలిచిన శరత్ అంతర్జాతీయ మెగా ఈవెంట్లలో పెద్ద సంఖ్యలో పతకాలు గెలుచుకున్నాడు. కామన్వెల్త్ క్రీడల్లో 7 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్యాలు గెలిచిన అతను ఆసియా క్రీడల్లో 2 కాంస్యాలు సాధించాడు. ఆసియా చాంపియన్‌షిప్‌లో కూడా అతని ఖాతాలో 4 కాంస్యాలు ఉన్నాయి. 2004 నుంచి 2024 మధ్య ఐదు ఒలింపిక్స్‌లలో పాల్గొన్న శరత్ కమల్‌ను భారత ప్రభుత్వం పద్మశ్రీ, ఖేల్‌రత్న పురస్కారాలతో గౌరవించింది.

న్యూజిలాండ్‌దే తొలి వన్డే

73 పరుగులతో పాక్ చిత్తు



చాప్‌మన్

నేపియర్: టి20 సిరీస్‌లో పాకిస్తాన్‌ను చిత్తు చేసిన న్యూజిలాండ్ సొంతగడ్డపై వన్డేల్లోనూ అదే జోరు కొనసాగించింది. శనివారం జరిగిన తొలి వన్డేలో కివీస్ 73 పరుగుల తేడాతో పాక్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 344 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మార్క్ చాప్‌మన్ (111 బంతుల్లో 132; 13 ఫోర్లు, 6 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా...డరైల్ మిచెల్ (84 బంతుల్లో 76; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించాడు. ఇర్ఫాన్ ఖాన్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం పాక్ 44.1 ఓవర్లలో 271 పరుగులకే ఆలౌటైంది. బాబర్ ఆజమ్ (83 బంతుల్లో 78; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), సల్మాన్ ఆగా (48 బంతుల్లో 58; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలు సాధించగా... ఉస్మాన్ ఖాన్ (39), అబ్దుల్లా షఫీక్ (36), మొహమ్మద్ రిజ్వాన్ (30) ఫర్వాలేదనిపించారు. కివీస్ బౌలర్లలో నాథన్ స్మిత్ 4 వికెట్లు పడగొట్టాడు. కివీస్ తరఫున ముహమ్మద్ అబ్బాస్‌కు ఇదే తొలి అంతర్జాతీయ మ్యాచ్. పాక్ గడ్డపై పుట్టి న్యూజిలాండ్‌కు ప్రాతినిధ్యం వహించిన తొలి ఆటగాడిగా నిలిచిన అబ్బాస్ అర్ధసెంచరీ (26 బంతుల్లో 52; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) చేయడంతో పాటు ఒక వికెట్ కూడా తీయడం విశేషం.

భారత రెజ్లర్లకు నిరాశ

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో శనివారం భారత్‌కు నిరాశాజనక ఫలితాలు ఎదురయ్యాయి. ఫ్రీస్టయిల్ పురుషుల విభాగంలో బరిలో నిలిచిన ఐదుగురు భారత రెజ్లర్లు కూడా ఓటమిపాలయ్యారు. సుజీత్ కల్కల్ (65 కేజీలు), విశాల్ కాళీరామన్ (65 కేజీలు), చిరాగ్ (57 కేజీలు), చంద్రమోహన్ (79 కేజీలు), జాయింటీ కుమార్ (97 కేజీలు) ముందంజ వేయడంలో విఫలమయ్యారు. ఆసియా చాంపియన్‌షిప్ పోటీలకు నేడు ఆఖరి రోజు. 92 కేజీల విభాగంలో పోటీ పడుతున్న దీపక్ పూనియాపై భారత్ పతక ఆశలు ఉన్నాయి.

సాక్షి సినిమా

కన్నప్ప విడుదల వాయిదా

విష్ణు మంచు హీరోగా నటించిన పాన్ ఇండియన్ మూవీ 'కన్నప్ప' విడుదల వాయిదా పడింది. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మోహన్‌బాబు, బ్రహ్మానందం, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, శరత్‌కుమార్, కాజల్ అగర్వాల్ ఇతర కీలక పాత్రలు పోషించారు. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 25న విడుదల కావాల్సి ఉంది. అయితే వీఎఫ్‌ఎక్స్ పనుల ఆలస్యం వల్ల విడుదలను వాయిదా వేసినట్లు ప్రకటించారు. ''కన్నప్ప' జీవిత ప్రయాణం అద్భుతమైనది. అత్యున్నత ప్రమాణాలు కలిగిన సినిమాటిక్ అనుభూతితో ఈ చిత్రాన్ని ప్రేక్షకులకు అందించడానికి మేం కృత నిశ్చయంతో ఉన్నాం. అందుకు మరికొన్ని వారాల సమయం అవసరం. కీలక ఎపిసోడ్స్‌కు సంబంధించిన వీఎఫ్‌ఎక్స్ పనులు ఇంకా పూర్తి కాలేదు. దీంతో సినిమా విడుదల కాస్త ఆలస్యమవుతుంది. మహా శివుడికి కన్నప్ప ఎంత గొప్ప భక్తుడో అందరికీ తెలుసు. అలాంటి భక్తుడి కథను అద్భుతంగా మీ ముందుకు తీసుకు రావాలనుకుంటున్నాం. కొత్త విడుదల తేదీతో మీ ముందుకు వస్తాం'' అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు విష్ణు మంచు.



మంచు విష్ణు

డొక్కా సీతమ్మ పాత్ర చేయడం నా అదృష్టం
- ఆమని

మురళీమోహన్, ఆమని ప్రధాన పాత్రల్లో టీవీ రవి నారాయణ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ'. వల్లూరి రాంబాబు నిర్మించారు. ఈ మూవీ టైటిల్ పోస్టర్ రిలీజ్ ఈవెంట్‌లో ఓ అతిథిగా పాల్గొన్న నిర్మాత అంబికా కృష్ణ మాట్లాడుతూ– ''తనకున్న నాలుగు వందల ఎకరాల భూమి అమ్మి, అందరికీ అన్నం పెట్టిన డొక్కా సీతమ్మ గురించి జనాలకు తెలియాలి'' అన్నారు. ''డొక్కా సీతమ్మ అంటే బ్రిటిష్ వారికి కూడా తెలుసు. లండన్ రాజు ఆహ్వానాన్ని కూడా తిరస్కరించి ఇక్కడే ఉండి సేవ చేశారామె'' అని మరో అతిథి, దర్శకుడు రేలంగి నరసింహారావు తెలిపారు. మురళీ మోహన్ మాట్లాడుతూ– ''ఆమనికి ఈ సినిమాతో జాతీయ అవార్డు రావాలి'' అని ఆశాభావం వ్యక్తం చేశారు. ''డొక్కా సీతమ్మగారి చరిత్ర అందరికీ తెలియాలనే ఈ సినిమా తీశాం'' అన్నారు రవి నారాయణ్. ''సీతమ్మగారి పాత్ర చేసే చాన్స్ నాకు రావడం నా అదృష్టం'' అని ఆమని చెప్పారు. ''మా సినిమాని త్వరలో రిలీజ్ చేస్తాం'' అన్నారు వల్లూరి రాంబాబు. నృత్య దర్శకురాలు సుచిత్రా చంద్రబోస్ మాట్లాడారు.



పట్టుదలతో విజయం సాధించాను
- దర్శకుడు విశ్వనాథ్



''దర్శకుడిగా నా తొలి చిత్రం '28 డిగ్రీస్ సెల్సియస్'. 2017లో ఈ మూవీ చిత్రీకరణను ప్రారంభించాం. 2020 మేలో రిలీజ్ చేయాలనుకున్నాం. ఆ ఏడాది మార్చిలో లాక్ డౌన్ వచ్చింది. అప్పుడు ఓటీటీ ఆఫర్స్ వచ్చాయి కానీ చాలా తక్కువ మొత్తానికి అడిగారు. అందుకని ఇవ్వలేదు. ఇటీవల నిర్మాత వంశీ నందిపాటి గారు ఈ సినిమా చూసి, థియేటర్స్‌లో రిలీజ్ చేద్దామన్నారు. అదృష్టం కొద్దీ మా సినిమా కాన్సెప్ట్‌తో మరో మూవీ రాలేదు'' అని అన్నారు దర్శకుడు డా. విశ్వనాథ్. నవీన్ చంద్ర, షాలినీ వడ్నికట్టి జంటగా నటించిన చిత్రం '28 డిగ్రీస్ సెల్సియస్'. సాయి అభిషేక్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 4న రిలీజ్ కానుంది. శనివారం విలేకరుల సమావేశంలో అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ– ''ఇద్దరు డాక్టర్స్ (కార్తీక్‌గా నవీన్, అంజలిగా షాలిని) బ్యూటిఫుల్ లవ్‌స్టోరీ ఫిల్మ్ ఇది. బ్రెయిన్ డ్యామేజ్ అయిన వారు ఎక్కువ వేడి, చల్లదనం తట్టుకోలేరు. ఈ అంశాన్ని సినిమాలో చూపించాం. ఎన్నో కష్టాలు పడి ఈ సినిమా పూర్తి చేశాం. కానీ ఈ చిత్రం అప్పట్లో థియేటర్స్‌లో రిలీజ్ కాలేదు. దాంతో నా జీవితం ప్రశ్నార్థకమైంది. ఈ నేపథ్యంలో సూసైడ్ థాట్స్ కూడా వచ్చాయి. నాకు నేను సర్ది చెప్పుకుని, పట్టుదలతో 'పొలిమేర' స్క్రిప్ట్‌ను రెడీ చేసుకుని సినిమా తీశాను... సక్సెస్ అయ్యాను. ఆ తర్వాత 'పొలిమేర 2' చేశాను. మళ్లీ విజయం సాధించాను. 'పొలిమేర 3'ను ఆగస్టులో ప్రారంభించాలనుకుంటున్నాం. ఈ చిత్రంలో ఓ పెద్ద స్టార్ హీరో కీ రోల్ చేస్తారు. నా దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో ఓ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీ ఉంది. ఇంకా నేను షో రన్నర్‌గా, నాని కాసరగడ్డ దర్శకత్వంలో 'అల్లరి' నరేశ్ హీరోగా '12ఏ రైల్వే కాలనీ' మూవీ చేస్తున్నాం'' అని అన్నారు.

ఈ ఆటకు అంతం లేదా!



అల్లాణి శ్రీధర్

'కొమరం భీమ్, రగులుతున్న భారతం' తదితర చిత్రాల ఫేమ్ దర్శకుడు అల్లాణి శ్రీధర్ తెరకెక్కించనున్న తాజా చిత్రం 'బెట్టింగ్'. 'ఈ ఆటకు అంతం లేదా' అనేది ఉపశీర్షిక. నిర్మాత సి. కల్యాణ్ సమర్పణ, మార్గనిర్దేశకత్వంతో తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ఈ సినిమాను నిర్మించనున్నారు. ''ఉగాది పర్వదినాన ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభిస్తున్నాం. ప్రస్తుతం సమాజాన్ని పట్టి పీడిస్తున్న తీవ్రమైన సమస్య - బెట్టింగ్ యాప్‌ల వ్యసనం. ఈ మాయ వ్యసనానికి పలువురు 'లోన్ ' అవుతున్నారు, బలవుతున్నారు. అప్పుల ఊబిలో కొందరు జీవితాన్ని కోల్పోయే దాకా వెళ్తున్నారు. ఈ ఆవేదన, సమస్యకు పరిష్కారాన్ని కూడా వెండితెరపై చూపేలా మా సినిమా ఉంటుంది. భావోద్వేగాలతో నిండిన కుటుంబ నేపథ్యం, ఆత్మవిమర్శను కలిగించే ప్రేమకథ, సామాజిక సందేశం... వంటి అంశాలతో ఈ సినిమాను రూపొందించనున్నాం. ఈ సినిమాలో కేవలం వినోదం మాత్రమే కాదు.. ఇది ఒక జాగృతం. ఒకే షెడ్యూల్‌లో చిత్రీకరణ పూర్తి చేసి, ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఆ విషయం తెలిసి ఆశ్చర్యపోయాను
- ఎమ్మెల్యే సి. మల్లారెడ్డి



కషికా, శ్రీహర్ష, మల్లా రెడ్డి, ఎస్పీ చరణ్, పవన్

''శ్రీహర్ష మా కళాశాల విద్యార్థి. వాళ్ల నాన్న రామస్వామి రెడ్డి మా కాలేజ్ ప్రిన్సిపాల్. వీళ్లు 'ఎల్.వై.ఎఫ్' (లవ్ యువర్ ఫాదర్) సినిమాని పాన్ ఇండియా భాషల్లో తీశారని తెలిసి ఆశ్చర్యపోయాను. శ్రీహర్ష తమిళ హీరో విజయ్ కంటే స్మార్ట్‌గా ఉన్నాడు. ప్రవీణ్ ఈ సినిమాని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించి పాన్ ఇండియా హిట్ చేయాలని కోరుతున్నాను'' అని ఎమ్మెల్యే సి. మల్లారెడ్డి అన్నారు. శ్రీహర్ష, కషికా కపూర్ జంటగా ఎస్పీ చరణ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఎల్.వై.ఎఫ్' (లవ్ యువర్ ఫాదర్). పవన్ కేతరాజు దర్శకత్వం వహించారు. మనీషా ఆర్ట్స్, అన్నపరెడ్డి స్టూడియోస్ బ్యానర్లపై కిశోర్ రాఠీ, మహేశ్ రాఠీ, ఎ. రామస్వామి రెడ్డి నిర్మించారు. ఈ సినిమాకు మణిశర్మ సంగీతం అందించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా మల్లా రెడ్డి హాజరయ్యారు. హీరో శ్రీహర్ష మాట్లాడుతూ– ''మా 'ఎల్.వై.ఎఫ్'లో మల్లారెడ్డిగారు నటించి ఉంటే పాన్ వరల్డ్ సినిమా అయ్యేది.. ఆయన నటించకపోవడం వల్ల పాన్ ఇండియా సినిమా అయ్యింది. ఈ సినిమాని నిర్మించిన మా నాన్న రామస్వామి రెడ్డికి కృతజ్ఞతలు'' అన్నారు. పవన్ కేతరాజు మాట్లాడుతూ– ''నాకు అవకాశం ఇచ్చిన నిర్మాతలకు కృతజ్ఞతలు'' అని తెలిపారు. ''ఇంతమంచి సినిమాలో నటించే అవకాశం ఇచ్చారు... కానీ పాడే అవకాశం ఇవ్వనందుకు కోపంగా ఉంది (నవ్వుతూ) అన్నారు ఎస్పీ చరణ్. ''మా సినిమా కచ్చితంగా అందరికీ నచ్చుతుంది'' అనే ఆశాభావం వ్యక్తం చేశారు కిశోర్ రాఠీ.

మధురమైన ప్రేమకథ



ఉదయ్‌రాజ్, వైష్ణవీ సింగ్

ఉదయ్ రాజ్, వైష్ణవీ సింగ్ జంటగా రాజేశ్ చికిలే దర్శకత్వం వహించిన చిత్రం 'మధురం'. 'ఎ మెమొరబుల్ లవ్' అనేది ట్యాగ్‌లైన్. శ్రీ వెంకటేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్‌పై యం. బంగార్రాజు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా రాజేశ్ చికిలే మాట్లాడుతూ– ''1990 నేపథ్యంలో జరిగే టీనేజ్ లవ్ స్టోరీ ఇది. అప్పటి స్కూల్ వాతావరణం, ఆటలు, అల్లర్లు ఎలా ఉండేవో నేటి తరానికి చూపిస్తున్నాం'' అని చెప్పారు. ''ఈ సినిమా నా కెరీర్‌కి టర్నింగ్ పాయింట్ అవుతుంది'' అన్నారు ఉదయ్ రాజ్. ''నితిన్ గారు రిలీజ్ చేసిన మా మూవీ టీజర్‌కి మంచి స్పందన లభించింది. సినిమా కూడా అందరికీ నచ్చేలా ఉంటుంది'' అని యం. బంగార్రాజు తెలిపారు. ''ఈ చిత్రంలో నా పాత్ర అందర్నీ అలరిస్తుంది'' అన్నారు వైష్ణవీ సింగ్.

ఓటీటీ — ఇది చూడొచ్చు

మన సిద్ధ వైద్య రహస్యాలు చెప్పిన సినిమా

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం అగత్తియా ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

మనం చూసే సినిమాలలో మనకు తెలియని చరిత్రకు సంబంధించిన రహస్యాలు చాలావరకు తెలుపుతూ ఉంటాయి. అటువంటి రహస్యాలలో మన సంస్కృతికి సంబంధించిన సిద్ధ వైద్యం ఒకటి. కొన్ని వేల సంవత్సరాలకు ముందే మన పూర్వీకులు మన ఆరోగ్యం కోసం అద్భుత ఔషధాల వివరాలను గోప్యంగా పొందుపరిచారు. కోట్ల విలువైన సంపద కంటే ఈ వివరాలు ఎంతో విలువగలవి. కానీ దురదృష్టవశాత్తు అటువంటి వివరాలు చాలావరకు విదేశీయులు నాశనం చేయడమో, కొల్లగొట్టడమో జరిగింది. ఆ సమయంలో ఎంతోమంది ఎన్నో పోరాటాలు చేసి ఆ మహత్ గ్రంథాలను కాపాడి ప్రాణత్యాగం చేశారు. ఆ నేపథ్యంలోనే అల్లుకున్న కథ 'అగత్తియా'. దేవతలకు రాక్షసుల మధ్య పోరాటం అనే టాగ్ లైన్‌తో సినిమా కథాంశం నడుస్తుంది. కథానుగుణంగా సీరియస్ పాయింట్ అయినా ఈ సినిమా దర్శకుడు పా. విజయ్ తన స్క్రీన్‌ప్లేతో దీనిని హారర్ కామెడీలా తెరకెక్కించారు. సినిమా మొత్తం సిద్ధ వైద్యం గొప్పతనాన్ని ప్రేక్షకులకు ఓ పక్క చెబుతూనే మరో పక్క కమర్షియల్ కామెడీ హంగులతో ప్రేక్షకులకు బోర్ కొట్టకుండా చేశారు. ఈ సినిమాలో లీడ్ రోల్స్‌లో జీవా, రాశీ ఖన్నా నటించారు. మరో ముఖ్య పాత్రలో ప్రముఖ నటుడు అర్జున్ నటించారు. ఇక సినిమా కథ విషయానికొస్తే... అగత్యన్ అనే ఆర్ట్ డైరెక్టర్ ఓ సినిమా కోసం తాను కూడా డబ్బులు పెట్టి ఓ పురాతన బంగ్లాలో షూటింగ్ ఏర్పాటు చేసుకుంటాడు. కానీ కొన్ని కారణాల వల్ల ఆ సినిమా షూటింగ్ రద్దవుతుంది. పెట్టుబడి పెట్టిన డబ్బులు పోతాయనే ఉద్దేశంతో ఆ బంగ్లాని ఓ హారర్ థీమ్‌తో పర్యాటక కేంద్రంగా మారుస్తాడు. పర్యాటకులను ఆ బంగ్లాలో అనుమతించినప్పటి నుండి బంగ్లాలో కొన్ని అనూహ్య సంఘటనలు జరుగుతాయి. అంతేకాదు అగత్యన్ టీమ్‌కి ఓ పాత పియానో కూడా దొరుకుతుంది. ఆ మిస్టరీ పియానో అగత్యన్‌కి ఆ బంగ్లా కథ చెబుతుంటుంది. అగత్యన్ తల్లి కేన్సర్‌తో బాధ పడుతుంటుంది. ఆ బంగ్లా వల్ల వాళ్ల అమ్మ కోలుకుంటుంది. అది ఎలానో మీరు సన్ నెక్స్ట్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'అగత్తియా' చూసి తెలుసుకోవాల్సిందే. తెలుగు వెర్షన్ 'అగత్యా' కూడా స్ట్రీమింగ్ అవుతోంది. ఐదేళ్ల క్రితం కరోనా వచ్చినప్పుడు ప్రపంచం అల్లాడిపోయింది. అప్పుడు ఇంగ్లిషు మందులతో పాటు మన ప్రాచీన వైద్యంతో కూడా చాలా మంది కోలుకున్నారు. అలానే మన సిద్ధ వైద్యం కూడా. అసలింతలా ఏముంది ఆ సిద్ధ వైద్యంలో అని అనుకుంటే 'అగత్యా' సినిమా చూడండి. ఉగాది పండగ రోజు పూజా పునస్కారాలయ్యాక మంచి కాలక్షేపం ఈ సినిమా.



– ఇంటూరు హరికృష్ణ

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

ఆస్తిపన్ను వసూళ్లు రూ. 1,010 కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పురపాలికల్లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను రూ. 1,010 కోట్లు వసూలైంది. ఇది జీహెచ్‌ఎంసీ మినహా రాష్ట్రంలోని 141 పురపాలికల్లో వసూలైన మొత్తం కావడం గమనార్హం. ఆది, సోమవారాల్లో ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ, ఆస్తిపన్ను వసూళ్ల కోసం నగర పాలక సంస్థలు, మునిసిపాలిటీల్లో సిబ్బంది విధుల్లో ఉంటారని పురపాలక శాఖ తెలిపింది. ఈ రెండు రోజుల్లో చెల్లించే మొత్తంతో రూ. 1,050 కోట్ల వరకు ఆస్తిపన్ను వసూలయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కాగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను రూ. 922 కోట్లు మాత్రమే వసూలు కాగా, ఈసారి రూ. 1000 కోట్ల మైలు రాయిని దాటడం పట్ల మునిసిపల్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజావాణి కార్యక్రమం వాయిదా

ప్రజాభవన్‌లో ఏప్రిల్1న జరగాల్సిన కార్యక్రమం 4కు వాయిదా

లక్డీకాపూల్(హైదరాబాద్): మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం వాయిదా పడింది. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఈ కార్యక్రమం జరుగుతున్న విషయం తెలిసిందే. రంజాన్ పండుగ మరుసటి రోజు మంగళవారం (ఏప్రిల్ 1) కావడం వల్ల ఈ కార్యక్రమాన్ని శుక్రవారం (ఏప్రిల్ 4) నాటికి వాయిదా వేసినట్టు ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య శనివారం ఒక ప్రకటనతో తెలిపారు.

పిడుగుపాటు మృతుల కుటుంబాలకు నష్టపరిహారం

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్: రాష్ట్రంలో గత ఐదేళ్లలో పిడుగుపాటుకు మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం విడుదల చేసింది. ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.6 లక్షల నష్టపరిహారాన్ని అందించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. పిడుగు పాటుతో మృతి చెందిన వారి ఒక్కో కుటుంబానికి ఆరు లక్షలు, అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు 4 లక్షలు లెక్కన నష్ట పరిహారం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. బాధిత కుటుంబాలకు ఈ పరిహారాన్ని త్వరితగతిన అందించాలని కలెక్టర్లను ఆదేశించారు.

రేపటితో 90 శాతం రైతుభరోసా పూర్తి

● మంత్రి తుమ్మల



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: రైతుభరోసాకు సంబంధించి సోమవారం రాత్రి వరకు 80 నుంచి 90 శాతం చెల్లింపులు పూర్తవుతాయని, రైతుల ఖాతాల్లో ఎకరాకు రూ.6 వేలు జమ అవుతాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ చుట్టుపక్కల గత 30 ఏళ్లుగా వ్యవసాయ యోగ్యం కాని భూములు పడావు పడ్డాయని, అలాంటి భూములకు రైతుభరోసా ఆగుతుందన్నారు. వ్యవసాయం చేసే ప్రతీ ఎకరాకు సీజన్ వారీగా రూ.6వేల చొప్పున రైతుల ఖాతాల్లో వేస్తున్నట్లు చెప్పారు. వానాకాలంలో రైతుల నుంచి సేకరించిన సన్నధాన్యానికి సంబంధించి బోనస్ రాష్ట్రవ్యాప్తంగా రూ. 1,200 కోట్లు ఖాతాల్లో జమ అయ్యాయని, బోనస్ పెండింగ్ లేదని మంత్రి వెల్లడించారు.

వస్త్ర ప్రియులకోసం 'అన్‌లిమిటెడ్' తాజా కలెక్షన్

న్యూఢిల్లీ: పండుగల సందర్భాన్ని పురస్కరించుకుని 'అన్‌లిమిటెడ్'వస్త్రాల బ్రాండ్ తాజా కలెక్షన్‌ను ప్రవేశపెట్టింది. మహిళలు, పురుషులు, పిల్లల కోసం ట్రెండీ డిజైన్‌లను వినియోగదారులకోసం అందుబాటులోకి తెచ్చింది. ఈ కలెక్షన్‌లో కుర్తాలు, సల్వార్ సూట్‌లు, మహిళలకు ఫ్యాషన్ టాప్‌లతో పాటు పురుషుల కోసం భారీ టీ–షర్టులు, కార్గోలు, రిసార్ట్ కాలర్ షర్టులు ఉన్నాయి. పండుగ షాపింగ్ అనుభవాన్ని మరింత మెరుగుపరచడానికి 'అన్‌లిమిటెడ్ ప్రత్యేకమైన ఆఫర్‌లను కూడా అందిస్తోంది! రూ.3,000 కొనుగోలుపై ఇయర్‌బడ్‌లు లేదా ల్యాప్‌టాప్ బ్యాగ్‌ను రూ. 99కే అందిస్తోంది. అలాగే రూ. 6,000 కొనుగోలుపై మూడు పీసుల కాసరోల్ రూ. 99కే పొందొచ్చు.

ముందుగానే ఎందుకు పారిపోయారు?

● దర్యాప్తు పరిణామాలను ముందే ఊహించారా?
● అమెరికాలో ఎవరి వద్ద ఆశ్రయం పొందారు?
● ఫోన్ ట్యాపింగ్ కేసులో శ్రవణ్‌రావుకు సిట్ ప్రశ్నలు
● ఆయన విచారణకు సహకరించలేదన్న పోలీసులు
● ఏప్రిల్ 2న మరోసారి విచారణకు రావాలని పోలీసుల ఆదేశం



జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరైన ఫోన్‌ట్యాపింగ్ నిందితుడు శ్రవణ్‌రావు

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరో నిందితుడిగా ఉన్న ఓ మీడియా ఛానల్ అధినేత శ్రవణ్‌రావు ఎట్టకేలకు పోలీసుల ముందు విచారణకు హాజరయ్యారు. గత ఏడాది మార్చి నుంచి అమెరికాలో తలదాచుకున్న ఆయన.. శనివారం ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ ఎదుటికి వచ్చారు. ఉదయం 11.20 గంటలకు విచారణాధికారి ముందు హాజరయ్యారు. సాయంత్రం 6 గంటల వరకు వివిధ అంశాలపై ఆయనను ప్రశ్నించారు. 'అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా మారకముందే దేశం విడిచి ఎందుకు పారిపోయారు? ఫోన్ ట్యాపింగ్‌లో మీ పాత్ర ఉన్నందుకే దర్యాప్తు పరిణామాలను ఊహించి పారిపోయారా? ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన ఎస్‌ఐబీ మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావుతో మీకు ఉన్న సంబంధాలు ఎలాంటివి? విదేశాలకు పారిపోయేందుకు ఎవరు సహకరించారు? అక్కడ ఎవరి వద్ద తలదాచుకున్నారు?' అని సూటిగా ప్రశ్నించినట్లు తెలిసింది.

కీలకంగా శ్రవణ్‌రావు?

అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు 2024 మార్చి 10న నమోదు కాగా... మే మొదటి వారంలో శ్రవణ్‌రావును ఆరో నిందితుడిగా చేర్చారు. అయితే ఆయన అప్పటికే అమెరికా పారిపోయారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతిపక్షాల నగదు లావాదేవీలపై దృష్టి పెట్టిన ప్రణీత్‌కు.. శ్రవణ్ కీలక ఇన్‌ఫార్మర్‌గా పనిచేసినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. దీనికి సంబంధించిన వాట్సాప్ చాటింగ్‌లను ఇప్పటికే నిందితుల ఫోన్ల నుంచి రిట్రీవ్ చేశారు. ముగ్గురు బీఆర్‌ఎస్ నాయకుల ఆదేశాల మేరకే శ్రవణ్‌రావు ఈ పాత్ర పోషించారని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలోనూ శ్రవణ్‌ను ప్రశ్నించారు. ప్రధానంగా రేవంత్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబీకులు, వీరికి అండగా నిలుస్తున్న వారి వివరాలను తన నెట్‌వర్క్ ద్వారా సేకరించిన శ్రవణ్.. ఆ వివరాలను వాట్సాప్ ద్వారా ప్రణీత్‌రావుకు పంపాడని ఆధారాలు సేకరించారు. గత ఏడాది మార్చి 22న దర్యాప్తు అధికారులు జూబ్లీహిల్స్ రోడ్ నెం.78లోని శ్రవణ్ ఇంట్లో సోదాలు చేశారు. ఈ కేసులో కీలక నిందితుడైన ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు అప్పట్లో అత్యాధునిక ట్యాపింగ్ పరికరాలను విదేశాల నుంచి తెప్పించి పలు చోట్ల మినీ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో ఒకటి శ్రవణ్ కార్యాలయం కేంద్రంగానూ పని చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ పరికరాల కొనుగోలు వెనుక శ్రవణ్ పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్న పోలీసులు ఆ కోణంలోనూ విచారించారు. ప్రణీత్‌రావు, తిరుపతన్న, భుజంగరావు, రాధాకిషన్‌రావు సెల్‌ఫోన్ల నుంచి రిట్రీవ్ చేసిన డేటా ఆధారంగానూ శ్రవణ్‌ను ప్రశ్నించారు. అయితే, ఆయన విచారణకు సహకరించలేదని పోలీసులు చెప్తున్నారు. కొన్ని ప్రశ్నలకు గుర్తులేదు, తెలీదు అని బదులిచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 2వ తేదీన మరోసారి విచారణకు రావాలని శ్రవణ్‌రావును పోలీసులు ఆదేశించారు.

రహస్యంగా రావటం.. రహస్యంగానే పోవటం

అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ సందర్భంగా గతంలో ఎప్పుడూ కనిపించని గోప్యతను శ్రవణ్‌రావు విషయంలో పోలీసులు పాటించారు. ఆయన మీడియా కంటపడకుండా అనేక జాగ్రత్తలు తీసుకున్నారు. శ్రవణ్ రాక విషయం తెలుసుకున్న మీడియా.. ఉదయం 10 గంటల నుంచే సిట్ కార్యాలయం ఉన్న జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌కు చేరుకుంది. అయితే, మీడియాను పోలీసులు ఠాణా ప్రధాన గేటు దాటి లోపలికి అనుమతించలేదు. శ్రవణ్‌రావు విచారణకు వచ్చిన సమయంలో ఫొటోలు, వీడియోలు తీసుకునేందుకు మీడియా ప్రతినిధులు ప్రయత్నించగా.. ఆయన చుట్టూ పోలీసులు నిలబడి కెమెరా కంటికి దొరకనివ్వలేదు. విచారణ ముగిసిన తర్వాత బయటకు వచ్చే సమయంలో అయినా ఫొటోలు తీసుకుందామని భావించిన మీడియా సాయంత్రం 6 వరకు వేచి చూసింది. ఈసారి మరో ఎత్తు వేసిన పోలీసులు.. శ్రవణ్‌రావును వెనుక గేటు నుంచి చాటుగా పంపించారు. దీంతో మిగిలిన నిందితుల విషయంలో లేని గోప్యత శ్రవణ్‌రావు విషయంలోనే ఎందుకు పాటించారని పోలీసులను మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. దీనికి అధికారుల నుంచి సమాధానం కరువైంది.

..చిందర వందర

▶ మొదటి పేజీ తరువాయి

బ్యాగులో సీల్ వేసి కారేపల్లి బస్టాండ్‌లో ఖమ్మం వెళ్లే బస్ కండక్టర్‌కు అప్పగించారు. బస్సు ఖమ్మం పాత బస్టాండ్‌కు సాయంత్రం చేరుకుంది. అక్కడి నుంచి ఆర్ఎంఎస్ (రైల్వే మెయిల్ సర్వీస్) క్యాంప్ ఆఫీస్‌కు పంపించి, ఆ తర్వాత నిర్దేశిత మూల్యాంకన కేంద్రానికి చేరవేస్తారు. అయితే, శుక్రవారం సాయంత్రం జవాబుపత్రాల బ్యాగ్‌ను ఖమ్మం పాత బస్టాండ్‌లో బస్సు నుంచి కిందకి పడేయగా, డ్రైవర్ బస్సును కదిలించడంతో టైరు ఆ బ్యాగ్ పైనుంచి వెళ్లింది. దీంతో బ్యాగ్ చిరిగి కారేపల్లి మోడల్ స్కూల్‌లో పరీక్ష రాసిన విద్యార్థుల జవాబు పత్రాలు బయట పడ్డాయి. ఈ విషయం శనివారం బయటకురావడంతో కలకలం రేగింది.

జవాబు పత్రాలన్నీ భద్రం..

జవాబు పత్రాలు రోడ్డుపై పడిన ఘటనపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. దీంతో ఆర్ఎంఎస్ కార్యాలయానికి ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, డీఈఓ సోమశేఖరశర్మ వెళ్లి ప్యాకేజీలను పరిశీలించారు. జవాబు పత్రాలన్నీ భద్రంగా ఉన్నాయని, విద్యార్థులు ఆందోళన చెందాల్సిన పని లేదని డీఈఓ తెలిపారు. ఇదే విషయమై కారేపల్లి పోస్ట్ మాస్టర్ ఝాన్సీ లక్ష్మీబాయిని వివరణ కోరగా.. పార్సిల్ బుకింగ్ చేయడం, ప్యాకర్ ద్వారా బస్సులో వేయడమే తమ బాధ్యత అని చెప్పారు. ఖమ్మం బస్టాండ్‌లో ఆర్ఎంఎస్ వారికి బ్యాగ్ అప్పగించే వరకు కండక్టరే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోస్టల్ శాఖకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. ఈ అంశంపై విద్యాశాఖకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ నివేదిక పంపారు.

మూడు గంటలు ఆలస్యంగా..

ఈ వ్యవహారంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బయటకొచ్చిన ఫొటోలను పరిశీలిస్తే బండిల్‌లోని పేపర్లు ఇప్పుడీసి మళ్లీ పెట్టినట్టుగా ఉన్నాయి. ప్రతిరోజూ పరీక్ష మధ్యాహ్నం 12.30 గంటలకు ముగుస్తుంది. 1.30లకు జవాబు పత్రాలను పోస్టల్ శాఖకు అందజేయాలి. కారేపల్లి నుంచి ఖమ్మంకు రావడానికి గంట సమయం పడుతుంది. కానీ రాత్రి పొద్దుపోయాక ఖమ్మంకు జవాబు పత్రాలు వచ్చినట్టు తెలుస్తోంది. ఇంత ఆలస్యానికి కారణాలేంటి? ఈ ఒక్క కేంద్రమే కాదు.. జిల్లాలోని ప్రతీ పరీక్ష కేంద్రం నుంచి జవాబు పత్రాలు దాదాపు 3 గంటల ఆలస్యంగా వస్తున్నట్టు సమాచారం. ఆ మూడు గంటల్లో ఏం జరుగుతోంది? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

అన్ని కోణాల్లో దర్యాప్తు

ఘటనపై జిల్లా కలెక్టర్ నుంచి నివేదిక తెప్పించాం. రవాణా వల్లే బండిల్ పగిలిందని కలెక్టర్ చెప్పారు. డీఈవో చేత విచారణ చేయిస్తున్నాం. ఎక్కడైనా అవకతవకలు జరిగాయా అన్న కోణంలోనూ విచారణ చేపట్టాలని ఆదేశించాం. పరీక్షలపై విశ్వాసం పెంచాల్సిన అవసరం ఉంది.

– ఈవీ నర్సింహా రెడ్డి, పాఠశాల విద్య డైరెక్టర్.

ప్రజారోగ్య డైరెక్టర్‌పై విచారణ

● రవీందర్ నాయక్‌పై విచారణకు ప్రభుత్వం ఆదేశం
● మరో ఆరుగురు డీహెచ్ ఉద్యోగులపైన కూడా..



సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్యశాఖలో కీలకమైన ప్రజారోగ్య సంచాలకుడు (డీహెచ్) డాక్టర్ రవీందర్ నాయక్‌తోపాటు ఆరుగురు ఉద్యోగులపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. సీనియారిటీ జాబితాలో మొదటి వరుసలో ఉన్న ఆయనను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డీహెచ్‌గా నియమించింది. ఆయన హయాంలో ఉద్యోగుల డిప్యుటేషన్లు, బదిలీలలో అనేక అక్రమాలు జరిగాయని, డిప్యుటేషన్లు లేవంటూనే జోన్లు, క్యాడర్ పోస్టులతో సంబంధం లేకుండా ఉద్యోగులను బదిలీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గతంలోనే మెమో ఇచ్చి విజిలెన్స్ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం.. తాజాగా పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను ఆదేశించింది. ఆయనతో పాటు డీహెచ్ కార్యాలయంలో పనిచేసే మరో ఆరుగురిపై కూడా విచారణకు ఆదేశిస్తూ 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అవినీతి ఆరోపణలు, అక్రమ డిప్యుటేషన్లు

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పారామెడికల్ బోర్డు కార్యదర్శిగా కీలక హోదాలో రవీందర్ నాయక్ పని చేశారు. ఆ సమయంలో పారా మెడికల్ బోర్డులో అక్రమాలు, అవినీతి చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులు రావడంతో పలువురు అధికారులను బదిలీ చేశారు. రవీందర్ నాయక్‌ను కూడా ఆ హోదా నుంచి తప్పించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశాఖకు డైరెక్టర్‌గా ఇన్‌చార్జి హోదాలో ఆయన వచ్చారు. గతేడాది ఆరోగ్యశాఖలో జరిగిన సాధారణ బదిలీల్లో డీహెచ్ ఆఫీస్ వేదికగా అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. డీహెచ్ కార్యాలయంలోనే కీలక పోస్టుల్లో పనిచేసిన మరో ఆరుగురు ఉద్యోగులకు ఈ అక్రమాల్లో పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. వీరిలో ఇద్దరు అధికారులు అర్హత లేకున్నా డిప్యుటేషన్లపై డీహెచ్ కార్యాలయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ పరిణామాలపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గత సంవత్సరం విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. విజిలెన్స్ నివేదిక అనంతరం గత నవంబర్‌లో డీహెచ్‌తో పాటు మరో ఆరుగురికి చార్జి మెమోలు జారీ చేశారు. మెమోలకు వారిచ్చిన వివరణలను పరిశీలించిన సర్కారు సంతృప్తి చెందకపోవడంతో మొత్తం వ్యవహారంపై విచారణకు ఆదేశించింది.

టెన్త్ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో మరో ఐదుగురి అరెస్ట్

నకిరేకల్: పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ కేసులో మరో ఐదుగురిని శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించామని నల్లగొండ జిల్లా నకిరేకల్ సీఐ రాజశేఖర్ తెలిపారు. ఈ నెల 21న నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రంలో ఓ యువకుడు తెలుగు ప్రశ్నపత్రాన్ని ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసిన విషయం విదితమే. ఈ ఘటనలో మొత్తం 12 మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో ఈ నెల 23న చిట్ల ఆకాష్, బండి శ్రీను, గుడుగుంట్ల శంకర్, బ్రహ్మదేవర రవిశంకర్, ఓ బాలుడుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కేసు తదుపరి విచారణ అనంతరం శనివారం నకిరేకల్‌కు చెందిన పోగుల శ్రీరాములు, తలారి అఖిల్‌కుమార్, ముత్యాల వంశీ, పల్స అనిల్‌కుమార్, పళ్ల మనోహర్‌ను శనివారం రిమాండ్‌కు పంపామని, ఓ బాలుడు పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. రిమాండ్ చేసినవారిలో ఇద్దరు కాంగ్రెస్, ఇద్దరు బీఆర్ఎస్, ఒకరు బీజేపీకి చెందిన వారుగా గుర్తించామని పేర్కొన్నారు.

మంత్రిని కలవగానే వేతనాలు.. ఆనందంలో అర్చకులు



మంత్రి కొండా సురేఖకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు, వేద పండితులు

బంజారాహిల్స్ (హైదరాబాద్): పండుగ వేళ ఇంకా వేతనాలు రాలేదంటూ పలువురు అర్చకులు మంత్రి కొండా సురేఖకు చెప్పడంతో వెంటనే ఆమె దేవాదాయ శాఖ కమిషనర్‌తో మాట్లాడి రాష్ట్రంలోని అర్చకులందరికీ వేతనాలు వేయించారు. శనివారం మత్రైక అర్చక సంఘం ఉద్యోగులు, అర్చకులు, వేద పండితులు మంత్రి కొండా సురేఖను జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు రూపొందించిన ఉగాది తెలుగు సంవత్సర కేలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మార్చి నెలలో పడాల్సిన వేతనాలు ఇంకా రాలేదని దీంతో ఉగాది పండుగ వేళ ఇబ్బందులు పడుతున్నామని వారు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే మంత్రి దేవాదాయ శాఖ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి దేవాదాయ శాఖ ఉద్యోగులు, అర్చకుల జీతాలను చెల్లించాలంటూ ఆదేశించడంతో వారి అకౌంట్లలో జీతాలు జమ అయ్యాయి. తాము అడిగిన వెంటనే సమస్య పరిష్కరించిన మంత్రికి తెలంగాణ మత్రైక అర్చక ఉద్యోగ సంఘం అధ్యక్షుడు మార్తి సత్యనారాయణ శర్మ కృతజ్ఞతలు తెలిపారు.

మాకూ సొంత ఇల్లు కావాలి!



జనంలో పెరుగుతున్న ఆకాంక్ష..

పెరుగుతున్న రుణ మంజూరీలే నిదర్శనం

లగ్జరీ ఇళ్లకు పెరుగుతున్న డిమాండ్

రూ.33 లక్షల కోట్లకు గృహ రుణాలు

వ్యక్తుల ఆదాయాల పెరుగుదల, చిన్న కుటుంబాలు అధికం కావడం, సొంత ఇల్లు కలిగి ఉండాలన్న ఆకాంక్ష.. వెరసి నూతన గృహాల అమ్మకాలను పెంచుతున్నాయి. ఇళ్ల ధరలు దూసుకెళ్లడం కూడా డిమాండ్‌కు ఆజ్యం పోస్తోంది. ప్రధానంగా భారతీయ కస్టమర్లు లగ్జరీ వైపు మొగ్గు చూపుతుండడంతో హైఎండ్ గృహాలకు స్థిర డిమాండ్ ఉంటోంది. ఓ నివేదిక ప్రకారం 62 శాతం మంది సంపన్న భారతీయులు రాబోయే ఒకట్రెండేళ్లలో లగ్జరీ రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడికి ఆసక్తి చూపుతున్నారు. ఆస్తుల విలువ పెరుగుదల ఇందుకు కారణమని 55 శాతం మంది తెలిపారు. అధిక ఆదాయ వర్గాలు అందుకుంటున్న రుణాల వాటా 2022 సెప్టెంబర్‌తో పోలిస్తే రెండేళ్లలో 52.63 శాతం పెరగడం దేశంలో లగ్జరీ గృహాల డిమాండ్‌కు నిదర్శనం. దేశవ్యాప్తంగా వ్యక్తిగత గృహ రుణాలు 2024 సెప్టెంబర్ చివరి నాటికి మొత్తం రూ.33.53 లక్షల కోట్లు నమోదయ్యాయి. ఏడాదిలో ఈ రుణాలు 14 శాతం పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–ఫిబ్రవరి కాలంలో బ్యాంకులు ఇచ్చిన అన్ని రకాల లోన్స్ రూ.15.3 లక్షల కోట్లు. ఇందులో హౌసింగ్ లోన్స్ 16.95 శాతం వాటాతో రూ.2.6 లక్షల కోట్లు ఉంది. ఈ కాలంలో పరిశ్రమలు అందుకున్న రుణాలు 14.5 శాతం వాటాకు పరిమితం కావడం గమనార్హం.

- సాక్షి, స్పెషల్ డెస్క్

నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) రెసిడెన్షియల్ ఇండెక్స్ (రెసిడెక్స్) ప్రకారం 2017–18తో పోలిస్తే ఇళ్ల ధరలు 2024 సెప్టెంబర్ చివరినాటికి 38.33 శాతం పెరిగాయి. నిర్మాణంలో ఉన్న ప్రాపర్టీ ధరలు ఏకంగా 42.95 శాతం పెరగడం విశేషం. స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ)లో షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్స్, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల వ్యక్తిగత గృహ రుణాల వాటా 2024లో 11.29 శాతానికి ఎగసింది. 2014లో ఇది 7.3 శాతమే. అంటే పదేళ్లలో 54.65 శాతం పెరిగిందన్న మాట. మొత్తం రుణాల్లో షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల వాటా 2015లో 9.76 నుంచి 2024లో 16.57 శాతానికి చేరింది. 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మంజూరైన గృహ రుణాలు రూ.9.07 లక్షల కోట్లు.

పదేళ్లలో 54 శాతం పెరుగుదల..


వ్యక్తిగత గృహ రుణాల్లో అధిక ఆదాయం పొందుతున్న వ్యక్తులకు హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు ఇచ్చిన రుణాలు 2022 సెప్టెంబర్‌లో 17.1 శాతం ఉంటే.. 2024 సెప్టెంబర్ నాటికి 26.1 శాతానికి పెరిగాయి. ఈ కాలంలో తక్కువ, మధ్యస్థాయి ఆదాయ వర్గాలకు మంజూరు చేసిన రుణాలు తగ్గడం గమనార్హం. వ్యక్తిగత గృహ రుణాల్లో 2023–24లో హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు జారీచేసిన మొత్తాల్లో రూ.25 లక్షలకు పైగా విలువ చేసే రుణాల వాటా 58% ఉంది. 2021–22లో ఇది 54.34 శాతం నమోదైంది. రూ.10 లక్షల వరకు విలువ చేసే రుణాల వాటా 10.85 శాతం మాత్రమే. 2024 సెప్టెంబర్ 30 నాటికి ఉన్న మొత్తం వ్యక్తిగత గృహ రుణాలలో ఆర్థికంగా వెనుకబడ్డ, తక్కువ ఆదాయ వర్గాల వాటా 39 శాతం, మధ్య ఆదాయ వర్గాలు 44% ఉంది.

అధిక ఆదాయ వ్యక్తులే..

2024 సెప్టెంబర్‌తో ముగిసిన అర్థిక సంవత్సరంలో వ్యక్తిగత గృహ రుణాల పంపిణీ రూ.4.10 లక్షల కోట్లుగా ఉంది. ఇందులో దక్షిణాది రాష్ట్రాలు అధికంగా 35.02 శాతం కై వసం చేసుకున్నాయి. పశ్చిమ భారత్ 30.14 శాతం, ఉత్తరాది రాష్ట్రాలు 28.73 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలతో సహా తూర్పు భారత్ వాటా 6.10 శాతమే. ఈశాన్య రాష్ట్రాల వాటా 0.68 శాతం ఉంది. ఇక 2024 సెప్టెంబర్ నాటికి రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో (జీఎస్‌డీపీ) మొత్తం వ్యక్తిగత గృహ రుణాల్లో మహారాష్ట్ర 18.49 శాతం, తెలంగాణ 18.44 శాతం వాటాతో ముందున్నాయి.

తూర్పున మరీ తక్కువ

సంవత్సరాల వారీగా వాణిజ్య బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల మొత్తం వ్యక్తిగత గృహ రుణాలు (రూ. లక్షల కోట్లలో)



2017-18తో పోలిస్తే 2024 సెప్టెంబర్ చివరినాటికి ధరల వృద్ధి

38.33%	42.95%
నిర్మాణం పూర్తయిన గృహాలు	నిర్మాణంలో ఉన్న ప్రాపర్టీ

జీడీపీలో వ్యక్తిగత గృహ రుణాల వాటా

2014 - 7.3%	2024 - 11.29%

స్థూల రాష్ట్ర ఉత్పత్తిలో వ్యక్తిగత గృహ రుణాల వాటా

రాష్ట్రం	2023 మార్చి	2024 సెప్టెంబర్
మహారాష్ట్ర	20.20	18.49
తెలంగాణ	16.42	18.44
కర్ణాటక	13.09	14.28
గుజరాత్	11.79	12.26
గోవా	11.35	12.09
కేరళ	12.06	10.91

ఆదాయ వర్గంవారీగా మొత్తం గృహ రుణాలు (శాతాల్లో)

వర్గం	2022 సెప్టెంబర్	2024 సెప్టెంబర్
బలహీన	12.50	10.73
తక్కువ ఆదాయం	31.45	28.48
మధ్య ఆదాయం	41.37	43.45
అధిక ఆదాయం	14.68	17.34

హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్స్ రుణాల తీరు (శాతాల్లో)

రుణం (రూ.లక్షల్లో)	2021-22	2022-23	2023-24
5–10	8.98	8.76	8.24
10	11.32	11.76	10.85
10–15	11.68	11.07	10.98
15–25	22.66	20.89	20.08
25 పైన	54.34	56.28	58.08

(గమనిక: రూ.5 లక్షల లోపు రుణాలను పరిగణనలోకి తీసుకోలేదు)

31న రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేస్తాయి

సాక్షి, హైదరాబాద్: ఈనెల 31వ తేదీన రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేయనున్నాయి. ఆ రోజున సెలవుదినం అయినప్పటికీ లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)–2020 గడువు అదేరోజు ముగియనున్న నేపథ్యంలో ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు వీలుగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సెలవును రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ జ్యోతిబుద్ధప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు ఈనెల 31వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు యథావిధిగా పనిచేయనున్నాయి.

ఆర్టీసీకి మహాలక్ష్మి షాక్

విడుదల కాని రూ.650 కోట్ల బకాయిలు

- శనివారంతో ఆర్థిక సంవత్సరం చివరి పనిదినం పూర్తి... ఇక ఆ నిధులు మురిగిపోయినట్లేనన్న అనుమానాలు



సాక్షి, హైదరాబాద్: మహిళల ఉచిత ప్రయాణాలకు సంబంధించి ఆర్టీసీకి రీయింబర్స్ చేయాల్సిన మొత్తంలో దాదాపు రూ.650 కోట్లను ప్రభుత్వం బకాయిపెట్టింది. ఆర్థిక సంవత్సరం ముగియటానికి మరో రోజు మాత్రమే మిగిలి ఉంది. ఆది, సోమ, మంగళవారాలు వరుస సెలవులు. శనివారం పనివేళలు ముగిసే సమయానికి ఆ మొత్తం విడుదల కాలేదని తెలిసింది. దీంతో ఇక అవి మురిగిపోతాయన్న ఆందోళన ఆర్టీసీలో వ్యక్తమవుతోంది. ఆర్టీసీకి గతేడాది బడ్జెట్‌లో రూ.4,084 కోట్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో దాదాపు రూ.800 కోట్లు బకాయి ఉండగా, వారం క్రితం రూ.156 కోట్లు విడుదలయ్యాయి. మిగతావి అలాగే పేరుకుపోయి ఉన్నాయి. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులు మహాలక్ష్మి పథకం వరకు మాత్రమే సరిపోతాయి. ఇతరత్రా అభివృద్ధి పనులకు, రాయితీ బస్‌పాసుల సర్దుబాటుకు సరిపోవు. ఇప్పుడు బడ్జెట్ నిధులు కూడా పూర్తిగా విడుదల కాని పక్షంలో, మహాలక్ష్మి భారాన్ని కూడా ఆర్టీసీ మోయాల్సి వస్తుంది. బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే మహిళల సంఖ్య పెరిగినందున.. మహాలక్ష్మి కేటాయింపులను రూ.5,500 కోట్లకు పెంచాలని బడ్జెట్ ప్రతిపాదనల్లో ఆర్టీసీ కోరింది. కానీ, సర్కారు రూ.4,400 కోట్లే కేటాయించింది.

గతంలోనూ అంతే..

2023 బడ్జెట్‌కు సంబంధించి కూడా గతేడాది చివరలో కొన్ని నిధులు విడుదల కాలేదు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1,500 కోట్లు బడ్జెట్‌లో చూపగా, చివరికి రూ.500 కోట్ల వరకు చేతికి అందకుండా పోయాయి. మరోసారి అదే దుస్థితి ఎదురుకావటం ఆర్టీసీకి ఇబ్బందిగా మారబోతోంది. శనివారం ఆలస్యంగానైనా నిధులు విడుదలై, తదుపరి పనిదినం రోజు ఖాతాలోకి చేరే అవకాశం కూడా ఉందన్న ఆశతో ఆర్టీసీ ఉంది.

పాత బార్లు... కొత్త నోటిఫికేషన్...

రాష్ట్రంలో 25 బార్లకు దరఖాస్తులు ఆహ్వానించిన ఎక్సైజ్ శాఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 25 బార్ అండ్ రెస్టారెంట్లకు ఎక్సైజ్ శాఖ రీ నోటిఫికేషన్ జారీ చేయాలని నిర్ణయించింది. గతంలో మంజూరైన బార్లలో ప్రస్తుతం మూసేసిన కొన్నింటిని గుర్తించి వాటిని మళ్లీ ఏర్పాటు చేసేందుకు దరఖాస్తులు స్వీకరించనుంది. నేడు లేదా రేపు ఈ నోటిఫికేషన్ వచ్చే అవకాశాలున్నాయని ఎక్సైజ్ వర్గాలు వెల్లడించాయి. ఈ నోటిఫికేషన్ ప్రకారం హైదరాబాద్ జిల్లా మినహా మిగిలిన చోట్ల 25 బార్ అండ్ రెస్టారెంట్లు ఏర్పాటు చేసేందుకు (నోటిఫై చేసిన ప్రాంతాల్లో మాత్రమే) దరఖాస్తులు స్వీకరిస్తారు. ఒక్కో దరఖాస్తు రుసుము రూ.లక్షగా నిర్ధారించినట్టు సమాచారం. ఈ ప్రక్రియలో ఒక్కో బార్‌కు ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ పద్ధతిలో కేటాయించనున్నారు. అయితే, ఇవి కొత్త బార్లు కావని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. 2020లో కొత్త బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇవ్వగా, అందులో కొన్నింటికి దరఖాస్తులు రాలేదని, మరికొన్నింటికి దరఖాస్తులు వచ్చినప్పటికీ ఆ షాపులు నడవడం లేదని, ఫీజు రెన్యువల్ చేసుకోకపోవడంతో మూతపడిన వాటిని గుర్తించి వాటికి రీ నోటిఫికేషన్ ఇస్తున్నామని వెల్లడించింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ఫుడ్ టెక్నాలజీ.. ఉపాధి ఈజీ

రుద్రూర్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కాలేజీలో ప్రత్యేక కోర్సులు



రుద్రూర్‌లోని ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాల (ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కాలేజీ) వద్ద విద్యార్థులు

- తెలంగాణలోనే ఏకైక కళాశాల.. 2015లో ఏర్పాటు
- ఎంసెట్‌లో ర్యాంకు ఆధారంగా ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రవేశం
- నాలుగేళ్ల కోర్సుతో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో లక్షణంగా ఉపాధి
- పారిశ్రామికవేత్తలుగానూ ఎదిగేందుకు అవకాశం
- విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ
- ఐసీఏఆర్ నుంచి 'ఏ'గ్రేడ్ అక్రిడిటేషన్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:

ఆహార వృథాను అరికట్టడం, ఆహార నాణ్యత పెంచడం.. ఆహార పదార్థాలను నిల్వ చేసే విజ్ఞానాన్ని బోధించడం.. ఇవే లక్ష్యాలతో కోర్సు నిర్వహిస్తోంది. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందిస్తోంది. పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశాలు కల్పిస్తోంది. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఈ కోర్సుపై అసక్తి కనబరుస్తున్నారు. నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లోని ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాల (ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కాలేజి) రాష్ట్రంలోనే ప్రత్యేకతను చాటుకుంటోంది.



రుద్రూర్‌లోని ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాలలో తయారు చేసిన పదార్థాలతో విద్యార్థులు







రుద్రూర్‌లోని ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాలలో పదార్థాలు తయారు చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు ఉజ్వల భవిత

ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఎంసెట్ ర్యాంకు ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నారు. నాలుగేళ్ల ఈ కోర్సులో ఫుడ్ టెక్నాలజీ, ఆహార భద్రత, నాణ్యత ప్రమాణాలు, ఫుడ్ ఇంజనీరింగ్, ఫుడ్ బిజినెస్ గురించి బోధిస్తారు. పాలు, పండ్లు, కూరగాయలు, మాంసం, వివిధ ఆహార పదార్థాలను నిల్వ చేసే విజ్ఞానాన్ని నేర్పిస్తారు. ఆహార పోషక విలువల గుర్తింపు, కల్తీ పరీక్షలు నిర్వహించడాన్ని ప్రయోగాత్మకంగా నేర్పుతున్నారు. నాణ్యత ప్రమాణాలతో ఆహారం తయారీ, వివిధ రకాల యంత్రాలతో జామ్, కురుకురే, బేకరీ పదార్థాల తయారీపై బోధన ఉంటోంది. ఏటా 35 మంది విద్యార్థులు కోర్సు పూర్తి చేసుకుని వివిధ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. నాలుగేళ్ల కోర్సులో థియరీ, ప్రాక్టికల్స్ ఉంటాయి. ఇందుకోసం క్యాంపస్‌లో మూడు ల్యాబ్‌లు, గ్రంథాలయం ఉన్నాయి. తరగతిలో నేర్చుకున్న అంశాలపై ల్యాబ్‌లలో ప్రయోగాలు చేస్తారు. పారిశ్రామిక పర్యటన ఉంటుంది. నాలుగో ఏడాది విద్యార్థులు స్వయంగా ఆహారం తయారు చేసి మార్కెటింగ్ చేస్తున్నారు.

నాలుగేళ్లు.. నాలుగు మాడ్యూళ్లు..

నాలుగేళ్ల కోర్సులో మొదటి మూడేళ్లు ఫుడ్ కెమిస్ట్రీ, ఫుడ్ మైక్రో బయాలజీ, ఫుడ్ ఇంజనీరింగ్ సబ్జెక్టులను బోధిస్తారు. నాలుగో ఏడాది అనుభవ శిక్షణ, ఇండస్ట్రియల్ అటాచ్‌మెంట్, ప్రాజెక్టుల వంటి వినూత్నమైన ప్రోగ్రాంల ద్వారా ఆహార ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో క్షేత్రస్థాయి శిక్షణ అందిస్తారు. తద్వారా విద్యార్థులను.. వ్యాపార, పారిశ్రామిక వ్యవస్థాపకులుగా ఎదిగేందుకు సిద్ధం చేస్తారు. సాంకేతిక అంశాలే కాక భాషా నైపుణ్యాలను మెరుగుపరుస్తున్నారు. ఆహార ప్రాసెసింగ్, సంరక్షణకు సంబంధించి సాంకేతిక ఆవిష్కరణలు చేస్తూ.. వాటిని రైతులు అమలు చేసేలా సైతం కళాశాల చర్యలు తీసుకుంటోంది.

- అంతర్జాతీయ ప్రాధాన్యమున్న ఈ కోర్సు పూర్తయ్యాక సొంత పరిశ్రమలను సైతం స్థాపించవచ్చు. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రోత్సాహకాలను వివిధ పథకాల ద్వారా అందిస్తున్నాయి.
- ఇప్పటివరకు ఈ కళాశాల నుంచి పట్టభద్రులైన 158 మంది విద్యార్థులలో 18 శాతం మంది ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. 58 శాతం మంది జాతీయ, బహుళ జాతీయ సంస్థల్లో ఏడాదికి రూ.8 లక్షలకు పైగా ప్యాకేజీతో ఉద్యోగాలు చేస్తున్నారు. యూఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియాల్లో ప్రసిద్ధ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య కోసం ఆరుగురు వెళ్లారు. ఈ కోర్సు తరువాత ఎంటెక్, పీహెచ్‌డీ సైతం చేయొచ్చు. విదేశాల్లో ఎంబీఏ, ఎంఎస్ చేయవచ్చు. వ్యవసాయ, సాంకేతిక విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల్లోనూ శాస్త్రవేత్తలుగా ఉద్యోగాలు పొందవచ్చు. ప్రైవేటు, ప్రభుత్వ రంగ ఫుడ్ ఇండస్ట్రీస్‌లో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్, క్వాలిటీ కంట్రోల్ ఎనలిస్ట్, క్వాలిటీ అష్యూరెన్స్ మేనేజర్స్, రీసెర్చ్ సైంటిస్ట్స్, రీసెర్చ్ అసోసియేట్స్ లాంటి ఉద్యోగాలు పొందొచ్చు. ఇవే కాక ప్రభుత్వ రంగ సంస్థలైన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ), అగ్రికల్చరల్ అండ్ ప్రాసెసింగ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఈడీఏ), ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ మంత్రిత్వ శాఖ (ఎఫ్‌పీఐ), ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సంస్థల్లో చేయొచ్చు.

1) **పండ్లు, కూరగాయలు:** వివిధ పండ్లతో జ్యూస్, జామ్ చేస్తారు. కూరగాయలతో పచ్చళ్లు, పొడులు తయారు చేస్తారు.

2) **మాంసం:** చికెన్, చేపలు, గుడ్లతో పచ్చడి, స్నాక్స్ చేస్తారు.

3) **చిరు ధాన్యాలు, పప్పులు:** మల్టీ గ్రెయిన్ పిండి, మిశ్రమ పిండి (రాగి, జొన్న, బార్లీ, ఓట్స్, గోధుమ, శనగ) పిండితో లడ్డూలు, దోశపిండి, డ్రైఫ్రూట్స్‌తో వివిధ రూపాల్లో లడ్డూలు చేస్తారు.

4) **మసాల దినుసులు:** నాణ్యమైన కారం, పసుపు, కరివేపాకు పొడి, మునగాకు పొడి, వెల్లుల్లి పచ్చడి, అల్లం పచ్చడి, కాకర పచ్చడి, కాకర పొడి తయారు చేస్తారు. వీటి నాణ్యతను ప్రయోగశాలలో పరిశీలించి మార్కెట్‌లో విక్రయిస్తారు.

- అదనంగా రీసెర్చ్ ప్రాజెక్టు పేరుతో వృథాగా పారేస్తున్న పండ్ల తొక్కలతో చిప్స్ తయారు చేస్తారు. ఉత్పత్తి, మార్కెటింగ్ విద్యార్థులే నిర్వహిస్తున్నారు. తయారు చేసిన పదార్థాలు విక్రయించి కళాశాలకు లాభాలూ తెస్తున్నారు.

ఏకైక ఫుడ్ టెక్నాలజీ కళాశాల

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సాంకేతికతను వినియోగించి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఈ కళాశాలను 2015లో ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ కింద ఇది తెలంగాణలోనే ఏకైక ఫుడ్ టెక్నాలజీ కళాశాల కావడం గమనార్హం. ఆహార వృథాను అరికట్టడం.. పదార్థాల నాణ్యత తగ్గకుండా చూడటంపై ఇందులో శిక్షణ ఇస్తున్నారు. నాలుగేళ్ల ఈ కోర్సులో నాలుగు మాడ్యూల్స్‌లో విద్యార్థులకు బోధన, ప్రాక్టికల్ శిక్షణ ఇస్తున్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి



ఈ కోర్సు ద్వారా ఆహార నాణ్యత, ఆహార ప్రమాణాల గురించి పూర్తిస్థాయిలో నేర్చుకుంటున్నాం. ధాన్యాలు, పప్పులు, పండ్లు, పాలు, కూరగాయలు, మాంసం తదితరాల ప్రాసెసింగ్ విషయంలో ఆధునిక పద్ధతుల్లో పోషకాలుండేలా శిక్షణ ఇస్తున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఫుడ్ కెమిస్ట్రీ ద్వారా పూర్తి స్థాయిలో అధ్యయనం చేస్తున్నాం. ఈ కోర్సు పూర్తయ్యాక ప్రభుత్వ రంగంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్, క్వాలిటీ కంట్రోల్ అధికారి, రీసెర్చ్ సైంటిస్ట్, ప్రైవేటు రంగంలో ప్రాసెసింగ్ మేనేజర్, ఫుడ్ టెక్నాలజీ నిపుణులుగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

– రచన, ఫైనల్ ఇయర్

పారిశ్రామికవేత్తలుగా ఎదగవచ్చు



కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ప్రాధాన్యం ఉంటుంది. కళాశాలలో నేర్చుకున్న విద్యతో స్వయంగా ఆహార ఉత్పత్తి సంస్థలను ఏర్పాటు చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగొచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసే ఫుడ్ పార్కుల్లో, దేశ విదేశాల్లో స్టార్ హోటళ్లలో ఆహార పరిశీలకులుగా ఉద్యోగావకాశాలు పొందొచ్చు.

– కల్పన, డీన్, ఫుడ్ సైన్స్ కాలేజీ

ఆహారంలో కల్తీ.. పట్టించుకోని అధికారులు

ముఖ్యమంత్రికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి లేఖ

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలో విపరీతంగా ఆహార కల్తీ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఏడు నక్షత్రాల హోటళ్ల నుంచి రోడ్డు పక్కన ఉన్న చిన్నచిన్న హోటళ్ల వరకు ఆహార పదార్థాల్లో కల్తీ జరుగుతోంది' అని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) ఆవేదన వ్యక్తం చేసింది. రాష్ట్రం మొత్తానికీ ఒకటే ఫుడ్ టెస్టింగ్ లేబొరేటరీ ఉందని, ఈ నేపథ్యంలో మరిన్ని ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని, ఆహార కల్తీపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

హైదరాబాద్‌లో పెద్ద సంఖ్యలో ఉన్న హోటళ్లను తనిఖీ చేసేందుకు తగినంత మంది ఆహారభద్రత అధికారులు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా కల్తీ జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తగినంత మంది సిబ్బందిని నియమించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

పోలీస్ ప్రతిష్ట మీ చేతుల్లోనే..

ఎస్‌హెచ్‌ఓలతో భేటీలో డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: పోలీసు వ్యవస్థలో స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌ఓ) ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. పోలీస్ శాఖ ప్రతిష్ట స్టేషన్ హౌస్ ఆఫీసర్ల పనితీరుపై ఆధారపడి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు డీజీపీ జితేందర్ 'ఎస్‌హెచ్‌ఓలతో భేటీ' అనే వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం డీజీపీ కార్యాలయంలో కొందరు ఎస్‌హెచ్‌ఓలతో శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్‌తో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 36 మంది ఎస్‌హెచ్‌ఓలు (ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు) శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఐజీ రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నిలబెట్టుకోవాలి

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ప్రకాశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సన్న బియ్యంతో పాటు సూపర్ మార్కెట్ మాదిరిగా అన్ని వస్తువులు ఇస్తామన్న హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్. ప్రకాశ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

అసెంబ్లీ ఎన్నికలకు ముందు వివిధ వర్గాల ఓటర్లను ఆకర్షించేందుకు గొప్పగా ఆరు డిక్లరేషన్లను ప్రకటించినా...వాటిలో ఏదీ కూడా పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదని ఆయన విమర్శించారు. శనివారం బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ, రైతాంగానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేదని మండిపడ్డారు. కాగా, ఆరెస్సెస్ గురించి మాట్లాడే నైతిక హక్కు ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలకు లేదని కాసం వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు.

● రామప్పపై ఆదిత్యుడు



ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ గోపురంపై శనివారం సూర్యాస్తమయ సమయాన అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. సూర్యభగవానుడే గోపురంపై గల కలశాన్ని ఒత్తిగా మలుచుకొని దీపంలా తన కిరణాలు ప్రకాశింపచేస్తున్న తీరును 'సాక్షి'క్లిక్‌మనిపించింది. - ఫొటో: రామిడి కృష్ణారెడ్డి, సాక్షి, వెంకటాపురం(ఎం)

ఎన్‌వోసీ జారీ చేయండి

జాతీయ స్మారక మండలికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: గోల్కొండ కోట నియంత్రిత ప్రాంతం, నిషేధిత జోన్ వెలుపల నివాస గృహాల నిర్మాణానికి నిరభ్యంతర పత్రం జారీ చేయాలని జాతీయ స్మారక ప్రాధికారిక అధీకృత ప్రాంతీయ మండలిని హైకోర్టు ఆదేశించింది. నేషనల్ మాన్యుమెంట్ అథారిటీ జారీ చేసిన ఆదేశాలను అమలు చేయాలని తేల్చిచెప్పింది. నిరభ్యంతర సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) జారీ చేయాలని నేషనల్ మాన్యుమెంట్ అథారిటీ ఆదేశించినా జాతీయ స్మారక ప్రాధికారిక అధీకృత ప్రాంతీయ మండలి అమలు చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ శ్రీఆదిత్య హోం ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై మౌషుమి భట్టాచార్య విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. నాలుగు వారాల్లో ఎన్‌వోసీ జారీ చేయాలని జాతీయ స్మారక ప్రాధికారిక అధీకృత ప్రాంతీయ మండలిని ఆదేశించింది.

మంత్రి కొండా సురేఖ ఉగాది శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: ఉగాది పర్వదినం సందర్భంగా ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు నెలకొని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు కలగాలని అటవీ, దేవాదాయశాఖల మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు. తెలుగు సంవత్సరాది ఉగాది మన సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించేది మాత్రమే కాకుండా, నూతన ఆశలు, కొత్త లక్ష్యాలు ముందుకు తీసుకెళ్లే అద్భుతమైన శుభదినమని పేర్కొన్నారు. ఉగాది పచ్చడి మాదిరిగా జీవితం కూడా చేదు, తీపి, కారం, వగరు, పులుపు, ఉప్పు రుచులతో కూడి ఉంటుందని, సమస్యలను సమర్థంగా ఎదుర్కొంటూ విజయపథంలో ముందుకు సాగాలని ఆమె శనివారం ఓ ప్రకటనలో కోరారు.

సంస్కృతీ, సంప్రదాయాలే భావితరాలకిచ్చే ఆస్తులు

ఎంపీ డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: సంస్కృతి సంప్రదాయాలే భావితరాలకు మనమిచ్చే ఆస్తులని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. మన ధర్మం, కట్టుబాట్ల గురించి భావితరాలకు మనమే నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం సింగపూర్‌లోని పంగోలులో శ్రీసాంస్కృతిక కళాసారథి ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకల్లో విశిష్ట అతిథిగా డీకే అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అందరి జీవితాలు సంతోషంగా సాగిపోవాలన్నదే ఉగాది సందేశమని, ప్రతి హిందూ పండుగలోనూ ఒక్కో సంస్కృతి, ఆచారం దాగి ఉందన్నారు. తెలుగు భాషకు ఆదరణ తగ్గుతున్న ఈ రోజుల్లో తెలుగు భాష గొప్పతనం చాటేలా ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమని ఆమె పేర్కొన్నారు.

అర్థగణాంక శాఖలో పలువురికి పదోన్నతులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అర్థగణాంక శాఖ సంచాలక కార్యాలయంలో పలువురు అధికారులకు పదోన్నతులు దక్కాయి. ఉప సంచాలకులు (డీడీ) నుంచి సంయుక్త సంచాలకులు (జేడీ)గా ఏడుగురు అధికారులు ప్రమోషన్ పొందారు. అదేవిధంగా సహాయ సంచాలకుల నుంచి ఉప సంచాలకులుగా 12 మంది అధికారులు పదోన్నతి పొందారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రోస్టర్ పాయింట్ల ఆధారంగా శాఖాపరమైన పదోన్నతుల కమిటీ సిఫార్సులతో ప్రమోషన్లు కల్పించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ పదోన్నతులు తాత్కాలిక పద్ధతుల్లోనే ఇచ్చినట్లు అందులో స్పష్టం చేశారు. ఏడీ నుంచి డీడీ పదోన్నతుల్లో ఒక పోస్టు క్యారీ ఫార్వర్డ్ చేశారు.

గుడి సంబరం.. అంగరంగ వైభవం

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో శనివారం రాత్రి పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుడి సంబరాల పేరుతో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు నృత్య రూపకాలతో చక్కటి అభినయాన్ని ప్రదర్శించారు. అన్నమయ్య, త్యాగరాజ సంకీర్తనలకు లయబద్ధంగా నృత్యాభినయాలను ప్రదర్శిస్తూ అలరించారు.





పోర్టుని సందర్శించిన అమెరికా ప్రతినిధులు

వాణిజ్య అవకాశాలపై చర్చించిన యూఎస్ నేవీ బృందం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టును అమెరికా ప్రతినిధి బృందం శనివారం సందర్శించింది. యునైటెడ్ స్టేట్స్ నేవీ కెప్టెన్ అలన్ ఎం. బెకర్ నేతృత్వంలోని అమెరికా ప్రతినిధుల బృందానికి పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్ కుమార్ దూబే స్వాగతం పలికారు. పోర్టులో అందుబాటులో ఉన్న విభిన్న మౌలిక సదుపాయాలు, కార్గో నిర్వహణ సామర్థ్యాలు, ఆధునీకీకరణ, యాంత్రీకరణ, కవర్డ్ స్టోరేజ్ సదుపాయాలు, సోలార్ పవర్, పారిశ్రామిక అవసరాల కోసం ఎస్టీపీ వాటర్ ట్రీట్మెంట్, పెట్టుబడి అవకాశాలపై చర్చించారు. పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనుల్ని యూఎస్ బృందం పరిశీలించింది. భారత్–అమెరికా మధ్య పోర్టు ద్వారా వాణిజ్య సంబంధాల ప్రాధాన్యత గురించి పోర్ట్ అధికారులు పీపీటీ ద్వారా వివరించారు. పోర్టులో ఉన్న మౌలిక వసతుల ప్రయోజనాలను ఉపయోగించుకోవాలని అమెరికా ప్రతినిధులకు సూచించారు. వీపీఏలో ఉన్న ఫ్రీ ట్రేడ్ జోన్, క్రూయిజ్ టూరిజం వంటి అవకాశాల్ని వినియోగించుకోవాలని కోరారు.

మా గ్రామంలో బెల్టు దుకాణాలు తొలగించండి

కృష్ణగిరి: ప్రభుత్వం మండలానికి ఒక మద్యం షాపు మంజూరు చేస్తే.. ఇక్కడ మాత్రం గ్రామ గ్రామానా బెల్టు దుకాణాలు వెలిశాయని, ముందు వీటిని తొలగించాలని కర్నూలు జిల్లా చిట్యాల సర్పంచ్ రాజేశ్వరగౌడ్ ఎక్సైజ్ అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వైస్ ఎంపీపీ బోయ సుశీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఎక్సైజ్ ఎస్ఐ చంద్రమౌళి మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసారా నిర్మూలనకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఇంతలో చిట్యాల సర్పంచ్ రాజేశ్వరగౌడ్ కల్పించుకొని నాటుసారా నిర్మూలనకు సహకరిస్తాం కానీ గ్రామాల్లో ఉన్న బెల్టు దుకాణాలను ఎందుకు కట్టడి చేయడం లేదని ప్రశ్నించారు. తాను కూడా అధికార పార్టీకి చెందిన వాడినేనని.. గ్రామాల్లో డబ్బులు తీసుకుని బెల్టు దుకాణాలు ఏర్పాటు చేయడం, దీన్ని అధికారులు ప్రోత్సహించడం ఎంత వరకు సమంజసమన్నారు. అయితే ఆయనకు సమాధానం చెప్పకుండానే అధికారులు దాటవేయడం గమనార్హం.

ఆదివారం ఆమె కోసం..



మనసున మనసై..

- వారాంతాల్లో విరామంతో ఇల్లాలికి ఉపశమనం
- ఇంటి పనుల్లో భర్త భాగస్వామ్యం అవసరం
- ఇద్దరి మధ్య బలమైన బంధానికి పునాది
- వర్క్ షేరింగ్.. హ్యాపీనెస్ లోడింగ్ అంటున్న మానసిక నిపుణులు

రోజంతా బండెడు చాకిరీ చేసే భార్యకు ఇంటి పనిలో భర్త చేసే చిన్నపాటి సాయం ఎంతో ఉపశమనాన్నిస్తుంది. లేచింది మొదలు పడుకునే వరకు అలుపెరుగని ఆమె శ్రమకు వారంలో ఒక్కరోజైనా విరామం అవసరం. ఆదివారం భర్త ఇంటి పనులు చక్కబెడుతూ ఆమెను మురిపిస్తే వారి సంసార బంధం మరింత బలపడుతుందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.




సాక్షి, భీమవరం: తెల్లారి లేచింది మొదలు ఆడవాళ్ల చేతులు పనులకు ముడిపడతాయి. ఇంటిని శుభ్రం చేయడం, పిల్లలకు స్నానాలు చేయించడం, భర్త, పిల్లలు రెడీ అయ్యేసరికి టిఫిన్లు సిద్ధం చేసి పెట్టడం. అవి పూర్తయ్యేలోగా లంచ్ బాక్స్‌లు ప్యాకింగ్. ఇలా.. ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు క్షణక్షణం ఉరుకులు పరుగుల జీవితం. భర్తను ఉద్యోగానికి, పిల్లల్ని బడికి సాగనంపాక బండెడు గిన్నెలు తోముకుని, ఇంటిల్లపాదివి మాసిన దుస్తులు ఉతుక్కుని, స్నానం చేసి దేవుడికి దణ్ణం పెట్టుకుని.. హమ్మయ్యా అనుకునేసరికి టైం 11 అయిపోతుంది. చాలామంది గృహిణులు ప్రశాంతంగా కూర్చుని టిఫిన్ చేసేది అప్పుడే. సాయంత్రం పిల్లలు, భర్త ఇంటికి తిరిగి వచ్చే వరకు ఏదో పనిలో ఈదుతూనే ఉంటారు. పిల్లలతో హోం వర్క్ చేయించి రాత్రి అందరూ పడుకున్నాక ఉదయానికి అన్నీ సర్దుకుని అలసిసొలసి అప్పుడు నిద్రలోకి జారుకుంటుంటారు.

కుటుంబానికి చేదోడుగా..

భర్త, పిల్లల్ని సాగనంపి కుటుంబ పోషణకు చేదోడుగా ఉద్యోగాలు, పనులు చేస్తున్న మహిళలు ఎందరో ఉన్నారు. వీరిపై పనిభారం మరింత ఎక్కువగా ఉంటుంది. దాదాపు ప్రతి ఇంటిలో తొలి మేలుకొలుపు భార్యదే. రాత్రి బాగా పొద్దిపోయాక నిద్రపోయేది ఆమెనే. పనుల సుడిగుండంలో తనను తాను మరిచిపోయి ఎల్లప్పుడూ కుటుంబ క్షేమం కోరే వ్యక్తి ఇల్లాలు. అలాంటి అర్ధాంగికి ఉపశమనం కలిగించేలా వారాంతాలు, ముఖ్యంగా ఆదివారం ఇంటి పనుల్లో భర్త సహాయం చేయడం ద్వారా గృహిణుల మానసిక, శారీరక స్థితులు మరింత దృఢమవుతాయని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. గృహ సంబంధ బాధ్యతలు పంచుకోవడం మేలని, ఈ దిశగా అందరూ ముందుండాలని అంటున్నారు.

ఏమేం చేయాలంటే..



- ఉదయం లేవగానే గదులను తుడవడం, దుమ్ములు దులిపి ఇంటిని శుభ్రం చేయడం. ఇంటి ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించడం, మొక్కలకు నీరు పెట్టడం. గిన్నెలు తోమడం, కూరగాయలు కోయడం, వంట చేయడం. దుస్తులు ఉతికి ఆరబెట్టడం, ఐరెన్ చేయడం
- పిల్లలు ఇంటి వద్దనే ఉంటారు కాబట్టి వారికి స్నానాలు చేయించడం, హోంవర్క్‌లో సాయం చేయడం, వారితో కలిసి సరదాగా ఆడుకోవడం వంటివి భర్తలు చేస్తుండాలి.

ప్రయోజనాలెన్నో..

- ఇంటిపనిలో చేదోడువాదోడుగా ఉండే భర్తని ఇల్లాలు చాలా ఎక్కువగా ప్రేమిస్తుందని నిపుణులు అంటున్నారు. భర్త తనను ఎంత ప్రేమగా, బాధ్యతగా చూసుకుంటున్నాడో అర్థం చేసుకుంటుంది. ఇద్దరి మధ్య ఏమైనా మనస్పర్థలు, అపార్థాలు ఉంటే తొలగిపోతాయి. ఆదివారం వర్క్ షేరింగ్‌తో ఆ ఇంట హ్యాపీనెస్ లోడింగ్ అవుతుందని నిపుణులు చెబుతున్నారు.
- ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటేనే ఇంటిల్లిపాది ఆరోగ్యంగా ఉంటారు. విశ్రాంతి వలన ఆమె శారీరక, మానసిక స్థితి మెరుగుపడుతుంది.
- ఇంటి పనులు త్వరగా పూర్తయితే ఇద్దరూ కూర్చుని కబుర్లు చెప్పుకునేందుకు సమయం పెరుగుతుంది.
- సెలవురోజున పని అయ్యాక ఇల్లాలని సరదాగా బయటకు తీసుకువెళ్లడం వలన వారికి రీఫ్రెష్ అయిన భావన కలిగి వారమంతా ఉత్సాహంగా ఉండే వీలుంటుంది.
- ఇల్లాలు భర్త నుంచి కొంత సమయం కోరుకుంటుంది. అది కూడా స్నేహపూర్వక వాతావరణంలో ఉండాలని భావిస్తుంది. ప్రేమగా వారి పనుల్లో పాలుపంచుకోవడం వలన ఇది సాధ్యపడుతుంది.
- ఇంటి పని మహిళలే చేయాలన్న భావన నుంచి బయటపడొచ్చు.

భార్యకు విశ్రాంతి అవసరం



భార్యకు ఒక్కరోజు విశ్రాంతినివ్వడం ఎంతో అవసరం. పని ఒత్తిడి నుంచి వారికి ఉపశమనం కలుగుతుంది. వారిని పట్టించుకోనట్టు ఉంటేనే ఆడవారికి అలకలు, కోపాలు వస్తాయి. భర్త ఇంటి పనుల్లో కలుగజేసుకుని భార్యకు చేసే సాయం వారి బంధానికి మరింత బలమవుతుంది. కౌన్సెలింగ్‌లో భార్యాభర్తలకు ఈ విషయాన్ని చెబుతుంటాం.

– చల్లా భారతిదేవి, సైకియాట్రిస్ట్, పాలకొల్లు

ఆయనకు సెలవొస్తే..



మా వారు పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగి. ఆదివారం, సెలవు రోజుల్లో ఇంటి వద్ద వంట పని, ఇంటి పనుల్లో సాయం చేస్తుంటారు. నా కష్టాన్ని అర్థం చేసుకునే మనస్తత్వం ఆయనకు ఉందని సంతోషం, సంతృప్తి కలుగుతుంటాయి. నేను ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటానికి నా భర్త సహకారమే కారణం.

– అంబటి అరుణ సూర్యకుమారి, గృహిణి, నరసాపురం

తప్పనిసరిగా సహకరించాలి



ఇంటి, వంట పనుల్లో భార్యకు తప్పనిసరిగా సహకరించాలి. నేను వ్యాపారరీత్యా ఆరు రోజులు షాపులో ఉన్నా ఆదివారం తప్పనిసరిగా ఇంటి పనుల్లో నా భార్య లక్ష్మీకుమారికి సహాయపడతాను. ఇతర రోజుల్లోనూ ఇతర పనుల్లో సహాయం చేస్తా. భార్యలకు సాయం చేయడం బాధ్యతగా భావించాలి తప్ప నామోషీగా ఫీల్ కాకూడదు.

– కారుమూరి నర్సింహమూర్తి (బాబు), భీమవరం

ఇంటి పనుల్లో సాయపడతాను



నేను ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయుడిని. ఉదయం నుంచి రాత్రి వరకూ ఇంటి కోసం కష్టపడే నా సతీమణి కోసం ఆదివారం ఇంటి పనుల్లో సాయపడతాను. అప్పుడు తెలుస్తుంది ఇంటిని చక్కబెట్టేందుకు ఆవిడ ఎంత కష్టపడుతుందోనని. పొద్దస్తమాను పనిచేసే మహిళలకు వారంలో ఒక రోజు విశ్రాంతి అవసరం.

– పొద్దోకు గజేంద్ర గడ్కర్, ఉపాధ్యాయుడు, రాయకుదురు



పెన్సిల్ తయారీకి అనువైన పలకలను ఆరబెట్టిన దృశ్యం

ఓఖూలో 17 పరిశ్రమలు

ఉపాధి పొందుతున్న వారు 20 వేల మంది

ఏటా ఎగుమతుల విలువ రూ.15 కోట్లు



పెన్సిల్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు

పెన్సిల్ విలేజ్ ఓఖూ




పరిశ్రమలో పెన్సిల్ తయారీ



- దేశానికి పెన్సిల్ ఉత్పత్తికి కావాల్సిన 90 శాతం కలప ఇక్కడి నుంచే
- 85 దేశాలకు ఎగుమతులు
- నేడు జాతీయ పెన్సిల్ దినోత్సవం

ఏపీ సెంట్రల్ డెస్క్: జమ్ము కశ్మీర్‌లోని పుల్వామా జిల్లా ఓఖూ గ్రామం పెన్సిల్ విలేజ్ ఆఫ్ ఇండియాగా వినుతికెక్కింది. దేశం నుంచి పెన్సిల్ ఉత్పత్తికి కావాల్సిన 90 శాతం ముడి కలప ఇక్కడి నుంచే కంపెనీలకు ఎగుమతవుతోంది. పెన్సిళ్ల తయారీకి అవసరమైన కలపను ఒకప్పుడు చైనా, జర్మనీ నుంచి ఇక్కడివారు దిగుమతి చేసుకునేవారు. ఇప్పుడా అవసరం లేకుండా స్థానికంగా లభించే కలపను సమర్థవంతంగా వినియోగించుకుంటున్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో తమదైన ముద్ర వేసుకుంటున్నారు. మార్చి 30 జాతీయ పెన్సిల్ దినోత్సవం. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం పాఠకుల కోసం.

ప్రధాని ప్రస్తావనతో వెలుగులోకి..



దేశ ప్రధాని నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆవిష్కరించే మన్ కీ బాత్ లో పెన్సిల్ విలేజ్ ఆఫ్ ఇండియాగా ఓఖూను అభివర్ణించారు. దీంతో ఈ గ్రామం వెలుగులోకి వచ్చింది. పుల్వామా జిల్లాలోని ఈ గ్రామం పెన్సిల్ తయారీకి ప్రధాన కేంద్రంగా గుర్తింపుపొందింది. దేశాన్ని విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో పుల్వామా కీలక భూమిక పోషిస్తోందని, విద్యార్థులు తమ హోంవర్క్ చేయడం, నోట్స్ రాసుకోవడంలో పెన్సిల్ వినియోగించినప్పుడల్లా పుల్వామా జిల్లా స్ఫురణకు వస్తుందని మన్ కీ బాత్ ప్రసంగంలో కితాబిచ్చారు.

దిగుమతుల నుంచి ఎగుమతుల దాకా..

1960 నుంచి ఇక్కడ పరిశ్రమల ప్రస్థానం ప్రారంభమైంది. మొదట్లో పెన్సిల్ తయారీకి దియోదార్ కలపను వినియోగించేవారు. 1992లో ఇక్కడి ప్రభుత్వం దియోదార్ వినియోగాన్ని నిషేధించడంతో చైనా, జర్మనీ దేశాల నుంచి కలపను దిగుమతి చేసుకునేవారు. అయితే ఇది వ్యయ ప్రయాసలతో కూడినది కావడంతో ప్రత్యామ్నాయానికి అన్వేషించారు. అలాంటి సమయంలో ఇక్కడ లోయల్లో లభించే పోప్లర్ కలప వీరికి వరంలా మారింది. ఆ కలపతో పెన్సిల్ పలకలను తయారుచేయడం మొదలెట్టారు. పోప్లర్ కలప పెన్సిల్ నాణ్యతను పెంచడంతో దిగుమతుల దశ నుంచి ఎగుమతి చేసుకునే స్థాయికి చేరింది. యూఏఈ, మెక్సికో, నేపాల్, పోలాండ్, ఫ్రాన్స్, భూటాన్, యూకే, బెల్జియం, మారిషస్, లెబనాన్, మాల్దీవులు, గ్రీక్, శ్రీలంక, బంగ్లాదేశ్ తోపాటు 85 దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

వోల్జా జూన్ 2024 నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా పెన్సిల్ ముడికలప ఎగుమతుల్లో తొలి మూడు స్థానాల జాబితా

స్థానం	దేశం	కంటెయినర్లు
1.	చైనా	17,800
2.	దక్షిణాఫ్రికా	1,982
3.	భారత్	1,771

వోల్జా 2024 నివేదిక ప్రకారం పెన్సిళ్ల ఉత్పత్తిలో తొలి మూడు స్థానాల్లోని దేశాల జాబితా

స్థానం	దేశం	కంటెయినర్లు
1.	చైనా	3,812
2.	యునైటెడ్ కింగ్‌డమ్	854
3.	భారత్	817

మూడేళ్లలో భారత్ పెన్సిళ్ల ఎగుమతులు	సంవత్సరం	(మిలియన్ డాలర్లలో)
	2022	52.2
	2023	56.7
	2024	61.2

నిరుద్యోగుల కల్పతరువు... ఓఖూ

ఓఖూ...పుల్వామా జిల్లాకు చెందిన ఓ మారుమూల గ్రామం. ప్రపంచ స్థాయి మార్కెట్లో ఒకటిగా వెలుగొందుతోంది. గతంలో ముడి కలపను జమ్ము, చండీగఢ్‌లో ముక్కలుగా చేసి తెప్పించేవారు.స్థానిక ప్రభుత్వం వీరికి ఆధునికతను అందుబాటులోకి తీసుకురావడంతో పెన్సిల్ పలకలను ఇక్కడే తయారు చేస్తున్నారు. పెన్సిల్ రూపకల్పనకు అవసరమైన పలకలను ఎండబెడతారు. ఇవి బాగా ఆరాక ఒక్కో పెట్టెలో 800 పలకల లెక్కన ప్యాక్ చేస్తారు. నటరాజ్, అప్సర, హిందూస్థాన్ పెన్సిళ్ల తయారీ కర్మాగారాలకు ఇక్కడి నుంచే కలప వెళ్తోంది. ఏనాటికైనా కశ్మీర్ లోనే పూర్తి స్థాయి పెన్సిల్ ప్లాంట్ అందుబాటులోకి రావాలని, ప్రపంచ స్థాయిలో పెన్సిల్ ఉత్పత్తిలో దేశాన్ని అగ్రగామిగా నిలపాలన్నది ఓఖూ గ్రామస్తుల ఆకాంక్ష.

ఇకపై ఇచ్చినంతే తీసుకోవాలి!

- ఇంతకు ముందులా కావాలనుకున్నంత తీసుకోవడం కుదరదు
- పొదుపు మహిళలకు ఇచ్చే బ్యాంకు రుణాలపై నియంత్రణ
- నీడ్ బేస్ట్ ఫైనాన్స్.. విధానం అమలుకు కూటమి ప్రభుత్వం కసరత్తు
- ఆ మేరకు త్వరలో సర్వే

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో పొదుపు సంఘాల మహిళలు ఇక మీదట ఇంతకు ముందు మాదిరి కావాలనుకున్నంత రుణం తీసుకునే పరిస్థితి ఉండకపోవచ్చు. వారికి బ్యాంకులిచ్చే రుణ మొత్తాలపై నియంత్రణ ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు మొదలెట్టింది. పొదుపు సంఘాల రుణ ప్రక్రియలో కొత్తగా 'నీడ్ బేస్డ్ ఫైనాన్స్' అన్న విధానాన్ని అమల్లోకి తెచ్చే యోచన చేస్తోంది. కుటుంబ ఆదాయం పెంచుకునేందుకు అవసరమైన జీవనోపాధుల కల్పనకు ఎంత అవసరమో అంతమేర మాత్రమే రుణం తీసుకునేలా కార్యాచరణను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా.. పొదుపు సంఘాల మహిళల రుణ ప్రణాళిక ఖరారుకు ముందే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత పొదుపు సంఘాల మహిళల ఆర్థిక అవసరాలపై సర్వే చేపట్టనున్నారు. దీనికి 'ఎస్‌హెచ్‌జీ అడ్వాన్స్ క్రెడిట్ అండ్ లైవ్‌లీహుడ్ యాక్షన్ ప్లాన్' అని పేరు పెట్టారు.

సేకరించే వివరాలివీ..

ఈ సందర్భంగా ఒక్కో పొదుపు సంఘం ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు ఆ సంఘంలోని సభ్యులు ఎంత మొత్తం పొదుపు చేసుకున్నారు? ఎన్ని విడతలు, ఎంతేసి మొత్తం బ్యాంకుల నుంచి రుణంగా తీసుకున్నారు? ప్రస్తుతం ఆయా సంఘాల పేరిట ఎంత అప్పు ఉంది? తీసుకున్న అప్పు కుటుంబ అవసరాలకు వాడుకున్నారా, జీవనోపాధుల కల్పనకు వాడుకుంటున్నారా? వచ్చే ఆర్థిక ఏడాదిలో కుటుంబ ఆదాయం పెంపునకు, జీవనోపాధుల కల్పనకు పెట్టుబడుల అవసరం ఉంటుందా? తదితర వివరాలపై ఈ సర్వే నిర్వహించనున్నారు. ప్రతి గ్రామ సమాఖ్య నుంచి ఐదుగురు చొప్పున పొదుపు సంఘాల మహిళలను ఎంపిక చేసి.. వారికి శిక్షణ ఇచ్చి వారి ద్వారానే ఈ సర్వే చేపడతారు. ఏప్రిల్ మొదటి వారంలో ప్రతి పొదుపు సంఘం మహిళ వద్ద నుంచి ఆయా వివరాలు సేకరిస్తారు.

ఈ ఏడాది రుణాల్లో సైతం భారీ తగ్గుదల

ఈ మార్చి నెలాఖరులో ముగిసే 2024–25 ఆర్థిక సంవత్సరం పొదుపు సంఘాల రుణాల పంపిణీలో భారీగా తగ్గుదల నమోదైంది. సెర్ప్ ఆధ్వర్యంలో కొత్తగా రూ.32,190 కోట్ల రుణాలు అందించాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.27 వేల కోట్ల మేరే పొదుపు సంఘాలు రుణాలు పొందాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సెర్ప్ ద్వారా గ్రామీణ ప్రాంత పొదుపు సంఘాలకు రూ.22 వేల కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకుని.. ఏకంగా రూ.40 వేల కోట్లు అందించడం విశేషం.

ప్రతి వైఫల్యం విజయానికి మెట్టు కావాలి

- కలలు నెరవేర్చుకునేలా చదువులు సాగించాలి
- దాల్మియా గ్రూప్ ఎండీ పునీత్ దాల్మియా
- వేడుకగా విశాఖ ఐఐఎం స్నాతకోత్సవం

విశాఖ విద్య: జీవిత గమనంలో ఎదురయ్యే ప్రతి వైఫల్యం తదుపరి విజయానికి మెట్టు కావాలని దాల్మియా భారత్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ దాల్మియా అన్నారు. విశాఖలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంవీ) 9వ స్నాతకోత్సవాన్ని నగరంలోని బీచ్‌రోడ్‌లో గల నోవాటెల్‌లో శనివారం వేడుకగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దాల్మియా మాట్లాడుతూ గ్రాడ్యుయేట్లు పెద్ద కలలు కనేలా రిస్క్ తీసుకోవాలని, అదే క్రమంలో వైఫల్యాన్ని విజయానికి మెట్టుగా స్వీకరించాలన్నారు. వృత్తిపరమైన ప్రయాణాలను ప్రారంభించేటప్పుడు దేశభక్తి నిండి ఉండాలన్నారు. ఇదే తన ఎదుగుదలకు కీలక భూమికగా నిలిచిందన్నారు. సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ నివేదికను సమర్పించారు. విద్యా కార్యక్రమాల విస్తరణ అనూహ్యంగా పెరిగిందన్నారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్ హరి ఎస్.భార్టియా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా 375 మంది ఎంబీఏ గ్రాడ్యుయేట్లు, ముగ్గురు పీహెచ్‌డీ స్కాలర్లకు డిగ్రీలు ప్రదానం చేశారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు.

ఇదిదా సర్‌ప్రైజ్!

● విలన్స్‌గా స్టార్ హీరోలు

కెరీర్ ప్రారంభంలో విలన్‌గా చేసి, ఆ తర్వాత హీరోగా టర్న్ తీసుకున్న హీరోలు ఇండస్ట్రీలో చాలామంది ఉన్నారు. కానీ హీరోగా సక్సెస్ అయిన తర్వాత కూడా విలన్ రోల్స్‌ను ప్రయత్నిస్తున్నారు కొందరు హీరోలు. 'ఇదిదా సర్‌ప్రైజ్' అంటూ ఇలా తమ నెగటివ్ షేడ్స్ ట్యాలెంట్‌తో ఆడియన్స్‌ను సర్‌ప్రైజ్ చేసిన, సర్‌ప్రైజ్ చేయనున్న కొందరు హీరోల గురించి ఓ లుక్ వేద్దాం.



● నాగార్జున ● ప్రభాస్ ● ఎన్టీఆర్ ● అల్లు అర్జున్



● మంచు మనోజ్

కూలీకి విలన్?

సిల్వర్ స్క్రీన్‌పై నాగార్జున నెగటివ్ రోల్ చేస్తే ఎలా ఉంటుందో చూడాలనే ఆసక్తి ఆడియన్స్‌లో తప్పక ఉంటుంది. పూర్తి స్థాయి గ్రే షేడ్స్ క్యారెక్టర్‌లో నాగార్జునను స్క్రీన్‌పై చూడాలని కొందరు ఆడియన్స్ కోరుకుంటున్నారు. ఆ తరుణం ఆసన్నమైందని, రజనీకాంత్ 'కూలీ' సినిమాలో నాగార్జున నెగటివ్ షేడ్స్ ఉన్న రోల్ చేస్తున్నారనే టాక్ కోలీవుడ్‌లో ప్రచారంలోకి వచ్చింది. 'కూలీ' సినిమా చిత్రీకరణ ప్రారంభమైనప్పుడు నాగార్జున ఓ వ్యక్తిని క్రూరంగా కత్తితో చంపుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ సినిమాలో నాగార్జున క్యారెక్టర్ నెగటివ్ షేడ్స్‌లో ఉంటుందనే వార్తలకు ఈ వీడియో రూపంలో బలం చేకూరినట్లయింది. అయితే ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' సినిమాను సన్ పిక్చర్స్ నిర్మించింది. శ్రుతీహాసన్, ఉపేంద్ర, సత్యరాజ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ ఓ గెస్ట్ రోల్ చేశారు. 'కూలీ' సినిమా చిత్రీకరణ పూర్తయింది. త్వరలోనే ఈ మూవీ విడుదల తేదీపై ఓ స్పష్టత రానుంది.

బ్రహ్మ రాక్షస

హీరోగా ప్రభాస్ కటౌట్‌కి ఉన్న బాక్సాఫీస్ స్టామినా ఏంటో ఆడియన్స్ చూశారు. మరి... ప్రభాస్‌లాంటి కటౌట్ ఉన్న హీరో క్యారెక్టర్‌లో నెగటివ్ షేడ్స్ ఉంటే ఎలా ఉంటుందో 'బిల్లా' సినిమాలో శాంపిల్‌గా ఆడియన్స్ చూశారు. కానీ ఈ డోస్‌ను ఇంకాస్త పెంచి 'బ్రహ్మ రాక్షస' సినిమాతో ఆడియన్స్‌ని తన నెగటివ్ షేడ్ యాక్టింగ్ స్కిల్‌తో సర్‌ప్రైజ్ చేయాలని ప్రభాస్ భావిస్తున్నారట. ప్రభాస్ మెయిన్ లీడ్ రోల్‌లో 'హనుమాన్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'బ్రహ్మ రాక్షస' అనే మూవీ రానుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో ప్రభాస్ క్యారెక్టరైజేషన్‌లో నెగటివ్ షేడ్స్ ఉంటాయని సమాచారం. ప్రస్తుతం ప్రభాస్ 'రాజా సాబ్, ఫౌజి' సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆ తర్వాత సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్' మూవీ చేస్తారు. ఈ 'స్పిరిట్' మూవీ చిత్రీకరణ ఓ కొలిక్కి వచ్చిన తర్వాతే... ప్రశాంత్ వర్మతో 'బ్రహ్మ రాక్షస' సినిమాను టేకాఫ్ చేస్తారు ప్రభాస్. ఈ లోపు రిషబ్ శెట్టితో 'హనుమాన్' సీక్వెల్ 'జై హనుమాన్'ను పూర్తి చేస్తారు ప్రశాంత్ వర్మ. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రభాస్–ప్రశాంత్ వర్మ కాంబోలోని మూవీ 2026 చివర్లో లేదా 2027 ప్రారంభంలో మొదలు కానున్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు ఈ 'బ్రహ్మ రాక్షస' సినిమాను తొలుత రణ్‌వీర్ సింగ్‌తో చేయాలనుకున్నారు ప్రశాంత్ వర్మ. కానీ కొన్ని కారణాల వల్ల రణ్‌వీర్ సింగ్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు.

బాలీవుడ్ వార్

'టెంపర్, జై లవకుశ' వంటి చిత్రాల్లో నెగటివ్ షేడ్స్ ఉన్న రోల్స్‌లో ఎన్టీఆర్ స్క్రీన్‌పై ఎంత రెచ్చిపోయారో ఆడియన్స్ చూశారు. కాగా ఎన్టీఆర్‌లోని నెగటివ్ షేడ్ యాంగిల్ ఈసారి నార్త్ ఆడియన్స్‌కు కూడా సిల్వర్ స్క్రీన్‌పై కనిపించనుందని తెలిసింది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ లీడ్ రోల్స్‌లో హిందీలో 'వార్ 2' అనే మూవీ రానుంది. 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. యశ్ రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్‌లో భాగంగా రానున్న 'వార్ 2' సినిమాలో ఎన్టీఆర్ క్యారెక్టర్‌లో నెగటివ్ షేడ్స్ ఉంటాయని బాలీవుడ్ సమాచారం. 'రా' (రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్) ఏజెంట్ వీరేంద్ర నాథ్ పాత్రలో ఎన్టీఆర్ నటిస్తున్నారని, ఆయన క్యారెక్టర్‌లో నెగటివ్ షేడ్స్ ఉంటాయని టాక్. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఆగస్టు 14న 'వార్ 2' సినిమాను రిలీజ్ చేయనున్నట్లుగా ఇటీవల మేకర్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

తొలిసారిగా విలన్‌గా...

సిల్వర్ స్క్రీన్‌పై బ్లాక్ బస్టర్ హీరోస్‌లో అల్లు అర్జున్ ఒకరు. కాగా అల్లు అర్జున్ హీరోగా నటించిన 'ఆర్య 2' చిత్రంలో ఆయన క్యారెక్టర్‌లో కాస్త గ్రే షేడ్స్ ఉంటాయి. ఆ తర్వాత 'పుష్ప' వంటి ఎగ్రెసివ్ ఎనర్జీ ఉన్న క్యారెక్టర్స్ చేశారు కానీ, పూర్తి స్థాయి గ్రే షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌ను అల్లు అర్జున్ చేయలేదు. ఇప్పుడు ఆ సమయం ఆసన్నమైందట. అల్లు అర్జున్ హీరోగా అట్లీ డైరెక్షన్‌లో ఓ భారీ బడ్జెట్ మూవీ రానుందనే టాక్ కొన్ని రోజులుగా వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ మూవీలో అల్లు అర్జున్ ద్విపాత్రాభినయం చేయనున్నారని, ఈ రెండు రోల్స్‌లో ఓ రోల్‌లో నెగటివ్ షేడ్స్ ఉంటుందని ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. సన్ పిక్చర్స్ సంస్థ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మించనుందట. ఈ వేసవిలో చిత్రీకరణను ప్రారంభించి, 2026 చివర్లో ఈ మూవీని రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని భోగట్టా. ఈ చిత్రంపై పూర్తి స్థాయి సమాచారం అందాల్సి ఉంది. ఏప్రిల్ 8న అల్లు అర్జున్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన రావొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

బ్లాక్ స్వార్డ్

హీరోగా తెలుగు స్క్రీన్‌పై సక్సెస్ అయ్యారు మంచు మనోజ్. ఇప్పుడు విలన్‌గా కనిపించనున్నారు. 'హను–మాన్' ఫేమ్ తేజ సజ్జా హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ ఈ మైథలాజికల్ అండ్ యాక్షన్ అడ్వెంచరస్ ఫిల్మ్‌ను నిర్మిస్తున్నారు. ఈ మూవీలో సూపర్ యోధ పాత్రలో తేజ సజ్జా నటిస్తుండగా, బ్లాక్ స్వార్డ్ పాత్రలో మంచు మనోజ్ విలన్‌గా కనిపిస్తారు. ఇక 'మిరాయ్' చిత్రం ఆగస్టు 1న విడుదల కానుంది.

ఈ హీరోలే కాదు... ఇంకొందరు స్టార్స్ కూడా నెగటివ్ షేడ్స్ ఉన్న రోల్స్‌కి సై అన్నారు.

- మునిమి శివాంజనేయులు



● సూర్య

కోలీవుడ్ హీరోలు కూడా వీలైనప్పుడు విలన్ రోల్స్ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' మూవీలో మెయిన్ విలన్‌గా కమల్‌హాసన్ నటించారు. కమల్‌హాసన్ హీరోగా చేసిన 'విక్రమ్' మూవీ క్లైమాక్స్‌లో రోలెక్స్‌గా విలన్ పాత్రలో కనిపించారు సూర్య. ఇక సూర్య హీరోగా చేసిన 'కంగువ' మూవీలో కార్తీ విలన్‌గా కనిపించారు. కార్తీ హీరోగా చేసిన 'ఖైదీ' సినిమాలో తమిళ యువ నటుడు అర్జున్ దాస్ నెగటివ్ షేడ్స్ ఉన్న రోల్‌లో కనిపించారు. కమల్‌హాసన్ 'విక్రమ్', కార్తీ 'ఖైదీ' చిత్రాల దర్శకుడు లోకేశ్ కనగరాజ్ నేతృత్వంలోని 'లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్'లో భాగంలోనివే. సో... 'ఖైదీ 2' చిత్రంలో సూర్య విలన్‌గా నటించే చాన్సెస్ ఉన్నాయి. ఇంకా శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న 'పరాశక్తి' సినిమా కోసం తొలిసారిగా విలన్‌గా స్క్రీన్‌పై కనిపించనున్నారు రవి మోహన్ (ఇటీవల 'జయం' రవి తన పేరును రవి మోహన్‌గా మార్చుకున్నారు). సుధ కొంగర దర్శకత్వంలోని ఈ మూవీ వచ్చే ఏడాది ప్రారంభంలో రిలీజ్ కానుందని తెలిసింది. ధనుష్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఇడ్లీ కడై'లో అరుణ్ విజయ్ విలన్‌గా చేస్తున్నారన్న వార్తలు కోలీవుడ్‌లో వినిపిస్తున్నాయి. ఇంకా వీలైనప్పుడల్లా విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి, మాధవన్ వంటి యాక్టర్స్ కూడా విలన్ రోల్స్ చేస్తున్నారు.
ఇలా ఇంకొంతమంది ఉన్నారు.



● అభిషేక్ బచ్చన్

బాలీవుడ్ హీరోలు కూడా విలన్ రోల్స్ చేస్తున్నారు. షారుక్ ఖాన్ హీరోగా చేయనున్న నెక్ట్స్ మూవీ 'కింగ్' (ప్రచారంలో ఉన్న టైటిల్)లో అభిషేక్ బచ్చన్ తొలిసారి నెగటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్ చేయనున్నారు. రణ్‌బీర్ కపూర్ హీరోగా చేస్తున్న 'రామాయణ' సినిమాలో 'కేజీఎఫ్' హీరో యశ్ రావణుడి పాత్ర చేస్తున్నారు. గత ఏడాది విడుదలైన అజయ్ దేవగన్ 'సింగమ్ ఎగైన్'లో అర్జున్ కపూర్ విలన్‌గా చేశారు. ఇంకా బాలీవుడ్‌లో హీరోలుగా, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా చేస్తున్న సంజయ్ దత్, బాబీ డియోల్ (హరిహర వీరమల్లు), ఇమ్రాన్ హష్మి (ఓజీ, జీ 2), జిమ్ సర్ఫ్ (కుబేర), సోహైల్ ఖాన్ (అర్జున్ సన్నాఫ్ వైజయంతి), దివ్యేందు (పెద్ది) వంటి వారు తెలుగు సినిమాల్లో విలన్ రోల్స్ చేస్తున్నారు. ఇలా ఇంకొందరు ఉన్నారు.



● శ్రద్ధా శ్రీనాథ్

కథ నచ్చితే నెగటివ్ షేడ్స్ ఉన్న రోల్స్ చేసేందుకు హీరోయిన్స్ సైతం వెనకాడటం లేదు. ఈ విషయంలో వరలక్ష్మీ శరత్‌కుమార్ ముందుంటారు. హీరోయిన్‌గా చేస్తూనే ఎక్కువగా విలన్ రోల్స్ చేస్తుంటారామె. ఇక వెంకటేశ్ 'సైంధవ్'లో ఆండ్రియా, విశ్వక్ సేన్ 'మెకానిక్ రాకీ' సినిమాలో శ్రద్ధా శ్రీనాథ్, 'వెన్నెల' కిశోర్ 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'లో అనన్య నాగళ్ల, అజిత్ 'విడాముయర్చి' లో రెజీనా, రణ్‌బీర్ కపూర్ 'బ్రహ్మాస్త్ర'లో మౌనీ రాయ్, 'పొన్నియిన్ సెల్వన్'లో ఐశ్వర్యా రాయ్ వంటి వారు కెరీర్‌లో హీరోయిన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా రాణిస్తున్న సమయంలోనే నెగటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్స్ చేశారు. ఇలా మరికొంతమంది ఉన్నారు.

ఆస్కార్ వరకూ వెళ్లిన సంతోష్ రిలీజ్‌కి బ్రేక్

● ఇండియాలో విడుదల చేయడంలేదన్న దర్శకురాలు సంధ్యా సూరి



● సంధ్యా సూరి

యూకే తరఫున ఆస్కార్ నామినేషన్ ఎంట్రీ పోటీకి అధికారికంగా ఎంట్రీ ఇచ్చిన 'సంతోష్' చిత్రం విడుదలకు భారత్‌లో బ్రేక్ పడిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. సహానా గోస్వామి, సునీతా రాజ్వర్, సంజయ్ బిష్ణోయ్, కుశాల్ దూబే ప్రధాన పాత్రల్లో భారతీయ సంతతికి చెందిన బ్రిటిష్ పౌరురాలు సంధ్యా సూరి దర్శకత్వం వహించిన చిత్రం 'సంతోష్'. 2024లో అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో యూకే తరఫున ఆస్కార్‌కు అధికారికంగా ఎంట్రీ ఇచ్చిన 'సంతోష్' మూవీ డిసెంబర్‌లో షార్ట్ లిస్ట్ అయినప్పటికీ అవార్డు అందుకోలేకపోయింది. ఇక ఈ చిత్రాన్ని ఈ ఏడాది జనవరిలో ఇండియాలో విడుదల చేయాలనుకున్నప్పటికీ కుదరలేదు. ఈ మూవీలో పలు సున్నితమైన అంశాలను చూపించడంపై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసిందని యూనిట్ తాజాగా వెల్లడించింది. అందుకే ఈ సినిమాని భారత్‌లో రిలీజ్ చేయడం లేదని పేర్కొంది. ఈ విషయం గురించి సంధ్యా సూరి మాట్లాడుతూ– ''సంతోష్'ని భారత్‌లో విడుదల చేయాలని ప్రయత్నించాం. మా చిత్రంలో కొన్ని సున్నితమైన సన్నివేశాలను తొలగించమని సెన్సార్ బోర్డు పేర్కొంది. అలా చేస్తే మా కథలోని గాఢత పోతుంది. స్క్రిప్ట్ దశలో ఉన్నప్పుడు మా సినిమాని అందరూ అంగీకరించారు. కానీ, ఇప్పుడు ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పైగా మా సినిమాలో చూపించిన సన్నివేశాలను, సమస్యలను గతంలో ఎన్నో సినిమాల్లో ప్రస్తావించారు. బహుశా మా సినిమాలో హీరో లేకపోవడం వల్ల నచ్చలేదేమో? అందుకే మా సినిమాని ఇండియాలో థియేటర్స్‌లో రిలీజ్ చేయడం లేదు. ఇది మాకెంతో బాధగా ఉంది'' అని తెలిపారు.

పాటకి వేళాయె



● కల్యాణ్ రామ్

కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్ జంటగా, విజయశాంతి కీలక పాత్రలో నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ మూవీ త్వరలో విడుదల కానుంది. ఈ మూవీ మ్యూజిక్ ప్రమోషన్స్‌ని ఆరంభించనున్నారు మేకర్స్. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'నాయాల్ది...' అంటూ సాగే తొలి పాటని ఈ నెల 31న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, కల్యాణ్ రామ్ కొత్త పోస్టర్ విడుదల చేశారు. ''యాక్షన్ ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం ఇది. ఇటీవల రిలీజ్ చేసిన టీజర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమా రిలీజ్ డేట్‌ని త్వరలో ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది. శ్రీకాంత్, పృథ్వీరాజ్, సోహైల్ ఖాన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమేరా: రామ్ ప్రసాద్.



● జెనీలియా

ఎవరూ ప్రోత్సహించలేదు... నిరాశపరిచారు!

జెనీలియా... పరిచయం అక్కర్లేని పేరు. 'అంతేనా... వీలైతే నాలుగు మాటలు... కుదిరితే కప్పు కాఫీ' అంటూ 'బొమ్మరిల్లు' సినిమాలో ఆమె చెప్పిన డైలాగ్స్ ఇప్పటికీ ఫేమస్సే. సుమంత్ హీరోగా రూపొందిన 'సత్యం' (2003) సినిమాతో తెలుగులో హీరోయిన్‌గా పరిచయమైన ఈ బ్యూటీ 'సాంబ, సై, సుభాష్ చంద్రబోస్, హ్యాపీ, ఆరెంజ్, రెడీ, బొమ్మరిల్లు' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సొంతం చేసుకున్నారు. 'నా ఇష్టం' (2012) తర్వాత ఆమె మరో తెలుగు చిత్రంలో నటించలేదు. బాలీవుడ్ హీరో రితేశ్ దేశ్‌ముఖ్‌తో వివాహ బంధంలోకి అడుగుపెట్టాక సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. పెళ్లి, పిల్లల కారణంగా దాదాపు పదేళ్ల సినిమాలకు దూరంగా ఉన్నారామె. ఆ తర్వాత కమ్ బ్యాక్ అవుదామనుకుంటే తెలిసినవారెవరూ ప్రోత్సహించలేదనీ, పైగా నిరాశపరిచారనీ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు జెనీలియా. ''పిల్లలు పుట్టిన తర్వాత యాక్టింగ్‌కు దూరం అయ్యాను. కమ్ బ్యాక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నప్పుడు తెలిసినవాళ్లెవరూ ప్రోత్సహించలేదు. 'పదేళ్ల తర్వాత తిరిగి సినిమాల్లోకి వస్తున్నావా? ఇది ఏమాత్రం వర్కౌట్ కాదు' అంటూ నిరాశపరిచారు. కానీ వారి మాటలు వినకుండా ధైర్యంగా రీ ఎంట్రీ ఇచ్చాను. నా భర్త రితేశ్ దేశ్‌ముఖ్‌తో కలిసి నేను నటించిన 'వేద్' మంచి విజయాన్ని అందుకుంది. దీంతో అన్ని విషయాల్లో ఇతరులను నమ్మకూడదని నాకు అనిపించింది'' అని తెలిపారు జెనీలియా. ప్రస్తుతం ఆమె 'సితారె జమీన్ పర్, జూనియర్' వంటి సినిమాల్లో నటిస్తున్నారు.

బిజినెస్ రీల్

గ్రో ఇండిగో 10 మిలియన్ డాలర్ల సమీకరణ



ముంబై: అగ్రిటెక్ అంకుర సంస్థ గ్రో ఇండిగో 10 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 83 కోట్లు) పెట్టుబడులు సమీకరించింది. బ్రిటీష్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ (బీఐఐ) నుంచి ఈ మొత్తాన్ని సమకూర్చుకున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉషా బర్వాలే జెహెర్ తెలిపారు. దేశవ్యాప్తంగా కార్యకలాపాల విస్తరణ కోసం ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు వివరించారు. పునరుత్పాదక సాగు విధానాలను పాటించేలా చిన్న రైతులను ప్రోత్సహించడం ద్వారా వారికి అదనపు ఆదాయ వనరును సమకూరుస్తున్నట్లు ఉషా చెప్పారు. ప్రస్తుతం నాలుగు కార్బన్ ఫార్మింగ్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.

టాటా న్యూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 'కార్డులు' @ 20 లక్షలు



న్యూఢిల్లీ: సుమారు రెండున్నరేళ్ల స్వల్ప వ్యవధిలోనే 20 లక్షల పైచిలుకు టాటా న్యూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డులు జారీ అయ్యాయి. కొత్తగా జారీ అయిన కార్డుల్లో ఇవి సుమారు 13 శాతం వాటా దక్కించుకున్నట్లు టాటా న్యూ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించాయి. వివిధ ఉత్పత్తులు, సేవల కొనుగోళ్ల ద్వారా వచ్చే రివార్డు పాయింట్లన్నీ సమగ్రంగా అనుసంధానమవుతాయని పేర్కొన్నాయి. ఈ క్రెడిట్ కార్డుతో 10% వరకు ఆదా, ట్రావెల్.. ఫ్యాషన్ మొదలైన వాటి షాపింగ్‌లో ప్రత్యేక ప్రాధాన్యత తదితర ప్రయోజనాలను పొందవచ్చని టాటా డిజిటల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (ఫైనాన్షియల్ సర్వీసెస్) గౌరవ్ హజ్రతి తెలిపారు.

బీవోఐతో న్యూఇండియా అష్యూరెన్స్ టైఅప్



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బీమా సంస్థ న్యూ ఇండియా అష్యూరెన్స్, బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఈ భాగస్వామ్యం కింద బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్లకు న్యూ ఇండియా అష్యూరెన్స్ బీమా ఉత్పత్తులను ఆఫర్ చేయనుంది. న్యూ ఇండియాకు చెందిన హెల్త్ ఇన్సూరెన్స్, మోటారు, వ్యక్తిగత ప్రమాద, హోమ్, వాణిజ్య ఇన్సూరెన్స్ ఉత్పత్తులను బీవోఐ కస్టమర్లు సులభంగా పొందొచ్చు. సమగ్రమైన బీమా ఉత్పత్తులను అందించేందుకు ఈ ఒప్పందం అవకాశం కల్పిస్తుందని బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో రజనీష్ కర్ణాటక్ తెలిపారు. ఈ ఒప్పందంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్లకు బీమా ఉత్పత్తులు చేరువ అవుతాయని, నాణ్యమైన సేవలు, రక్షణ అందుతాయని న్యూ ఇండియా అష్యూరెన్స్ చైర్మన్, ఎండీ గిరిజా సుబ్రమణ్యం పేర్కొన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియాకు దేశవ్యాప్తంగా 5,200 శాఖలున్నాయి.

లారిట్జ్ నడ్సెన్ నుంచి కొత్త ఉత్పత్తులు

న్యూఢిల్లీ: వ్యవసాయం రంగంలో ఆటోమేషన్‌ను ప్రోత్సహించే దిశగా కొత్త సొల్యూషన్స్‌ను ఆవిష్కరించినట్లు లారిట్జ్ నడ్సెన్ ఎలక్ట్రికల్ అండ్ ఆటోమేషన్ (గతంలో ఎల్అండ్‌టీ స్విచ్‌గేర్) వెల్లడించింది. వ్యవసాయ ఉత్పాదకత 20 శాతం మేర పెరిగేందుకు, నీటి వినియోగం 30 శాతం మేర తగ్గేందుకు, వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ఈ ప్రొడక్టులు తోడ్పడతాయని సంస్థ సీవోవో నరేశ్ కుమార్ తెలిపారు. పొలాలను రిమోట్‌గా పర్యవేక్షించేందుకు అధునాతన స్మార్ట్‌కామ్ ఇరిగేషన్ మేనేజ్‌మెంట్ సిస్టంను ఆవిష్కరించినట్లు వివరించారు. వచ్చే కొన్నేళ్ల వ్యవధిలో సాంప్రదాయ సాగు విధానాల నుంచి ఆటోమేటెడ్ విధానం వైపు మళ్లడంలో 25,000 మంది రైతులకు తోడ్పాటు అందించనున్నట్లు వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-3-2025

విశాఖ	455-00
చిత్తూరు	520-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455-00
విజయవాడ	470-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	450-00
వరంగల్	452-00
రిటైల్ ధర	5.10

ఐపీవోలపై కంపెనీల కసరత్తు..



- సెబీకి స్టడ్స్ ప్రాస్పెక్టస్
- పార్క్ మెడి వరల్డ్, ఎస్ఐఎస్ క్యాష్ సర్వీస్ కూడా రెడీ..

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూల ద్వారా నిధులను సమీకరించుకునేందుకు మరిన్ని కంపెనీలు ముందుకొస్తున్నాయి. ఇందుకు సంబంధించి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేస్తున్నాయి. తాజాగా స్టడ్స్ హెల్మెట్స్, పార్క్ మెడి వరల్డ్, ఎస్ఐఎస్ క్యాష్ సర్వీస్ మొదలైన సంస్థలు తమ ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి.ఇక ఐపీవో సన్నాహాల్లో ఉన్న ఒక్కొక్క సంస్థ వివరాలను చూస్తే..

రూ. 1,260 కోట్ల పార్క్ మెడి వరల్డ్ ఇష్యూ..



పార్క్ బ్రాండ్ కింద హాస్పిటల్ చెయిన్ నిర్వహించే పార్క్ మెడి వరల్డ్ సంస్థ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 1,260 కోట్లు సమీకరించనుంది. దీనికి సంబంధించిన ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించింది. ఈ ఇష్యూ కింద రూ. 900 కోట్లు విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ఆఫర్ ఫర్ సేల్ కింద ప్రమోటర్ అజిత్ గుప్తా రూ. 300 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించనున్నారు. ప్రీ-ఐపీవో ప్లేస్‌మెంట్ కింద రూ. 192 కోట్లు సమీకరించే యోచనలో కంపెనీ ఉంది. ఇష్యూ ద్వారా సేకరించిన నిధుల్లో రూ. 410 కోట్ల మొత్తాన్ని రుణాలను తీర్చేసేందుకు, రూ. 110 కోట్లను కొత్త ఆస్పత్రి నిర్మాణం, అనుబంధ సంస్థలైన పార్క్ మెడిసిటీ (ఎన్‌సీఆర్), బ్లూ హెవెన్స్‌కి చెందిన ప్రస్తుత ఆస్పత్రుల విస్తరణ కోసం కంపెనీ వినియోగించుకోనుంది. 3,000 పైచిలుకు పడకల సామర్థ్యంతో ఉత్తరాదిలో పార్క్ మెడి వరల్డ్ రెండో అతి పెద్ద ప్రైవేట్ హాస్పిటల్ చెయిన్‌గా కార్యకలాపాలు సాగిస్తోంది. న్యూఢిల్లీ, జైపూర్, ఫరీదాబాద్ తదితర ప్రాంతాల్లో కంపెనీకి 13 మల్టీ-సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఉన్నాయి.

ఓఎఫ్ఎస్ మార్గంలో స్టడ్స్..



పబ్లిక్ ఇష్యూ ద్వారా నిధులను సమీకరించడంపై హెల్మెట్ల తయారీ సంస్థ స్టడ్స్ యాక్సెసరీస్ రెండోసారి కసరత్తు చేస్తోంది. ఏడేళ్ల క్రితం 2018లో ఇందుకు సంబంధించి సెబీ నుంచి అనుమతులు పొందినప్పటికీ, అప్పట్లో ముందుకెళ్లలేదు. తాజా ప్రతిపాదన ప్రకారం ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో) పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ఉంటుంది. ప్రమోటర్ గ్రూప్, ఇతరత్రా షేర్‌హోల్డర్లు 77.9 లక్షల షేర్లను విక్రయించనున్నారు. ఇది పూర్తిగా ఓఎఫ్ఎస్ రూపంలో ఉంటుంది కాబట్టి ఐపీవో ద్వారా సమీకరించిన నిధులేమీ కంపెనీకి లభించవు. స్టడ్స్ యాక్సెసరీస్ సంస్థ 'స్టడ్స్', 'ఎస్ఎంకే' బ్రాండ్ల కింద టూ-వీలర్ హెల్మెట్లను తయారు చేస్తోంది. అలాగే స్టడ్స్ బ్రాండ్ కింద గ్లవ్స్, హెల్మెట్ లాకింగ్ డివైజ్‌లు, రెయిన్ సూట్‌లు వంటి యాక్సెసరీలను ఉత్పత్తి చేస్తోంది. దేశవ్యాప్తంగానే కాకుండా 70 పైచిలుకు దేశాల్లో తమ ఉత్పత్తులను విక్రయిస్తోంది. అమెరికాలో ఓ'నీల్ అనే సంస్థకు, 'డేటోనా' బ్రాండ్ పేరిట జీ స్క్వేర్డ్ అనే సంస్థకు హెల్మెట్లు తయారు చేసి అందిస్తోంది. 2024 సెప్టెంబర్‌తో ముగిసిన ఆరు నెలల వ్యవధిలో కంపెనీ రూ. 285 కోట్ల ఆదాయంపై రూ. 33 కోట్ల నికర లాభం ఆర్జించింది.

ఎస్ఐఎస్.. షేర్ల జారీతో రూ. 100 కోట్లు..



క్యాష్ లాజిస్టిక్స్ సేవల సంస్థ ఎస్ఐఎస్ క్యాష్ సర్వీస్ తాజాగా షేర్లను జారీ చేయడం ద్వారా ఐపీవో కింద రూ. 100 కోట్లు సమీకరించనుంది. ప్రమోటర్ సంస్థలు ఎస్ఐఎస్ లిమిటెడ్, ఎస్ఎంసీ ఇంటిగ్రేటెడ్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ 37.15 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో విక్రయించనున్నాయి. తాజా షేర్ల విక్రయం ద్వారా వచ్చే నిధుల్లో రూ. 37.59 కోట్లను వాహనాల కొనుగోళ్లు, ఫ్యాబ్రికేషన్‌కు, రూ. 30 కోట్ల మొత్తాన్ని రుణాల చెల్లింపు, ఇతరత్రా కార్పొరేట్ అవసరాల కోసం కంపెనీ వినియోగించుకోనుంది. 2024 ఆర్థిక సంవత్సరంలో ఆదాయపరంగా 17-18 శాతం మార్కెట్ వాటాతో పరిశ్రమలో రెండో అతి పెద్ద సంస్థగా ఎస్ఐఎస్ క్యాష్ సర్వీసెస్ నిలుస్తోంది. 2024 డిసెంబర్ 31తో ముగిసిన తొమ్మిది నెలల్లో కంపెనీ రూ. 530 కోట్ల ఆదాయాన్ని రూ. 39 కోట్ల లాభాన్ని ఆర్జించింది.

సందిగ్ధంలో కొన్ని..

మరోవైపు, ఎంబసీ గ్రూప్ ప్రమోట్ చేస్తున్న వర్క్‌స్పేస్ ఆపరేటర్ వుయ్‌వర్క్ ఇండియా మేనేజ్‌మెంట్ ఐపీవో ప్రతిపాదనను సెబీ పక్కన పెట్టింది. ఇందుకు నిర్దిష్ట కారణాలేమీ వెల్లడి కాలేదు. ఇష్యూ కింద ప్రమోటర్ సంస్థ ఎంబసీ బిల్డ్‌కాన్, 1 ఏరియల్ వే టెనెంట్ అనే ఇన్వెస్టరు 4.37 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానం కింద విక్రయించే యోచనలో ఉన్నాయి. అటు ఫెర్టిలిటీ క్లినిక్ చెయిన్ ఇందిరా ఐవీఎఫ్ తమ ఐపీవో ముసాయిదా పత్రాలను వెనక్కి తీసుకుంది. ఐపీవో సన్నాహాల సమయంలోనే కంపెనీ వ్యవస్థాపకుడు అజయ్ ముర్దియాపై బాలీవుడ్ బయోపిక్ విడుదల కావడమనేది ఇష్యూను పరోక్షంగా ప్రభావితం చేస్తుందని సెబీ అభిప్రాయం వ్యక్తం చేయడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందిరా ఐవీఎఫ్ ఐపీవో పత్రాలను దాఖలు చేసిన సుమారు నెల రోజుల్లో మార్చి 21న చిత్రం విడుదలైంది. ఇందులో అనుపమ్ ఖేర్, ఈషా డియోల్ నటించారు.

పేస్ డిజిటెక్ అదే బాటలో..

న్యూఢిల్లీ: టెలికం టవర్, ఆప్టికల్ ఫైబర్ కేబుళ్ల విభాగంలో సొల్యూషన్లు అందించే పేస్ డిజిటెక్ పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతోంది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 900 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయాలని భావిస్తోంది. తద్వారా రూ. 900 కోట్లు సమీకరించనుంది. టెలికం మౌలిక సదుపాయాల విభాగంలో సేవలందించే కంపెనీ ఐపీవోకు ముందు రూ. 180 కోట్ల ప్లేస్‌మెంట్ చేపట్టే యోచనలో ఉంది. ఇష్యూ నిధుల్లో రూ. 630 కోట్లు పెట్టుబడి వ్యయాలకు కేటాయించనుంది. 2024 సెప్టెంబర్‌తో ముగిసిన 6 నెలల్లో రూ. 1,188 కోట్ల ఆదాయం, రూ. 152 కోట్ల నికర లాభం సాధించింది.

యూఎస్ టారిఫ్‌లతో భారత్‌కు అవకాశాలు

- మనపై ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చు
- నీతి ఆయోగ్ ప్రోగ్రామ్ డైరెక్టర్ సాహూ



న్యూఢిల్లీ: అమెరికా ప్రతీకార సుంకాలు భారత్‌పై పెద్దగా ప్రభావం చూపించకపోవచ్చని.. పైగా వాటితో మనకు ఎన్నో అవకాశాలు ఏర్పడతాయని నీతి ఆయోగ్ కార్యక్రమాల డైరెక్టర్ ప్రవాకర్ సాహూ అభిప్రాయపడ్డారు. అమెరికా దిగుమతుల్లో 50 శాతం వాటా కలిగిన మెక్సికో, చైనా, కెనడా కంటే.. తక్కువ వాటా కలిగిన భారత్ మెరుగైన స్థితిలో ఉందన్నారు. అమెరికా టారిఫ్‌లు భారత్‌కు చెందిన కొద్ది రంగాలపైనే ఉంటుందన్నారు. నీతి ఆయోగ్ త్రైమాసికం ఎడిషన్‌ను విడుదల చేసిన సందర్భంగా మాట్లాడారు. వచ్చే ఎడిషన్‌లో అమెరికా ప్రతీకార సుంకాల ప్రభావంపై వివరాణత్మక విశ్లేషణ అందించనున్నట్టు తెలిపారు. అమెరికా ఇప్పటికే స్టీల్, అల్యూమినియం, ఆటో దిగుమతులపై 25 శాతం సుంకాలు ప్రకటించగా.. ఏప్రిల్ 2 నుంచి అమెరికాకు ఎగుమతి చేసే ప్రతి దేశంపైనా ప్రతిసుంకాలు అమల్లోకి వస్తాయని అధ్యక్షుడు ట్రంప్ లోగడ ప్రకటించడం గమనార్హం. 2018లోనూ అమెరికా సుంకాలు విధించగా, అప్పుడు చైనా వాటా తగ్గడం.. తైవాన్, వియత్నాం, థాయిలాండ్, మెక్సికో, భారత్ ప్రయోజనం పొందిన విషయాన్ని ఇదే కార్యక్రమంలో పాల్గొన్న నీతి ఆయోగ్ సభ్యుడు అరవింద్ విర్మాణి గుర్తు చేశారు. టారిఫ్‌ల ప్రభావాన్ని తగ్గించేందుకు, వాణిజ్య ఒప్పందానికి వచ్చేందుకు వీలుగా అమెరికాతో భారత్ ఇప్పటికే చర్చలు నిర్వహిస్తుండడం గమనార్హం. రెండు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రస్తుతమున్న 190 బిలియన్ డాలర్ల నుంచి 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించడం తెలిసిందే.

ఎన్‌సీఎల్‌ఏటీలో గూగుల్‌కు ఎదురుదెబ్బ



న్యూఢిల్లీ: నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ)లో టెక్ దిగ్గజం గూగుల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. యాప్ స్టోర్ బిల్లింగ్ విధానం సమంజసంగా లేదని, డెవలపర్లకు పరిమితులు విధించేదిగా ఉందని జరిమానా విధిస్తూ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఇచ్చిన ఉత్తర్వులను ఎన్‌సీఎల్ఏటీ సమర్థించింది. అయితే, పెనాల్టీ పరిమాణాన్ని రూ. 936.44 కోట్ల నుంచి రూ. 216 కోట్లకు తగ్గించింది. గుగుల్ తన గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేసిందంటూ 104 పేజీల ఆర్డరులో వ్యాఖ్యానించింది. కానీ, వివిధ అంశాల ప్రాతిపదికన యాప్‌లపై 15 నుంచి 30 శాతం వరకు సర్వీస్ ఫీజులను వసూలు చేయడంలో టెక్ దిగ్గజం ఎలాంటి నిబంధనలను ఉల్లంఘించలేదని ఎన్‌సీఎల్ఏటీ పేర్కొంది. గూగుల్ ఇప్పటికే పెనాల్టీలో 10 శాతం మొత్తాన్ని డిపాజిట్ చేసిందని, మిగతా మొత్తాన్ని 30 రోజుల్లోగా డిపాజిట్ చేయాలని ఆదేశించింది.

సీఐఈఎల్ హెచ్‌ఆర్ చేతికి వైబ్రెంట్ స్క్రీన్

న్యూఢిల్లీ: టెక్నాలజీ ఆధారిత మానవ వనరుల సేవల సంస్థ సీఐఈఎల్ హెచ్‌ఆర్ సర్వీసెస్ తాజాగా బ్యాగ్రౌండ్ వెరిఫికేషన్ సేవలు అందించే వైబ్రెంట్ స్క్రీన్‌ను కొనుగోలు చేసింది. తమ స్టాఫింగ్ సొల్యూషన్స్ పోర్ట్‌ఫోలియోను మరింత పటిష్టం చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. అయితే, ఇందుకోసం ఎంత వెచ్చించినదీ వెల్లడి కాలేదు. సీఐఈఎల్ హెచ్‌ఆర్ ఇటీవల జాంబే, ఆర్‌జీ స్టాఫింగ్, కోర్స్‌ప్లే, థామస్ అసెస్‌మెంట్స్ / పీపుల్ మెట్రిక్స్ మొదలైన సంస్థలను కొనుగోలు చేసింది. వైబ్రెంట్ స్క్రీన్ సుమారు 24 సంవత్సరాలుగా ఉద్యోగాలు, విద్య, క్రిమినల్ రికార్డులు, డేటాబేస్ లిస్టింగ్, క్రెడిట్ హిస్టరీ, ఐడెంటిటీ ధృవీకరణ మొదలైన వాటి కోసం వెరిఫికేషన్ సేవలు అందిస్తోంది. ఫార్చూన్ 500 కంపె పాటు బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ తదితర రంగాల్లో కంపెనీకి 240 పైచిలుకు క్లయింట్లు ఉన్నాయి. మరోవైపు, సీఐఈఎల్ హెచ్‌ఆర్‌కి ఇటీవలే పబ్లిక్ ఇష్యూకి సంబంధించి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి అనుమతులు లభించాయి. ఇష్యూ కింద తాజాగా షేర్ల జారీ ద్వారా రూ. 335 కోట్లు సమీకరించనుండగా, ప్రమోటర్లు..ఇతరత్రా షేర్‌హోల్డర్లు 47.4 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద విక్రయించనున్నారు.

జీడీపీలో 1.1 శాతానికి 'క్యాడ్'

డిసెంబర్ క్వార్టర్‌లో 11.5 బిలియన్ డాలర్లు



ముంబై: జీడీపీలో కరెంట్ ఖాతా లోటు (క్యాడ్) డిసెంబర్ త్రైమాసికంలో (క్యూ3) 1.1 శాతానికి చేరుకుంది. విలువ పరంగా చూస్తే 11.5 బిలియన్ డాలర్లు(రూ.99వేల కోట్లు)గా ఉంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలోనూ డిసెంబర్ త్రైమాసికంలో క్యాడ్ జీడీపీలో 1.1 శాతంగా ఉంటే, విలువ పరంగా 10.4 బిలియన్ డాలర్లు (రూ.89వేల కోట్లు) కావడం గమనార్హం. ఈ డేటాను ఆర్‌బీఐ విడుదల చేసింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికం (క్యూ2) చివరికి క్యాడ్ 16.7 బిలియన్ డాలర్లుగా ఉంది. జీడీపీలో ఇది 1.8 శాతం. అక్కడి నుంచి చూస్తే చెప్పుకోతగ్గ మేర తగ్గింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2024 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు మూడు త్రైమాసికాల్లో క్యాడ్ 37 బిలియన్ డాలర్లుగా ఉంది. జీడీపీలో 1.3 శాతానికి సమానం. అంతకుముందు ఆర్థిక సంవత్సరం మొదటి మూడు త్రైమాసికాల్లో ఉన్న 30.6 బిలియన్ డాలర్ల (జీడీపీలో 1.1 శాతం)తో పోల్చి చూసినప్పుడు పెరిగింది.

ఫిబ్రవరిలో క్షీణించిన సేవల ఎగుమతులు

31.62 బిలియన్ డాలర్లుగా నమోదు



ముంబై: సేవల ఎగుమతులు వరుసగా రెండో నెలలో ఫిబ్రవరిలో డీలాపడ్డాయి. 31.62 బిలియన్ డాలర్ల విలువైన (రూ.2.72 లక్షల కోట్లు) సేవల ఎగుమతులు నమోదయ్యాయి. ఇదే నెలలో సేవల దిగుమతులు 14.5 బిలియన్ డాలర్లకు తగ్గుముఖం పట్టినట్టు ఆర్‌బీఐ తెలిపింది. ఈ ఏడాది జనవరిలో సేవల ఎగుమతులు 34.72 బిలియన్ డాలర్లు కాగా, 2024 డిసెంబర్‌లో 37 బిలియన్ డాలర్ల మేర నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరిలో సేవల దిగుమతులు 16.7 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

రూ.5.91 లక్షల కోట్ల పన్ను బకాయిలు

- జాడలేని 47,674 మంది పన్ను చెల్లింపుదారులు
- పరోక్ష పన్నుల్లో ఆచూకీ లేని 60,853 మంది



న్యూఢిల్లీ: ఆదాయపన్ను చెల్లింపుదారులకు సంబంధించి ఆశ్చర్యపరిచే గణాంకాలను ప్రభుత్వం పార్లమెంట్‌కు అందించింది. ప్రత్యక్ష పన్నుల్లో 47,674 మంది పన్ను ఎగవేతదారుల జాడ తెలియడం లేదని.. వీరు చెల్లించాల్సిన బకాయిలు రూ.5.91 లక్షల కోట్లుగా ఉన్నట్టు తెలిపింది. అదే పరోక్ష పన్నుల్లో 60,853 మంది ఎగవేతదారుల ఆచూకీ లభించడం లేదని.. వీరు రూ.43,525 కోట్ల పన్ను చెల్లించాల్సి ఉందని వెల్లడించింది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి రాజ్యసభకు లిఖిత పూర్వకంగా ఈ వివరాలు తెలియజేశారు. పన్ను వసూళ్లకు సంబంధించి ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) తీసుకున్న చర్యలను సైతం వివరించారు. వ్యక్తిగత లావాదేవీల సమాచారాన్ని అందుబాటులో ఉంచడం, 360 డిగ్రీల కోణంలో ప్రొఫైల్‌ను ఫీల్డ్ యూనిట్లకు పంపించి.. పన్ను చెల్లింపుదారులను గుర్తించి, పన్ను వసూలు చర్యలకు వీలు కల్పించినట్టు చెప్పారు. పరోక్ష పన్నుల కేంద్ర మండలి పన్ను ఎగవేతదారుల నుంచి వసూలుకు గాను బ్యాంక్ ఖాతాల స్తంభన వంటి చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

జేబీ కెమ్‌లో కేకేఆర్ వాటా విక్రయం

బల్క్ డీల్ విలువ రూ. 1,460 కోట్లు



న్యూఢిల్లీ: ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా కంపెనీ ప్రమోటర్, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ కేకేఆర్ తాజాగా జేబీ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్‌లో 5.8 శాతం వాటా విక్రయించింది. బల్క్‌డీల్ గణాంకాల ప్రకారం వీటి విలువ రూ. 1,460 కోట్లు. అనుబంధ సంస్థ టౌ ఇన్వెస్ట్‌మెంట్స్ ద్వారా ఒక్కో షేరుకి రూ. 1,625 సగటు ధరలో 89.83 లక్షలకు పైగా షేర్లను అమ్మివేసింది. ఈ లావాదేవీ తదుపరి కేకేఆర్ వాటా 53.66 శాతం నుంచి 47.88 శాతానికి క్షీణించింది. కొటక్ మహీంద్రా ఎంఎఫ్ రూ. 200 కోట్లు వెచ్చించి 0.8 శాతం వాటాకు సమానమైన 12.3 లక్షల షేర్లు కొనుగోలు చేసింది. **ఈ నేపథ్యంలో జేబీ కెమికల్స్ షేరు ఎన్ఎస్ఈలో 6.2% పతనమై రూ. 1,604 వద్ద ముగిసింది.**

72 రీసెర్చ్ అనలిస్టుల రిజిస్ట్రేషన్ రద్దు



న్యూఢిల్లీ: రెన్యువల్ ఫీజును కట్టనందుకు గాను 72 రీసెర్చ్ అనలిస్టుల రిజిస్ట్రేషన్‌ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ రద్దు చేసింది. దీంతో వాటి రిజిస్ట్రేషన్ ఇక చెల్లుబాటు కాదు. గడువు తీరిపోయిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు దుర్వినియోగం కాకుండా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సెబీ తెలిపింది. సెబీ నిబంధనల ప్రకారం నమోదు చేసుకున్న ప్రతి రీసెర్చ్ అనలిస్టు అయిదేళ్లకోసారి రెన్యువల్ ఫీజును కట్టాల్సి ఉంటుంది. అయితే, ఈ 72 అనలిస్టులు రెన్యువల్ ఫీజులు చెల్లించలేదని, వారి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ గడువు ముగిసిపోయిందని సెబీ గుర్తించింది. దీంతో నిబంధనల ఉల్లంఘనకు గాను వారికి షోకాజ్ నోటీసులు పంపించి, తాజా నిర్ణయం తీసుకుంది. అటు లిక్విడిటీ ఉండని స్టాక్ ఆప్షన్లలో మోసపూరిత ట్రేడింగ్ ఆరోపణలపై సహదేవ్ షైక్ హెచ్‌యూఎఫ్, పరితోష్ సాహా హెచ్‌యూఎఫ్, త్రిప్తా ష్రాఫ్, దక్ష్ షేర్ బ్రోకర్స్ మొదలైన వర్గాలపై జరిమానా విధించింది.

190 బిలియన్ డాలర్లకు ఈ-రిటైల్ మార్కెట్



- 2030 నాటికి అంచనా
- వార్షికంగా 18 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: దేశీ ఈ-రిటైల్ మార్కెట్ ఏటా 18 శాతం వృద్ధి చెందనుంది. 2030 నాటికి 170-190 బిలియన్ డాలర్లకు చేరనుంది. ఓ నివేదిక ప్రకారం స్థూల ఆర్థికాంశాలు, వినియోగంపరమైన సవాళ్ల కారణంగా 2024లో ఈ-రిటైల్ రంగ వృద్ధి చారిత్రక గరిష్ఠమైన 20 శాతం నుంచి నెమ్మదించి సుమారు 10-12 శాతానికి మందగించింది. అయితే, ఇటీవల ద్రవ్య పరపతి విధానాన్ని సరళతరం చేయడంతో వృద్ధి క్రమంగా పుంజుకోనుంది. ముఖ్యంగా 2025 పండుగ సీజన్ నుంచి మరింత మెరుగుపడే అవకాశం ఉంది. 'దీర్ఘకాలికంగా మార్కెట్ ఫండమెంటల్స్ పటిష్టంగా ఉన్నాయి. ఈ-రిటైల్ రంగం వచ్చే ఆరేళ్లు 18 శాతం వృద్ధి చెంది 170-190 బిలియన్ డాలర్లకు చేరవచ్చు' అని నివేదిక పేర్కొంది. ముఖ్యావసరయేతర ఉత్పత్తులు, సేవలపై ప్రజలు మరింతగా ఖర్చు చేయనుండటం ఇందుకు దోహదపడనుంది.

రిపోర్టులోని మరిన్ని ముఖ్యాంశాలు..

- గత దశాబ్దకాలంలో రిటైల్‌కి సంబంధించి భారత్ శక్తివంతమైన కేంద్రంగా మారింది. 2024లో అంతర్జాతీయంగా మూడో అతి పెద్ద రిటైల్ మార్కెట్‌గా ఎదిగింది.
- ఇటీవలి కాలంలో వినియోగం, ముఖ్యావసరాలు కాకుండా ఇతరత్రాల ఉత్పత్తులు, సేవలపై ఖర్చు చేయడం కాస్త నెమ్మదించింది. ప్రైవేట్ వినియోగం కోవిడ్ పూర్వం (2017-19లో) 11 శాతంగా ఉండగా దానితో పోలిస్తే కోవిడ్ తర్వాత (2022-24) 8 శాతానికి తగ్గింది. వేతనాలు పెద్దగా పెరగకపోవడం, ద్రవ్యోల్బణం అధిక స్థాయిలో ఉండటం మొదలైన అంశాలు ఇందుకు కారణం.
- ఇటీవల ద్రవ్యపరపతి విధానాన్ని సరళతరం చేయడంతో ఈ-రిటైల్ వృద్ధి మళ్లీ పుంజుకోనుంది. నిత్యావసరాలు, దుస్తులు.. ఎల్రక్టానిక్స్ వంటి ఉత్పత్తుల అమ్మకాలు ఇందుకు దోహదపడనున్నాయి. 2030 నాటికి ప్రతి మూడు డాలర్లలో వీటి వాటా రెండు డాలర్లుగా ఉంటుంది.
- ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో కూడా ఈ-రిటైల్ వినియోగం పెరుగుతోంది. 2020 నుంచి చూస్తే కొత్తగా షాపింగ్ చేస్తున్న ప్రతి అయిదుగురిలో ముగ్గురు ఈ ప్రాంతాల నుంచే ఉంటున్నారు. అలాగే, 2021 నుంచి చూస్తే కొత్త విక్రేతల్లో 60 శాతం మంది ద్వితీయ శ్రేణి లేదా అంతకన్నా చిన్న పట్టణాలకు చెందినవారే ఉంటున్నారు.
- క్విక్ కామర్స్, హైపర్ వేల్యూ కామర్స్ మొదలైన విభాగాలు తదుపరి ఈ-రిటైల్ వృద్ధికి దోహదపడనున్నాయి.

'జడ్జి డోర్ వద్ద నగదు' కేసు..

17 ఏళ్లకు నిర్మల్ యాదవ్‌కు విముక్తి

చండీగఢ్: దేశ న్యాయవ్యవస్థను కుదిపేసిన 17 ఏళ్లనాటి 'జడ్జి డోర్ వద్ద నగదు' కేసులో పంజాబ్ హరియాణా హైకోర్టు రిటైర్డు జడ్జి నిర్మల్ యాదవ్ మరో నలుగురికి సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం విముక్తి కల్పించింది. పంజాబ్ హరియాణా హైకోర్టుకే చెందిన మరో జడ్జి జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ ఇంటికి 2008 ఆగస్టు 13న రూ.15 లక్షల నగదున్న పార్సిల్ చేరడం సంచలనం రేపింది. వాస్తవానికి అప్పటి జస్టిస్ నిర్మల్ యాదవ్‌కి ప్రాపర్టీ డీల్ కేసులో లంచంగా అందజేయాల్సి ఉండగా పొరపాటున పార్సిల్ నిర్మల్ జిత్ కౌర్ ఇంటికి చేరినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై చండీగఢ్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కేసు సీబీఐకి బదిలీ అయ్యింది. సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం గురువారం ఈ కేసులో తుది వాదనలను ముగించి, శనివారం తీర్పు వెలువరించింది. నిర్దోషులుగా కోర్టు ప్రకటించిన వారిలో హరియాణా మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ సంజీవ్ బన్సల్, ఢిల్లీకి చెందిన హోటల్ యజమాని రవీందర్ సింగ్, చండీగఢ్‌కు చెందిన వ్యాపారి రాజీవ్ గుప్తా, మరొకరు ఉన్నారు. వీరిలో బన్సాల్ 2017లోనే చనిపోయారు. కోర్టు తీర్పుపై నిర్మల్ యాదవ్ స్పందించారు. న్యాయవ్యవస్థలో కొందరి కుట్ర కారణంగానే ఈ కేసులో ఇరుక్కున్నాను. దీంతో, కెరీర్ పరంగా ఎంతో నష్టపోయా. వేదనను అనుభవించా. చివరికి న్యాయం దక్కినందుకు సంతోషంగా ఉంది'అని తెలిపారు. ఈ కేసులో సమయాల్లో వేర్వేరు సాక్షులను విచారించేందుకు హైకోర్టు నుంచి సీబీఐ అనుమతుల తీసుకోవడంలో జాప్యమైనందునే విచారణకు 17 ఏళ్లు పట్టిందని రాజీవ్ గుప్తా, సంజీవ్ బన్సాల్ తరఫు లాయర్ తెలిపారు. కాగా, మార్చి 14వ తేదీన ఢిల్లీ హైకోర్టు జడ్జి యశ్వంత్ వర్మ ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదం సమయంలో నాలుగైదు నోట్ల కట్టల బండిళ్లు పాక్షికంగా కాలిన స్థితిలో దొరికినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈ కేసు తీర్పు వెలువడటం గమనార్హం.

ఇప్పటికైనా సారీ చెప్తారా ?

జలియన్‌వాలా బాగ్ ఉదంతానికి
106 ఏళ్లు పూర్తవుతున్న వేళ ఊపందుకున్న 'క్షమాపణ' చర్చ

లండన్: తోటలో సమావేశమైన భారతీయులపై తుపాకీ గుళ్ల వర్షం కురిపించి దాదాపు 1,500 మందిని బలితీసుకున్న జలియన్‌వాలా బాగ్ ఉదంతంలో బ్రిటన్ ప్రభుత్వం ఇప్పటికైనా క్షమాపణ చెప్పాలన్న డిమాండ్ ఊపందుకుంది. స్వాతంత్ర్యసమరంలో భాగస్వాములైన వేలాది మంది అమాయకులపై జలియన్‌వాలా బాగ్‌లో జనరల్ డయ్యర్ బలగాలు తుపాకులు ఎక్కుపెట్టి వందలాది మంది ప్రాణాలు తీసిన ఉదంతం జరిగి ఏప్రిల్ 13వ తేదీకి 106 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నాటి దారుణ దాడికి బ్రిటన్ సర్కార్ సారీ చెప్పాలని యూకే పార్లమెంట్ సాక్షిగా అభ్యర్థనలు వెల్లువెత్తాయి. దిగువసభలో కన్జర్వేటివ్ పార్టీ పార్లమెంట్ సభ్యుడు బాబ్ బ్లాక్‌మాన్ ఈ ఉదంతాన్ని గుర్తుచేస్తూ ప్రసంగించారు. ''నాటి బ్రిటిష్‌పాలకుల అరాచకాలను అంగీకరిస్తూ నేటికైనా నాటి ఉదంతంపై క్షమాపణలు చెప్పాలి. 1919 ఏప్రిల్ 13నాటి ఘటన బ్రిటన్ చరిత్రలోనే మాయని మచ్చ. ప్రశాంత వాతావరణంలో సమావేశమైన నిరాయుధులపైకి తూటాలు అయిపోయేదాకా కాల్పులు జరపాలని జనరల్ డయ్యర్ తన సైన్యానికి ఆదేశాలిచ్చారు. తూటాలకు 1,500 మంది ప్రాణాలు కోల్పోగా మరో 1,200 మంది గాయపడ్డారు. హేయమైన చర్యకు జనరల్ డయ్యర్ హత్యకు గురై తగిన మూల్యం చెల్లించుకున్నారు. ఇది కూడా బ్రిటిష్ వలసపాలనలో మరో మాయని మచ్చగా మిగిలింది. ఇదంతా బ్రిటన్ పాలనలో చీకటి అధ్యాయంగా 2019లో అప్పటి బ్రిటన్ మహిళా ప్రధానమంత్రి థెరిసా మే అంగీకరించారు. కానీ ప్రభుత్వం తరఫున ఎలాంటి క్షమాపణలు తెలపలేదు. ఇకనైనా ప్రభుత్వం సారీ చెప్పాలి. ఏప్రిల్ 13న పార్లమెంట్ సమావేశాలు లేవుకాబట్టి ఆరోజు క్షమాపణలు చెబుతూ అధికారిక ప్రకటన అయినా వెలువరించాలి''అని ఆయన డిమాండ్‌చేశారు. ఈ డిమాండ్‌కు మరో సభ్యుడు లూసీ పావెల్ మద్దతు పలికారు.

'ఎక్స్'ను ఎక్స్‌ఏఐకు అమ్మిన మస్క్

సొంత సంస్థకే 33 బిలియన్ డాలర్లకు
అమ్మిన ప్రపంచ కుబేరుడు

వాషింగ్టన్: మూడేళ్ల క్రితం 44 బిలియన్ డాలర్లకు ట్విట్టర్ సంస్థను కొనుగోలుచేసి దాని పేరు 'ఎక్స్'గా మార్చిన ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరో వినూత్న నిర్ణయం తీసుకున్నారు. కృత్రిమమేథ రంగం అనూహ్యంగా విస్తరిస్తున్న నేపథ్యంలో అదే రంగంలోకి సంస్థ పరిధిలోకి 'ఎక్స్'సంస్థను తీసుకొచ్చారు. సామాజిక మాధ్యమ సంస్థగా వెలుగొందుతున్న 'ఎక్స్'ను కృత్రిమమేథ సంస్థ అయిన ఎక్స్‌ఏఐకు 33 బిలియన్ డాలర్లకు విక్రయించినట్లు మస్క్ శుక్రవారం ప్రకటించారు. అయితే ఎక్స్‌ఏఐ అనేది కూడా మస్క్‌కు చెందిన సంస్థే కావడం విశేషం. గత ఏడాది గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతినెలా దాదాపు 43 కోట్ల మంది 'ఎక్స్'యూజర్లు తమ ఖాతాలను వినియోగిస్తున్నారు. వీళ్ల డేటాను ఉపయోగించి ఎక్స్‌ఏఐ సంస్థను మరింత మెరుగుదిద్ది ఈ రంగంలో అగ్రగామిగా మార్చే ఉద్దేశ్యంతో 'ఎక్స్'ను ఎక్స్‌ఏఐకు అమ్మేశారని మార్కెట్‌వర్గాలు అంచనావేస్తున్నాయి. మస్క్ సైతం దాదాపు ఇదే రీతిలో వ్యాఖ్యలుచేస్తూ శుక్రవారం ఒక పోస్ట్‌పెట్టడం గమనార్హం. ''ఎక్స్‌ఏఐ ఆధునిక కృత్రిమ మేథా సామర్థ్యాన్ని, 'ఎక్స్'అత్యధిక యూజర్లను ఒక్కచోటుకు చేర్చడం ద్వారా ఈ రెండు సంస్థల సమ్మిళిత శక్తిని బయటకు తీసుకురాగలం. విక్రయం తర్వాత రెండు సంస్థల డేటా, మోడళ్లు, కంప్యూటింగ్, ప్రతిభలు ఏకం కాబోతున్నాయి. రెండు సంస్థల భవిష్యత్తులు ఒకదానితో మరోటి పెనవేసుకున్నాయి. విలీనం తర్వాత కొత్త సంస్థ ఇకపై వందల కోట్ల మంది వినియోగదారులకు మరింత అర్థవంతమైన, ప్రయోజనకరమైన సేవలను అందిస్తుంది''అని మస్క్ వ్యాఖ్యానించారు. 'ఎక్స్'రాకతో ఎక్స్‌ఏఐ మార్కెట్ విలువ 80 బిలియన్ డాలర్లకు పెరిగిందని చెప్పారు. ఎక్స్‌ఏఐను మస్క్ గత ఏడాది ప్రారంభించారు. 2022లో ట్విట్టర్‌ను మస్క్ కొనుగోలుచేయడం అప్పట్లో సంచలనమైంది. మస్క్ దాదాపు 80 శాతం మంది ఉద్యోగులను తొలగించడం, సంస్థ పేరును 'ఎక్స్'గా మార్చడం, ట్రంప్‌సహా రద్దయిన కొందరి ఖాతాలను పునరుద్ధరించడం సహా ఎన్నో వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు.

కెనడా సార్వభౌమత్వాన్ని ట్రంప్ గౌరవిస్తామన్నారు

కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ వెల్లడి

మాంట్రియల్: కెనడా సార్వభౌమత్వాన్ని గౌరవిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనతో చెప్పారని కెనడా నూతన ప్రధానమంత్రి మార్క్ కార్నీ తెలియజేశారు. శుక్రవారంట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడానని, తమ మధ్య చక్కటి సంభాషణ జరిగిందని అన్నారు. ఇది నిర్మాణాత్మక సంభాషణ అని అభివర్ణించారు. మరోవైపు మార్క్ కార్నీతో ఫలవంతమైన చర్చ జరిగినట్లు ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. కెనడాను తాను ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటానని తెలిపారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత కెనడాను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కెనడా దేశం అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరాలని అన్నారు. అంతేకాకుండా అప్పటి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోను 'గవర్నర్ ట్రూడో'అని సంబోధించారు. ట్రంప్ నోటి దురుసుపై కెనడా ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. అమెరికాలో చేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. మరోవైపు ట్రంప్ వచ్చిన తర్వాత అమెరికా–కెనడా మధ్య వాణిజ్య యుద్ధం ముదురుతోంది. కెనడా ఉత్పత్తులపై ట్రంప్ భారీగా సుంకాలు పెంచేశారు. కెనడా నుంచి దిగుమతి అయ్యే వాహనాలపై 25 శాతం సుంకం వసూలు చేయబోతున్నట్లు మరో బాంబు పేల్చారు. కెనడా ఒక ప్రత్యేక దేశంగా మనుగడ సాగించడం ట్రంప్‌కు ఇష్టం లేదన్న సంకేతాలు గతంలో వెలువడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో కెనడా సార్వభౌమత్వాన్ని గౌరవిస్తున్నామని ట్రంప్ చెప్పారంటూ ప్రధాని మార్క్ కార్నీ స్వయంగా ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. కెనడా విషయంలో దూకుడుగా వెళ్లకుండా ట్రంప్ వెనక్కి తగ్గినట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

పదవీచ్యుత బంగ్లా ప్రధాని హసీనాపై కేసు

ఢాకా: అంతర్గత తిరుగుబాటు ద్వారా యూనుస్ సారథ్యంలోని మధ్యంతర ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు కుట్ర పన్నారంటూ బంగ్లాదేశ్ పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనాపై కేసు నమోదైంది. హసీనా, మరో 72 మందిపై క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంట్(సీఐడీ) ఢాకాలోని చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేసిందని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న కోర్టు దర్యాప్తు చేపట్టాలంటూ సీఐడీని గురువారం కోరిందన్నారు. 'జోయ్ బంగ్లా బ్రిగేడ్'పేరుతో ఏర్పాటైన ఆన్‌లైన్ వేదికపై 2024 డిసెంబర్ 19వ తేదీన కొందరు సమావేశమై దేశంలో అంతర్యుద్ధం ద్వారా హసీనాను తిరిగి ప్రధాని పీఠంపై కూర్చోబెట్టే విషయమై చర్చించినట్లు సమాచారముందని సీఐడీ తన ఫిర్యాదులో పేర్కొంది. మధ్యంతర ప్రభుత్వాన్ని కొనసాగనివ్వరాదని డాక్టర్ రబ్బీ ఆలం సారథ్యంలో జరిగిన ఈ వర్చువల్ సమావేశం నిర్ణయించిందన్నారు. షేక్ హసీనా తదితరులు పాల్గొన్న ఈ భేటీ రికార్డింగ్స్ తమకు లభ్యమైనట్లు సీఐడీ తెలిపింది. హసీనా ఆదేశాల మేరకు అమెరికాలో ఉంటున్న అవామీ లీగ్ నేత ఆలం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దేశ, విదేశాలకు చెందిన మొత్తం 577 మంది పాల్గొన్నట్లు సీఐడీ తెలిపింది. ఈ కేసులో ఆలంను రెండో నిందితుడిగా పేర్కొంది. కాగా, యూనుస్ సారథ్యంలోని మధ్యంతర ప్రభుత్వం భారత్‌లో ఉంటున్న హసీనాపై పలు ఆరోపణల కింద కేసులు నమోదు చేయడం తెలిసిందే.

వీఓఏ సిబ్బంది తొలగింపును అడ్డుకున్న జడ్జి

న్యూఢిల్లీ: అమెరికా ప్రభుత్వ నిధులతో 8 దశాబ్దాలుగా నడుస్తున్న అంతర్జాతీయ వార్తా సంస్థ 'వాయిస్ ఆఫ్ అమెరికా'(వీఓఏ) గొంతునొక్కేందుకు ట్రంప్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు తాత్కాలికంగా ఫుల్‌స్టాప్ పడింది. ఈ సంస్థకు నిధులను ఆపేయాలని రెండు వారాల క్రితం అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలివ్వడంతో అందులో పనిచేసే జర్నలిస్టులు, ఇంజనీర్లు, ఇతర సిబ్బంది మొత్తం 1,200 మందిని తొలగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఫెడరల్ జడ్జి అడ్డుకున్నారు. కాంగ్రెస్ నుంచి నిధులు పొందే సంస్థపై ప్రభుత్వ చర్య ఏకపక్షమని జడ్జి జేమ్స్ పాల్ ఓట్కెన్ శుక్రవారం పేర్కొన్నారు. సిబ్బందిని లీవుపై పంపడం, తగ్గించడం, తొలగించడం, ఆఫీసులను మూసివేయడం వంటి చర్యలను తాత్కాలికంగా ఆపేయాలని ఆయన ఆదేశించారు. రేడియో ఫ్రీ యూరప్, రేడియో ఫ్రీ ఆసియా, రేడియో ఫ్రీ అఫ్గానిస్తాన్ వంటి విభాగాలకు నిధుల్లో కోత పెట్టరాదని కూడా స్పష్టం చేశారు. జడ్జి ఆదేశాల మేరకు రేడియో ఫ్రీ యూరప్‌కు తిరిగి నిధులందజేశామని యూఎస్ ఏజెన్సీ ఫర్ గ్లోబల్ మీడియా గురువారం పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్లోబల్ మీడియాకు 860 మిలియన్ డాలర్లు కేటాయించేందుకు కాంగ్రెస్ ఆమోదం తెలిపింది.

ఎన్‌పీఎస్‌ఎస్‌ను ఉపయోగించుకోండి

రైతులకు కేంద్రం సూచన

సాక్షి, న్యూఢిల్లీ: పంటలకు సోకే తెగుళ్లను గుర్తించేందుకు రైతులు కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్(ఎన్‌పీఎస్‌ఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర వ్యవసాయ శాఖ కోరింది. వరి, పత్తి, గోధుమ, మొక్కజొన్న, కంది, పెసర, సోయాబీన్, చెరుకు, వంగ, టమాటా, ఆపిల్, అరటి, ద్రాక్ష, దానిమ్మ సహా దాదాపు 61 పంటలకు వ్యాపించే తెగుళ్లను ఇది గుర్తిస్తుందని తెలిపింది. తెగుళ్లను మరింత సమర్థవంతంగా నివారించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణుల సలహాలను రైతులు నేరుగా పొందేందుకు ఎన్‌పీఎస్‌ఎస్ వేదికగా ఉంటుందని పేర్కొంది. గతేడాది ఆగస్టు 15న ప్రారంభించిన ఈ వ్యవస్థ తెగుళ్లను శాస్త్రీయంగా అరికట్టడం, పురుగుమందుల వ్యాపారులపై రైతులు ఆధారపడటాన్ని తగ్గిస్తుందని వ్యవసాయ శాఖ వివరించింది.

చర్చలను ప్రభుత్వమే అడ్డుకుంటోంది: ప్రియాంక

వయనాడ్: ప్రజాస్వామ్య ప్రక్రియను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో సరైన చర్చలు జరగకుండా అడ్డుకుంటోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ ఆరోపించారు. చర్చలకు ఎలాగైనా అవరోధం కలిగించేందుకు రకరకాల కుట్రలు చేస్తోందని, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని విమర్శించారు. ఇది ఎంతో విచారకరమని పేర్కొన్నారు. 'గత కొన్ని సెషన్లుగా చూస్తున్నా. పార్లమెంట్‌లో చర్చలను ఏదోవిధంగా ఆపడమే ప్రభుత్వ విధానంగా కనిపిస్తోంది. ప్రతిపక్షాలు నిరసన తెలుపుతాయని భావించిన వెంటనే ఏదో అంశంపై సభను ప్రభుత్వం తప్పుదారి పట్టిస్తోంది. ప్రతిపక్ష నేత మాట్లాడే అవకాశం ఇవ్వకుండా చేస్తోంది'అని కేరళలోని సొంత నియోజకవర్గం వయనాడ్‌లో శనివారం ఆమె మీడియాతో వ్యాఖ్యానించారు. 'ప్రభుత్వమే పార్లమెంట్‌లో కార్యకలాపాలకు అడ్డుతగులుతూ ఆ నెపాన్ని ప్రతిపక్షాలపైకి నెడుతోంది. చాలా కొద్ది మందికి మాత్రమే ఈ విషయం తెలుసు'అని ప్రియాంకా గాంధీ చెప్పారు.

'దల్లెవాల్ దీక్షలోనే ఉన్నారు'

చండీగఢ్: పంజాబ్ రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లెవాల్(70) నిరాహార దీక్ష ఇప్పటికీ కొనసాగిస్తూనే ఉన్నారని ఆయన సన్నిహితుడైన అభిమన్యు కొహర్ చెప్పారు. నీళ్లు తాగేందుకు అంగీకరించిన దల్లెవాల్ దీక్ష విరమించినట్లు శుక్రవారం పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలపడంపై కొహర్ ఈ మేరకు స్పందించారు. వేర్వేరు జైళ్లలో ఉన్న రైతు నేతల విడుదల కోరుతూ గత వారం ఆయన ఒక గ్లాసు నీళ్లు తాగారని వివరించారు. దల్లెవాల్ దీక్ష విరమించారంటూ తప్పుడు అభిప్రాయం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం తదితర డిమాండ్లపై గతేడాది నవంబర్ 26వ తేదీన చేపట్టిన దీక్షను దల్లెవాల్ విరమించలేదని కొహర్ స్పష్టం చేశారు.

విమానంలో బీడీ కాల్చిన ప్రబుద్ధుడు

సూరత్: ఓ ప్రయాణికుడు విమానంలో బీడీ కాలుస్తూ పట్టుబడ్డాడు. సూరత్ నుంచి కోల్‌కతాకు వెళ్లాల్సిన విమానం గురువారం మధ్యాహ్నం సాంకేతిక కారణాలతో చివరి నిమిషంలో ఆగిపోయింది. విమానం రెస్ట్‌రూమ్ నుంచి పొగ, కాలిన వాసన రావడంతో ఎయిర్‌హోస్టెస్ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చింది. అశోక్ బిశ్వాస్ అనే వ్యక్తి విమానంలో బీడీ తాగిన విషయాన్ని తనిఖీ సిబ్బంది గుర్తించారు. అతని బ్యాగులో వెతకగా బీడీలు, అగ్గిపెట్టె కనిపించాయి. వెంటనే అతడిని విమానం నుంచి దింపేసి పోలీసులకు అప్పగించారు. దీనిపై విమానయాన సంస్థ అధికారులు డ్యూమస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో భారతీయ న్యాయసంహిత 125 సెక్షన్ ప్రకారం కేసు నమోదుచేసి అశోక్‌ను అరెస్ట్‌చేశారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన అశోక్ పనికోసం గుజరాత్‌లోని నవ్‌సారీకి వచ్చాడు. విమానయాన నిబంధనల ప్రకారం అగ్గిపెట్టె, బీడీ వంటి మండే పదార్థాలు, వస్తువులను విమానంలోకి తీసుకురావడం నేరం. కట్టుదిట్టమైన ఎయిర్‌పోర్ట్ తనిఖీలను దాటుకుని మరీ వాటిని విమానం లోపలికి ఎలా తీసుకొచ్చాడని అశోక్‌ను పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

దక్షిణాఫ్రికాలో డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరం

అధ్వానంగా ఉన్న ఐదో దేశంగా భారత్

జొహన్నెస్‌బర్గ్: వాహన డ్రైవింగ్ విషయంలో ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన దేశంగా దక్షిణాఫ్రికా నిలిచింది. వరుసగా రెండో ఏడాది ఈ అపఖ్యాతి మూటగట్టుకున్న దేశంగా ఉంది. ఈ విషయంలో భారత్ ఐదో స్థానంలో ఉంది. అదేసమయంలో, ప్రపంచంలోనే డ్రైవింగ్‌కు అత్యంత సురక్షితమైన దేశంగా నార్వే వరుసగా నాలుగోసారి కీర్తి కిరీటం ధరించింది. అమెరికాకు చెందిన డ్రైవర్ ట్రెయినింగ్ కంపెనీ జుటోబీ వార్షిక నివేదికలో ఈ విషయాలున్నాయి. మొత్తం 53 దేశాలకు గాను దక్షిణాఫ్రికా అట్టడుగున 53వ స్థానంలో ఉండగా అమెరికాకు 51, భారత్‌కు 49వ ర్యాంకులు దక్కాయి. రహదారులపై స్పీడ్ లిమిట్లు, డ్రైవర్లకు బ్లడ్ ఆల్కహాల్ మోతాదు పరిమితులు, రహదారి ప్రమాదాల స్థాయిలు ఆధారంగా డ్రైవింగ్‌కు సురక్షితమైన, ప్రమాదకరమైన దేశాలను విశ్లేషించామని జుటోబీ తెలిపింది. ప్రతి లక్ష మందిగాను రోడ్డు ట్రాఫిక్ ప్రమాదాల్లో చనిపోయే సరాసరి సంఖ్య గతేడాది 8.9 ఉండగా ఈసారి ఇది 6.3కు తగ్గిందని జుటోబీ పేర్కొంది. దక్షిణాఫ్రికాలో చట్టాలున్నా అవినీతి అధికారుల కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయన్నది అందరికీ తెలిసిన విషయమని జొహన్నెస్‌బర్గ్‌కు చెందిన డ్రైవింగ్ కంపెనీ ఉద్యోగి అలిషా చిన్నాహ్ వ్యాఖ్యానించారు.

ఆర్‌జీ కర్ ఘటనలో గ్యాంగ్‌రేప్ జరగలేదు

హైకోర్టుకు సీబీఐ నివేదిక

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో సంచలనం సృష్టించిన కోల్‌కతా ఆర్‌జీ కర్ బోధనాస్పత్రిలో ట్రైనీ వైద్యురాలి హత్యోదంతంలో గ్యాంగ్‌రేప్ కోణం లేదని, దోషి సంజయ్ రాయ్ ప్రమేయం మాత్రమే ఉందని కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) వెల్లడించింది. ఈ మేరకు శుక్రవారం సీబీఐ తన నివేదికను కలకత్తా హైకోర్టుకు సమర్పించింది. సంజయ్ ఒక్కడే అత్యాచారం చేశాడా, ఇతరులూ ఉన్నారా అని కోర్టు గతంలో సీబీఐని ప్రశ్నించడం తెలిసిందే. దర్యాప్తు సంస్థ తాజా నివేదికలో దీనిపై స్పష్టతనిచ్చింది. బలమైన సాక్ష్యాధారాలు, నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని హత్యోదంతంపై తుది నిర్ధారణకు వచ్చామని పేర్కొంది. ఘటనాస్థలిలో సేకరించిన అన్ని డీఎన్‌ఏ శాంపిళ్ల ఫలితాలు, నిపుణులైన 14 మంది వైద్యులు సభ్యులుగా ఉన్న మెడికల్ బోర్డ్ నిర్ణయాలను లెక్కలోకి తీసుకుని నివేదిక తయారుచేశామని సీబీఐ తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ రాజ్‌దీప్ మజుందార్ చెప్పారు. ''ఈ కేసులో సాక్ష్యాధారాలను ధ్వంసం చేసేందుకు అధికారులు ప్రయత్నించారు. కేసును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో దర్యాప్తు కొనసాగుతోంది'' అని తెలిపారు. బాధితురాలి కుటుంబం తరఫున న్యాయవాది సుదీప్తా మైత్రా వాదించారు. ''ఘటనపై తల్లిదండ్రులకు మొదట సమాచారం ఇచ్చిన ఆస్పత్రి మహిళా అసిస్టెంట్ సూపరింటెండెంట్‌ను సీబీఐ ఇంతవరకు ప్రశ్నించలేదు''అని ఆమె వాదించారు. ఆమె వాదనలను సీబీఐ ఖండించింది. ఆమెను గతంలోనే విచారించి వాంగ్మూలం తీసుకున్నామని తెలిపింది. సాక్ష్యాల ధ్వంసం కోణంలో దర్యాప్తు ఇంకెన్నాళ్లు కొనసాగుతుంది?. ఎందుకింత ఆలస్యం? అంటూ ఇందుకు తగు వివరణ ఇవ్వాలని సీబీఐను కోర్టు ఆదేశించింది.

డెన్మార్క్‌ను వదిలేయండి..

అమెరికాతో ఒప్పందం చేసుకోండి

గ్రీన్‌లాండ్ ప్రజలకు జె.డి.వాన్స్ పిలుపు

గ్రీన్‌లాండ్: ఆర్కిటిక్ ద్వీప దేశమైన గ్రీన్‌లాండ్‌పై అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్రీన్‌లాండ్‌ను డెన్మార్క్ ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. చైనా, రష్యాలకు గ్రీన్‌లాండ్‌ను అప్పగించాలన్నదే డెన్మార్క్ ఆలోచనగా కనిపిస్తోందని మండిపడ్డారు. అందుకే అమెరికాతో ఒక ఒప్పందానికి వస్తే బాగుంటుందని గ్రీన్‌లాండ్ ప్రజలకు సూచించారు. జె.డి.వాన్స్ శుక్రవారం తన భార్య ఉషా వాన్స్‌తో కలిసి గ్రీన్‌లాండ్‌లో పర్యటించారు. డెన్మార్క్‌తో సంబంధాలు తెంచుకోవాలని గ్రీన్‌లాండ్ పౌరులకు పిలుపునిచ్చారు. మిమ్మల్ని రక్షించే పరిస్థితిలో డెన్మార్క్ లేదని అన్నారు. ఇతర దేశాల ఆక్రమణల నుంచి గ్రీన్‌లాండ్‌ను కాపాడే సత్తా అమెరికాకు మాత్రమే ఉందని తేల్చిచెప్పారు. గ్రీన్‌లాండ్ సార్వభౌమత్వాన్ని గౌరవిస్తున్నామని చెప్పారు. గ్రీన్‌లాండ్ భద్రతతోనే అమెరికా భద్రత ముడిపడి ఉందన్నారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికాలో విలీనం చేసుకుంటామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రతిపాదనను గ్రీన్‌లాండ్ ప్రజలకు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గ్రీన్‌లాండ్‌లో 57 వేల మంది నివసిస్తున్నారు. ఇక్కడ పెద్ద ఎత్తున విలువైన ఖనిజ నిక్షేపాలున్నాయి. వీటిపై డొనాల్డ్ ట్రంప్ కన్నేశారని ఆయన ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు.



గ్రీన్‌ల్యాండ్‌లోని పిటుఫ్ఫిక్ అమెరికా స్పేస్ బేస్ వద్ద వాన్స్, ఉష దంపతులు

నిర్బంధాలు.. బహిష్కరణలు!

పాలస్తీనా అనుకూలురపై ట్రంప్ సర్కార్ కఠిన చర్యలు

న్యూయార్క్: అమెరికా యూనివర్సిటీల్లో చదువుకొనసాగిస్తూ పాలస్తీనా అనుకూల నిరసనలకు మద్దతు పలుకుతున్న వారిపై ట్రంప్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. వీరు పాలస్తీనా సాయుధ సంస్థ హమాస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ట్రంప్‌తోపాటు అధికారులు కూడా ఆరోపణలు చేస్తున్నారు. అయితే, గాజాలోని హమాస్‌పై ఇజ్రాయెల్ చర్యలకు వ్యతిరేకంగా మాత్రమే తాము మాట్లాడుతున్నామన్నది నిరసనల్లో పాల్గొంటున్న వారి వాదనగా ఉంది. ఇటీవలి కాలంలో యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఏడెనిమిది మంది పాలస్తీనా అనుకూల విద్యార్థి నేతలను నిర్బంధంలోకి తీసుకోవడమో లేదా బలవంతంగా సొంత దేశాలకు పంపించడమో చేశారు. వీరిలో కొందరిని గురించి పరిశీలిద్దాం..

రుమేసా ఒజ్‌టుర్క్

తుర్కియేకు చెందిన 30 ఏళ్ల రుమేసా ఒజ్‌టుర్క్ మంగళవారం బోస్టన్‌లోని ఓ వీధిలో నడిచి వెళ్తుండగా ఫెడరల్ అధికారులు అడ్డుకుని నిర్బంధించారు. టఫ్ట్స్ వర్సిటీలో డాక్టరేట్ చేస్తున్న ఈమె హమాస్‌కు మద్దతుగా జరిగే కార్యకలాపాల్లో పాల్గొంటోందని హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారి ఒకరు తెలిపారు. ఆధారాలను మాత్రం చూపలేదు. అయితే, ఇజ్రాయెల్‌తో సంబంధాలు తెంచుకోవాలని డిమాండ్ చేసే వర్సిటీ వార్తాపత్రికకు రుమేసా వ్యాసాలు రాస్తుంటారని స్నేహితులు తెలిపారు. ప్రస్తుతం లూసియానాలో డిటెన్షన్ సెంటర్‌లో ఉంచారు. రుమేసా నిర్బంధానికి తగు కారణాలు తెలపాలని జిల్లా జడ్జి ఒకరు అధికారులను ఆదేశించారు.

మహ్మూద్ ఖలీల్

అమెరికాలో నివాసానికి అర్హత పొందిన పాలస్తీనా అనుకూల ఉద్యమకారుడు మహ్మూద్ ఖలీల్‌ను మార్చిలో ఇమిగ్రేషన్ అధికారులు అరెస్ట్ చేసి, నిర్బంధంలో ఉంచారు. కొలంబియా వర్సిటీలో గతేడాది జరిగిన ఇజ్రాయెల్ వ్యతిరేక ఆందోళనలను నడిపిన వారిలో ఇతడూ ఉన్నాడు. అనంతరం వర్సిటీ అధికారులు, ఆందోళనకారులకు మధ్యవర్తిగా ఉండి ఆందోళనలను విరమింపజేశాడు. అయితే, ఇతడు హమాస్‌కు మద్దతు తెలుపుతున్నాడనే ఆరోపణలపై ఖలీల్‌కున్న గ్రీన్‌కార్డును యంత్రాంగం రద్దు చేసింది. బలవంతంగా సొంతదేశం సిరియాకు పంపించేందుకు జరిగే ప్రయత్నాలను ఇతడు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాడు. ఇతడు అమెరికా పౌరురాలిని వివాహం చేసుకున్నాడు.

యున్‌సియో చుంగ్

దక్షిణ కొరియా నుంచి చిన్నతనంలోనే అమెరికాకు వచ్చిన యున్‌సియో చుంగ్ నివాసార్హత పొందింది. ఈమె కొలంబియా వర్సిటీ విద్యార్థి. పాలస్తీనా అనుకూల విద్యార్థులపై ప్రభుత్వం బహిష్కరాస్త్రాన్ని ప్రయోగించడాన్ని నిరసిస్తూ ఇటీవల బర్నార్డ్ కాలేజీలో జరిగిన నిరసనల్లో పాల్గొనడమే ఈమె చేసిన నేరం. ఈమెను సొంతదేశం కొరియాకు పంపించాలని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రయత్నాలు చేస్తోంది. దీనిపై ఈమె కోర్టును ఆశ్రయించింది. కోర్టు తీర్పు వచ్చే వరకు యున్‌సియోను నిర్బంధించవద్దని జడ్జి ఒకరు ఆదేశించారు.

మొమొడౌ తాల్

కార్నెల్ యూనివర్సిటీలో డాక్టరేట్ చేస్తున్న మొమొడౌ తాల్(31) వీసాను ఇటీవలే అధికారులు రద్దు చేశారు. క్యాంపస్‌లో జరిగిన పాలస్తీనా అనుకూల ఆందోళనల్లో పాల్గొనడమే ఇతడి తప్పు. యూకే, గాంబియా పౌరసత్వాలున్న మొమొడౌ తనను అక్రమంగా నిర్బంధించారంటూ కోర్టులో సవాల్ చేశాడు. ప్రభుత్వ చర్యలు చట్టబద్ధమేనని కోర్టు ప్రకటిస్తే ఇమిగ్రేషన్ అధికారుల ఎదుట లొంగిపోతానని ఇతడు అంటున్నాడు.

బాదర్ ఖాన్ సురి

భారత్‌కు చెందిన బాదర్ ఖాన్ సురి జార్జిటౌన్ వర్సిటీ విద్యార్థి. వర్జీనియాలోని తన నివాసం వద్ద ముసుగు ధరించిన హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం అధికారులు ఇతడిని అదుపులోకి తీసుకున్నారు. హమాస్ సిద్ధాంతాలను ఇతడు ప్రచారం చేస్తున్నట్లు ఆరోపణలు చేశారు. సురి సోషల్ మీడియా పోస్టులు, ఇతడి భార్య పాలస్తీనా వాసి కావడమే ఇందుకు కారణమని ఇతడి లాయర్ కోర్టుకు తెలిపారు. విజిటింగ్ స్కాలర్‌గా అమెరికాలో ఉండేందుకు సురికి అనుమతి ఉందని, ఇతడి భార్య అమెరికా పౌరురాలని అన్నారు. లూసియానాలోని డిటెన్షన్ సెంటర్‌లో సురిని ఉంచారు. సురి ని వెంటనే విడుదల చేయాలని, భారత్‌కు బలవంతంగా పంపించరాదని వాదిస్తున్నారు.

లెకా కొర్డియా

వెస్ట్ బ్యాంకుకు చెందిన పాలస్తీనా వాసి లెకా కొర్డియా. ప్రస్తుతం న్యూయార్క్‌లోని నెవార్క్‌లో ఉంటోంది. విద్యార్థి వీసా పరిమితి ముగిసిన తర్వాత కూడా అమెరికాను వీడి వెళ్లలేదని అధికారులు ఆరోపిస్తున్నారు. కొర్డియా తమ విద్యార్థి కానేకాదని కొలంబియా యూనివర్సిటీ అంటోంది. టెక్సాస్‌లోని అల్వరాడో డిటెన్షన్ సెంటర్‌లో ఈమెను ఉంచారు.

రంజనీ శ్రీనివాసన్

భారత పౌరురాలైన రంజనీ శ్రీనివాసన్ కొలంబియా వర్సిటీలో డాక్టరేట్ చేస్తోంది. యూనివర్సిటీ హాస్టల్‌లో ఉండగా ఇమిగ్రేషన్ అధికారులు ఈమెను సోదా చేయడంతో ఈమె భారత్‌కు తిరిగి వచ్చింది. హింసను, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందున ఈమె వీసాను రద్దు చేసినట్లు యంత్రాంగం తెలిపింది. ఇందుకు గల ఆధారాలను మాత్రం వెల్లడించలేదు. ఈ ఆరోపణలను ఈమె ఖండించింది. నిరసనల్లో తనకెలాంటి పాత్ర లేదని తెలిపింది. 'సెల్ఫ్ డిపోర్ట్'ఆప్షన్‌ను ఎన్నుకుని, స్వదేశానికి చేరుకున్నట్లు తెలిపింది.

అలిరెజా డొరాడి

అలబామా యూనివర్సిటీ డాక్టొరల్ విద్యార్థి అలిరెజా డొరాడి సొంత దేశం ఇరాన్. మంగళవారం ఇతడిని ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధంలోకి తీసుకుని, లూసియానాలోని జెనా ఇమిగ్రేషన్ ఫెసిలిటీకి తరలించారు. మెకానికల్ ఇంజనీరింగ్ చదువుతున్న ఇతడి వీసాను అధికారులు 2023లోనే రద్దు చేశారని లాయర్ డేవిడ్ రొజాస్ తెలిపారు. అయితే, విద్యార్థి హోదాలో ఉన్నంత కాలం ఇతడు అమెరికాలో ఉండేందుకు అర్హత ఉంటుందన్నారు. జాతీయ భద్రతకు ప్రమాదమనే ఆరోపణలపై ఇతడిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు అంటున్నారు. అయితే, ఇతడికి ఎలాంటి రాజకీయ కార్యకలాపాలతో సంబంధం లేదని లాయర్ డేవిడ్ తెలిపారు.

డాక్టర్ రషా అలావీహ్

లెబనాన్‌కు చెందిన కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ రషా అలావీహ్(34). రోడ్ ఐల్యాండ్‌లో పనిచేస్తూ అక్కడే నివాసం ఉన్న ఈమెను ఇటీవలే సొంత దేశానికి బలవంతంగా పంపించివేశారు. ఈమె పిటిషన్‌పై తీర్పు వెలువడే వరకు నిర్బంధించరాదన్న జడ్జి ఆదేశాలను సైతం ఇమిగ్రేషన్ అధికారులు పక్కనబెట్టడం గమనార్హం. లెబనాన్‌లోని హెజ్‌బొల్లా సాయుధ సంస్థకు ఈమె బహిరంగంగా మద్దతు పలికారని అధికారులు ఆరోపిస్తున్నారు. అయితే, హెజ్‌బొల్లా నేత హసన్ నస్రుల్లా మత, ఆధ్యాత్మిక బోధనలకే తప్ప రాజకీయ సిద్ధాంతాలకు మద్దతు తెలపలేదని రషా అంటున్నారు.

సైబర్ మోసానికి వృద్ధ దంపతులు బలి

- రూ.50 లక్షలు పోగొట్టుకున్న బాధితులు
- సైబర్ నేరగాళ్ల వేధింపులు తట్టుకోలేక బలవన్మరణం
- కర్ణాటకలోని బెళగావి జిల్లాలో దారుణం

బెళగావి: సైబర్ మోసం వృద్ధ దంపతులను ప్రాణాలు బలి తీసుకుంది. సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి రూ.50 లక్షలు పోగొట్టుకున్న బాధితులు అది తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. కర్ణాటకలోని బెళగావి జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. దియాంగో నజరత్(83), ఫ్లైవియానా నజరత్(79) దంపతులకు సంతానం లేదు. గతంలో కర్ణాటక సెక్రటేరియట్‌లో పనిచేసి, పదవీ విరమణ పొందారు. బెళగావి జిల్లాలో స్థిరపడ్డారు. ఇంట్లో ఇద్దరే ఉంటున్నారు. ఇటీవల వీడియో కాల్ ద్వారా సైబర్ నేరగాళ్లు వారిని సంప్రదించారు. తాము ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ నుంచి మాట్లాడుతున్నామని, మీపై క్రిమినల్ కేసు నమోదైందంటూ బెదరగొట్టారు. కఠిన శిక్ష తప్పదని భయపెట్టారు. కేసు నుంచి బయటపడాలంటే రూ.5 లక్షలు తమకు బదిలీ చేయాలని సూచించారు. తీవ్ర భయాందోళనకు గురైన దంపతులు సైబర్ నేరగాళ్లు అడిగినంత సొమ్ము వారి బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు. అయినా సైబర్ రాక్షసుల వేధింపులు ఆగలేదు. రకరకాల కారణాలు చెబుతూ రూ.50 లక్షలకుపైగా వసూలు చేశారు. ఇంకా డబ్బులు పంపాలని బెదిరిస్తుండడంతో చేసేది లేక దంపతులిద్దరూ తనువు చాలించారు. భర్త గొంతు కోసుకొని చనిపోగా, భార్య విషం సేవించి మృతిచెందారు. ఘటనా స్థలంలో సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సైబర్ నేరగాళ్ల వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు దంపతులిద్దరూ ఆ లేఖలో పేర్కొన్నారు. వృద్ధ దంపతులకు సంతానం లేకపోవడంతోపాటు స్థానికంగా బంధువులు, మిత్రులు లేకపోవడంతో తమకు ఎదురైన కష్టాన్ని చెప్పుకోలేకపోయారు. సైబర్ నేరస్థుల బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించామని, మొత్తం ఎంత సొమ్మును దోచుకున్నారు అనేది దర్యాప్తులో తేలుతుందని పోలీసులు తెలిపారు.

పొట్టలో మర్చిపోయిన కత్తెరను

17 ఏళ్ల తర్వాత తీశారు!

లక్నో: సిజేరియన్ సమయంలో మహిళ పొట్టలోనే కత్తెరను మర్చిపోయి కుట్లేశాడో వైద్యుడు. 2008లో ఈ ఘటన చోటుచేసుకుంది. దాదాపు 17 ఏళ్ల పాటు కడుపు నొప్పితో ఎంతో బాధపడింది ఆ మహిళ. చివరికి ఎక్స్ రేతో పొట్టలో కత్తెర ఉన్న విషయం తెల్సి ఆపరేషన్‌తో వెలుపలికి తీశారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకుంది. సంధ్యా పాండే అనే మహిళకు 2008 ఫిబ్రవరి 28వ తేదీన లక్నోలోని 'షీ మెడికల్ కేర్'ఆస్పత్రిలో సిజేరియన్‌తో కాన్పు చేశారు. ఆ సర్జరీ జరిగినప్పటి నుంచి పొట్టలో విపరీతమైన బాధతో ఇబ్బంది పడుతున్నారు. ఎందరో డాక్టర్ల వద్దకు వెళ్లారు. అయినా ఉపశమనం దొరకలేదు. ఇటీవల సంధ్యా పాండే వైద్య పరీక్షల కోసం లక్నోలోని మెడికల్ కాలేజీ ఆస్పత్రికి వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ ఎక్స్ రే కూడా తీశారు. ఆమె పొట్టలో కత్తెర ఉన్నట్లు ఎక్స్ రే రిపోర్టుతో తెలిసింది. దీంతో ఆమె కింగ్ జార్జి మెడికల్ యూనివర్సిటీ ఆస్పత్రిలో చేరారు. మార్చి 26వ తేదీన ఆపరేషన్ చేసి వైద్యులు కడుపులో ఉన్న కత్తెరను బయటకు తీశారు. ఎంతో సంక్లిష్టమైన ఆపరేషన్ ద్వారా కత్తెరను బయటకు తీశామని, కోలుకున్నాక సంధ్యా పాండేను డిశ్చార్జి చేశామని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సంధ్య భర్త అరవింద్ కుమార్ పాండే ఫిర్యాదు మేరకు సిజేరియన్ చేసిన డాక్టర్ పుష్పా జైశ్వాల్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జిల్లా పరిషత్ కౌన్సిల్‌లో ఎన్ని రకాల సభ్యులుంటారు?

భారతదేశ అభివృద్ధిలో గ్రామాల పాత్ర అత్యంత కీలకం. గ్రామీణ అభివృద్ధి, సమాజ వికాస సాధనలో స్థానిక ప్రభుత్వాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా గ్రామీణ స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ హోదా కల్పించారు. అందువల్ల దీన్ని 'పంచాయతీరాజ్ చట్టం' అని కూడా అంటారు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

73వ రాజ్యాంగ సవరణ చట్టం

స్థానిక ప్రభుత్వాల బలోపేతం ద్వారా గ్రామీణ వికాసాన్ని సాధించడానికి స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాలని 1986లో నియమించిన ఎల్.ఎం.సింఘ్వీ కమిటీ సిఫార్సు చేసింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 1989లో 64వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశ పెట్టింది. ఈ బిల్లు లోక్‌సభ ఆమోదం పొందగా రాజ్యసభలో తిరస్కరించారు. అనంతరం పి.వి. నరసింహారావు ప్రభుత్వం 1991లో 73వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశ పెట్టింది. పార్లమెంట్ దీన్ని 1992లో ఆమోదించగా,రాష్ట్రపతి 1993 ఏప్రిల్ 20న ఆమోదించారు. ఇది 1993 ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం గురించి ప్రత్యేకంగా 11వ షెడ్యూల్‌లో పేర్కొన్నారు. అధికరణలు 243(ఎ) నుంచి 243(ఒ) వరకు దీని గురించి తెలియజేస్తాయి. వీటిని ప్రత్యేకంగా 9వ భాగంలో చేర్చారు. ఈ చట్టంలో చేర్చిన మొత్తం అంశాలు 29.

243వ అధికరణ నిర్వచనాలు

జిల్లా, గ్రామసభ, మాధ్యమిక స్థాయి (మండల పరిషత్), పంచాయతీ ఏరియా, జనాభా మొదలైన అంశాలపై గవర్నర్ నోటిఫికేషన్ ద్వారా నిర్వచనాలు తెలియజేస్తారు.

అధికరణ 243(ఎ)-గ్రామసభ: పంచాయతీ రాజ్ చట్టం ద్వారా గ్రామసభకు అత్యంత ప్రాముఖ్యం కల్పించారు. దీంట్లో గ్రామ ఓటర్లందరూ సభ్యులుగా ఉంటారు. గ్రామసభ కనీసం ఆరు నెలలకు ఒకసారి సమావేశం కావాలి. సమావేశాల కోరం 1/10వ వంతు. గ్రామ సర్పంచ్ ఈ సమావేశాలను ఏర్పాటు చేసి, నిర్వహిస్తారు. గ్రామ పంచాయతీ దీనికి సమష్టి బాధ్యత వహిస్తుంది. ఈ సమావేశాల్లో గ్రామ పంచాయతీ ఎజెండాను రూపొందిస్తారు. ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి దీన్ని ప్రాతిపదికగా భావించవచ్చు.

అధికరణ 243(బి)-పంచాయతీల వ్యవస్థాపన: ప్రతి రాష్ట్రంలో మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేయాలి. 20 లక్షల లోపు జనాభా ఉన్న రాష్ట్రాల్లో మాధ్యమిక వ్యవస్థ తప్పనిసరి కాదు.

1. **గ్రామ పంచాయతీ:** 500ల మందికి మించి జనాభా ఉన్న గ్రామాన్ని గ్రామ పంచాయతీగా గుర్తించవచ్చు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వీటి సంఖ్య సుమారుగా 21,590. తెలంగాణలో గ్రామాల సంఖ్య సుమారుగా 8872. వార్షిక ఆదాయం 60 వేలు దాటితే మేజర్ పంచాయతీగా, అంత కంటే తక్కువగా ఉంటే మైనర్ పంచాయతీగా పేర్కొంటారు.
2. **మండల పరిషత్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మండల వ్యవస్థను 1986లో ప్రవేశపెట్టారు. సుమారుగా 40 వేల జనాభాకు 20 నుంచి 30 గ్రామాలను కలుపుతూ మండలాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం మండలాల సంఖ్య 1104. ప్రస్తుతం వీటి సంఖ్య 1128. వీటిలో తెలంగాణలో 454 మండలాలున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకారం మండల పరిషత్‌ల సంఖ్య 1096. ఎంపీటీసీల సంఖ్య 16,589.
3. **జిల్లా పరిషత్:** పరిపాలన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాను ఏర్పాటు చేస్తారు. రాష్ట్ర శాసనసభ చట్టం ద్వారా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 13 జిల్లాలు, వాటికి 13 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. తెలంగాణలో జిల్లాలు 10, జిల్లా పరిషత్‌లు 9 (హైదరాబాద్‌కు జిల్లా పరిషత్ లేదు).

అధికరణ 243(సి) - పంచాయతీల నిర్మాణం: రాష్ట్ర శాసన సభ నిర్ణయించిన చట్టాల మేరకు పంచాయతీల నిర్మాణం ఉంటుంది.

జిల్లా పరిషత్

జిల్లా పరిషత్‌లో ప్రధానంగా ఆరు విభాగాలుంటాయి.

జిల్లా పరిషత్ కౌన్సిల్: ఇందులో మూడు రకాల సభ్యులు ఉంటారు.

1) ప్రత్యక్షంగా ఎన్నికైన జడ్పీటీసీలు
2) పదవి రీత్యా సభ్యులు
3) సహకార సభ్యులు

వీరితోపాటు జిల్లా గ్రంథాలయ, సహకార బ్యాంక్, డెయిరీ, మార్కెట్ కమిటీ చైర్మన్ శాశ్వత ఆహ్వానిత సభ్యులుగా కొనసాగుతారు.

జిల్లా పరిషత్ చైర్మన్: ఈయనను పరోక్ష పద్ధతిలో అయిదేళ్ల కాలానికి ఎన్నుకుంటారు. అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించవచ్చు.

జిల్లా మహాసభ: జిల్లా పరిషత్ మండల పరిషత్‌కు మధ్య వారధిగా పనిచేస్తుంది. జడ్పీటీసీ, ఎంపీపీలు సభ్యులుగా కొనసాగుతారు.

స్థాయీ సంఘం: జిల్లా పరిషత్‌లో స్థాయి సంఘాల పాత్ర కీలకమైంది. అందువల్ల వీటిని 'స్థానిక ప్రభుత్వాల కళ్లు, చెవులు'గా పేర్కొంటారు. ప్రతి జిల్లా పరిషత్‌లో ఏడు స్థాయీ సంఘాలు ఉంటాయి.

చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో): సీఈవోగా సీనియర్ గ్రూప్-1 అధికారిని నియమిస్తారు. ఈయన జిల్లా సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారు.

కలెక్టర్: జిల్లా పరిపాలనలో ఈయనే ముఖ్యులు. జిల్లాకు ఈయన ప్రధాన న్యాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఎన్నికలు, శాంతి భద్రతలు, పౌరసరఫరా, కరవు కాటకాల అధికారిగా వ్యవహరిస్తారు.

మండల పరిషత్

మండల పరిషత్‌లో ప్రధానంగా నాలుగు విభాగాలుంటాయి.

మండల పరిషత్ కౌన్సిల్: దీంట్లో మూడు రకాలు సభ్యులుంటారు.

1) పార్టీ ప్రాతిపదికన ప్రత్యక్షంగా ఎన్నికైన ఎంపీటీసీలు
2) పదవి రీత్యా సభ్యులు 3) సహకార సభ్యుడు

మండల పరిషత్ ప్రెసిడెంట్: ఈయనను పరోక్ష పద్ధతిలో అయిదేళ్ల కాలానికి ఎన్నుకుంటారు. అవిశ్వాస తీర్మానం ద్వారా ముందుగానే తొలగించవచ్చు.

మండల మహాసభ: మండల పరిషత్‌కు గ్రామ పంచాయతీకి మధ్య వారధిగా పనిచేస్తుంది. దీంట్లో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సభ్యులుగా ఉంటారు. మండల పరిషత్ ప్రెసిడెంట్ దీని సమావేశాలను ఏర్పాటు చేసి నిర్వహిస్తారు.

ఎంపీడీవో: గ్రూప్-1 అధికారిని ఎంపీడీవోగా నియమిస్తారు. ఈయన మండల సమాచారాన్ని జిల్లా పరిషత్‌కు అందజేస్తారు.

గ్రామ పంచాయతీ

గ్రామ పంచాయతీలో ప్రధానంగా నాలుగు విభాగాలుంటాయి.

పంచాయతీ బోర్డు: వార్డు మెంబర్లు సభ్యులుగా ఉంటారు. వీరి సంఖ్య కనిష్ఠంగా 5, గరిష్ఠంగా 21 ఉండాలి. పంచాయతీ బోర్డు కనీసం నెలకు ఒకసారి సమావేశం కావాలి.

సర్పంచ్: గ్రామ ఓటర్లు ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకుంటారు. గ్రామ ప్రథమ పౌరుడు ఈయనే. ఈయనను అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించే అవకాశం లేదు.

గ్రామసభ: గ్రామ ఓటర్లందరూ సభ్యులుగా ఉంటారు. కనీసం ఆరు నెలలకు ఒకసారి సమావేశం కావాలి.

పంచాయతీ కార్యదర్శి: ఈయన ప్రభుత్వ ఉద్యోగి. గ్రామ పంచాయతీ సమాచారాన్ని మండల పరిషత్‌కు అందజేస్తారు.

అధికరణ 243 (డి) - రిజర్వేషన్లు: ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన, మహిళలకు మూడో వంతు సీట్లు కేటాయించారు. బీసీ రిజర్వేషన్లను రాష్ట్రాలే నిర్ణయిస్తాయి. తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీలకు 18.25 శాతం, ఎస్టీలకు 8.25 శాతం, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించారు.మహిళా రిజర్వేషన్‌ను ఇటీవల కొన్ని రాష్ట్రాలు 50శాతానికి పెంచాయి. దీన్ని అమలు చేసిన మొదటి రాష్ట్రం బీహార్.

అధికరణ 243 (ఇ) - పంచాయతీల పదవీ కాలం: స్థానిక ప్రభుత్వాల సాధారణ కాల పరిమితి అయిదేళ్లు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే రద్దుచేయవచ్చు. ఒకవేళ ముందుగా రద్దు చేస్తే తిరిగి ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాలి.

అధికరణ 243 (ఎఫ్) - పంచాయతీ సభ్యుల అనర్హతలు: రాష్ట్ర శాసనసభ ప్రత్యేక చట్టం ద్వారా ఈ అనర్హతలను నిర్ణయిస్తుంది. 21 ఏళ్ల లోపు ఉన్న వారు పోటీ చేసేందుకు అనర్హులు. 1995 తర్వాత ఇద్దరికి మించి సంతానం ఉన్నవారు అనర్హులు.

అధికరణ 243 (జి) - పంచాయతీల విధులు, అధికారాలు: పంచాయతీలకు 29 అంశాలకు సంబంధించిన విధులు, అధికారాలను కల్పించారు. వీటిని ప్రత్యేకంగా 11వ షెడ్యూల్‌లో చేర్చారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు బదలాయించాలి.

ఉదాహరణలు:

1) వ్యవసాయం, వ్యవసాయ విస్తరణ
2) భూ సంస్కరణలు, భూ పరిరక్షణ
3) తాగునీరు, సాగునీటి సరఫరా
4) పశు సంరక్షణ, కోళ్ల పరిశ్రమ
5) చేపలు
6) వనసంరక్షణ, సామాజిక అడవులు

అధికరణ 243 (హెచ్)-పంచాయతీల ఆదాయ వనరులు: రాష్ట్ర శాసనసభ ప్రత్యేక చట్టం ద్వారా పంచాయతీలకు కొన్ని పన్నులను విధించే అధికారం కల్పిస్తుంది. కొన్ని పన్నుల్లో వాటా, సహాయ నిధులను కూడా ఇస్తుంది.

అధికరణ 243 (ఐ) - రాష్ట్ర ఆర్థిక సంఘం: రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని గవర్నర్ ఏర్పాటు చేస్తారు. దీని పదవీ కాలం 5 ఏళ్లు. ఇందులో చైర్మన్, సభ్యులు ఉంటారు. వీరిని నియమించే, తొలగించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి ఆర్థిక సంఘాన్ని 1994లో ఏర్పాటు చేశారు. దీని చైర్మన్ లక్ష్మణస్వామి. రాష్ట్ర ఆర్థిక సంఘం పంచాయతీలకు కేటాయించాల్సిన నిధులు, పన్నుల విభజన, ఇతర సహాయ గ్రాంట్ల గురించి సిఫార్సులు చేస్తుంది. సంబంధిత నివేదికను గవర్నర్‌కు సమర్పిస్తుంది. గవర్నర్ శాసనసభకు అందజేస్తారు.

అధికరణ 243 (జె) - పంచాయతీ ఖాతాల ఆడిటింగ్: పంచాయతీల ఆడింటింగ్ నిర్వహణకు శాసన చట్టం ద్వారా ప్రత్యేక ఆడిటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. తెలుగు రాష్ట్రాల్లో దీన్ని ఇప్పటి వరకూ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఈ విధులను రాష్ట్ర ఆడిట్ సంచాలకులు నిర్వహిస్తున్నారు.

అధికరణ 243 (కె) - రాష్ట్ర ఎన్నికల కమిషన్: పంచాయతీలకు సకాలంలో సక్రమంగా ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా రూపొందించడం తదితర విధులను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది. ఎన్నికల కమిషనర్‌ను గవర్నర్ నియమిస్తారు. ఈయన పదవీ కాలం అయిదేళ్లు. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే తొలగించే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘాన్ని 1994లో ఏర్పాటు చేశారు. మొదటి కమిషనర్ కాశీ పాండ్యన్. 2014లో తెలంగాణకు ప్రత్యేక ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేశారు. దీని కమిషనర్ నాగిరెడ్డి.

అధికరణ 243(ఎల్) - కేంద్ర పాలిత ప్రాంతాలకు అనువర్తన: పంచాయతీరాజ్ చట్టాన్ని కేంద్ర పాలిత ప్రాంతాలకు కూడా వర్తింపజేయవచ్చు. శాసనసభ ఉంటే శాసనసభ ప్రత్యేక తీర్మానం ద్వారా ఏర్పాటు చేసుకోవచ్చు. శాసనసభ లేకుంటే రాష్ట్రపతి నోటిఫికేషన్ ద్వారా వర్తింపజేయవచ్చు.

అధికరణ 243 (ఎం) - మినహాయింపులు: పంచాయతీరాజ్ చట్టం నుంచి కొన్ని ప్రాంతాలకు మినహాయింపులు ఇచ్చారు. ముఖ్యంగా జమ్ము-కశ్మీర్, మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, షెడ్యూల్ ప్రాంతాలు, మణిపూర్‌లోని కొండ ప్రాంతాలు, పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతానికి మినహాయింపులు ఉన్నాయి.

అధికరణ 243 (ఎన్) - పాత చట్టాల కొనసాగింపు: ఈ చట్టం అమల్లోకి వచ్చిన ఏడాది వరకు పాత చట్టాలు అమల్లో ఉండవచ్చు. అంతకు ముందు రాష్ట్ర శాసనసభ 73వ సవరణ చట్టం మౌలిక స్వరూపానికి భంగం వాటిల్లకుండా సొంత చట్టాలను రూపొందించుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో నూతన చట్టం 1994 నుంచి అమల్లోకి వచ్చింది.

అధికరణ 243 (ఒ)- న్యాయస్థానాల జోక్యం: పంచాయతీల్లో నియోజకవర్గాల ఏర్పాటు, వాటిలో సీట్ల కేటాయింపు గురించి న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు. వీటి వివాదాల పరిష్కారానికి శాసనసభ తీర్మానం ద్వారా లీగల్ అథారిటీలను ఏర్పాటు చేయాలి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. **జిల్లాపరిషత్ చైర్మన్‌ను ఎవరు ఎన్నుకుంటారు?**
   ఎ) ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఓటర్లు
   బి) మండల పరిషత్ అధ్యక్షులు
   సి) జిల్లా పరిషత్‌కు ఎన్నికైన సభ్యులు
   డి) జిల్లాలోని సర్పంచ్‌లు
2. **పంచాయతీరాజ్ వ్యవస్థను మొదటగా1959 అక్టోబరులో ఏ రాష్ట్రం అమలు చేసింది?**
   ఎ) రాజస్థాన్ బి) తమిళనాడు
   సి) కర్ణాటక డి) కేరళ
3. **న్యాయ పంచాయతీల ఉద్దేశం ఏమిటి?**
   ఎ) గ్రామ పంచాయతీలను నిర్వహించడం
   బి) పంచాయతీ ప్రెసిడెంట్ ఇచ్చిన తీర్పులను కొట్టేయడం
   సి) హైకోర్టు అప్పీలుకు అనుమతి ఇవ్వడం
   డి) గ్రామీణ ప్రజలకు త్వరగా ఎక్కువ ఖర్చు లేకుండా న్యాయాన్ని అందించడం
4. **73, 74వ రాజ్యాంగ సవరణ చట్టాలు కింది వాటిలో ఏ రాష్ట్రాలకు వర్తించవు?**
   ఎ) గోవా, జమ్ము-కశ్మీర్, పాండిచ్చేరి
   బి) ఢిల్లీ, గోవా, మిజోరాం, మేఘాలయ
   సి) మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం
   డి) సిక్కిం, అసోం, మిజోరాం
5. **ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థను ఏ ముఖ్యమంత్రి కాలంలో ప్రవేశపెట్టారు?**
   ఎ) నీలం సంజీవరెడ్డి
   బి) దామోదరం సంజీవయ్య
   సి) కాసు బ్రహ్మానందరెడ్డి
   డి) పి.వి. నరసింహారావు

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) డి; 4) సి; 5) ఎ.

న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ) ఎక్కడ ఉంది?

రాష్ట్రంలో ఏర్పాటైన ఏకైక అంతర్జాతీయ పరిశోధనా సంస్థ ఇక్రిశాట్. దీన్ని 1972లో మెదక్ జిల్లా పటాన్‌చెరు వద్ద ఏర్పాటు చేశారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో అర్ధశుష్క వాతావరణ పరిస్థితులను తట్టుకొని పెరిగే వంగడాలకు రూపకల్పన చేస్తోంది. సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణనిస్తోంది. మెట్ట ప్రాంత వ్యవసాయ సాగుపై పరిశోధనలు చేస్తోంది. ఇంటర్నేషనల్ క్రాప్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సెమీ ఎరిడ్ ట్రోపిక్స్‌కు సంక్షిప్త రూపమే ఇక్రిశాట్.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

జాగ్రఫీ

రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రభుత్వ రంగ సంస్థలు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)

బీఈఎల్ మొదటి యూనిట్‌ను బెంగళూరులో 1954లో స్థాపించారు. ఇది రక్షణ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. దీని 9వ యూనిట్‌ను 1986లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. ఈ యూనిట్ రక్షణ శాఖకు అవసరమైన ఎలక్ట్రానిక్ అవసరాలను తీరుస్తోంది. దీనికి నవరత్న హోదా కల్పించారు.

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్)

దేశంలో మొత్తం ఆరు బీహెచ్ఈఎల్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. మెదక్ జిల్లాలోని రామచంద్రాపురంలో 1963లో బీహెచ్ఈఎల్‌ను స్థాపించారు. దేశంలోని అతి పెద్ద ఇంజినీరింగ్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీల్లో ఇదొకటి. ఇక్కడ టర్బైన్లు, జనరేటర్లు, సర్క్యూట్ బ్రేకర్లు తయారవుతాయి. ఇది థర్మల్ పవర్ ప్లాంట్ల ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషిస్తోంది. దీనికి మహారత్న హోదా ఉంది.

ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ (ఐడీపీఎల్)

ఇది కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని అతిపెద్ద ఫార్మా రంగ సంస్థ. దీన్ని 1961లో ఢిల్లీలో ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఆరు ఐడీపీఎల్ యూనిట్లను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ యూనిట్‌ను 1967లో బాలానగర్‌లో స్థాపించారు. అత్యవసర, జీవనాధార మందుల తయారీలో స్వయం సమృద్ధి సాధనకు అవసరమైన పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ఈ సంస్థ చేపడుతోంది.

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)

1967 ఏప్రిల్ 11న హైదరాబాద్ సమీపంలో ఏర్పాటు చేశారు. ఇది అణుశక్తి విభాగం ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఎలక్ట్రానిక్ పరికరాల పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ఈ సంస్థ చేపడుతోంది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల స్వయం సమృద్ధి సాధనలో కీలకపాత్ర పోషిస్తోంది.

దేశంలో తొలి డిజిటల్ కంప్యూటర్‌ను ఈసీఐఎల్ రూపొందించింది. దేశంలో తొలి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, మొదటి న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నియంత్రణ పరికర వ్యవస్థలను, టెలివిజన్లను ఈ సంస్థ రూపొందించింది.

ప్రాగా టూల్స్

దీన్ని 1959లో హైదరాబాద్‌లో స్థాపించారు. యంత్రాల విడి పరికరాలు, కట్టర్లు, టూల్స్, గ్రైండర్లు, త్రెడ్ రోలింగ్ మిషన్లు మొదలైన వాటిని ఇది రూపొందిస్తోంది.

హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్)

హెచ్‌సీఎల్‌ను రంగారెడ్డి జిల్లాలో, పశ్చిమ బెంగాల్‌లోని రూప్ నారాయణ్‌పూర్‌లో స్థాపించారు. ఇది భారీ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో పని చేస్తోంది. హెచ్‌సీఎల్‌లో టెలికాం కేబుల్స్‌ను తయారు చేస్తున్నారు.

హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)

భారత్‌లో హెచ్ఏఎల్‌కు ఆరు యూనిట్లు ఉన్నాయి. 1965లో రంగారెడ్డి జిల్లాలో హెచ్ఏఎల్ యూనిట్‌ను ప్రారంభించారు. దీనికి నవరత్న హోదా కల్పించారు. ఇందులో విమానయాన యంత్ర భాగాలను ఉత్పత్తి చేస్తున్నారు.

రేడియో అల్టీమీటర్ తయారీలో హెచ్ఏఎల్ హైదరాబాద్ డివిజన్‌ది కీలకపాత్ర. ఇది కమ్యూనికేషన్, నావిగేషన్లలో రక్షణ శాఖకు సాంకేతిక సహాయాన్ని అందిస్తోంది.

రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్ఈసీ)

దీని దక్షిణ ప్రాంత మండల ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది. ఇది గ్రామీణ ప్రాంత విద్యుదీకరణకు ఆర్థిక సహాయం అందిస్తోంది. దీనికి నవరత్న హోదా ఉంది.

హిందుస్తాన్ మెషిన్ టూల్స్ లిమిటెడ్ (హెచ్ఎంటీ)

దేశంలో ఆరు హెచ్ఎంటీ పరిశ్రమలున్నాయి. వాటిలో ఒకటి రంగారెడ్డి జిల్లాలో ఉంది. ఈ పరిశ్రమలో గడియారాలు, బల్బులు, లేత్, బోర్, మిల్లింగ్ యంత్రాలు తయారవుతాయి.

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)

ఇది భారత ప్రభుత్వ పరిపాలన నియంత్రణ, రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తోంది. దీన్ని 1970లో ప్రారంభించారు. ఈ పరిశ్రమలో క్షిపణులను రూపొందిస్తారు. హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్, మెదక్ జిల్లాలోని భానూర్‌లో దీని తయారీ కేంద్రాలున్నాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో రెండు యూనిట్లను స్థాపించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్

దీన్ని 1973లో రంగారెడ్డి జిల్లాలో ప్రారంభించారు. పారిశ్రామికీకరణ వేగవంతమయ్యేందుకు తోడ్పడే లోహాలు, మిశ్రమ లోహాలు ముఖ్యంగా టైటానియం లాంటి లోహాల తయారీలో కీలక పాత్ర పోషిస్తోంది.

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబోరేటరీ (డీఆర్‌డీఎల్)

దీన్ని 1962లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. భారత రక్షణ వ్యవస్థను పటిష్టపర్చడంలో ఈ కంపెనీది కీలకపాత్ర. క్షిపణి వ్యవస్థ రూపకల్పన, క్షిపణుల తయారీ ప్రయోగాల్లో ఇది కృషి చేస్తోంది. ఈ సంస్థ ద్వారా అభివృద్ధి చేసిన ఆకాశ్, నాగ్, పృథ్వీ, అగ్ని తదితర క్షిపణులు భారత సైన్యాన్ని పటిష్టం చేశాయి.

న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ)

అణుశక్తి విభాగం ఆధ్వర్యంలో మౌలాలీలో 1971లో దీన్ని ఏర్పాటు చేశారు. న్యూక్లియర్ ఫ్యూయల్ బండిల్స్, రియాక్టర్ కోర్ పదార్థాలను ఇది తయారు చేస్తోంది. యురేనియం ఇంధనం, జిర్కోనియం మిశ్రమ లోహ క్లాడింగ్‌ను రూపొందించింది.

భార జల కేంద్రం (హెవీ వాటర్ ప్లాంట్)

ఈ కేంద్రాన్ని ఖమ్మం జిల్లాలోని మణుగూరులో ఏర్పాటు చేశారు. దీనిలో డ్యూటీరియం ఆక్సైడ్ (D_2O) తయారు చేస్తున్నారు. అణు రియాక్టర్లలో న్యూట్రాన్ల వేగాన్ని స్థిరీకరించేందుకు భారజలాన్ని వాడతారు.

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో)

ఇది రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తోంది. ప్రపంచస్థాయి ఆయుధాల తయారీలో, స్వదేశీ పరిజ్ఞానం ద్వారా సైన్యానికి కావాల్సిన ఆయుధ సంపత్తిలో స్వయం సమృద్ధి సాధనకు సాంకేతిక సహాయాన్ని అందిస్తోంది.

నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ)

కేంద్ర ఉక్కు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో 1958లో ఎన్ఎండీసీని ఏర్పాటు చేశారు. ముడి ఇనుము, రాగి, డోలమైట్, టంగ్‌స్టన్ తదితర ఖనిజాలను వెలికి తీయడానికి, ముడి ఖనిజాలను వేరు చేయడానికి అవసరమైన సాంకేతిక సహాయాన్ని ఈ సంస్థ అందిస్తోంది. ఖనిజ వనరులపై పరిశోధనా కార్యక్రమాలను చేపడుతోంది.

నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ

సికింద్రాబాద్‌లోని హకీంపేటలో ఏర్పాటు చేశారు. భారీ పరిశ్రమలకు సెక్యూరిటీ నిర్వహణ, విపత్తు నిర్వహణలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సీడీఎం)

దీన్ని 1970లో సికింద్రాబాద్‌లోని సైనిక్‌పురిలో ఏర్పాటు చేశారు. భద్రతా దళాలు, సైన్యంలో మేనేజ్‌మెంట్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలను పెంచడం కోసం ఇది కృషి చేస్తోంది.

ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌కు మేనేజ్‌మెంట్ రంగంలో శిక్షణనిచ్చే ఆసియాలోని ఏకైక సంస్థ ఇది.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ

మెదక్ జిల్లాలోని ఎద్దుమైలారంలో 1987లో దీన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ యుద్ధ ట్యాంకు(ఐసీవీ)లను తయారు చేస్తున్నారు.

తెలంగాణ మొదటి పారిశ్రామిక విధానం

- పారిశ్రామిక వర్గాలను ఆకర్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి పారిశ్రామిక విధానం టీఎస్-ఐపాస్‌ను 2015లో రూపొందించింది. అప్పటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు 2015 జూన్ 12న హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో టీఎస్-ఐపాస్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వివిధ దేశాల రాయబారులు, పారిశ్రామిక దిగ్గజాలు హాజరయ్యారు. నూతన పారిశ్రామిక విధానంలో నూరు శాతం అవినీతి రహితంగా పరిశ్రమలకు అనుమతులు ఇస్తామని ప్రకటించారు. దరఖాస్తు చేసిన 10, 12 రోజుల్లోనే అనుమతులు జారీ చేస్తారు.
- ఈ కార్యక్రమంలోనే సోలార్ విద్యుత్ విధానాన్ని ప్రకటించారు.
- ఈ విధానంలో తెలంగాణ ప్రభుత్వం 14 కీలక రంగాలపై దృష్టి సారించింది.
- 'కనీస తనిఖీ గరిష్ట సౌలభ్యత' నినాదం దీని ప్రధానాంశం.
- రాష్ట్రంలో ఆరు పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.
- మొదటి దశలో భాగంగా హైదరాబాద్ - వరంగల్, హైదరాబాద్ - నాగ్‌పూర్, హైదరాబాద్ - బెంగళూరు పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటు చేస్తారు.
- రెండో దశలో భాగంగా హైదరాబాద్ - మంచిర్యాల, హైదరాబాద్ - నల్లగొండ, హైదరాబాద్ - ఖమ్మం పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటు చేస్తారు.
- దళితులు, గిరిజనులకు నేరుగా రుణసాయం, వారి తరఫున మార్జిన్ మనీ చెల్లింపు.
- రాష్ట్రంలోని ఉమ్మడి 9 జిల్లాల్లో మహిళల కోసం ప్రత్యేక పారిశ్రామిక పార్కులు.
- రాష్ట్రంలోని పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరాలో నాణ్యత పెంపు, సంప్రదాయేతర ఇంధన వనరుల వాడకం, ఉత్పత్తికి ప్రోత్సాహం.
- నీటి పారుదల ప్రాజెక్టుల్లో పది శాతం పరిశ్రమలకు కేటాయింపు. టీఎస్ఐఐసీ ద్వారా నీటి సౌకర్యం.
- రూ. 200 కోట్లకుపైగా పెట్టుబడి, వెయ్యి మందికిపైగా ఉపాధి కల్పించే మెగా ప్రాజెక్టులకు సీఎస్ నేతృత్వంలోని 'తెలంగాణ స్టేట్‌వైడ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫెసిలిటేషన్ బోర్డ్' అనుమతులు మంజూరు చేస్తుంది.
- టీఎస్-ఐపాస్ విధానాన్ని సింగిల్ విండో క్లియరెన్స్ పద్ధతి అంటారు.
- తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్ సంక్షిప్త రూపమే టీఎస్-ఐపాస్.

టీ-హబ్: గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఇది ఏర్పాటైంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు దీన్ని ఏర్పాటు చేశారు.

మాదిరి ప్రశ్నలు

1. **భారజల కర్మాగారం ఎక్కడ ఉంది?**
   1) పటాన్‌చెరు 2) మణుగూరు
   3) రామగుండం 4) హైదరాబాద్
2. **అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధన కేంద్రం (ఇక్రిశాట్) ఏ జిల్లాలో ఉంది?**
   1) హైదరాబాద్ 2) రంగారెడ్డి
   3) మెదక్ 4) నల్లగొండ
3. **తెలంగాణలో ఒక పరిశ్రమను మెగా పరిశ్రమగా గుర్తించాలంటే కనీసం ఎంత పెట్టుబడి పెట్టాలి?**
   1) రూ. 250 కోట్లు 2) రూ. 200 కోట్లు
   3) రూ. 300 కోట్లు
   4) రూ. 150 కోట్లు
4. **ఇచ్చిన వాటిలో మహారత్న హోదా పొందిన సంస్థ?**
   1) బీఈఎల్ 2) ఈసీఐఎల్
   3) ఐడీపీఎల్ 4) బీహెచ్ఈఎల్
5. **ముల్కనూర్ మహిళా సహకార డైరీ ఏ ఉమ్మడి జిల్లాలో ఉంది?**
   1) వరంగల్ 2) ఆదిలాబాద్
   3) కరీంనగర్ 4) నల్లగొండ
6. **ఇచ్చిన వాటిలో రక్షణ శాఖకు సంబంధించిన వస్తువులను ఉత్పత్తి చేసే సంస్థ?**
   1) బీడీఎల్ 2) ఈసీఐఎల్
   3) హెచ్ఏఎల్ 4) హెచ్‌సీఎల్
7. **న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ) ఎక్కడ ఉంది?**
   1) మణుగూరు 2) పాల్వంచ
   3) రామచంద్రాపురం 4) మౌలాలీ
8. **భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) ఎక్కడ ఉంది?**
   1) రామగుండం 2) రామచంద్రాపురం
   3) గచ్చిబౌలి 4) కొత్తగూడెం
9. **నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన సంవత్సరం?**
   1) 1970 2) 1963
   3) 1958 4) 1967
10. **టెలివిజన్లను ఉత్పత్తి చేసే సంస్థ ఏది?**
    1) ఎన్ఎఫ్‌సీ 2) బీడీఎల్
    3) ఈసీఐఎల్ 4) హెచ్‌సీఎల్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 2; 4) 4; 5) 3;
6) 1; 7) 4; 8) 2; 9) 3; 10) 3.

మానవుని ఆవిష్కరణలన్నింటిలో అద్భుతం.. ద్రవ్యం!!

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఎకానమీ

బ్యాంకింగ్ రంగం

ఖాతాదారుల నుంచి డబ్బు స్వీకరించి భద్రపరచడం, వారికి అవసరానికి డబ్బు ఇవ్వడం, స్వీకరించిన ధరావతులకు కాలానుగుణంగా వడ్డీలు చెల్లించడం, అప్పులు ఇవ్వడం (వారి స్తోమతను బట్టి), తీసుకున్న అప్పులకు వడ్డీ చెల్లించడం లేదా వసూలు చేయడం తదితర ద్రవ్య సంబంధ కార్యకలాపాలను నిర్వహించే వ్యవస్థను బ్యాంకింగ్ రంగంగా నిర్వచిస్తాం. బ్యాంకింగ్ వ్యవహారాలు నిర్వర్తించే సంస్థనే బ్యాంకుగా గుర్తిస్తాం. చెక్కులు, డ్రాఫ్టులు, ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు లేదా ఒక స్థలం నుంచి మరో స్థలానికి ద్రవ్య బదలాయింపులు నిర్వహించడం ద్వారా ఇంకా మరెన్నో ద్రవ్య లావాదేవీలకు బ్యాంకులు ఆలవాలంగా ఉంటాయి. ద్రవ్య సేవల పరిశ్రమగా బ్యాంకును పేర్కొనవచ్చు. బ్యాంకులు లేనికాలంలో సామాన్యుడి నగదు లావాదేవీలు, రుణ అవసరాలను స్థానిక వడ్డీ వ్యాపారులు తీరుస్తుండేవారు.

భారతదేశంలో మొదటి బ్యాంకును 1786లో 'ది జనరల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' పేరుతో నెలకొల్పారు. ఈస్ట్ ఇండియా కంపెనీ 1809లో 'ది బ్యాంక్ ఆఫ్ బెంగాల్'ను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఎన్నో ప్రెసిడెన్సీ బ్యాంకులు ఆవిర్భవించాయి. వీటన్నింటినీ బ్రిటిషర్లే నిర్వహించేవారు. స్వాతంత్ర్యానంతరం 1949లో భారత ప్రభుత్వం బ్యాంకింగ్ క్రమబద్ధీకరణ చట్టాన్ని ప్రవేశపెట్టింది. 1965లో ఈ చట్టాన్ని సవరించింది. బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు మొదటగా జాతీయ స్ఫూర్తితో 1953లో మొదలయ్యాయి. బ్రిటిష్ వారసత్వంగా వచ్చిన ఇంపీరియల్ బ్యాంక్‌ను.. 'భారతీయ స్టేట్ బ్యాంక్'గా మార్చి జాతీయం చేశారు. ఇందిరా గాంధీ హయాంలో 14 ప్రైవేట్ వాణిజ్య బ్యాంకులను 1969 జూలై 19న జాతీయం చేశారు.

1980వ దశకం తర్వాత దశల వారీగా ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించాల్సిన ఆవశ్యకత ఉందనే, ప్రభుత్వం తన పరిధిని తగ్గించుకోవడం అవసరం అనే ప్రతిపాదనలు వచ్చాయి. నరసింహన్ కమిటీ సిఫారసుల మేరకు 1993లో సవరించిన బ్యాంకుల క్రమబద్ధీకరణ చట్టం అమలైంది. ఈ చట్టం ద్వారా మరిన్ని ప్రైవేట్ వాణిజ్య బ్యాంకులకు, పెట్టుబడులకు ద్వారాలు తెరిచినట్లైంది. ఈ దశను బ్యాంకింగ్ రంగంలో మూడో స్థాయి సంస్కరణగా చెప్పవచ్చు. ఇది విస్తృత స్థాయి స్థూల ఆర్థిక సరళీకరణ సంస్కరణల్లో భాగంగా గమనించవచ్చు. అంటే.. అన్ని రంగాలకు వర్తిస్తూ 1991-92ల్లో జరిగిన సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణలో భాగంగానే బ్యాంకింగ్ సంస్కరణలనూ అర్థం చేసుకోవాలి. ఈ దశలోనే బ్యాంకింగ్ రంగం సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించుకుంది. బ్యాంకింగ్ రంగాన్ని కంప్యూటర్లతో అనుసంధానిస్తూ ఆన్‌లైన్ నగదు బదిలీలను, ప్లాస్టిక్ మనీ (క్రెడిట్ లేదా డెబిట్ కార్డులు)ని ప్రవేశపెట్టారు.

ప్రస్తుతం భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థ నిర్మాణాన్ని కింది విధంగా పేర్కొనవచ్చు.

1. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



2. షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు
   ఇందులో పబ్లిక్ రంగ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు ఉంటాయి. పబ్లిక్ రంగ బ్యాంకుల్లో ఎస్‌బీఐ, దాని అనుబంధ బ్యాంకులు, ఇతర జాతీయ బ్యాంకులు ఉంటాయి.
3. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (ఆర్ఆర్‌బీలు)
4. విదేశీ బ్యాంకులు
5. షెడ్యూల్డ్ సహకార బ్యాంకులు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బ్యాంకింగ్ వ్యవస్థకు అధిపతి కేంద్ర బ్యాంకు, భారతీయ రిజర్వ్ బ్యాంకు(ఆర్‌బీఐ) మన కేంద్ర బ్యాంకు. 1934 రిజర్వ్ బ్యాంక్ చట్టం ద్వారా 1935 ఏప్రిల్ 1న భారతీయ రిజర్వ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. మొట్టమొదట ఇది వాటాదారుల బ్యాంకుగా రూ. 5 కోట్ల మూలధనంతో ఏర్పాటైంది. 1949 జనవరి 1న ఆర్‌బీఐని జాతీయం చేశారు. ఆర్‌బీఐకి గవర్నర్, నలుగురు డిప్యూటీ గవర్నర్లు ఉంటారు. వీరితో పాటు ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి ఒక ప్రభుత్వ ప్రతినిధి, ప్రభుత్వంతో ప్రతిపాదితమైన వివిధ రంగాలను ప్రతిబింబించే పది మంది ప్రతినిధులు, స్థానిక బోర్డులను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసిన డైరెక్టర్లు కలిసి సమగ్ర నిర్వహణ బాధ్యత పర్యవేక్షిస్తారు. ఈ స్థానిక బోర్డులు ముంబై, కోల్‌కతా, న్యూఢిల్లీ, చెన్నై ప్రధాన కేంద్రాలుగా పనిచేస్తాయి. ప్రస్తుత ఆర్‌బీఐ గవర్నర్ రఘురాం రాజన్.

ఆర్‌బీఐ లక్ష్యాలు- విధులు: కరెన్సీని క్రమబద్ధం చేయడం, ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య స్థిరత్వాన్ని, సుస్థిరతను సాధించడం, పటిష్టమైన ద్రవ్య విధానాన్ని అమలు పరుస్తూ పరపతి నియంత్రణ చేయడం, దేశంలోని వాణిజ్య బ్యాంకులకు మార్గదర్శిగా వ్యవహరించడం, దేశవ్యాప్తంగా ఒకే రీతిలో పరపతి విధానాన్ని అమలు చేయడం ఆర్‌బీఐ ప్రధాన లక్ష్యాలు. దీంతోపాటు కరెన్సీ నోట్ల జారీ గుత్తాధిపత్యం కూడా ఆర్‌బీఐదే. ఇది 2, 5, 10, 20, 50, 100, 500, 1000 రూపాయల కరెన్సీ నోట్లను జారీ చేస్తుంది. ఒక రూపాయి నోట్లను మాత్రం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేస్తుంది.

అలాగే రిజర్వ్‌బ్యాంక్ కేంద్ర ప్రభుత్వానికి బ్యాంకరుగా, ప్రతినిధిగా, సలహాదారుగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వానికి బ్యాంకింగ్ సౌకర్యాలను కల్పిస్తుంది. ద్రవ్య విధానాన్ని రూపొందించడం, ప్రభుత్వానికి సలహా ఇవ్వడమే కాకుండా అమలుపరిచే బాధ్యతను ఆర్‌బీఐ నిర్వహిస్తుంది. దీంతోపాటు బ్యాంకులకు బ్యాంకుగా వ్యవహరిస్తుంది అంటే.. వాణిజ్య బ్యాంకుల కార్యకలాపాలను నియంత్రిస్తుంది, పర్యవేక్షిస్తుంది. వాణిజ్య బ్యాంకుల అంతిమ రుణదాతగా వ్యవహరిస్తుంది. విదేశీ మారకంగా ఉపయోగించే బంగారం నిల్వలను, విదేశీ మారక ద్రవ్య నిల్వలను కూడా ఆర్‌బీఐ పరిరక్షిస్తుంది. వీటితోపాటు బ్యాంకింగ్ వ్యవస్థను అభివృద్ధి పరచడం, వ్యవసాయ పరపతిని ప్రోత్సహించడం, పారిశ్రామికాభివృద్ధికి పరపతిని అందించడం లాంటి అభివృద్ధిపరమైన విధులను కూడా భారతీయ రిజర్వ్‌బ్యాంక్ నిర్వహిస్తుంది.

షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు

వాణిజ్య బ్యాంకులు.. షెడ్యూల్‌లో ఉన్నవి, షెడ్యూల్డ్ కానివి అని రెండు రకాలు. రిజర్వు బ్యాంకు 1934వ చట్టంలోని రెండో షెడ్యూల్‌లో పేర్కొన్న బ్యాంకులు షెడ్యూల్డ్ బ్యాంకులు. ప్రైవేట్, పబ్లిక్ సెక్టారు బ్యాంకులు, విదేశీ బ్యాంకులు.. అన్నీ షెడ్యూల్డ్ బ్యాంకులుగానే పరిగణిస్తారు. కానీ సహకార బ్యాంకులకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. సహకార బ్యాంకులు షెడ్యూల్డ్ బ్యాంకులు కావు. షెడ్యూల్‌లో లేని బ్యాంకులన్నీ షెడ్యూల్డేతర వాణిజ్య బ్యాంకులు.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను (రీజినల్ రూరల్ బ్యాంక్స్) 1970లో స్థాపించారు. ఇవి వాణిజ్య బ్యాంకులు నిర్వహించే విధులన్నింటినీ నిర్వహిస్తాయి. వీటి కార్యకలాపాలు గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే పరిమితం. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులన్నీ భారతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ నియంత్రణలో ఉంటాయి. ప్రస్తుతం విలీన ప్రక్రియలో భాగంగా 25 గ్రామీణ బ్యాంకులను పదింటికి కుదించారు. మొత్తం దేశంలో ప్రస్తుతం 56 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

విదేశీ బ్యాంకులు

భారతదేశంలో విదేశీ బ్యాంకులు కొత్తగా వచ్చినవి కావు. బ్రిటిషర్ల పాలనకాలంలోనే విదేశీ బ్యాంకుల పరంపర ప్రారంభమైంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విదేశీ బ్యాంకుల కార్యకలాపాలు తగ్గించారు. 1950లలో విదేశీ బ్యాంకులను జాతీయం చేయడం ద్వారా వాటి కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి. విదేశీ మారక క్రమబద్ధీకరణ చట్టం పరిధిలో పని చేస్తున్న విదేశీ బ్యాంకులకు స్వతహాగా తమ కార్యకలాపాలు నిర్వహించే స్వేచ్ఛను మన ప్రభుత్వం కల్పించలేదు. తర్వాత కాలంలో ప్రభుత్వం సరళీకరణ ప్రక్రియను చేపట్టి విదేశీ మారక క్రమబద్ధీకరణ చట్టాన్ని విదేశీ మారక నిర్వహణ చట్టంగా మార్చింది (ఫెరా చట్టం ఫెమాగా మారింది). ఆ చట్టంలో విదేశీ బ్యాంకులకు వెసులుబాటు కల్పించారు. ప్రపంచీకరణ తర్వాత విదేశీ బ్యాంకులకు భారత కార్యకలాపాల్లో ప్రాచుర్యం కల్పించారు. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం ప్రస్తుతం దేశంలో 34 విదేశీ బ్యాంకులు దాదాపు 320 శాఖలతో ప్రధాన పట్టణాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఏబీఎన్-ఆమ్రో బ్యాంక్, ఏఎన్‌జడ్ గ్రిండ్లేస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, సిటీ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఎమిరేట్స్, బ్యాంక్ ఆఫ్ అబుదాబీ ప్రధానమైన విదేశీ బ్యాంకులు.

షెడ్యూల్డేతర బ్యాంకులు

1934లోని బ్యాంకింగ్ చట్టంలో రెండో షెడ్యూల్‌లో ప్రస్తావించని బ్యాంకులను షెడ్యూలేతర బ్యాంకులు అంటారు. వీటి ప్రాముఖ్యం అంతగా లేదు. అయితే షెడ్యూల్‌లో లేని బ్యాంకులు ప్రైవేట్ బ్యాంకులై కొన్ని లాభాపేక్ష కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. జాతీయ స్థాయిలో వీటికి పెద్దగా ప్రాధాన్యం లేదు. ఇవి స్థానిక వ్యాపార కార్యకలాపాలకే పరిమితమైనట్లుగా భావించవచ్చు.

సహకార బ్యాంకులు

ప్రభుత్వ ప్రోత్సాహంతో, కొంతభాగం మూలధన పెట్టుబడి చేకూర్చడంతో ఈ సహకార బ్యాంకులను స్థాపించారు. ఇవి లాభాపేక్ష లేకుండా సహకార సూత్రంపై ఆధారపడి పనిచేస్తాయి. సహకార బ్యాంకుల నిర్మాణం నాలుగు స్థాయిల్లో ఉంటుంది. కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల సహకార బ్యాంకులు, రాష్ట్ర సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో జిల్లా సహకార బ్యాంకులు విధులు నిర్వహిస్తాయి. జిల్లా సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లోని గ్రామ ప్రాథమిక సహకార సంఘాలు పనిచేస్తాయి.

బ్యాంకింగ్ రంగంలో ఉపయోగించే పదాలు..

ద్రవ్య విధానం, బ్యాంకింగ్ రంగంలో తరచూ ఉపయోగించే కొన్ని సాంకేతిక పారిభాషిక పదాల గురించి తెలుసుకుందాం..

బ్యాంకు రేటు
రిజర్వ్ బ్యాంకు ఇతర బ్యాంకులకు రుణ సదుపాయం కోసం ఏర్పరిచే కనీస వడ్డీ రేటు.

నగదు నిల్వల నిష్పత్తి (క్యాష్ రిజర్వ్ రేషియో)
బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద ఉంచాల్సిన నిర్దిష్ట నిధుల మొత్తం. ఆర్‌బీఐ సీఆర్ఆర్‌ను పెంచితే బ్యాంకుల వద్ద ఉండే ద్రవ్యం తగ్గిపోతుంది. షెడ్యూల్డ్ బ్యాంకులు కొంత నిర్దిష్ట ద్రవ్యాన్ని తప్పనిసరిగా ఆర్‌బీఐ వద్ద ఉంచాలి. దీన్నే సీఆర్ఆర్ అంటారు. సీఆర్ఆర్, వడ్డీ రేట్లు మార్కెట్‌లో చలామణిలో ఉన్న ద్రవ్య ప్రవాహ వేగానికి అడ్డుకట్ట వేయడానికి లేదా గతిశీలత పెంచడానికి ఉపయోగపడతాయి.

స్టాట్యూటరీ లిక్విడిటీ రేషియో (ఎస్ఎల్ఆర్)
వాణిజ్య బ్యాంకులు తమ రోజూవారీ వ్యాపారంలో కాలానుగత రుణాలు, బంగారం, ధరావతులు లేదా సెక్యూరిటీస్.. అన్నీ ద్రవ్యత్వ సంపత్తిగా అంటే లిక్విడ్ అసెట్స్‌గా కలిగి ఉంటాయి. బిజినెస్ డే ముగిసే సరికి ప్రతి బ్యాంక్.. దాని రోజు వారీ నికర డిమాండ్, రుణాలు ద్రవ్యత్వ సంపత్తికి కనీస అనుపాతంలో ఉండేలా చూసుకోవాలి. ఈ కనీస అనుపాత రాశినే చట్టపర ద్రవ్యత్వ రాశి నిష్పత్తి (ఎస్ఎల్ఆర్)గా నిర్వచిస్తారు. ప్రస్తుతం ఆర్‌బీఐ సూచించిన రాశి 18 శాతం. ఇది మారుతూ ఉండవచ్చు.

రెపో రేటు
వాణిజ్య బ్యాంకులకు ధరావతుల (సెక్యూరిటీస్) ఆధారంగా రిజర్వ్ బ్యాంక్ స్వల్పకాలిక అప్పుగా ఇచ్చే మొత్తంపై వసూలు చేసే వడ్డీ రేటును రెపో రేటు అంటారు. ప్రస్తుతం ఇది 6.25 శాతంగా ఉంది. ఇది ఆర్‌బీఐ సూచనల ప్రకారం మారుతూ ఉంటుంది.

రివర్స్ రెపో రేటు
వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకొనే అప్పుపై ఆర్‌బీఐ చెల్లించే వడ్డీ రేటును రివర్స్ రెపో రేటు అంటారు. వ్యవస్థలో అధిక ద్రవ్యం ఉన్నప్పుడు ఆర్‌బీఐ రివర్స్ రెపో రేటును పెంచి బ్యాంకులు తమ అనుత్పాదక ద్రవ్యాన్ని ఆర్‌బీఐ వద్ద డిపాజిట్ చేసేలా చేస్తుంది. ప్రస్తుతం ఇది 3.35 శాతంగా ఉంది. ఇది కూడా మారుతూ ఉంటుంది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఐఐలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు

న్యూఢిల్లీలోని బయోటెక్నాలజీ రీసెర్చ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (బీఆర్ఐసీ) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ(ఎన్ఐఐ) జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 22.04.2025 నాటికి 18 నుంచి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.04.2025.
» **వెబ్‌సైట్:** https://nii.res.in/

సీఎస్ఐఆర్-సీఆర్ఆర్ఐ, న్యూఢిల్లీలో 209 పోస్టులు

న్యూఢిల్లీలోని సీఎస్ఐఆర్-సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్(సీఆర్ఆర్ఐ).. గ్రూప్-సి(నాన్ గెజిటెడ్) జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 209.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్-177, జూనియర్ స్టెనోగ్రాఫర్-32.
» **అర్హత:** సంబంధిత విభాగంలో 10+2/ఇంటర్మీడియట్ లేదా తత్సమాన విద్యార్హత, టైపింగ్ స్కిల్స్, స్టెనోగ్రఫీ ప్రావీణ్యం ఉండాలి.
» **వయసు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్‌కు 28 ఏళ్లు, జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు 27 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యరులకు ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్‌కు రూ.19,900 నుంచి రూ.63,200, జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు రూ.25,500 నుంచి రూ.81,100.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్టెనోగ్రఫీ, టైపింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.04.2025.
రాతపరీక్ష తేది: మే/జూన్ 2025.
వెబ్‌సైట్: https://crridom.gov.in/

Recently deleted files are stored in..?



BANK EXAMS

Computer Awareness

1. What is the shortcut key to show font dialog box in MS Word?
   a) Ctrl + D b) Ctrl + Shift + F
   c) Ctrl + Shift + P
   d) All of the above
   e) None of the above
2. How to remove all character formats in MS Word?
   a) Shift + Spacebar
   b) Shift + Enter
   c) Ctrl + Spacebar
   d) Ctrl + Enter
   e) None of the above
3. A(n) ______ is a private corporate network, used exclusively by company employees.
   a) Internet
   b) Local area network
   c) Peer-to-peer
   d) Intranet e) Ethernet
4. When you save a file as a Web page, Word converts the contents of the document into _____.
   a) Java b) Perl c) HTML
   d) Unix e) Linux
5. By default, Word automatically formats each heading in a table of contents as _______
   a) Bookmarks
   b) Cross -references
   c) Hyperlinks d) word-fields
   e) HTML rags
6. LAN is an abbreviation for?
   a) Large Access Network
   b) Local Access Network
   c) Large Area Network
   d) Local Area Network
   e) None of the above
7. Which of the following hardware components is the most important to the operation of a database management system?
   a) High-resolution video display
   b) Printer
   c) High speed, large-capacity disk
   d) Plotter e) Mouse
8. If you want to group the records in the abc database, you could use the Job code as the _____.
   a) Delete b) Update
   c) Sort Key d) Index e) Insert
9. Frames from one LAN can be transmitted to another LAN via the device:
   a) Router b) Bridge c) Repeater
   d) Modem e) NetWare
10. How many bits internet address is assigned to each host on a TCP /IP internet which is used in all communications with the host?
    a) 16 - bits b) 32 - bits
    c) 48 - bits d) 64 - bits
    e) None of the above
11. When a hyperlink is created, Word formats the Web address as:
    a) Italicized and coloured red
    b) Italicized and coloured blue
    c) Underlined and coloured red
    d) Underlined and coloured blue
    e) a and b
12. To select a block of text, click at the beginning of the selection, scroll to the end of the selection, position the mouse pointer at the end of the selection, hold down the _____ key, and then click (or drag through the text).
    a) Ctrl b) Alt c) Shift
    d) Tab e) None of the above
13. With the _____, Word notifies that a smart tag is available by displaying a smart tag indicator on the screen.
    a) Auto Correct Options and Paste Options
    b) Smart Tag Actions and Copy Actions
    c) Auto Correct Options and Smart Tag Actions
    d) Paste Options and Copy Actions
    e) All the above
14. When the same word is used in multiple locations or a word is used that was not quite appropriate, a thesaurus can be used to look up a (n) _____ or a word similar in meaning.
    a) synonym b) homonym
    c) antonym d) metonym
    e) pynonym
15. Which of the following option in File pull down menu is used to close a MS Word document?
    a) Quit b) Close c) Exit
    d) New e) Insert
16. _____ shares characteristics with both hardware and software.
    a) Operating system
    b) Software c) Data
    d) File e) Hard ware
17. Recently deleted files are stored in
    a) Recycle Bin b) Desktop
    c) Taskbar d) My computer
    e) Documents
18. Which is not a system tool?
    a) Folder b) Backup
    c) Scandisk d) Format
    e) Edge
19. Virtual stores for B2C electronic commerce are also known as:
    a) Auctions b) Houses
    c) Web storefronts
    d) Internet buyers
    e) None of the above
20. This type of e-commerce often takes the form of an electronic version of the classified ads or an auction.
    a) B2C b) C2C c) G2C
    d) B2B e) B2P
21. This type of electronic commerce involves the sale of a product or service to the general public.
    a) B2C b) B2P c) C2C
    d) B2B e) G2C
22. Buying and selling goods over the Internet is called _______
    a) hyper-marketing
    b) cyber-selling c) e-commerce
    d) euro-conversion
    e) All of the above
23. Before you submit a contribution to a discussion group, you should first ___
    a) lurk b) signal c) queue
    d) ping e) router
24. A popular chat service is called
    a) IM-Chat b) UseNet Chat
    c) Internet Protocol Chat
    d) Internet Relay Chat
    e) None of the above
25. What is the shortcut key to Close Active Document in Microsoft Word?
    a) Ctrl + F4 b) Shift + F4
    c) Ctrl + Shift + F4
    d) Ctrl + Alt + F4
    e) None of the above
26. Which of the following is not the layer of TCP/IP protocol?
    a) Application Layer
    b) Session Layer
    c) Transport Layer
    d) Internetwork layer
    e) Mac layer
27. What is the name given to the temporary storage area that a web browser uses to store pages and graphics that it has recently opened?
    a) Niche b) Cellar
    c) Webspace d) Cache
    e) Junk
28. IP address is currently
    a) 4 bytes long
    b) available in plenty
    c) 6 bytes long
    d) not assigned as it is all used up
    e) any long
29. A computer on the Internet that hosts data, that can be accessed by web browsers using HTTP is known as:
    a) Web Rack b) Web Space
    c) Web Server d) Web Computer
    e) Web client
30. Linux is
    a) A Web Browser
    b) A Web Server
    c) An Operating System
    d) An nonprofit organization
    e) Web site
31. Microsoft Windows is
    a) A Web Browser
    b) A Web Server
    c) An Operating System
    d) A Spreadsheet Package
    e) Package
32. A domain name ending with "org" is
    a) An organization
    b) A commercial website
    c) A network site
    d) A site which has very high traffic
    e) None of the above
33. At which of the following sites would you most probably buy books?
    a) www.hotmail.com
    b) www.amazon.com
    c) www.sun.com
    d) www.msn.com
    e) All of the above
34. Internet requires
    a) An international agreement to connect computers
    b) A local area network
    c) A commonly agreed set of rules to communicate between computers
    d) A world wide web
    e) A LAN
35. The maximum size of a write file is limited to only
    a) Name of the file
    b) Extension of the file
    c) The amount of memory in your computer
    d) All of the above
    e) None of the above
36. Each computer connected to the internet must
    a) be an IBM PC
    b) have a unique IP address
    c) be internet compatible
    d) have a modem connection
    e) be system PC
37. In normal view, automatic page breaks _____.
    a) do not display
    b) display on the screen as a single dotted horizontal line
    c) display on the screen above the header and beneath the footer
    d) display on the screen as a line separated by the words Page Break
    e) display on the screen as a double dotted horizontal line
38. Although it is not shown in normal view, to view a header, click _____ on the menu bar and then click Header and Footer.
    a) View b) Edit c) Format
    d) Tools e) References

Answers

1) d; 2) c; 3) d; 4) c; 5) c;
6) d; 7) c; 8) c; 9) b; 10) b;
11) d; 12) a; 13) d; 14) a; 15) b;
16) a; 17) a; 18) a; 19) c; 20) b;
21) a; 22) c; 23) a; 24) d; 25) a;
26) b; 27) d; 28) a; 29) c; 30) c;
31) c; 32) a; 33) b; 34) c; 35) c;
36) b; 37) c; 38) c.